
చరిత్రలో మే 11, 2007

ఒక సుదీర్ఘ జ్ఞాపకం

ఇది అలెగ్జాండర్ ఇండియా జయించి విజయ పతాకాన్నెగరేసిన
రాజకీయ బానిసత్వ జ్ఞాపకం కాదు.
ఇది చికాగో కార్మికుల రక్తం చిందిన సంఘటనల జ్ఞాపకం కాదు.
ఇది జలియన్‌వాలా బాగ్ దురంతాల క్రూర జ్ఞాపకం కాదు.
ఇది ఇంద్రవెల్లి కాల్పుల్లో చిందించిన రక్త నదుల జ్ఞాపకం కాదు.
ఇది బుద్ధుడు జన్మించిన జ్ఞాపకాన్ని జ్ఞాపకం చేసే జ్ఞాపకం.
ఇది మహాత్మా జ్యోతిబా పూలే జన్మించిన జ్ఞాపకం.
ఇది సంత్ కబీర్, సంత్ రవిదాస్‌ల జ్ఞాపకం.
ఇది పెరియార్ రామస్వామి, సాహు మహరాజ్‌ల జ్ఞాపకం.
ఇది భాగ్యరెడ్డి వర్మ, అంబేద్కర్‌ల వారసత్వాల జ్ఞాపకం.
ఇది 15 ఆగస్టు స్వాతంత్ర్యం కన్నా తక్కువ కాని ఉత్సాహ జ్ఞాపకం.
ఇది ఏనుగు గుర్రాన్ని నడిపించిన జ్ఞాపకం.
నాగులు అర్యుల్ని నడిపించిన జ్ఞాపకం.
ఇది స్వదేశీ జ్ఞాపకం.
స్వదేశీ ప్రజల, స్వదేశీ సిద్ధాంతాల విజయాల జ్ఞాపకం.
ఇది నేపాల్ ప్రచండ విజయం కన్నా
తక్కువ కాని నిశ్శబ్ద విప్లవ జ్ఞాపకం.
ఇది రష్యా దూమాల జ్ఞాపకం.
లెనిన్, స్టాలిన్ విప్లవం కన్నా తక్కువ కాని చారిత్రక జ్ఞాపకం.
జాతీయవాదులతో మావో పొత్తులు కుదుర్చుకున్న జ్ఞాపకం.
ఇది చైనా మావో విప్లవం కన్నా తక్కువ కాని చారిత్రక జ్ఞాపకం.
ఇది రాబర్ట్ ఓవెన్, మార్క్స్, ఎంగెల్స్ కన్నా తక్కువ కాని
అంబేద్కర్, కాన్షీరామ్‌ల జ్ఞాపకం.
ఇది కాన్షీరామ్ కలల సాకారాల జ్ఞాపకం.
ఇది గెలిచిన వారం రోజుల్లో 50వేల పేజీలలో
భారతీయ చరిత్రను మీడియా తిరగరాసిన జ్ఞాపకం.
ఇది భారత రాజకీయాలను
మాయావతి మలుపు తిప్పిన జ్ఞాపకం.
ఇది సంస్కరణలు, సమూలమైన మార్పుకు
దారివేసే మహోన్నతమైన జ్ఞాపకం.
ఇది భారతీయ చరిత్ర భవిష్యత్తు వాణిని వినిపించిన జ్ఞాపకం.





యు.పి.లో బిఎస్‌పి గెలుపు - బి.ఎస్. రాములు

యు.పి.లో

బిఎస్‌పి గెలుపు



- బి.ఎస్. రాములు

విషయ సూచిక

బి.ఎస్.రాములు

బిఎస్‌పి గెలుపు

భారతీయ చరిత్రలో మహోన్నతమైన మలుపు

- తులసి సంపత్కుమార్

1

ఈ పుస్తకమెందుకు?

అరవై ఏళ్ళ భారత పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థలో మాయావతి గెలుపు విశిష్టమైనది. బ్యాలెట్ గొప్పతనాన్ని మొట్టమొదటి సారిగా మాయావతి నిరూపించారు. ప్రపంచంలోని 192 దేశాల కన్నా పెద్దదైన ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి పూర్తి మెజార్టీతో ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. దేశంలోని పత్రికలు తమ అభిప్రాయాలను మార్చుకున్నాయి. అన్ని పార్టీలు బహుజన సమాజ్‌పార్టీ నిర్మాణ దక్షతను చూసి విస్తుపోయాయి. రెండు నెలల పాటు సాగిన పోలింగ్ నిజంగా ఒక బృహత్తర కార్యక్రమంగా చరిత్రలో నిలిచిపోయింది. ఉత్తర ప్రదేశ్‌లో బహుజనుల విజయం దేశంలోని బహుజనులకు గొప్ప ధైర్యాన్ని, రాజ్యాధికారాన్ని సాధించగలమనే విశ్వాసాన్ని కలిగించింది. ఈ సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ గెలుపు వెనక గల నిర్మాణాన్ని, కార్యదక్షతను, ఎన్నికల ఫలితాల విశ్లేషణను లోతుగా అధ్యయనం చేసి సుప్రసిద్ధ సామాజిక తత్వవేత్త బి.ఎస్.రాములన్న ఈ గ్రంథంలో పొందుపరిచారు.

'యుపిలో బిఎస్‌పి గెలుపు' అనే ఈ పుస్తకం బిఎస్‌పి గురించి ఏమీ తెలియని వారికి ఎంతో సమాచారాన్నందిస్తుంది. బిఎస్‌పి గురించి బాగా తెలుసుననుకుని ఏదేదో వాగేసే వారికి ఏమీ తెలియదనే విషయాన్ని తెలిసేటట్టు చేస్తుంది. బిఎస్‌పి గురించి లోతుగా సమస్త పార్శ్వాల్లో తెలుసుకోవాలనే వారికి ఈ పుస్తకం ఒక గొప్ప ఆధారం. బిఎస్‌పిలో బహుజనులు ఎందుకు చేరాలో తద్వారా భారతీయ సమాజంలో రాజ్యాధికారాన్ని ఎందుకు సాధించుకోవాలో, ఎలా సాధించుకోవాలో ఈ పుస్తకం సాధికారికంగా తెలియజేస్తుంది. వీటన్నిటికోసమే ఈ పుస్తకం. ఇందులోని వ్యాసాలను 20రోజుల్లోనే రాయడం, పత్రికలు ప్రచురించడం వెంటనే పుస్తకంగా రావడం అనేవి బి.ఎస్.రాములన్నకు బిఎస్‌పితో రెండు దశాబ్దాల పాటు గల విశేషమైన అనుబంధం, సన్నిహిత పరిశీలన, నిరంతర అధ్యయనం లేకుండా సాధ్యం కాదు.

యు.పి. ఎన్నికల ఫలితాలు పై బి.సి.లైన ములాయం కూటమిని ఓడించాయని కొందరు అభిప్రాయపడ్డారు. బిసిలను బిఎస్‌పి దూరం కొట్టిందని వారు ఆరోపించారు. ఇలా అనుకోవడం పొరపాటు. అక్కడ కాంగ్రెసు, బిజెపిలు చావుదెబ్బ తిన్నాయి. అగ్రవర్ణ ఆధిపత్యం చావుదెబ్బ తిన్నది. తిరిగి కోలుకోలేనంతగా దెబ్బతిన్నాయి. వీటన్నిటిని రాములన్న 'భారతీయ చరిత్రలో మహోన్నత మలుపు', 'బిఎస్‌పి గెలుపు భారత రాజకీయాల్లో మలుపు', 'ఉత్తర ప్రదేశ్ చారిత్రక పరిణామాల్లో భాగంగా బిఎస్‌పి గెలుపు', 'జాతీయోద్యమ కాలం నుండి కుల సమీకరణలు' మొదలైన వ్యాసాల్లో విశ్లేషించారు. బిసిలకు, ఒసిలకు బిఎస్‌పి పట్ల ఉన్న అనుమానాలను నివృత్తి చేశారు.

బి.సిలలోని పైస్థాయి కులాలకు, ములాయంలకూ బహుజన కూటమిలో స్థానం ఈనాటికీ ఉంది. కానీ, వారే విముఖంగా, పైపెచ్చు వ్యతిరేకంగా ఉంటే ఎవరేం చేయగలరు? ఈ కొరతాతీరి, అరమరికలు లేని బహుజన సర్వజన సంపూర్ణ కూటమి ఏర్పడే ఆ మహోత్సవ సందర్భానికై కాలగమనంలో వేచిచూడడం తప్ప మరో మార్గం లేదు. ఆ మార్గమేమిటో, ఎలా సాధించాలో రాములన్న 'బిఎస్‌పి యుపిలో జానపద వీరగాథలను విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చింది', 'రాజకీయ అధికార సాధనలో సామాజిక పరిణామాల్లో కులం', 'బహుజన సమాజ్ పార్టీ నిర్మాణం-పనివిధానం', 'బహుజనులకు దేశ వ్యాప్తంగా రాజ్యాధికారం సాధ్యమేనని స్ఫూర్తి నిచ్చిన మాయావతి' అనే వ్యాసాల్లో చక్కగా వివరించారు. యుపి, బిహార్ రాష్ట్రాల్లో రాములన్న చేసిన పర్యటనలు కులం పట్ల తన అవగాహన మార్చిన తీరును 'ఉత్తర ప్రదేశ్‌తో నా అనుబంధం-అనుభవాలు'లో రికార్డు చేయడం ప్రశంసనీయం.

సామాజిక తత్వవేత్తగా బి.ఎస్.రాములన్న అనేక విషయాలను అరటిపండు వొలిచినట్లు అందిస్తూ బిసిలకు ప్రత్యేక కార్యక్రమాలను కూడా ప్రతిపాదించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బిఎస్‌పి ఎలా ముందకు కదలాలో, ఎందుకు కదలాలో, తెలంగాణ రాష్ట్ర సాధనలో జాతీయ స్థాయిలో బిఎస్‌పి పాత్ర ఎంత ప్రధానమైనదో మొదలైనవి అనేక వ్యాసాల్లో విశ్లేషించి చూపారు. ఇలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రత్యేక పరిస్థితులను పరిశీలిస్తూ ఎవరెవరు ఎలాంటి కార్యక్రమాలు తీసుకోవాలో, ఎన్ని రకాల సంస్థలు, నిర్మాణాలు అవసరమో, అవన్నీ బహుజన సమాజ పరివర్తనలో ఒక సమన్వయంలో ఎలా కలిసి పని చేయాలో సూచించారు. ఇలా బి.ఎస్. రాములన్న తన విస్తారమైన అనుభవాలతో, అధ్యయనంతో రాష్ట్రంలో బహుజనులు రాజ్యాధికారాన్ని సాధించుకునే కార్యక్రమాలను, నిర్మాణాలను సమగ్రంగా మనముందుంచారు. బహుజన సామాజిక తత్వవేత్తగా రాములన్న చేస్తున్న ఈ కృషి మహోన్నతమైనది.

2

2007 ఉత్తర ప్రదేశ్ ఎన్నికలు బిసి, ఎస్సీ, ఎస్టీ, ఎంబిసి, మైనార్టీలతో పాటు అగ్రవర్ణాలలో మార్జినలైజ్ అయిన వారికి కూడా దేశవ్యాపితంగా గొప్ప సంకేతాన్ని,

మార్గాన్ని అందించాయి. వారు ఏదారి నెంచుకోవాలో నమ్మకం చూపాయి. బహుజనుల మేలూ, సర్వజనుల మేలూ, వెరసి ఈ భారత జాతి మేలు ఏ పంథాలో సాధించవచ్చో చాటి చెప్పాయి. ఈ గెలుపు ఈ యుగపు భారత పంథాను నిరూపించింది. దేశం రేపు ఎటు పయనిస్తుందో మార్గాన్ని స్పష్టం చేసింది.

'ఓట్లు మావి, సీట్లు మీవా' : ఒక విప్లవం

ఆధునిక యుగంలో అంబేద్కరు ఈ దేశానికి రాజ్యాంగాన్నిస్తూ బహుజనులకు రిజర్వేషన్లనివ్వడమే కాక ఒక గొప్ప రాజకీయ ఆయుధాన్నిచ్చాడు. గాంధీ, గాంధీవాదులంతా ఓటుహక్కును కొన్ని సంపన్న వర్గాలకే, అగ్ర వర్ణాలకే పరిమితం చేయదల్చుకుని ఎలక్టోరల్ కాలేజెస్‌కే కుదించివేయ ప్రయత్నిస్తే, అంబేద్కరుడు దానిని ఎదిరించి యూనివర్సల్ ఫ్రాంచైజ్ (సార్వత్రిక ఓటు)ను సాధించాడు.

అంబేద్కర్ అనంతరం బహుజనులకూ, బహుజన నాయకులకూ 30 ఏళ్ళ పాటు రిజర్వేషన్లొక్కటే కనిపించాయి. 30 సం.॥ల తర్వాత వచ్చిన కాన్షీరాం దాకా ఈ రాజకీయ హక్కు - సార్వత్రిక ఓటు హక్కు - పై మబ్బులు కమ్ముకుని ఉన్నాయి. ఈ హక్కు ఉన్నట్టు కనపడ్డా ఈ హక్కుతో ఏమి సాధించవచ్చో అప్పటిదాకా ఎవరికీ కనపడలేదు.

"ఓట్ హమారా, రాజ్ తుమ్హారా! నహీ చలేగా, నహీ చలేగా!!" అనే తత్వం తన్నుకుని వచ్చింది. అంతే! అన్ని కోటలూ కదిలాయి. అన్ని పవిత్ర కొంపల్లోకి ఈ నినాదం చొచ్చుకు పోయింది. అగ్రవర్ణాలే ఉన్నంత కాలం కులానికి కస్తూరి వాసన! బహుజనులు దూసుకుని వస్తుంటే కులానికి గబ్బు వాసనట!! ఆధునిక మనువాదమిదే.

భారతదేశ చరిత్ర విలక్షణమైనది

యావత్ర్పపంచంలో అన్వయింపుకుదిరే సాంఘిక శాస్త్రాలు మరి ఈ భారతదేశంలో పనికి వస్తాయా? భారత దేశ సాంఘిక శాస్త్రమే భిన్నమైనది. దీని ఒరవడి వేరు. ఇక్కడ పుట్టినంత మంది తాత్వికులు బహుశ ప్రపంచంలో ఏ దేశంలోనూ పుట్టలేదేమో. కడుపులో నుండి తన్నుకుని వచ్చే స్వేచ్ఛా కాంక్షయే కదా తాత్వికత. పదేళ్ళ క్రితం ఒక మహానుభావుడు దళిత వాదానికి తాత్విక భూమికే లేదని సెలవిచ్చారు. "శూద్రులు ఎందుకూ పనికిరారు, తెలివిలేనివారు వారికి తాత్విక దృక్పథం లేదు" అని అనే ఈలాంటి కుహనా తాత్వికులు వాళ్ళు అన్ని కాలాల్లోనూ ఉన్నారు. వీరిని పూర్వపక్షం చేస్తూ మహోన్నత తాత్వికతతో సమాజాన్ని నిరంతరం ముందుకు నడిపిన తాత్వికులు బహుజనుల్లో వందలాది మంది ఆయాకాలాల్లో పుట్టి పెరిగారు.

బహుజన హితాయ - బహుజన సుఖాయ అన్నాడు బుద్ధుడు. నాటి నుండి బుద్ధుడు, అశోకుడు, అనేకానేక భక్తి ఉద్యమ తాత్వికులు, ఫూలే, సాహుజీ, నారాయణ గురు, పెరియార్, అంబేద్కర్ మరియు నిన్నటి కాన్షీరాంల హృదయాంతరాల నుండి పొంగి పరవళ్ళు తొక్కుతూ సాగుతున్న బహుజన స్రవంతికి ప్రతీక మాయావతి గెలుపు.

అయితే, ఈ తాత్వికులలో ప్రపంచంలోని ఇతరులతో పోల్చినప్పుడు ఒక సార్వజనీన

అంశం ఉంది. అది స్వేచ్ఛాకాంక్ష. అదే విధంగా అత్యంత విలక్షణమైన ఒక ప్రత్యేకతా ఉంది. అది వర్ణవ్యవస్థ వ్యతిరేకత. **అందుకే, భారతదేశ తాత్వికత వర్ణ వ్యవస్థ వ్యతిరేకత.**

అత్యంత క్రూరమైన వంశపారంపర్య వర్ణవ్యవస్థ మరియు నిచ్చెనమెట్ల కులాల చట్రంలో శూద్రుల అతిశూద్రుల విభజన ఈ భారతదేశానికి ప్రత్యేకం. ప్రపంచంలో ఎక్కడా కానరానిది. తన కన్న కింది వారితో తనను తాను పై స్థాయిలో స్థిరపరుచుకుంటూ తనను అణచివేసే వర్ణవ్యవస్థనే కొనసాగించుటకు స్వచ్ఛందంగా పూనుకునేటట్టు చేసిన విచిత్ర వ్యవస్థ. ఇలాంటి వ్యవస్థలు – సెల్ఫ్ పర్‌పెట్యుయేటింగ్ (Self perpetuating) వ్యవస్థలు ప్రపంచంలో ఇంకెక్కడన్నా ఉన్నాయా!? అనుమానమే.

బుద్ధుని నుండి అంబేద్కరు, కాన్షీరాంల దాకా అందరూ ఈ వర్ణ వ్యవస్థను అంతం చేయడానికే అంకితమయ్యారు. వర్ణవ్యవస్థను అంతం చేయడం అంటే అగ్ర వర్ణాల వారిని అంతం చేయడం కాదని బుద్ధుని నుండి అంబేద్కరు దాకా, మరియు జేబులో పెన్ను తీసి నిటారుగా నిలబెట్టి భారత దేశ వ్యవస్థనూ, చరిత్రనూ వివరించి ఆ తర్వాత ఆ పెన్నును పండబెట్టి ఇదే మన లక్ష్యమని ముగిస్తూ చెప్పిన కాన్షీరాం దాకా స్పష్టం చేశారు.

సాంప్రదాయక మనువాదపు నోరా ఎలాగూ పడిపోయింది. ఆధునిక మనువాదపు (ప్రతిభావాదం, కులాతీతవాదం) గగ్గోలునూ లెక్కచేయకుండా బహుజన 'పరిమళం' పాకిపోయింది. ప్రత్యేకించి యు.పి.లో కాన్షీరాం, మాయావతి గార్ల సృజనాత్మక, దీక్షాబద్ధమైన, విరామ మెరుగని కృషి వల్ల, అత్యంత చాకచక్యమైన ఎత్తుగడల వల్ల బహుజన 'సుగంధం' రాజకీయాధికార శిఖరంలో ఉన్నత స్థాయికెదిగింది. జుట్టు చేతిలో పట్టుకుంది. ఇదంతా నిరంతర కృషి ఫలం రాములన్న ఈ నిరంతర కృషిని అనేక కోణాల్లో పేర్కొన్నారు. ఇది రాష్ట్రంలో నిర్మాణం చేయాల్సిన కర్తవ్యాలను తెలుపుతుంది.

1960 నుండి భారతీయ సామాజిక పరిణామ క్రమంలో సమాంతరంగా సాగిన ఇతర అనివార్య సాంఘిక పరిణామాల వల్ల ఒకవైపు అణగారిన వర్ణ శ్రేణుల్లో మెరుగైన జీవితం, మెరుగైన హోదా గల ఒక శ్రేణి రిజర్వేషన్లను ఆసరా చేసుకుని ఎలాగైతే ఉనికిలోకి వచ్చిందో (ఈ మార్పు బహుజనులకు ఒక ఆధునిక వనరును అందించింది.) మరోవైపు అగ్రవర్ణాలలో ఒక సెక్షను సాంప్రదాయక హోదాలో కోల్పోయింది. ఏమీ లేకపోయినా ధనం, వనరులు, అధికారంలలో ప్రయోజనాలను కోల్పోయింది. కొనసాగుతున్న సాంప్రదాయక హోదా వీటిని వీరికి ఆటోమెటిక్‌గా గ్యారంటీ చేయగల సామాజిక దశ అంతరించింది. వీటిని తిరిగి పొందే అవకాశాన్నీ అగ్ర వర్ణాలలోని వీరి ప్రత్యర్థులు (సంపన్న వర్గాలు, అధికార వర్గాలు) వీరికి నిరాకరిస్తున్నారు. (ఈ మార్పు అగ్ర వర్ణాలలో వారి వారి మధ్య ఆధునిక హద్దులు గీసింది.) ఈ పోలరైజేషన్ యు.పిలో ఎక్కువ మోతాదులో ముందుకొచ్చింది. దీన్ని బిఎస్‌పియే ముందుగా పసిగట్టి కార్యక్రమం తీసుకుంది. వారికి అవకాశం ఇచ్చి తన ఓటు బ్యాంకును కూడా పెంచుకుంది. తద్వారా మతతత్వ శక్తుల ఆటకట్టించింది. సెక్యులర్ శక్తులను ఒక్కటి చేసింది.

అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని కుదిపేసిన వాటిలో మరొక పరిణామంలో భాగంగా బిసిలలోని పై కులాలకు రాజకీయ అధికార హోదా మొన్న దక్కినప్పటికీ వీరు బహుజన పంథాను అవలంబించనందువల్ల విఫలమయ్యారు. అంతేకాక, యు.పిలో సాగుతున్న అసలైన బహుజన పంథాకు రాజకీయ ప్రత్యర్థుల పాత్రను చేపట్టడానికి కూడా వీరు వెనుకాడక పోవడం విచారకరం. పైగా తమను బలపరిచిన జనాన్ని ఇతర సాధారణ జనంతో శత్రు వైరుధ్యంలోకి పోనిచ్చారు. ఇది ఎలా జరిగిందో బి.ఎస్.రాములన్న ఉత్తర ప్రదేశ్ సామాజిక పరిణామాల్లో భాగంగా అపూర్వంగా విశ్లేషించారు.

ఎస్‌సిల నాయకత్వంలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలతో పాటు అగ్రవర్ణాలు ముందుకు సాగడం, విజయం వరించడాన్ని కొందరు జీర్ణించుకోలేకపోతున్నారు. అంచనాలు తారుమారయ్యాయని వాస్తవాలను తారుమారు చేస్తున్నారు. ఎవరి అంచనాలు తారుమారయ్యాయి?

1. మనువాదుల అంచనాలు తారుమారయ్యాయి.

2. ఎగ్జిట్ పోల్ పేరిట 7 ఫేజెస్‌లో 2 నెలల కాలం పాటు సాగిన ఓటింగు ప్రక్రియలో ఓటర్ల మనోభావాలను బిజెపి వైపు లాగే దుర్బుద్ధితో మీడియా మొత్తం ఒక్కటయ్యి నడిపించిన కుట్రయే అంచనాలు.

3. బిఎస్‌పికి తిరుగులేని మెజారిటీ వస్తుందని మాయావతి గారు ముందు నుంచీ ఘంటా పథంగా చెప్తూనే ఉన్నారు. వారు మాత్రం మనువాదుల అంచనాల్లోనే మునిగి పోయారు.

ఎవరూ స్పర్శించలేని పలు కోణాలను హైలెట్ చేసిన రాములన్న

ఈ సందర్భంగా ప్రజల తీర్పును గౌరవిస్తూ దేశ వ్యాప్తంగా వేలాది సానుకూల వ్యాసాలు వచ్చాయి. తెలుగుదినపత్రికలల్లో అచ్చయిన బి.ఎస్.రాములన్న రాసిన ఈ వ్యాసాలు ఇతరులెవరు స్పర్శించలేని, విశ్లేషించలేని పలు కోణాలను ముందుకు తెచ్చి హైలెట్ చేశాయి. రాములన్న అన్నట్లు ఎన్నికలలో అతి తక్కువ ఖర్చుతో బిఎస్‌పి తరఫున ప్రచారం, మీడియా వ్యతిరేకతను అధిగమించి, కార్యకర్తల అభిమానాన్ని చూరగొంటూ చాప కింద నీరులా పని చేసిన స్ఫూర్తి మొదలైనవి దేశానికే ఆదర్శం.

అభ్యర్థులను సంవత్సరం ముందే ప్రకటించడం ప్రపంచానికే ఆదర్శం

మరొక ముఖ్య విషయం కూడా గుర్తించాలి. బిఎస్‌పికి ఎన్నికల సందర్భంగా మ్యానిఫెస్టో లేదు. దీనిపై వచ్చిన ప్రశ్నలకు మాయావతి చక్కటి సమాధానమిచ్చారు – "మా గత పరిపాలనే మా మ్యానిఫెస్టో" అని. ఈ అరవైఏండ్ల పార్లమెంటరీ ఎన్నికల చరిత్రలో ఏ పార్టీ కూడా తన గత పాలనా విధానాలే కొనసాగుతాయని అనగలిగే దమ్ము చూపలేదు. కారణం? వారి గత పాలనలెప్పుడైనా గాని ప్రజావ్యతిరేకమూ, ప్రజాకంటకంగా సాగాయనే విషయం ప్రజలకు తెలుసని వారికి తెలుసు.

బిఎస్పి ఆత్మీయ స్పర్శను దర్శించాలి

పలు వాదాల, పలు మీమాంసల, పలు గతకాలపు నియమ నిబద్ధతల పేర బిఎస్పిని తూచడం సరైంది కాదు. ముందు బిఎస్పి ఆత్మీయ స్పర్శను దర్శించాలి. ఒకే హృదయంగా కలవాలి. ఆ అనుభూతుల్ని తెలుసుకోవాలి. కలబోసుకోవాలి. రాజకీయ అధికారం రుచి, పస, ప్రాధాన్యత ఏమిటో తెలుసుకున్న అనుభవాలను కలిసి పంచుకోవాలి. వేల ఏళ్ళుగా అధికారానికి దూరంగా ఎందుకు ఉంచారో అర్థం అవుతుంది. అప్పుడు విజ్ఞులుగా స్పందించడం సాధ్యపడుతుంది. యుపిలో నేడు జరిగిన పరిణామం అప్రయత్నంగా వచ్చింది కాదు. నిరంతర కృషి ఫలితం. మనీ మీడియా, మాఫియా అగ్రకులాధిక్యత అనే నాలుగు మహాపర్వతాలను ఢీకొని పగలగొట్టి చీల్చుకొని వచ్చిన విజయమే బిఎస్పి గెలుపు.

ఎన్నికల్లో నిలబడిన వారు రాజకీయ నాయకులు అవుతారా? - రాములన్న

'ఎన్నికల్లో నిలబడిన వారు రాజకీయ నాయకులవుతారా?' అని ప్రశ్నిస్తూ రాజకీయ నాయకులు ఎలా కారో విశ్లేషించిన తీరు రాజకీయాల గురించి ఊకదంపుడు ఉపన్యాసాలు దంచి ఎన్నికల్లో నిలబడకుండా, ప్రజాభిమానం చూరగొనకుండా, ప్రజాభిమానాన్ని ఓట్లుగా మార్చుకోకుండా రాజకీయ నాయకులుగా ఫోజులు కొట్టే నాయకులకు చెంపపెట్టు. వాళ్ళు తమ శక్తి సామర్థ్యాలు పెంచుకొని రాజకీయ నాయకులుగా ఎన్నికల్లో నిలబడి గెలవాలనేదే రాములన్న కోరిక.

ఎన్ని అవరోధాలను దాటితే ఒక సర్పంచ్, ఒక మండలాధ్యక్షుడు, ఒక ఎమ్ఎల్ఏ, ఒక ఎంపి కావడం బహుజనులకు సాధ్యమో, అది ఎంత కష్టమో పోటీ చేసిన వారిని ప్రత్యక్షంగా కలిసి తెలుసుకోవాలి. ఇలా బహుజన ఉద్యమ కారులు అంకిత భావంతో ఎంత కృషి చేస్తే ఈ విజయం సాధ్యపడిందో ముందు తెలుసుకొని అభినందించడం కనీస సంస్కారం. వేలఏళ్ళ స్వేచ్ఛకాంక్ష తాత్వికుల ఆశను, వర్ణ వ్యతిరేక తాత్విక భావాలను ఆచరణలో నిజం చేసి చూపిన మహోన్నత చారిత్రక సందర్భమిది.

బహుజనులకు వినమ్రతతో హెచ్చరిక

మన రాష్ట్రంలో కొందరు పై శ్రేణి బిసి ప్రముఖులు బిఎస్పి ఇచ్చిన రాజీ లేని సంకేతాన్ని మింగలేక రెచ్చిపోతున్నారు. మాయావతి బ్రాహ్మణైజ్ అయ్యిందని వాదిస్తున్నారు. ఎంతో సామాజిక తపనతో అంకిత భావంతో ఎస్సి, ఎస్టి, బిసి మైనారిటీలందరికోసమూ నిర్ణయాత్మక ఉద్యమాలను నడుపుతూ ఎస్సిల నుండి సక్సెస్ఫుల్గా ఎదిగిన నాయకత్వం పట్ల వీరికి పాథలాజికల్ విముఖత. మనువు అంటించిన సామాజిక జాఢ్యము, లేక న్యూనతా భావము, లేక ఆ రెండింటి సమ్మేళనము వీరిని అలా చేసింది. మనువాద తత్వం కాదు కానీ, వీరిది రాజకీయ మనువాదం, సాంస్కృతిక మనువాదం. బిఎస్పి పట్ల నిజమైన సానుకూలత ఉన్న బిసిలు ఎలా ఆలోచిస్తారో బి.ఎస్.రామలన్న 'బిఎస్పి నిర్మాణం-పనివిధానం' వ్యాసంలో సమగ్రంగా

వివరించారు. అవి ఆచరణాత్మకమైనవి. వాటిని ఆచరించి బిసిలు రాజకీయ శక్తిగా ఎదగాలి. బీసీల్లోంచి ప్రజలందరినీ రాజకీయంగా ముందుకు నడిపే మాస్ లీడర్స్ ఎదిగినప్పుడే ఇది సాధ్యం. రాములన్న ఈ మాట చెప్పకనే చెప్పారు.

నిర్ధారించబడిన ఒక తాత్విక ఒక వాస్తవాన్ని వీరు గ్రహించడం అవసరం. ఎస్.సి.లు కేంద్రంగా, ఎస్సిలు ప్రముఖ నాయకత్వంగా మాత్రమే బహుజన సామాజికీకరణ మరియు బహుజన ఉద్యమం సాగుతాయి. దీనికి తిరుగులేదు. ఇది సెటిల్డ్ మ్యాటర్. మాన్యశ్రీ కాన్షీరామ్ గారు బోధించిన ఎన్×డి×ఎస్ = సి (నీడ్ × డిజైర్ × స్ట్రెంత్ = చేంజ్) అనే అద్భుతమైన గతితార్కిక సూత్రం ఈ విషయాన్ని నిర్ధారిస్తుంది. ఈ వాస్తవంతో ఈ బిసి ప్రముఖులు తమ మనువాద వ్యతిరేక తాత్విక ఉనికిని మరింత పదునెక్కించుకొని తమను పట్టి పీడిస్తున్న రాజకీయ మనువాదం నుంచీ, సాంస్కృతిక మనువాదం నుంచీ బయట పడాలి.

ఇక ప్రత్యేకించి ఎస్సిల వర్గీకరణ చుట్టు మాత్రమే తిరుగుతూ ఆధునిక రాజకీయ మనువాదం రొంపిలో ఓలనాడుతున్న మాల, మాదిగ నాయకత్వాలకూ యుపిలో బిఎస్పి విజయం చేదు మందు అయింది. ఆ విజయం వీరి మీద కొన్ని బాధ్యతలను రుద్దుతున్నది. ఆ రొంపిలో వీరి జలకాలాటలకు కొన్ని హద్దుల్ని, ఆంక్షల్ని ముందకు తెస్తూ ఒక ముగింపును కూడా నిర్దేశిస్తున్నది. ఏమో! బిఎస్పి విజయంతో ఆ నాయకులకే ఉజ్వల జ్ఞానోదయం అవుతుందేమో! కనీసం వారి వెనుక పోగౌతున్న కార్యకర్తలైనా సరైన దారిని తక్షణమే ఎన్నుకుంటారని నమ్మకం మాత్రం కలుగుతున్నది.

గడ్డకట్టుకొని పోయిన వర్గీకరణ (అనుకూల, వ్యతిరేక) వాదులది బిఎస్పి పట్ల రాజకీయ వ్యతిరేకత మాత్రమే. సాంస్కృతిక మరియు తాత్విక వ్యతిరేకతలు కాదని ఈ సందర్భంగా గుర్తుంచుకోవడం అవసరం.

భారతదేశంలో రినాయ్జాన్స్కు ఈ ఫలితాలు ఒక నాందీ ప్రస్తావన

భారతదేశంలో రినాయ్జాన్స్ అంటే వర్ణకుల వ్యవస్థ పతనమై అందరూ సమానంగా రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక రంగాల్లో సహజీవనం చేయడం. అందువల్ల భారత సమాజానికి కుల నిర్మూలన ఉద్యమం తప్ప మరో పునరుజ్జీవనం (రినాయ్జాన్స్) లేదు. "కుల పునాదుల మీద.... ఒక జాతినిగాని,.... నిర్మించలేమన్న" బాబా సాహెబ్ స్ఫూర్తితో భారతదేశానికి ప్రత్యేకమయిన తప్పనిసరి అయిన ఆ పునరుజ్జీవన జైత్రయాత్రకు యు.పి. ఫలితాలు, ఒక దారినీ, నమ్మకాన్నీ అందిస్తున్నాయి.

బహుజనమే సర్వజనం

ఈ యుగపు భారతదేశ పంథా బహుజన పంథా. అధికారంలోకి వచ్చినా, అధికారానికి దగ్గరగా వచ్చినా అది సర్వజనా పంథా. బుద్ధుని నుండి, అంబేద్కర్ వరకూ మరియు పెన్నును పండబెట్టి కర్తవ్యాన్ని చూపిన నిన్నటి కాన్షీరాం వరకూ ఇచ్చిన సందేశమే ఇది.

బలహీనపడిన అగ్రవర్ణాల సెక్షను సర్వజన వాదానికి, సర్వజన సమానత్వానికి "జిత్ నీ జిస్‌కీ సంఖ్యా భారీ, ఉతనీ ఉస్‌కీ భాగ్ దారీ" సూత్రానికి వినమ్రంగా, సవినయంగా ఎంతవరకు కట్టుబడి ఉంటారో అంత వరకు వారికి బుద్ధి వచ్చినట్టు. ఇప్పుడైతే మాయావతికి తలవంచి నమస్కరిస్తున్నారు కదా. అది దానికి సంకేతమనుకుందాం. నమ్ముదాం. మనమీద మనకు నమ్మకముంది. మనిషి – దీనజనుడైన ప్రతి మనిషి మీదా నమ్మకంతో సాగుదాం.

3

ఈ నేపథ్యంలో అందరూ ప్రత్యేకించి, బహుజన మేధావులు, విద్యావంతులు, బహుజన సామాజిక శాస్త్రవేత్తలు, బహుజన రాజకీయ నాయకులు ఆలోచించవలసిన అవసరముంది.

యుపి ఫలితాల సందర్భంగా పత్రికల్లో కొన్ని వేల పేజీల వ్యాసాలు వచ్చాయి. ఎంతోమంది మేధావులు, బిఎస్‌పితో సంబంధాలు లేని వారు సైతం ఎంతో గొప్పగా స్పందించారు. బిఎస్‌పి గెలుపు నుండి తాము పొందిన ఉత్తేజాన్ని వ్యక్తం చేశారు. ఉత్తేజితులై ఉన్న అశేష జనానికి గొప్ప ఆనందాన్ని అందిస్తూ నమ్మకాన్నీ పెంచారు.

ఈ గెలుపు సందర్భంగా బి.ఎస్.రాములన్న పత్రికల కోసం అనేక వ్యాసాలు రాశారు. తన వ్యాసాలతోపాటు పత్రికల్లో వచ్చిన సంపాదకీయాలు, వ్యాసాలు, విశ్లేషణలను కలిపి ఒక పుస్తకంగా వేద్దామన్నారు. నాకూ చాలా గొప్ప ఆలోచన అనిపించింది. దాని సంపాదకత్వం బాధ్యత నన్ను తీసుకొమ్మన్నారు. 'సరే' అన్నాను. తెలుగు, ఇంగ్లీషుల్లో వచ్చిన ఆ వ్యాసాలను, సంపాదకీయాలను ఏరి, డిటిపి చేస్తే 400 పేజీలకు పైగా అయింది.

ముందుగా బి.ఎస్.రాములన్న రాసిన వ్యాసాలను 'యుపిలో బిఎస్‌పి గెలుపు' పేరిట సంకలనంగా తెస్తున్నాము. మిగతా వ్యాసాలు వీలువెంట తెస్తాను. బి.ఎస్.రాములన్న ఈ వ్యాసాలన్నీ కేవలం ఇరవై రోజుల్లో రాసినవే. విస్తారమైన అవగాహన ఉంటే తప్ప యిన్ని కోణాల్లో ఇంత సమగ్రంగా ఇంత వేగంగా రాయడం సాధ్యం కాదు. ప్రాముఖ్యత గల అంశాలు అనుకున్న వాటిపై బిఎస్‌పి ప్రముఖులతో, రాష్ట్ర అధ్యక్షునితో చర్చించి, కొన్ని వివరాలు సేకరించారు. బహుజన ఆలోచనాపరులకు, కార్యకర్తలకు ఈ వ్యాసాలు ఎంతో ఉపయోగపడతాయి. యుపి 2007 ఎన్నికల్లో బిఎస్‌పి గెలుపును విశ్లేషిస్తూ బహుశా దేశంలోనే సమగ్రంగా వెలువడుతున్న మొదటి పుస్తకం ఇది. త్వరలో దీని ఇంగ్లీషు అనువాదం కూడా వెలువడుతుంది. బి.ఎస్.రాములన్న విరామం లేకుండా ఇందుకోసం చేసిన కృషిని అభినందిస్తున్నాను.

తులసి సంపత్ కుమార్, బహుజన సామాజిక శాస్త్రవేత్త
హైదరాబాద్. సెల్ : 9440413444

తేది : 10-6-2007

చరిత్రలో మే 11, 2007

ఒక సుదీర్ఘ జ్ఞాపకం

ఇది బాబ్రీ మసీదును కూలగొట్టిన దుర్దినం వంటి జ్ఞాపకం కాదు.
ఇది వరల్డ్ ట్రేడ్ సెంటర్స్ కూల్చివేసిన వంటి దుర్ఘటనల జ్ఞాపకం కాదు.
ఇది చికాగో కార్మికుల రక్తం చిందిన సంఘటనల జ్ఞాపకం కాదు.
ఇది జలియన్‌వాలా బాగ్ దురంతాల క్రూర జ్ఞాపకం కాదు.
ఇది ఇంద్రవెల్లి కాల్పుల్లో చిందించిన రక్త నదుల జ్ఞాపకం కాదు.
ఇది అలెగ్జాండర్ ఇండియా జయించి విజయ పతాకాన్నెగరేసిన
రాజకీయ బానిసత్వ జ్ఞాపకం కాదు.
ఇది బుద్ధుడు జన్మించిన జ్ఞాపకాన్ని జ్ఞాపకం చేసే జ్ఞాపకం.
ఇది మహాత్మా జ్యోతిబా పూలే జన్మించిన జ్ఞాపకం.
ఇది సంత్ కబీర్, సంత్ రవిదాస్‌ల జ్ఞాపకం.
ఇది బసవేశ్వరుడు, దుర్గావతి, బిర్సాముండా, తళక్కల్ చాంద్,
పోతులూరి వీరబ్రహ్మం, వేమన, కొమరంభీంల సుమధుర జ్ఞాపకం.
ఇది పెరియార్ రామస్వామి, సాహు మహరాజ్‌ల జ్ఞాపకం.
ఇది భాగ్యరెడ్డి వర్మ, అంబేద్కర్‌ల వారసత్వాల జ్ఞాపకం.
ఇది 15 ఆగస్టు స్వాతంత్ర్యం కన్నా తక్కువ కాని ఉత్సాహ జ్ఞాపకం.
ఇది 26 జనవరి కన్నా తక్కువ కాని ఉత్తేజ జ్ఞాపకం.
ఇది మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి
మరో 'కలికి' తురాయిని అందించిన జ్ఞాపకం.

ఇది ఏనుగు తిరిగి భారత దేశంలో సగర్వంగా తల ఎత్తుకున్న జ్ఞాపకం.

ఇది ఏనుగు గుర్రాన్ని నడిపించిన జ్ఞాపకం.

ఇది నాగులు ఆర్యుల్ని నడిపించిన జ్ఞాపకం.

ఇది స్వదేశీ జ్ఞాపకం.

ఇది స్వదేశీ ప్రజల, స్వదేశీ సిద్ధాంతాల విజయాల జ్ఞాపకం.

ఇది జ్యోతిబసు, బుద్ధదేవ్ గెలుపుల కన్నా గొప్పదైన మహోన్నత జ్ఞాపకం.

ఇది నేపాల్ ప్రచండ విజయం కన్నా తక్కువ కాని నిశ్శబ్ద విప్లవ జ్ఞాపకం.

ఇది రష్యా డ్యూమా, జాతీయవాదులతో మావో పొత్తులు కుదుర్చుకున్న జ్ఞాపకం.

ఇది రష్యా లెనిన్, స్టాలిన్ విప్లవం కన్నా తక్కువ కాని చారిత్రక జ్ఞాపకం.

ఇది చైనా మావో విప్లవం కన్నా తక్కువ కాని స్వదేశీ, విశిష్ట చారిత్రక జ్ఞాపకం.

ఇది స్వదేశీ ప్యారిస్ కమ్యూన్ కన్నా తక్కువ కాని జ్ఞాపకం.

ఇది రాబర్ట్ ఒవెన్, మార్క్స్, ఎంగెల్స్ కన్నా తక్కువ కాని
అంబేద్కర్, కాన్షీరామ్‌ల జ్ఞాపకం.

ఇది కాన్షీరామ్ కలల సాకారాల జ్ఞాపకం.

ఇది ప్రపంచంలోని అయిదు పెద్ద దేశాల తరువాత
ఆరవ అతిపెద్ద ప్రాంత ప్రజల విజయకేతన జ్ఞాపకం.

ఇది శాంతి భద్రతలకు, సర్వజన హితానికి బహుజనులు పునరంకితమైన జ్ఞాపకం.

ఇది బిఎస్‌పి పూర్తి మెజారిటీతో యుపిలో గెలుపొందిన జ్ఞాపకం.

ఇది బహుజనులతో పాటు అగ్ర కులాలకు దళితులు నాయకులై
సర్వజనులను నడిపిన జ్ఞాపకం.

ఇది బహుజన రాజ్య స్థాపనకు సర్వజనామోదంతో
శంఖుస్థాపన చేసిన శుభదిన జ్ఞాపకం.

ఇది గెలిచిన వారం రోజుల్లో 50వేల పేజీలలో
భారతీయ చరిత్రను మీడియా తిరగరాసిన జ్ఞాపకం.

ఇది భారత రాజకీయాలను మాయావతి మలుపు తిప్పిన జ్ఞాపకం.

అదే చరిత్రలో మే 11, 2007 జ్ఞాపకం.

అది ఉత్తరప్రదేశ్ ఎన్నికల ఫలితాలు వెల్లడై
బిఎస్‌పి నిలకడగా గెలిచిన చారిత్రక జ్ఞాపకం.

అది భారత రాష్ట్రపతిని ఎన్నుకునే దృష్టిని మార్చిన జ్ఞాపకం.

అది మూడవ ఫ్రంటు దశను మసకబార్చిన జ్ఞాపకం. మలుపుతిప్పిన జ్ఞాపకం.

అది లెఫ్ట్ కలల నుంచి కళ్ళు తెరిపించిన జ్ఞాపకం.

అది మనువాదులు రాజేసే మంటలపై నీళ్ళు చల్లిన జ్ఞాపకం.

అది శాంతియుత పద్ధతిలో ప్రభుత్వాలు మారిన జ్ఞాపకం.

మే 11న ప్రోఖ్రాన్‌లో నవ్విన బుద్ధుడు నిశ్శబ్దంగా మళ్ళీ నవ్విన జ్ఞాపకం

అది నిశ్శబ్ద విప్లవ జ్ఞాపకం.

అది మనీ మీడియా మాఫియాలను ఓడించి ప్రజల 'సత్తా' గెలిచిన జ్ఞాపకం.

అది ప్రజల సంకల్ప బలం ముందు అన్నీ వెనుకడుగేనని చాటి చెప్పిన జ్ఞాపకం.

అది లెనిన్ అన్నట్టు 'కడుపు నిండా తిండికై
అరిచే శక్తినిచ్చిన సగం రొట్టె' తిన్న జ్ఞాపకం.

అది సంస్కరణలు, సమూలమైన మార్పుకు దారివేసే మహోన్నతమైన జ్ఞాపకం.

అది రాజకీయాధికార శక్తిని ప్రజలకు పంచి ఇచ్చే మహత్తర జ్ఞాపకం.

అది యుపి నుండి ఢిల్లీ ఎర్రకోటకు దారి వేసిన జ్ఞాపకం.

అది భారతీయ చరిత్ర భవిష్యత్తు వాణిని వినిపించిన జ్ఞాపకం.

ఇది విదేశీ చరిత్ర, సిద్ధాంతాల కళ్ళద్దాలతో
స్వదేశీ చరిత్రను చూసే సుదీర్ఘ జ్ఞాపకం కాదు.

ఇది బహుజన నాయకత్వంలో సర్వజన హితం కోరే రాజ్యస్థాపన జ్ఞాపకం.

ముందుమాట :

భారతీయ చరిత్రలో

మహోన్నత మలుపు

బిఎస్‌పి గెలుపు ఆధునిక భారత రాజకీయ చరిత్రలో ఒక మహోన్నతమైన మలుపు. ఇది ఒక సామాజిక, రాజకీయ విప్లవం. శాంతియుత పద్ధతిలో ఎన్నికల ద్వారా అధికార మార్పిడి ఎలా సాధ్యమో రుజువు చేసిన విప్లవం. భారత రాజకీయ చరిత్రలో ఒక అద్భుతం. ఇది బహుజనుల విజయగాథ. ఇది ప్రథమ భారత స్వాతంత్ర పోరాటం 1857 కన్నా తక్కువ ప్రాధాన్యత కలది ఏమీ కాదు. ఇది విలువైనది. గొప్పది.

మీరేమిటి బిఎస్‌పి విజయగాథల పుస్తకం తేవడం ఏమిటి అని కొందరు మిత్రులు ఆశ్చర్యంగా అడిగారు. మీరు తేవడమే సరియైన నిర్ణయం అని మరికొందరు మిత్రులు అభినందించారు.

ఉత్తరప్రదేశ్ విజయం ఒక రాజకీయ ప్రయోగం యొక్క విజయం. ఈ ప్రయోగం ఆచరణ అవసరాల నుండి అనుభవం మీద చేసిన ప్రయోగం. ఈ పుస్తకం మూగ జీవాల ఆనంద, విజయాల, విశ్లేషణ అందించే చారిత్రక డాక్యుమెంట్.

1857 భారత స్వాతంత్ర పోరాటంలో కూడా మార్క్స్ ఏంగెల్స్ ఉత్తరప్రదేశ్, లక్నోల ప్రాధాన్యతను చిత్రించారు. విశ్లేషించారు. భారతదేశంలో ఉత్తరప్రదేశ్ ప్రాధాన్యత, ప్రభావం ఎంత గొప్పదో బిఎస్‌పి గెలుపు ఎన్ని మలుపులకు దారితీస్తుందో దేశ వ్యాప్తంగా అనేక కోణాల్లో వ్యాస కర్తలు, జర్నలిస్టులు విశ్లేషించారు.

కొందరు వామపక్షవాదులు, ప్రజాస్వామిక వాదులు ఈ ప్రయత్నాన్ని విచిత్రంగా చూసే అవకాశం ఉంది. వాళ్ళు గెలిస్తే విప్లవం. ఇతరులు గెలిస్తే మామూలు విషయం అనే ధోరణి వారిది. అందువల్ల అదొక రాజకీయ పార్టీ అధికారంలోకి రావడం తప్ప, అదొక అవకాశవాదం తప్ప ఇందులో రికార్డు చేయాల్సింది ఏముంది? అని పెదవి విరుస్తారు. దొరగారింట్లో జరిగితే పెళ్ళి. పేదవారింట్లో జరిగితే అది ఒక

తంతు అని భావించే దృక్పథం ఇలాంటి వారందరిలో కొనసాగుతున్నది.

నా తల్లి మాతృప్రేమ గొప్పది. నా తల్లి ప్రపంచంలో అందరి కన్నా గొప్పది. నాకు జన్మనిచ్చిన తల్లితో మరెవరినీ పోల్చలేను. నా చెల్లి అందమైనది. నా చెల్లి ప్రేమాస్పదమైనది. నా చెల్లిని, నా తల్లిని నేను ప్రేమించకుండా ఎలా ఉండగలను? ప్రపంచంలో ఎవరైనా తన చెల్లిని, తల్లిని ప్రేమిస్తూనే వుంటారు. ఇది బహుజన తల్లి, బహుజన చెల్లి పట్ల సహజమైన ప్రేమ.

నేను కాన్షీరామ్ గారికి, బిఎస్‌పికి కొంత రుణపడి ఉన్నాను. ఆ రుణాన్ని కొంత మేరకైనా తీర్చుకుందామని ఈ ప్రయత్నం. ఈ గ్రంథం కాన్షీరామ్ గారికే అంకితం.

విప్లవ సామాజిక జీవితంలో ఉన్న నన్ను, నాలాంటి వేలాది, లక్షలాది మందిని బహుజన రాజకీయ దృక్పథానికి మలుపు తిప్పిన మహా మనీషి కాన్షీరామ్. నాకు తెలియని మహోన్నత బహుజన చారిత్రక పురుషులైన మహాత్మా జ్యోతిబా పూలే, నారాయణ గురు, గురు రవిదాస్, పెరియార్ రామస్వామి, సాహు మహరాజ్ మొదలైన వారిని నా చరిత్ర వారసత్వంగా పరిచయం చేసిన బహుజన సమాజ్ పార్టీ రుణాన్ని ఎలా తీర్చుకోగలను ? ఇలా నా ఆలోచనలకు, సామాజిక దృక్పథానికి మరింత స్పష్టతను పొందడానికి కాన్షీరామ్ ఆచరణ, ఆలోచన నాకు ఎంతగానో ఉపకరించింది. అది నా జీవితంలో భాగమైంది.

కాన్షీరామ్ కేవలం రాజకీయ నాయకుడే కాదు. కేవలం రాజనీతి శాస్త్రవేత్త మాత్రమే కాదు. అతడు గొప్ప సామాజిక తత్వవేత్త. తత్వవేత్తలకే మహోన్నత తత్వవేత్త. వేలాది బహుజన తత్వవేత్తలు ఎదగడానికి కారకుడైన సామాజిక రాజకీయ తత్వవేత్త. రష్యాలో లెనిన్ కన్నా, చైనాలో మావో కన్నా, యూరప్‌లో మార్క్స్ ఏంగెల్స్ కన్నా ఏ విషయంలోనూ తక్కువ కాని పరిణతి, ప్రయోగశీలత కాన్షీరామ్ సొంతం.

మార్క్సిజాన్ని లెనిన్ డిఫరెంట్‌గా ఆచరించారు. మావో డిఫరెంటుగా ఆచరించారు. అవన్నీ మార్క్సిజం ప్రయోగాల్లో, అనుభవాల్లో భాగమే. అలాగే అంబేద్కరిజాన్ని కాన్షీరామ్ డిఫరెంట్‌గా తన సమకాలిక పరిస్థితుల్లో అన్వయించారు. మాయావతి మరింత డిఫరెంట్‌గా ప్రయోగాలు చేశారు. ఆ ప్రయోగం యొక్క విజయమే ఉత్తరప్రదేశ్ గెలుపు.

ప్రముఖ విప్లవకారుడు నా పాత మిత్రుడు, జనశక్తి పార్టీ నాయకులు కూర రాజన్న ఉత్తర ప్రదేశ్‌లో బిఎస్‌పి విజయాన్ని ఆహ్వానిస్తూ భవిష్యత్ భారత

రాజకీయాలను ఇది ప్రభావితం చేస్తుందని అభినందించారు. ప్రముఖ వాగ్గేయకారుడు, మిత్రుడు, ప్రజాయుద్ధనౌక గద్దర్ ఇది ఒక గొప్ప రాజకీయ ప్రయోగం. మార్క్స్ కూడా ప్రయోగాలు నిరంతరం జరగవలసిందేనని అన్నారని గద్దర్ గుర్తుచేశారు.

“మహాత్మా, జ్యోతిబా పూలే నుండి సాహు మహరాజ్, పెరియార్ రామస్వామి, అంబేద్కర్ దాకా జరిగిన పోరాటాల సారాంశమే భారత రాజ్యాంగం. ఆ రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారా మేము ఉద్యమాన్ని బలోపేతం చేశాం. భారతదేశంలో ప్రజాస్వామ్యం వేళ్లానుకోకపోతే నేను ముఖ్యమంత్రినయ్యేదాన్ని కాదు. ఇది ప్రజాస్వామ్యానికి లభించిన గొప్ప విజయం” అని మాయావతి అన్నారు.

ఇరవయ్యేళ్ళ క్రితం నేను దళితులే పీడిత వర్గమని, దళితుల్లో స్త్రీలు మరింత పీడిత వర్గమని దళిత స్త్రీలు నాయకులుగా ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా పాలసీ నిర్ణేతలుగా ఎదిగినప్పుడే నిజమైన నూతన ప్రజాస్వామిక విప్లవం, నూతన సాంస్కృతిక విప్లవం విజయవంతమైనట్లు అని అనేక సందర్భాల్లో స్పష్టం చేశాను. ఆ కల 1993లో అరకొరగా నిజమైంది. ఇప్పుడు 2007లో పూర్తి స్థాయి మెజారిటీతో సాకారం చెందింది. ఇది అగ్రకులాల నాయకత్వంలో వున్న పార్టీల ద్వారా అసాధ్యమైన విషయం. వామపక్ష నక్సలైట్ పార్టీల ద్వారా అసాధ్యమైన విషయం.

ఇలాంటి అసాధ్యమైన విషయాన్ని సుసాధ్యం ఎలా అయింది? 1) విజన్. 2) సిద్ధాంతం. 3) సమర్థవంతమైన నాయకత్వం. 4) అనుక్షణం పరిస్థితులకనువుగా ఎత్తుగడలను మార్చుకుంటూ అవతలి పక్షానికి అవకాశం రాకుండా నిరంతరం తాను పైచేయిగా ఉండేట్లు జాగరూకతతో ముందుకు సాగడం. 5) కేడర్‌ను అనుక్షణం మారుతున్న ఎత్తుగడలకు అనువుగా వాటిని సమర్థించే వారుగా ఎదిగిస్తూ నాయకత్వం పట్ల పూర్తి విశ్వాసంతో ముందుకు సాగడం. 6) మీడియా మీద ఆధారపడకుండా సొంత మీడియాగా కార్యకర్తల మీదనే ఆధారపడడం.

ఉత్తరప్రదేశ్‌లో మాయావతి గెలుపొందాక కేవలం వారం రోజుల్లో దేశ వ్యాప్తంగా దిన, వార పత్రికల్లో సుమారు లక్ష యాభై వేల పేజీల వ్యాసాలు, వార్తాంశాలు, టివి ప్రసారాలు వెలువడ్డాయి. వారం రోజుల్లోనే ఒక గెలుపు చరిత్రను, ప్రపంచ ప్రజల మానసికతను గెలుపుకు అనువుగా ఎలా మలుపుతుందో ఇది తెలుపుతుంది. ఎన్ని సామాజిక ఉద్యమాలు, ఎన్ని సంఘటనలు కలిసినా ఇంతగా ప్రజల మైండ్ సెట్‌ను మార్చడంలో ప్రభావితం చేయగలుగుతాయా? ప్రజాస్వామిక ఎన్నికల గెలుపు దీన్ని సాధ్యం చేసింది. ప్రజాస్వామ్యంలో ఉన్న గొప్ప విలువ, సంస్కృతి ఇదే. గెలిచిన వారిని గౌరవించడం ఓడినవారి సంస్కారంగా ప్రజాస్వామ్యం ఉన్నత విలువలను

పరిరక్షిస్తూ వస్తున్నది. ఓడిన రోజే ములాయం రాజీనామా చేయడంతో పాటు మాయావతి ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి హాజరు కావడం ప్రజాస్వామ్య సంస్కృతి సౌందర్యాన్ని, స్నేహశీలతను తెలుపుతుంది.

అందువల్ల సామాజిక ఉద్యమకారులు, కుల సంఘాలు, బిసి, ఎస్సీ, ఎస్టీ సంఘాలు తమ శక్తి సామర్థ్యాలన్నింటినీ రాజకీయ అధికారం సాధించడంలోకి మలుపు తిప్పితే అద్భుతాలు సృష్టిస్తారు. అందుకు బిఎస్‌పి విజయాలే మనకు సాక్ష్యం. మరింత అధ్యయనం కోసం మరిన్ని పుస్తకాలు రావాల్సి ఉంది.

భారత దేశంలో ఒక విచిత్రమైన స్థితి కొనసాగుతున్నది. రష్యా, చైనా, ఇంగ్లాండ్, అమెరికా ప్రజల గురించి మనకు తెలిసినంతగా ఇరుగు పొరుగు రాష్ట్రాల ప్రజల గురించి తెలియదు. ఉత్తరప్రదేశ్ ఎక్కడో ఉన్న దేశంలాగా రాష్ట్ర ప్రజలు మానసికంగా దూరంగా ఉన్నారు. వీరిని పరస్పరం సన్నిహితం చేయడం ఎంతో అవసరం. అందుకు రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, సాహిత్య గ్రంథాలు, విశేషాలు పరస్పరం అనువాదం చేసుకోవడం ఎంతో అవసరం.

అందువల్ల ఈ పుస్తకంలో ఉత్తర ప్రదేశ్ రాజకీయ పరిణామాల విశ్లేషణతో పాటు అక్కడి ప్రజలను కూడా సన్నిహితం చేయాలని భావించాను. అందులో భాగంగా ఉత్తర ప్రదేశ్‌తో ఇరవైరెండేళ్ళ నాటి నా అనుబంధం, అనుభవాలను, పర్యటన విశేషాలను సంక్షిప్తంగా రాశాను. ఈ ప్రయత్నం ఏ కాస్త ఫలితమిచ్చినా నా లక్ష్యం సఫలమైనట్టే.

ఈ పుస్తకం రావడంలో అనేక మంది సహకారం ఉంది. సమాచార సేకరణలో తెలుగు, ఇంగ్లీష్ దినపత్రికలతో పాటు కేంద్ర ప్రభుత్వ ప్రచురణలు, మనోరమ ఇయర్ బుక్ 2007, మరికొన్ని గ్రంథాలు ఎంతో ఉపయోగపడ్డాయి. నా గేయ కవిత అట్టవెనుక కాదు, ముఖ చిత్రంగానే ఉండాలని మిత్రులు ఎ.విద్యాసాగర్ సూచించారు. బిఎస్‌పితో 1990 నుండి దగ్గరగాను, పరిశీలకుడిగాను నాకున్న అనుభవాలు ఈ రచనలో ఎంతో ఉపకరించాయి. బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు, మిత్రుడు నల్లా సూర్యప్రకాష్ విస్తృత సమాచారంతో సహకరించారు. ఇవన్నీ ఈ రచనలో నాదైన తీరులో ఉపయోగించుకున్నాను. ఈ వ్యాసాలన్నీ పత్రికల కోసం, ఈ పుస్తకం కోసం 20 రోజుల్లో పూర్తి చేసినవే.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో బిఎస్‌పి నిర్వహించాల్సిన పాత్ర మహోన్నత మైనది. అందుకు ఉత్తరప్రదేశ్ గెలుపు ఎంతో ఉత్తేజాన్ని ఇచ్చే సందర్భం. ఆ ఉత్తరప్రదేశ్ విజయాన్ని నిక్షిప్తం చేసుకున్న ఈ గ్రంథం ఈ పరంపరలో మొదటిది.

బిఎస్‌పి గెలుపు

భారత రాజకీయాల్లో మలుపు

ఉత్తర ప్రదేశ్‌లో సొంత బలంపై మొదటి సారి గెలిచిన బిఎస్‌పిది నిశ్శబ్ద విప్లవం. స్వాతంత్ర్యానంతర భారత రాజకీయాల్లో ఇదొక మౌలికమైన మలుపు. దేశంలో మొట్టమొదటి సారిగా ఎస్సీల నాయకత్వంలో ఇతర వర్గాలు, ఇతర కులాలు దేశంలోని పెద్ద రాష్ట్రంలో మాయావతి నాయకత్వంలో సొంత బలం మీద అధికారంలోకి రావడం జరిగింది. జగ్జీవన్‌రాం, దామోదరం సంజీవయ్య, బంగారు లక్ష్మణ్ మొదలైన వాళ్ళు తమ సొంత నాయకత్వంలో సొంత బలంపై ఎదిగిన వాళ్ళు కాదు. వీళ్ళంతా 1932లో జరిగిన పూనా ఒప్పందం పరిణామాలననుసరించి ఎదిగిన వారు. కానీ మాయావతి గెలుపు అంబేద్కర్ ఆశించిన కమ్యూనల్ అవార్డు లక్ష్యానికి అనువుగా సాధించిన గెలుపు. కమ్యూనల్ అవార్డు బదులుగా పూనా ఒప్పందాన్ని తీసుకు రావడం వల్ల 70 ఏళ్ళు ఆలస్యంగా ఎస్సీలు తమ సొంత బలాన్ని సమీకరించుకోగలిగారు.

కమ్యూనల్ అవార్డు యథాతథంగా అమలు జరిగి ఉంటే 1960 నాటికే ఎస్సీలు తమ సొంత బలం మీద అన్ని రాష్ట్రాల్లో జాతీయ నాయకులుగా జాతికి నాయకత్వాన్ని అందించి ఉండేవారు.

బిఎస్‌పి విజయం రెండు విషయాల్లో గొప్పది

బిఎస్‌పి విజయం సిపిఎం 1967 నుంచి బెంగాల్‌లో గెలిచిన దానికన్నా రెండు విషయాల్లో గొప్ప విజయం.

1. సిపిఎందీ విదేశీ సిద్ధాంతం – బిఎస్‌పిది స్వదేశీ సిద్ధాంతం
2. సిపిఎందీ అగ్రకులాల నాయకత్వం. బిసి,ఎస్సిలకు అందులో స్థానంలేదు. మంత్రి వర్గాల్లో కూడా స్థానం లేదు.

బిఎస్‌పిది ఎస్సిల బిసిల నాయకత్వం. మెజార్టీ ప్రజాప్రతినిధులు.

బి.ఎస్.రాములు

మెజార్టీ మంత్రులు కూడా వారే. మెజార్టీ బడ్జెట్ కూడా వారికే.

ఈ మౌలికమైన మార్పు సిపిఎం ద్వారా గానీ, నక్సలైట్ల ద్వారా గానీ, కాంగ్రెస్, తెలుగుదేశం, బిజెపిల ద్వారా గానీ అసాధ్యమైన విషయం అని చరిత్ర స్పష్టం చేసింది. ఇదే బిఎస్‌పి భారత రాజకీయాల్లో సాధించిన మౌలిక విజయం.

ఎస్‌పి, బిఎస్‌పి పోట్లాటలో బిజెపి లాభపడకుండా, కాంగ్రెస్ లాభపడకుండా బిఎస్‌పియే లాభపడడానికి అగ్ర కులాలకు టికెట్లు ఇచ్చి తన గొడుగు కిందికి తీసుకురావడం ఒక గొప్ప రాజకీయ చాతుర్యానికి నిదర్శనం. అలా అని సమాజ్ వాది పార్టీ ఏమీ చేయలేదు అని అనుకోనవసరం లేదు. బిసిల్లో, మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాసుల్లో గొప్ప చైతన్యాన్ని తీసుకు రావడానికి రామమనోహర్ లోహియా, ములాయం సింగ్ యాదవ్ కృషి ఎంతో ఉపయోగపడింది. బిఎస్‌పి అగ్రకులాలకు టికెట్లు ఇచ్చిన వాళ్ళంతా బెజెపి, ఎస్‌పి వంటి పార్టీల్లో టికెట్లు పొందిన అగ్ర కులాలలాంటి వాళ్ళు కాదు. అగ్రకుల ధనికుల్తో పోటీ పడలేని రెండోస్థాయి అగ్రకులాలకు, సెక్యులరిస్టులకు, ప్రజాస్వామిక వాదులకు టికెట్లిచ్చి గెలిపించడం ద్వారా అగ్ర కులాల్లో నిజమైన సామాజిక పరివర్తన సాధించే నాయకత్వాన్ని ప్రమోట్ చేసినట్టయింది.

బిఎస్‌పి సొంత బలంపై గెలవడం భారత రాజకీయాల్లో ఒక గొప్ప మలుపు. రాబోయే కాలంలో రాజకీయాలు ఎలా ఉండబోతున్నాయో బిఎస్‌పి గెలుపు సూచిస్తుంది. అయితే అన్ని రాష్ట్రాల్లో బిఎస్‌పి నాయకత్వంలో ప్రభుత్వాలు ఏర్పడతాయని భావించనవసరం లేదు. ఎక్కడికక్కడ స్థానిక పరిస్థితులను అనుసరించి స్థానిక పార్టీలు, రాజకీయ పార్టీలు బిఎస్‌పి ఫార్ములాను తమకు అనుకూలంగా మలుచుకొని ఎవరు ముందుకు సాగుతారో వారికే అధికారం చేతికి వస్తుంది. గతంలో కూడా అనేక ఫార్ములాలు కొన్ని చోట్ల గెలుపొందాయి. అవేఫార్ములాలు ఇతర రాష్ట్రాల్లో కొడిగట్టుకొని పోయాయి. ఆ పార్టీలకు ఇతర రాష్ట్రాల్లో ఏమీ లాభించలేదు.

ఉదాహరణకు పశ్చిమబెంగాల్‌లో 30 ఏళ్ళుగా సిపిఎం ప్రభుత్వం కొనసాగుతున్నది. అయినప్పటికీ ఆ ఫార్ములాతో కార్యక్రమాలతో ఇతర రాష్ట్రాల్లో అధికారంలోకి రాలేక పోయింది. అధికారం కనుచూపు మేరలో కూడా లేదు. అలాగే డిఎంకె, తెలుగుదేశం, ఆర్‌జెడి, సమాజ వాది పార్టీ, బిజెపి మొదలైన పార్టీల ఫార్ములాలు ఇతర రాష్ట్రాల్లో గెలుపుకు దారితీయలేదు. అవి ఆయా రాష్ట్రాలకే పరిమితమయ్యాయి. ఉత్తర ప్రదేశ్‌లో బిఎస్‌పి తరఫున మాయావతి ముఖ్యమంత్రిగా ఇప్పటిదాకా మూడు సార్లు పీఠం అధిష్టించినా ఆంధ్రప్రదేశ్ బిఎస్‌పికి తద్వారా పెరిగిన బలమేమీ లేదు. ఎక్కడి కృషి అక్కడ సాగాల్సిందే. ఎక్కడి నాయకత్వం అక్కడ స్వయంగా కష్టపడి

సమీకరించి ప్రజల విశ్వాసం చూరగొని గెలవాల్సిందే అని ఈ సంఘటనలు అన్నీ రుజువు చేస్తున్నాయి.

ప్రతి ప్రాంతానికి ప్రత్యేక ఫార్ములాలు అవసరం

అలాగే సిపిఎం పార్టీ రాష్ట్రంలో బెంగాల్‌లో వలె ఏ మార్పు లేకుండా కార్యక్రమాలు తీసుకుంటే, అవగాహన కలిగి ఉంటే అదే ఫార్ములా ఆచరిస్తే ఇప్పటిలాగే 30 ఏళ్ళయినా పెరగని దశలోనే ఉండిపోతుంది. తెలుగుదేశం పార్టీ కూడా తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం వచ్చిన తరువాత తెలంగాణలో గెలవడం అసంభవమైన విషయం.

తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యానికి అనువుగా తెలుగుదేశం పార్టీ కూడా ఆమోదిస్తూ తీర్మానిస్తూ తిరిగి స్వయం శక్తితో ప్రజల్లోకి చొచ్చుకుపోయి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమిస్తే టిడిపి తెలంగాణ రాష్ట్రంలోనూ, ఆంధ్ర రాష్ట్రంలోనూ గెలిచే అవకాశం ఉంటుంది. సిపిఎం పేదలకు భూమి అంటూ ఎన్ని పోరాటాలు చేసినా తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని స్వయంగా నిర్వహించకుండా రాబోయే ఎన్నికల్లో గెలవడం అనే సమస్యే లేదు. క్రమ క్రమంగా సిపిఎం తెలంగాణలో నామ రూపాలు లేకుండా పోయే అవకాశం ఉంది.

అలాగే బహుజన సమాజ్ పార్టీ కూడా ఉత్తర ప్రదేశ్ ప్రయోగాన్ని యధాతధంగా స్వీకరిస్తే అక్కడ నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయినప్పటికీ ఇక్కడ ఏమీ ఎదగనట్టుగానే చివరకు మిగిలిపోతుంది. బహుజన సమాజ్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, తెలంగాణ ప్రాంతానికి ఒక ప్రత్యేకమైన చరిత్ర పరిణామం ఉందని ముందు గుర్తించాలి. తెలంగాణ చరిత్ర, తెలంగాణ రాజకీయ పరిణామాలు, సామాజిక ఉద్యమాలు, ప్రత్యేక పరిణామాలను, ప్రత్యేక అస్తిత్వాన్ని కలిగి ఉన్నాయని తెలుగు దేశం, సిపిఎం, బిఎస్‌పి గుర్తించడం అవసరం. అప్పుడే అవి గెలుపు పోటీలో గెలుపొందడం సాధ్యమవుతుంది.

తెలంగాణ రాష్ట్ర ఉద్యమం యుపి విజయం నుండి ఎంతో నేర్చుకోవాలి

బహుజన సమాజ్ పార్టీ ఉత్తర ప్రదేశ్‌లో గెలుపొందడం నుంచి తీసుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ఉద్యమం, టిఆర్ఎస్ మొదలైనవాళ్ళు తమను తాము మార్చుకోవడానికి ఉత్తర ప్రదేశ్‌లో గత ఐదుఆరేళ్ళుగా బిఎస్‌పీ ప్రజల్లో చేసిన నిర్మాణాన్ని కార్యకర్తల సమీకరణను అధ్యయనం చేయడం ఎంతో అవసరం. అందుకు బృందాలుగా వెళ్ళి తెలంగాణ రచయితలు, మేధావులు, కళాకారులు, విద్యావంతులు అక్కడి గెలుపు సాధ్యమైన తీరును లోతుగా పరిశీలించాలి.

ముఖ్యంగా రాష్ట్రంలో బిసి, ఎస్‌సి, ఎస్‌టిల నాయకత్వంలో తెలంగాణలో, ఆంధ్రలో ప్రభుత్వాలు ఏర్పడాలని ఉద్యమాలు సాగాలని కోరుకునే వారంతా ఉత్తర ప్రదేశ్ పర్యటించడం అవసరం.

మీడియాపై ఆధారపడకుండా బిఎస్‌పి గెలిచిన తీరు అందరికీ ఆదర్శం

ఉత్తర ప్రదేశ్‌లో బిఎస్‌పి గెలుపు అనేక మౌలిక విషయాల్లో ప్రాధాన్యత కలిగి ఉంది. బిఎస్‌పి మొదటి నుంచి రాజకీయాల్లో మనీ, మీడియా మాఫియా ప్రాధాన్యతను వ్యతిరేకిస్తున్నది. మనీ మీడియా మాఫియా బిఎస్‌పిని ఎన్ని విధాలుగా వ్యతిరేకించాలో అన్ని విధాలుగా వ్యతిరేకించి కించపరిచింది.

అయినప్పటికీ మనీ మీడియా మాఫియా ప్రభావాలకు అతీతంగా బిఎస్‌పి ఎలా గెలవగలిగింది. అనేది అన్నింటికన్నా ముఖ్యమైన విషయం. ప్రజల్లో పని చేయని వారే మనీ మీడియా మాఫియాలపై ఆధారపడుతారు. రాష్ట్రంలో అనేక ఉద్యమాలు మనీ మీడియా మాఫియాలపై ఆధారపడి కొనసాగుతున్నాయి.

అందువల్లే ఈనాడు రామోజీరావు అక్రమాలకు మద్దతు పలుకుతూ పలు పార్టీలు పోటీలు పడి సాగిలపడ్డాయి. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకత్వం రామోజీరావును ప్రత్యేకంగా కలవడం కూడా మనీ మీడియా మాఫియాలకు లొంగిపోవడంలో భాగమే.

టిఆర్ఎస్ సందర్భోచిత నిర్ణయాలు అన్నీ మనీ మీడియా రియల్ ఎస్టేట్, మాఫియాకనుకూలంగా కొనసాగుతున్నాయని అది చేస్తున్న ఉద్యమాలు, దాని నాయకులు, దాని ఆర్థిక వనరుల దాతలు మొదలైనవన్నీ స్పష్టం చేస్తున్నాయి. బిఎస్‌పి మీడియాకు దూరంగా ఉండి విజయం సాధించడం అందరికీ ఆదర్శం.

తెలంగాణ ఉద్యమం బిఎస్‌పికి గొప్ప అవకాశం

ఎప్పటిలాగే ఈ సారి కూడా బిఎస్‌పి తన కార్యకర్తలమీద ఆధారపడింది. ఎప్పటిలాగే బిఎస్‌పి ఓటుతో పాటు నోటు ఇచ్చి గెలిపించండి అని ప్రజలను కోరింది. అలా ఉత్తర ప్రదేశ్‌లో బిఎస్‌పి అభ్యర్థులు అతి తక్కువ ఖర్చుతో గెలుపొందారు.

కానీ తెలంగాణ ఉద్యమం ఎంత ఉధృతంగా సాగుతున్నప్పటికీ కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తే తప్ప గెలువలేక పోయింది. అంటే తెలంగాణ ఉద్యమం ప్రజల మీద, కార్యకర్తలమీద ఆధారపడి నడవడం లేదు, నడిపించడం లేదు అని అర్థం. నిజంగా ప్రజలపై ఆధారపడితే ఉద్యమాల పార్టీలకు కోట్లాది రూపాయల ఖర్చుతో గెలవాల్సిన దుస్థితి ఏర్పడి ఉండేది కాదు.

దబ్బున్న వాళ్ళకే రాజకీయాలను పరిమితం చేసే ప్రత్యేక పథకం

నిజానికి ఇది దుస్థితి కాదు, కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టగలిగే వారి నుంచే నాయకులను తయారు చేసే స్పష్టమైన నిర్ణయంలో భాగంగానే ఇలా జరుగుతున్నది. అందువల్ల తెలంగాణ రాష్ట్ర సమితి ఉద్యమం అది తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని తన రాజకీయ పార్టీ ఎదుగుదలకు వెలమ వంటి ఒకటి రెండు కులాల నాయకులకు, కుటుంబ రాజకీయ ఆధిపత్యానికి అనువుగా కావాలని మలుస్తున్న క్రమం అని రుజువవుతున్నది.

తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో బిఎస్‌పి అలాగే బిసి, ఎస్‌సి, ఎస్‌టి వర్గాలు తమ సొంత నాయకత్వంలో 1996 నుండి ఉద్యమించి ఉంటే ఆ చరిత్ర స్పష్టంగా ఉత్తర ప్రదేశ్‌లో బిఎస్‌పి గెలిచినట్టుగా రాష్ట్రంలో బిసి, ఎస్సీల ఎస్టీల నాయకత్వంలో అనేక మంది ప్రజా ప్రతినిధులుగా, పార్టీ నాయకులుగా ఎదిగి ఉండేవారు.

ఈ క్రమాన్నంతా పకడ్బందీగా అడ్డుకుంటూ విచ్ఛిన్నం చేస్తూ ముందుకు సాగడం వల్ల, వెలమ రాజకీయాలకు తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని ఒక పావుగా మార్చుకోవడం వల్ల ఇతర కులాలకు ఇతర వర్గాలకు నిజంగా చిత్తశుద్ధితో పని చేసే వారికి నాయకత్వం అందకుండా చేయబడింది. అలాంటి వారికి టికెట్లు ఇవ్వకుండా నిరాకరించారు. పార్టీ ఫండ్ పేరిట కోట్లాది రూపాయలు సమీకరించడానికి అనువుగా అలాంటి వర్గాల నుండి, కులాల నుండి టిఆర్‌ఎస్ నాయకత్వం రూపొందుతూ వచ్చింది.

అందువల్ల డా॥ కె. జయశంకర్ వంటి సిద్ధాంత కర్తలను రాజ్యసభకుగానీ, ఎమ్మెల్సీగా గానీ ఎన్నుకోలేక పోయింది. ప్రజాస్వామిక పార్టీ నిర్మాణాన్ని, జిల్లా, రాష్ట్ర కార్యవర్గాలను, పోలిట్ బ్యూరోలను, వాటి నిర్మాణాన్ని అపహాస్యం చేసే బాల్‌థాకరేలు సమాజాన్ని ప్రభావితం చేయగలరే గానీ ప్రజల నాయకులుగా ఎదగడం సాధ్యం కాదు. అధికారంలోకి రావడం అంతకన్నా సాధ్యం కాదు. యువ నాయకత్వాన్ని తీర్చి దిద్దని నాయకత్వం ఎప్పుడూ ఎదగదు.

ఒకసారి పోగొట్టుకున్న అవకాశం మళ్ళీ వచ్చింది

ఈ బలహీనతలున్న టిఆర్‌ఎస్ పార్టీ నుంచి బిఎస్‌పి తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని తన చేతుల్లోకి తీసుకోవడం అంత కష్టమేమీ కాదు. అందుకు బిఎస్‌పి రాష్ట్ర నాయకత్వం సిద్ధంగా ఉందా? లేదా? అనేదే అసలు ప్రశ్న.

వార్త దినపత్రిక; -5-2007

ఉత్తర ప్రదేశ్ రాజకీయ, సామాజిక, చారిత్రక పరిణామాల్లో భాగంగా

బిఎస్‌పి గెలుపు

బహుజన సమాజ్‌పార్టీ ఉత్తరప్రదేశ్‌లో పూర్తి మెజార్టీతో అధికారంలోకి రావడం మొత్తం భారత దేశంలో రాబోయే మౌలిక సామాజిక, రాజకీయ పరిణామాలను సూచిస్తుంది. ఒకటి రెండు దశాబ్దాలలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో స్థానిక బిసి, ఎస్‌సి, ఎస్టీ సామాజిక వర్గాల నుండి ఎదిగిన సామాజిక శక్తుల ప్రతినిధులైన పార్టీలే రాష్ట్రాల్లోనూ, కేంద్రాల్లోనూ అధికారంలోకి వస్తాయి. అది సాధ్యమే అని మాయావతి గెలుపు రుజువు పరుస్తున్నది.

బిఎస్‌పి పుట్టుక-నేపథ్యం

1984లో కీ.శే. కాన్షీరామ్ నాయకత్వంలో బహుజన సమాజ్ పార్టీ పుట్టింది. ఉత్తరప్రదేశ్‌ను ఒక ప్రయోగ శాలగా మలచాలని కాన్షీరామ్ భావించారు. మహారాష్ట్రలో అంబేద్కర్ తదనంతరం జరిగిన ప్రయోగాలన్నీ బహుజనుల విచ్ఛిన్నతకు దారితీశాయే తప్ప రాజ్యాధికారం రాలేదని ఏ గీతలు లేని తెల్ల కాగితం వంటి ఉత్తర ప్రదేశ్‌ని తన ప్రయోగాలకు అనువైనదని భావించారు కాన్షీరామ్.

బహుజన సమాజ్ పార్టీ పుట్టుకకు సిద్ధాంత భూమికను, సామాజిక వర్గాల భూమికను 1978లో ఏర్పడిన బాంసెఫ్ అందించింది. బాంసెఫ్ నిర్మాతల్లో కాన్షీరామ్ ఒకరు. 1981లో కాన్షీరామ్ నాయకత్వంలో సామాజిక ఉద్యమంగా పని చేయాలని డిఎస్4 (దళిత, సోషిత్, సమాజ్ సంఘర్ష సమితి)ను స్థాపించారు. దాని తర్వాత ఇక రాజకీయ పార్టీ స్థాపించక తప్పదని భావించి కాన్షీరామ్ 1984లో బహుజన సమాజ్ పార్టీని స్థాపించారు. బహుజన సమాజ్ పార్టీని స్థాపించడాన్ని, రాజకీయ రంగంలోకి వెల్లడాన్ని బాంసెఫ్ నాయకులు వ్యతిరేకించారు. వ్యతిరేకించిన ఆ బాంసెఫ్ నాయకులు బాంసెఫ్‌ను దేశవ్యాప్తంగా స్వతంత్ర ఉద్యమంగా ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. బాంసెఫ్ వెనుకబడిన వర్గాల, మైనార్టీ వర్గాల ఉద్యోగుల సమాఖ్య.

ఇది అన్ని ఉద్యోగ సంఘాల్లా ట్రేడ్ యూనియన్ ఉద్యమాలు నడుపదు. అంబేద్కర్ దృక్పథంతో బిసి,ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీ ఐక్యతకు కృషి చేస్తుంది.

బిఎస్‌పి సిద్ధాంత, చారిత్రక వారసత్వం

బుద్ధుడు నుండి చార్వాకుల నుండి గురు రవిదాస్, బసవన్న, పాల్కురికి సోమన, అమీర్‌కుస్రో, యోగి వేమన, నారాయణగురు, సంత్ కబీర్, మహాత్మ జ్యోతిరావు పూలే, తిరువల్లువర్, అయోతీదాస్, పెరియార్ రామస్వామి, ఛత్రపతి సాహుజీ మహరాజ్, గురునానక్, బిర్సాముండా, డా. బి.ఆర్. అంబేద్కర్ దాకా గల భారతీయ సామాజిక విప్లవకారుల వారసత్వాన్ని సిద్ధాంతాలను సంశ్లేషించి వారి స్ఫూర్తితో కుల వివక్షతకు వ్యతిరేకంగా కృషి చేస్తూ అన్ని కులాలు సమానమే అనే దృష్టితో అంబేద్కరిజం వెలుగులో బహుజన సమాజ్ పార్టి పని చేస్తుందని కాన్షీరామ్ ప్రకటించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఆయా కాలాల్లో శూద్ర ఉత్పత్తి కులాల నుండి అతిశూద్ర కులాల నుండి ఎదిగిన కవులను కళాకారులను ఉద్యమ కారులను రాజులను తత్వవేత్తలను చరిత్ర పొరల్లోంచి వెలికి తీసి జాతీయ స్థాయిలో ఒక్కటిచేసి విస్తృతంగా ప్రచారం చేశారు.

స్వదేశీ చరిత్ర పునాదుల మీద స్వదేశీ సిద్ధాంత భూమిక

ఇలా స్వదేశీ చరిత్ర పునాదులమీద స్వదేశీ మహనీయుల సిద్ధాంత భూమిక మీద ఆధారపడి బహుజన సమాజ్ పార్టీ ముందుకు సాగింది. బహుజన సమాజ్ పార్టీ సిద్ధాంతం స్వదేశీది. బుద్ధుడు నుండి అంబేద్కర్ దాకా సాగిన చారిత్రక సామాజిక సిద్ధాంత పరిణామాలన్నీ తమ సిద్ధాంతాలుగా లక్ష్యాలుగా ప్రకటించారు. శతాబ్దాలుగా అధికారానికి దూరం చేయబడ్డ బిసి,ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీల నాయకత్వంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లోకి అధికారంలోకి రావాలని లక్ష్యంగా నిర్దేశించారు. మా లక్ష్యం అంతిమంగా భారత దేశాన్ని పరిపాలించడమే అని కాన్షీరామ్ అనేక సందర్భాల్లో స్పష్టం చేశారు. ఓట్లు మావి, సీట్లు మీవా? అనే నినాదంతో దేశాన్ని తనవైపు ఆకర్షించారు. ముస్లింలు కూడా మతం మార్చుకున్న శూద్రులే అనే చరిత్రను ముందుకు తెచ్చి చర్చను లేవదీశారు. ముస్లింలు తమ చరిత్ర మూలాల్లోకి వెళ్ళడానికి కారకులయ్యారు.

ముఖ్యమంత్రిగా మాయావతి కృషి

మాయావతి మూడుసార్లు ముఖ్యమంత్రి అయ్యాక చేసిందేమిటి? అనే ప్రశ్న వస్తుంది. మూడు సార్లు ముఖ్యమంత్రి అయిన తరువాత సంపాదించుకున్న

అభిమానమే సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి రావడానికి కారణమయింది. ఆమె మరీ ఎక్కువ పనులేమీ చేయలేదు. మైనార్టీ ప్రభుత్వానికి అనేక పరిమితులు ఉంటాయి. 50 ఏళ్ళుగా అనేక ప్రభుత్వాలు పేదలకు భూమి పట్టాలు ఇచ్చాయి. కానీ భూమిని వాళ్ళు అనుభవించే అవకాశం కలిగించలేదు. మాయావతి అలా ఎప్పుడో ఇచ్చిన పట్టాలను అమలు జరిపి భూమిని వారు దున్నుకునేట్టుగా ఏడు లక్షల ఎకరాలను వారికి హస్తగతం చేశారు. భావజాల వ్యాప్తిని విస్తృతం చేశారు. అయిదు కొత్త జిల్లాలను అంబేద్కర్, బుద్ధుడు, పూలే, ఛత్రపతి సాహుజి మహరాజ్ పేర్లతో ఏర్పర్చారు. అంబేద్కర్ పార్కును కొన్ని కోట్ల రూపాయలతో నిర్మించారు. శాంతిభద్రతలను కాపాడుతూ అగ్రకులాల దౌర్జన్యాలను వ్యతిరేకిస్తూ బహుజనుల పక్షాన ప్రభుత్వ యంత్రాంగాన్ని నడిపించారు. దాంతో ప్రభుత్వం పట్ల బహుజనులకు విశ్వాసం పెరిగింది. అదే క్రమ క్రమంగా పూర్తి స్థాయి మెజార్టీతో గెలిపించడానికి కారణమయ్యింది.

అంబేద్కరిజం బిఎస్‌పి సిద్ధాంత భూమిక

అంబేద్కర్ సామాజిక తత్వవేత్తగా, సామాజిక విప్లవకారుడిగా, అర్థ శాస్త్రవేత్తగా పలు రంగాల్లో అనేక కర్తవ్యాలను నిర్వర్తించారు. బౌద్ధానికి పూర్వ స్థితి తీసుకు రావాలని బౌద్ధాన్ని సాంస్కృతిక విప్లవంలో భాగంగా దేశంలో పునరుద్ధరించారు.

భారత రాజ్యాంగం ద్వారా, పూనా ఒప్పందంద్వారా ఎస్‌సి, ఎస్‌టిలు రాజకీయ రంగంలో, ఉద్యోగ రంగంలో కొంత వాటా పొందారు. కాలం గడిచిన కొద్దీ వీళ్ళు ఒక సామాజిక వర్గంగా బలంగా రూపొందారు. దానికి అంబేద్కరిజం తాత్విక భూమిక అయింది. అంబేద్కరిజం బిసి, ఎస్‌సి, ఎస్‌టిల మైనారిటీలందరి విముక్తికి అధికారానికి బాట వేయడానికి రాజకీయ నిర్మాణంలో కాన్షీరాం అనేక కోణాల్లో అంబేద్కరిజాన్ని విస్తరించారు.

బహుజన పార్టీని సర్వజన పార్టీగా మలిచిన పరిణామం

కాన్షీరామ్ అగ్రవర్ణాలను, అగ్ర కులాలను చాలా సీరియస్‌గా విమర్శించేవారు. మాయావతి కూడా వారిని చెప్పుతో కొట్టండి అని విమర్శించిన వారే. కానీ ఇప్పుడు వారితో కూడా కలిసి పార్టీని విశాలం చేశారు. చరిత్ర పరిణామ క్రమం అనుసరించి 2002 నుంచి ఒక ప్రయోగం చేశారు. 2007లో బహుజన పార్టీని సర్వజన ప్రతినిధి పార్టీగా మలిచారు. దీనివల్ల అంబేద్కరిజాన్ని వదిలేశారని కొందరు భావిస్తున్నారు. అలా భావించడం సరియైనది కాదు.

బహుజన సమాజ్ పార్టీ కూడా సమాజంలోని అన్ని కులాలను సామాజిక న్యాయంలో భాగంగా జీవన భద్రతను, జీవికను ఆత్మగౌరవాన్ని శాంతియుత జీవనాన్ని గడపడానికి బాధ్యత వహిస్తుంది. అందువల్ల అగ్రకులాల ప్రజల ప్రయోజనాలు కూడా నెరవేర్చడం దాని బాధ్యత అవుతుంది. అగ్ర కులాలు అధికారంలో ఉన్నప్పుడు పేదల అభ్యున్నతి మా లక్ష్యం అని ప్రకటించు కున్నారు. బహుజన కులాలు అధికారంలో ఉన్నప్పుడు అగ్ర కులాల ప్రయోజనాలు పరిరక్షించడం కూడా మా లక్ష్యం అని ప్రకటించడం ద్వారా అగ్ర కులాల్లోని ప్రజాస్వామిక వాదుల అభిమానాన్ని చూరగొన్నది.

వీళ్ళందరినీ ఒకే గొడుగు కిందికి తీసుకు రావడం ఎంతో కష్టమైన పని. సొంత పార్టీలో తిరుగుబాటు, వ్యతిరేకత ఎంతో ఉంటుంది. వారందరినీ ఒక్కతాటిమీదికి తీసుకురావడంలో మాయావతి రాజకీయ పరిణతి స్పష్టమౌతుంది. బిఎస్‌పి పేరిట గెలిచి ఆ తర్వాత పార్టీ ఫిరాయించిన నియోజక వర్గాల్లో అన్ని చోట్ల తిరిగి బిఎస్‌పి నిలబెట్టిన కొత్త అభ్యర్థులనే ప్రజలు ఎన్నుకున్నారు. దీని ద్వారా తేలేదేమంటే ప్రజల్లో బిఎస్‌పి సిద్ధాంత భావజాలం కార్యకర్తల నిర్మాణం చాలా బలంగా అన్ని స్థాయిల్లో విస్తరించిందని అర్థం. దీని వల్లే కేవలం 25వేల రూపాయల ఖర్చుతో ఎమ్మెల్యేలుగా ఎన్నిక కాగలిగారు. ఒక దశలో లక్ష 25వేల రూపాయలు ఖర్చు ఎమ్మెల్యే ఎలక్షన్లలో అత్యధిక ఖర్చు. ఈ ఎన్నికల్లో కూడా అతి తక్కువ ఖర్చుతో గెలుపొందిన వాళ్ళే ఎక్కువ. ఇదంతా ఓటుతో పాటు నోటు ఇవ్వండి అంటూ ప్రజల హృదయాలను గెలుచుకోవడం ప్రధాన కారణం.

ఐబిసిలకు రిజర్వేషన్లు

గెలిచాక ఐబిసిలకు రిజర్వేషన్లు ఇవ్వాలని మాయవతి తన లక్ష్యాన్ని ప్రకటించింది. తద్వారా అగ్ర కులాలకు ఏ మాత్రం తీసి పోకుండా అందరి గురించి పట్టించుకునే నాయకురాలిగా నిరూపించుకుంది. ఇది కొందరికి జీర్ణం కావడం లేదు. అగ్ర కులాల నాయకులతో సమానంగా గుర్తించ నిరాకరించడం నుంచే ఈ సమస్య ఉత్పన్నమవుతున్నది. బిఎస్‌పి గెలుపు వెనుక గల సామాజిక పరిణామాలను తెలుసుకోవడానికి కాస్త ఉత్తరప్రదేశ్ రాష్ట్రాన్ని అధ్యయనం చేయడం అవసరం.

హిందీ, ఉర్దూ, హిందూస్తానీ పరిణామాలు

ఉత్తరప్రదేశ్‌లో హిందీ, ఉర్దూ ప్రధాన భాషలు. తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా భాషల్లోని వైవిధ్యం లాగే ఉత్తర ప్రదేశ్‌లో హిందీ భాషలో అనేక

ప్రత్యేక ప్రాంతీయ భాషాభేదాలు కొనసాగుతున్నాయి. సుమారు ఎనిమిది ప్రాంతీయ భాషాభేదాలు వున్నాయి.

భారత రాజ్యాంగం హిందుస్తానీ భాషను రాజభాషగా గుర్తించింది. కానీ ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోని బ్రాహ్మణీయ హిందీ భాషావాదులు హిందుస్థానీ బదులుగా సంస్కృత భాషకు దగ్గర చేస్తూ ఉర్దూ అరబీ వాడుక భాషా పదాలను తొలగిస్తూ హిందీగా ప్రాచుర్యంలోకి తెస్తున్నారు. దాంతో ఉర్దూ, హిందీ మిశ్రమమైన హిందుస్థానీ భాషను మాట్లాడే ప్రజలు ముఖ్యంగా బిసి, ఎస్.సిలు, ముస్లింలు ఈ మీడియా ప్రచారాన్ని వ్యతిరేకిస్తూ ఉత్తరప్రదేశ్‌లో ఉద్యమాలు చేస్తున్నారు.

ఇలా తెలంగాణా భాషా సంస్కృతి ప్రత్యేక ఉద్యమంలాగా 1980 నుండి ఉత్తరప్రదేశ్‌లో ఉద్యమాలు సాగుతున్నాయి. హిందుస్థానీ భాషకు బదులుగా సంస్కృత హిందీ భాషను రుద్దడం అనేది భాషా సంస్కృతులతో పాటు రాజకీయాలను అగ్రవర్ణ బ్రాహ్మణీయ వర్గాల ఆధిక్యతను నెలకొల్పడానికి సంబంధించినదే. అందులో భాగంగానే బాబ్రీ మసీదు, రామజన్మభూమి వివాదం మండల్ కమిషన్ వ్యతిరేక ఉద్యమం మండల కమిషన్‌ను మరిపించడానికి కమండలం తీసుకొని రామజన్మభూమి పేరిట బిజెపి అద్వానీ, దేశం మీద పడడం జరిగింది.

ఇలా మొదట ఉత్తర ప్రదేశ్‌లో కూడా తెలంగాణాలో ఆంధ్ర భాష పెత్తనం సంస్కృతి పెత్తనం 1956 నుంచి కొనసాగించినట్లుగానే బిసి, ఎస్సి, ఎస్టి, ముస్లింల సంస్కృతి భాషపై పెత్తనం కొనసాగించడం మొదలైంది. ఆ తరువాత అది రాజకీయ అధికారంగా బ్రాహ్మణీయ అగ్రవర్ణ హిందూ బిజెపి ఆర్ఎస్ఎస్ అధికారంగా స్థిరపడింది. కేంద్రంలో కూడా అధికారంలోకి రావడం సాధ్యపడింది.

ఉత్తర ప్రదేశ్‌లో సామాజిక వర్గాల పొందిక

ఉత్తరప్రదేశ్‌లో సామాజిక వర్గాల వారిగా జనాభా ఈ క్రింది విధంగా ఉంది. ఎస్సిలో చమారులు, 18 శాతం. సఫాయి పని చేసేవారు 6 శాతం. మొత్తం ఎస్.సి., ఎస్టీల జనాభా 24 శాతం.

ఎంబిసిలు (బాగా వెనుకబడిన కులాలు) 12 శాతం. ముస్లింలు 18 శాతం. జాట్లు, యాదవులు, లోధీలు, కుర్మీలు, ఠాకూర్‌లు ప్రదానమైన జనాభా గల కులాలు. ఒబిసిలు 13 శాతం. బ్రాహ్మణులు 11-13 శాతం. ఠాకూర్‌లు 9 శాతం. వైశ్యులు 4 శాతం. జాట్లు, భూమిహార్లు 4 శాతం. కాయస్తులు 1 శాతం. ఇతరులు 4.5 శాతం.

ముఖ్యమంత్రి మాయావతి పరిచయం

మాయావతి 1956 జనవరి 15వ తేదీన జన్మించారు. సామాన్య కుటుంబంలో పుట్టి పెరిగింది. తండ్రి ప్రభుదాస్ ఢిల్లీ పోస్టల్ టెలిగ్రాఫ్‌లో ఉద్యోగం చేసేవారు. మాయావతి బి.ఎ., బిఇడి చేసి ఎల్.బి. కూడా చేసింది.

1977 నుండి 1984 దాకా ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తూ ఐ.ఎ.ఎస్. సివిల్స్‌కి ప్రిపేర్ అవుతూ ఉండేది. కలెక్టర్ కావాలని మాయావతి కలలు కనేది. కాన్షీరామ్ కలెక్టర్ కావడం గొప్పేమీ కాదు. కొన్ని వందల మంది ఐఎఎస్ ఆఫీసర్లకు నాయకురాలిగా ఉండడం గొప్ప కదా అని వివరించి రాజకీయాల్లోకి ఆకర్షించారు.

అలా కాన్షీరామ్ ప్రారంభించిన బహుజన సమాజ్ పార్టీలో 1984 నుండి మాయావతి క్రియాశీల పాత్ర నిర్వహించారు. 2001లో కాన్షీరామ్ మాయావతిని తన వారసురాలిగా ప్రకటించారు. ఎమ్మెల్యేగా, ఎంపిగా ఎన్నికవుతూ మూడుసార్లు ముఖ్యమంత్రి పదవిని అధిష్టించి 2007 మే 11న వెలువడిన ఉత్తర ప్రదేశ్ ఎన్నికల ఫలితాలతో పూర్తి మెజార్టీ సాధించి నాలుగోసారి మే 13న ముఖ్యమంత్రి పదవి బాధ్యతలు స్వీకరించారు.

మాయావతి మైనార్టీ ముఖ్యమంత్రిగా అనేక పరిమితుల్లో 3సార్లు పని చేయాల్సి వచ్చింది. అయినప్పటికీ ప్రజల విశ్వాసం రోజు రోజుకు పొందగలిగింది అని 1993 నుండి నిరంతరం క్రమ క్రమంగా పెరుగుతున్న ఓట్ల శాతం స్పష్టం చేస్తున్నది. 1993 నాటికి 9.41 శాతం ఓట్లనుంచి 2002 ఎన్నికల నాటికి 23శాతం ఓట్లకు ఎదిగింది. ఇప్పుడు సుమారు 33 శాతం ఓట్లతో 402 స్థానాల్లో 207 స్థానాలు కైవసం చేసుకున్నారు. సాధారణంగా ముఖాముఖీ పోటీ జరిగినప్పుడు పోలైన ఓట్లలో 35 శాతం ఓట్లు సాధిస్తే పూర్తి స్థాయి మెజార్టీ సాధించడం జరుగుతుంది.

2007 మేలో జరిగిన ఎన్నికల్లో ఎస్.పి., బి.ఎస్.పి., బిజెపి, కాంగ్రెస్‌ల మధ్య ముక్కోణపు పోటీ, చతుర్ముఖ పోటీ జరిగినప్పటికీ 33 శాతం ఓట్లు రావడం ముఖాముఖి పోటీలో 40-42 శాతం ఓట్లు రావడంతో సమానం.

సుమారు వెయ్యి ఓట్లు తక్కువై 29 సీట్లలో ఓడిపోయారు. మీడియా వ్యతిరేక ప్రచారం ప్రభావం వల్ల మరికొన్ని ప్రాంతాల్లో ఓడిపోయారు. మాయావతి అంచనాల ప్రకారం 320 అసెంబ్లీ స్థానాలు గెలుచుకోవాలి. కేవలం పదివేల ఓట్లతో మిగతా

స్థానాలు కోల్పోయారు. ఇది మీడియా వ్యతిరేక ప్రచార ప్రభావం అని చెప్పవచ్చు.

ఓబిసిలు ఒంటరి వాళ్ళు కాదు

ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఈ ఎన్నికల్లో బిఎస్‌పి ఫార్ములా విజయంతో ఒబిసి వర్గాలు ఒంటరివైపోయాయని బి.ఎస్.పి.ని సమర్థించే జర్నలిస్టు చంద్రభాను ప్రసాద్ అభిప్రాయపడ్డారు. కానీ, వాస్తవం అలా లేదు. అనేక కులాలు ఎస్.పి., బి.ఎస్.పి మధ్య సామాజిక సమీకరణలు, పోలరైజేషన్‌లు జరిగాయని వాస్తవాలు తెలుపుతున్నాయి.

ఉత్తర ప్రదేశ్ పరిణామంలో సోషలిస్టు రామ్‌మనోహర్ లోహియా పాత్ర

ఉత్తరప్రదేశ్‌లో కులాల వారీ సమీకరణకు బ్రాహ్మణులే ప్రధాన కారకులు. ఠాకూర్‌లు, బ్రాహ్మణులు, క్షత్రియులు జాతీయోద్యమ కాలం నుండి బిసిలను, ఎస్‌సిలను, ఎస్‌టిలను అణిచివేస్తూ వచ్చారు. సామాజిక, రాజకీయ రంగాల్లో వారి వాటాను భాగస్వామ్యాన్ని నిరాకరించారు. సాంస్కృతిక రంగాల్లో బ్రాహ్మణీయ భావజాలాన్ని వర్ణాధిక్య వాదాన్ని కొనసాగించారు.

ఈ దుస్థితిని గమనించిన రామ్ మనోహర్ లోహియా అనే వైశ్యుడు సోషలిస్టు పార్టీ నిర్మాణం చేస్తూ బిసిలకు, ఎస్.సిలకు పార్టీల్లో 60 శాతం స్థానాలు అన్ని స్థాయిలో కెటాయించాలని భావించారు. దీనిపై ఆయన సొంత పార్టీలో ఎంతో వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. చదువు రాని వాళ్ళు, చైతన్యం లేని వాళ్ళు, డబ్బు లేని వాళ్ళు, సంస్కారం లేనివాళ్ళు అయిన బిసి,ఎస్‌సి,ఎస్‌టిలకు 60 శాతం పార్టీలో స్థానాలు ఇవ్వడమేమిటని తీవ్రంగా ధ్వజమెత్తారు. రామ్ మనోహర్ లోహియా అంబేద్కర్ స్ఫూర్తితో అయితే గాంధీజీ చారిత్రక వారసత్వంతో ఈ నిర్ణయం నుంచి వెనక్కి తగ్గలేదు. అలా సోషలిస్టు పార్టీ నాయకత్వంలో బిసిలు, ఎస్‌సిలు మెల్లి మెల్లిగా ఎదగడం ప్రారంభించారు.

1967 నుండి బిసిలు యుపిలో అధికారంలోకి వచ్చిన క్రమం

యాదవ కులానికి చెందిన వర్గం సోషలిస్టు రాజకీయాల్లో కులాధిక్యతతో, బలాధిక్యతతో, జనాభాధిక్యతతో సింహ భాగాన్ని పొందగలిగింది. దాంతో 1967లో దేశంలోని సగం రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓడిపోయి ఇతర పార్టీలు అధికారంలోకి వచ్చిన చారిత్రక మలుపు కాలంలో ఉత్తరప్రదేశ్‌లో రామ్ నరేష్ యాదవ్ ముఖ్యమంత్రిగా సోషలిస్టు పార్టీ అధికారంలోకి వచ్చింది. అప్పటి నుండి 40 ఏళ్ళుగా బిసిలు, ఎస్‌సిలు ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో కీలక పాత్ర చైతన్యపూరితంగా నిర్వహిస్తూ వస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ తన ప్రాబల్యాన్ని కోల్పోతూ వచ్చింది.

ముస్లింలకు, బిసి, ఎస్సీ వర్గాల మధ్య మానసిక ఐక్యత

ముస్లింలు కూడా కాంగ్రెస్‌పై ఉన్న భ్రమలను కోల్పోతూ బిసి, ఎస్‌సి వర్గాలతో ఐక్యం కావడం ప్రారంభించారు. ఆహారంలో మాంసాహారం వీరి మానసిక ఐక్యతకు ఒక గట్టి పునాది వేసింది. శాఖాహారులైన బ్రాహ్మణులు, వైశ్యులు కాంగ్రెస్ పార్టీలో, బిజెపిలో ముస్లింలను ఎంతగా చేర్చుకున్నప్పటికీ సంస్కృతి రీత్యా, భాష రీత్యా, ఆహారపుటలవాట్ల రీత్యా కొద్ది మంది ముస్లిం సంపన్నులు తప్ప మిగతా అంతా ఒబిసి ఎస్‌సి నాయకులతో ఏకమయ్యారు.

ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బిహార్, బెంగాల్, బంగ్లాదేశ్‌లలోని ముస్లింలు బిసి చేతివృత్తి కులాల నుండి, ఎస్‌సిల నుండి సామాజిక సమానత్వం కోసం కుల వివక్షతకు వ్యతిరేకంగా, రాజ్యమతానికి అనుకూలంగా ముస్లిం మతం స్వీకరించారు. శతాబ్దాలు గడిచినా ఆ సాంస్కృతిక వారసత్వం కులవృత్తి వారసత్వం ముస్లింలో కూడా అటూ ఇటుగా కొనసాగుతూనే వచ్చింది.

హిందీ, ఉర్దూ సంఘర్షణ పరిణామాలు

దీనికి తోడు హిందీ, ఉర్దూ సమానంగా కలిసి ఉన్న హిందుస్థానీ భాష స్థానంలో బ్రాహ్మణ హిందూ మతవాదులు సంస్కృత హిందీని రుద్దుతూ ఉర్దూను హిందుస్థానీని ప్రాధాన్యత తగ్గిస్తూ వెనక్కి నెట్టివేశారు. ఈ ప్రమాదాన్ని గాంధీజీ మొదటే గమనించి హిందుస్థానీ మాత్రమే రాజభాషగా ఉండాలని కోరారు. అయినా కాంగ్రెస్ పార్టీ, బ్రాహ్మణ అగ్ర వర్ణాలు అధికారం అన్ని రంగాల్లో విస్తరిస్తూ దీన్ని అడ్డుకున్నారు. తమ అగ్రవర్ణ భావజాలాన్ని వ్యాప్తి చేశారు. దీనితో ముస్లింలు, బిసి ఎస్‌సిలు ఒక్కటి కావడానికి సాంస్కృతిక, మానసిక భాషాపరమైన ప్రాతిపదిక ఏర్పడింది. దీన్ని ఏ సామాజిక ఉద్యమం, రాజకీయ ఉద్యమం పట్టించుకోలేక పోయింది.

ముస్లింలు తమ భాషా సంస్కృతి విషయంలో ఒంటరి వాళ్ళు అయ్యారు. ఈ ఒంటరితనం నుండి ఓబిసిల వైపుకు జరిగారు. అందుకు సోషలిస్టు పార్టీ 60 శాతం స్థానాలను ఒబిసిలకు ముస్లింలకు కేటాయించడం ఎంతగానో ఉపకరించింది. ఇలా సామాజిక వర్గాల పరిణామ క్రమం కొనసాగుతూ వచ్చింది. రాజకీయ పార్టీల ఎదుగుదల పతనం సందర్భంగా ఈ విషయాలను కావాలని మరుగుపరచడం జరిగింది. ఈ విషయాలను చర్చిస్తే ఒబిసిల, ఎస్‌సిల రాజకీయ పునాది మరింత బలపడుతుందని మీడియా వారికి, మేధావులకు తెలుసు. అందువల్లే వీటిని ఎన్నికల విజయాల్లో వీటి చర్చను తేకుండా కేవలం కులాల జనాభా సమీకరణాలను, ఆయా

రాజకీయ పార్టీల్లోని నాయకుల మధ్య ఉండే వైరుధ్యాలను, అవకాశవాదాలను చర్చించి అపహాస్యం పాలు చేసి ప్రజల తీర్పును పరోక్షంగా నిరాకరించే ప్రయత్నం చేశారు.

లోహియా వైఫల్యం

ప్రజల తీర్పు సామాజిక సమీకరణాలు 1960 నుండి ఎలా సాగుతున్నాయో స్పష్టం చేస్తుంది. ఈ విషయంలో రామ్‌మనోహర్ లోహియా అంబేద్కర్ స్థాయిలో అనేక కోణాల్లో విశ్లేషించారు. రామ్ మనోహర్ లోహియా వైఫల్యం ఎందుకు జరిగింది అనేది కూడా ఇప్పుడు తిరిగి తెలుసుకోవలసిన అవసరం ఉంది. హిందీ భాషను బలవంతంగా దక్షిణాది రాష్ట్రాలపై రుద్దే ప్రయత్నం చేశారు. ఇంగ్లీషును వ్యతిరేకిస్తూ, హిందీని వాడాలని దక్షిణాది రాష్ట్రాలకు హిత బోధ చేశారు. ఆ పని జరిగి ఉంటే హిందీ రాష్ట్రాల్లాగే దక్షిణాది రాష్ట్రాలు కూడా వెనుకబడి పోయి ఉండేవి. హిందీ భాష రుద్దుడు, రామలక్ష్మణలను రుద్దుడు, తొలుత అధికారాన్ని అందుకున్న యాదవులు ఆ అధికారాన్ని కింది కులాలకు ప్రవహించకుండా అడ్డుకునుడు వల్ల లోహియా వాదం వైఫల్యం చెందింది.

హిందీని వ్యతిరేకించి ఇంగ్లీషు ప్రాధాన్యతను గుర్తించి మాతృభాషతో పాటు ఇంగ్లీషును నేర్చుకోవడం వల్లనే ఇవాళ ప్రపంచానికి లక్షలాది మంది డాక్టర్లను ఇంజనీర్లను దక్షిణాది రాష్ట్రాలు అందించి చరిత్ర సృష్టించాయి.

రామ్‌మనోహర్ లోహియా చేసిన మరొక పొరపాటు ఏమంటే అంబేద్కర్ రాముడు, కృష్ణులను బిసి, ఎస్‌సిలను అణిచివేసిన వారిగా చిత్రిస్తే లోహియా భారతీయుల ఆదర్శ పురుషులుగా వారిని పేర్కొన్నారు. ఇలా సైద్ధాంతికంగా రామ్ మనోహర్ లోహియా గాంధీజీ వారసుడిగా తేలారు.

లోహియా బిసిలకు 60 శాతం స్థానాలు పార్టీలో కల్పిస్తూ రాముడు, కృష్ణులను ఆదర్శ పురుషులుగా చెప్పడం వల్ల వారిలో హిందూ మత భావాలు పెరిగాయి. ఇది క్రమంగా బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ విస్తరించే క్రమంలో సోషలిస్టు పార్టీ ఓటు బ్యాంకు బిజెపి ఓటు బ్యాంకుగా మారడానికి దారి తీసింది.

సామాజిక రంగంలో సమన్యాయం కాకుండా హిందూ కుల వివక్షతను పరోక్షంగా అంగీకరించే దుస్థితిని సోషలిస్టు పార్టీ ప్రజలలో కలిగించింది. ఇలా రామజన్మభూమి సమస్యకు భూమిక బిసిల్లో ఏర్పాటు కావడానికి లోహియాయే కారణమయ్యారు. తన పతనానికి కూడా అలా కారణభూతులయ్యారు. మరోవైపు బిసిల్లో రాజకీయ చైతన్యం పెరగడానికి కూడా కారకులయ్యారు.

బిసిల చైతన్యం పెరిగే క్రమంలో మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కూడా బిసిల అండతో స్ఫూర్తితో చైతన్యవంతులయ్యారు. అయితే ఎంబిసిలకు మొదట ఎదిగిన యాదవ, లోధి, కుర్మి మొదలైన ఒబిసి కులాలు తగు స్థానం, ప్రాధాన్యత ఇవ్వడానికి నిరాకరించాయి. ఈ సామాజిక పరిణామాన్ని ఒక్కడుగు ముందుకు వేసి బహుజన సమాజ్ పార్టీ ఎంబిసిలను గౌరవించి వారికి పార్టీలో స్థానాలను ప్రాధాన్యతను కలిగించి ప్రోత్సహించారు.

లోహియా వాదం... మిగతా బిసిలకు అధికారం అందకుండా పోయిన క్రమం

అలా లోహియా నాయకత్వంలో, వారసత్వంలో సాగి కొత్త పేరుతో ముందుకు వచ్చిన సమాజ్ వాది పార్టీ ఒబిసిల్లోని పెద్ద కులాలకు పరిమితమైపోయింది. మైనారిటీ, మోస్ట్ బ్యాక్‌వర్డ్ కులాలకు బిఎస్‌పి పెద్ద పీట వేసింది. ఇలా ఎస్‌సి, ఎస్‌టి, ముస్లింలతో పాటు బిసిల్లోని ఒక ప్రధానమైన అనేక కులాలుగా చీలిన ఎంబిసిలకు పెద్ద దిక్కుగా బిఎస్‌పి నిలిచింది.

చారిత్రకంగా చెప్పాలంటే లోహియా సిద్ధాంతంతో ప్రయోజనం పొందిన ఒబిసి కులాలు తమ కన్నా వెనుకబడి పోయిన కులాలకు అధికారాన్ని, అధికారంలో భాగస్వామ్యాన్ని అందించడానికి నిరాకరించాయి. ఇలా లోహియా సిద్ధాంతం వైఫల్యం చెందింది. ఆ వైఫల్యం నుంచి గుణపాఠం తీసుకొని బిఎస్‌పి లోహియా లాభోక్తలకు వెలుపలే ఉండిపోయిన బిసి కులాలను తన సామాజిక వర్గంగా దగ్గరకు తీసింది.

ఎస్‌సిల స్థాయిలో బతికే ఎంబిసిలు ఎస్‌సిల నాయకత్వంలో పని చేయడానికి వారికి ఏ అహంకారం, కులగర్వం అడ్డు రాలేదు. వారికి సమాజం ఆ అహంకారాన్ని గానీ, కుల గర్వాన్నీ గానీ కలిగించలేదు కూడా. యాదవ, లోధి, కుర్మీ కులాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కమ్మ, రెడ్డి, వెలమ, కాపు మొదలైన శూద్ర కులాలు గత 60 ఏళ్ళుగా సామాజిక రాజకీయ ఆర్థిక రంగాల్లో ఎదుగుతూ అహంకారాన్ని, కులగర్వాన్ని సంతరించుకున్నాయి. రాష్ట్రంలోని బిసిబి గ్రూపు కులాలు కూడా ఈ కోవలోనే నడుస్తున్నాయని ఎంబిసి కులాలు, ఎస్‌సిలు విమర్శిస్తున్నారు, ఆవేదన చెందుతున్నారు. ఇలాంటి ఆవేదనే, విమర్శే, వ్యతిరేకతే బిసి కులాలైనప్పటికీ యాదవ, కుర్మీ, లోధి కులాలపై ఎస్.సి. ఎం.బి.సి కులాల్లో పెరిగింది. అది సామాజిక సమీకరణలను, రాజకీయ సమీకరణలను మార్చింది.

అధ్యయనం లోపిస్తే అవకాశవాదంగా కనిపించే సామాజిక పరిణామాలు

ఇదేదీ అధ్యయనం చేయకుండా ఉత్తరప్రదేశ్ 60 ఏళ్ళ సామాజిక సాంస్కృతిక,

రాజకీయ సమీకరణాల భూమికను తెలుసుకోకుండా కొందరు విశ్లేషకులు బిఎస్‌పి వ్యూహం ఎత్తుగడలు, బిఎస్‌పి ఎదుగుదల పరిణామం అవకాశవాద రాజకీయాలని వక్రీకరిస్తున్నారు. అసత్యాలు సత్యాలుగా చెబుతున్నారు. నచ్చితే సామాజిక సమీకరణలు అంటారు. నచ్చకపోతే అవకాశవాదం అంటారా! ఇదే వీరిలోని వైరుధ్యం. ఇదే వీరిలోని అవకాశవాదం.

బిఎస్‌పి గెలుపు అవకాశవాద రాజకీయాల పరిణామమే అని చెప్పడం అంటే అర్థమేమిటి? ప్రజల వివేచన శక్తిని వాళ్ళు ఓట్లు వేస్తున్న తీరును వ్యతిరేకించడమే. అనగా ప్రజాభిప్రాయంపట్ల వీళ్ళకు ఏ మాత్రం గౌరవం లేదని అర్థం. ప్రజాభిప్రాయం రూపొందడానికి వెనక సామాజిక సమీకరణాలు ఉంటాయని వారి ప్రయోజనాలు కూడా ఉంటాయని విస్మరించే పైపై విశ్లేషకులు గమనించడం కష్టం.

రాజకీయ రంగం స్వతంత్ర ప్రతిపత్తి గల రంగం కాదు

1950 నుండి దేశంలో ఆయా ప్రాంతాల్లో, రాష్ట్రాల్లో సామాజిక సమీకరణలు, రాజకీయ సమీకరణలు, భావజాల సమీకరణలు, సాంస్కృతిక సమీకరణలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. వాటి పరిణామంలో భాగంగానే అవి రాజకీయ రంగంలో ప్రతిఫలిస్తున్నాయి. రాజకీయ రంగం దానికది స్వతంత్ర ప్రతిపత్తి గల రంగం కాదు.

రాజకీయ రంగం మొత్తం సమాజంలోని ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, ప్రాంతీయ, భాష భూమిక నుండి ఉత్పత్తి సంబంధాల నుండి మానవ సంబంధాల పరిణామాల నుండి, కులాల మధ్య జరుగుతున్న మానవ సంబంధాల పరిణామాల నుండి రూపుదిద్దుకుంటుంది.

అందువల్ల రాజకీయాల్లో అవకాశవాదం అనే మాట సామాజిక సమీకరణలను గుర్తించకుండా గెలిచిన వారిని వ్యతిరేకించడానికి, ఆ సామాజిక సమీకరణాలను అంగీకరించడానికి నిరాకరించడాన్ని తెలుపుతుంది. అనగా వీళ్ళు తమ కులాల ప్రయోజనాల స్వార్థ దృష్టికి పరిమితమై విశ్లేషిస్తుంటారు అని అర్థం. అంతేగానీ సామాజిక పరిణామాల ననుసరించి సాగే అన్ని రంగాలలోని సమీకరణల్లో భాగంగానే రాజకీయ సమీకరణలు కూడా సాగుతాయి తప్ప రాజకీయ రంగం దానికది విడిగా, స్వతంత్రంగా ఉండదు.

ముప్పయ్యేళ్ళ విప్లవ కృషిపై... ఆరు నెలల్లో పైచేయి సాధించిన వెలమలు

ఉదాహరణకు నక్సలైట్ల ఉద్యమంతో ప్రాధాన్యత కోల్పోయిన వెలమ, రెడ్డి కులాలు తమ అవకాశాల కోసం వెతుకుతున్న క్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమం

తమకు గొప్ప అవకాశంగా భావించారు. వాళ్ళే కాంగ్రెస్ పేరిట, టిఆర్ఎస్ పేరిట తెలంగాణ రాష్ట్ర నినాదాన్ని సామాజిక రంగం నుండి రాజకీయ రంగంలోకి మలుపు తిప్పి తమ అధికారాన్ని సుస్థిరం చేసుకున్నారు. 2004 ఎన్నికల్లో గెలిచారు. ముప్పయ్యేళ్ళ నక్సలైట్ల ఉద్యమం వల్ల పల్లెలు వదిలి పట్టణాలు పారిపోయిన దొరలు, ధనిక రైతులు కేవలం ఆరు నెలల్లోనే తిరిగి పల్లెల్లో తమ స్థానాలను స్థిరపరచుకున్నారు. ఇలా ముప్పయ్యేళ్ళ కృషి, ముప్పయ్యేళ్ళ ఓటమిని వాళ్ళు ఆరు నెలల్లో తమదే పై చేయిగా మార్చుకోవడానికి తెలంగాణ రాష్ట్ర ఉద్యమం అపూర్వ సాధనంగా ఉపయోగపడింది.

ఇలా రెండు దశాబ్దాలుగా సామాజిక రంగంలో అధికారం కోల్పోయిన వెలమ, రెడ్డి కులాలు తెలంగాణ రాష్ట్ర సాధన పేరిట కాంగ్రెస్, టిఆర్ఎస్ పేరిట తిరిగి అధికారంలోకి వచ్చాయి. 1969-71లో కూడా తమ రాజకీయ అధికార సుస్థిరత కోసం రెడ్లు, వెలమలు తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని వాడుకొని నిండా ముంచి వదిలేశారు. తమకు మళ్ళీ అవసరమైనప్పుడు అవే కులాలు, అవే వర్గాలు, అదే నినాదాన్ని ఎత్తుకున్నాయి. 1996 నుండి బహుజనులు విద్యావంతులు నడిపిన తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని ఇదే అదును అని 1969లో కొండా లక్ష్మణ్ బాపూజీ నాయకత్వాన్ని వెనక్కి నెట్టి మర్రి చెన్నారెడ్డి తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని హైజాక్ చేసినట్లుగా 2001లో టిఆర్ఎస్ పేరిట వెలమ, రెడ్డి కులాల రాజకీయ వర్గాలు హైజాక్ చేశాయి. ఇవి సామాజిక వర్గాల పోరాటంలో సాగుతున్న గెలుపు ఓటముల పరిణామాలుగా భావించాలి. ఇవేవీ అవకాశవాద రాజకీయాలు కావు.

యుపి సామాజిక సమీకరణలు

సామాజిక సమీకరణల్లో భాగంగా తమ సామాజిక వర్గాలకు, కులాలకు తమ నాయకత్వానికి ఎక్కడ స్థానం దొరుకుతుందో అక్కడ ప్రవేశించి దాన్ని తన చేతుల్లోకి తీసుకునే క్రమమే రాజకీయ రంగంలో చూడవచ్చు. ఇలాగే ఉత్తరప్రదేశ్‌లో ఆగ్రా, కాన్పూర్ చెప్పుల ఉత్పత్తిదారులైన చమార్ కుల పారిశ్రామిక వేత్తలు మన కులం నుండి ఎదుగుతున్న కాన్షీరామ్‌కు ఆర్థికంగా, సామాజికంగా పూర్తి స్థాయి మద్దతు ఇవ్వాలని అది తమనుండి పారిశ్రామిక వేత్తలు ఎదగడానికి ఎంతో అవసరం అని భావించారు. కోట్ల రూపాయలను తమ కులాల సామాజిక రాజకీయ చైతన్యం కోసం అభ్యున్నతి కోసం బహుజన సమాజ నిర్మాణం కోసం ఖర్చు చేశారు. అలా కాన్షీరామ్, అతని వెంట చమారులు సామాజిక సమీకరణ జరిగింది.

అధికారం కిందికి ప్రవహించిన సామాజిక పరిణామాలు

అటు తర్వాత ఉదిత్‌రాజ్, చంద్రభాను ప్రసాద్ వంటి వారి కులవృత్తి అయిన సపాయి కులవృత్తి గల ఎస్‌సిలు కూడా బిఎస్‌పి వెంట ర్యాలీ అయ్యారు. వీళ్ళు మొదట కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకుగా ఉన్నవాళ్ళే. ముస్లింలు కూడా కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకుగా ఉన్నవాళ్ళే. 50 ఏళ్ళ సామాజిక పరిణామాల్లో భాగంగా జరిగిన సామాజిక సమీకరణల్లో వీళ్ళు, వీరితో పాటు ఎంబిసిలు బిఎస్‌పి వెంట ర్యాలీ అయ్యారు. ఒక్క మాటలో చెప్పాలంటే కాంగ్రెస్ ఇంట్లో ఉన్నదంతా బిఎస్‌పి ఇంట్లోకి జారవేసుకున్నారు. అయితే మౌలికమైన మార్పు ఏమిటంటే కాంగ్రెస్‌లో ఉదార వాద, హిందూ వాద, ముస్లిం వాద, బ్రాహ్మణ, శిష్ట వర్గ ముస్లిం వర్గం నాయకత్వం ఉంటే, వారి ప్రయోజనాలు నెరవేరితే బిఎస్‌పిలో ఎస్‌సిల, ఎంబిసిల, రెండోశ్రేణి ముస్లిం వర్గాల, రెండో శ్రేణి అగ్ర కులాల ప్రయోజనాలు నెరవేర్చుకునే సామాజిక వర్గాల ప్రతినిధుల నాయకత్వంలో ఈ సమీకరణ జరిగింది. అందువల్లే ఇది మౌలికమైన మార్పు.

ఈ మార్పు నక్సలైట్లు, కమ్యూనిస్టులు, కాంగ్రెస్, తెలుగుదేశం, బిజెపి, సమాజ్‌వాది పార్టీ మొదలైన ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా జరిగేది కాదు. ఆ పార్టీలు అధికారంలోకి వస్తే హిందూ వర్ణ వ్యవస్థ ఆధిక్యతా వాదులు, అగ్రకులాలు మాత్రమే వాటిల్లో నాయకత్వంలో ఉంటారు. వారే ఎమ్మెల్యేలు అవుతారు. ఎంపిలవుతారు. మంత్రులవుతారు. అంతే తప్ప ఈ బిఎస్‌పి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఎం.బిసి, ముస్లింలు ఆ పార్టీల్లో నాయకత్వ స్థానంలో 70శాతం ఎదిగే అవకాశం గత 60 ఏళ్ళలో ఎప్పుడూ రాలేదు. ఇదే పరిణామం రేపూ కొనసాగుతుంది. ఎందుకంటే వాళ్ళు దూరం కొట్టడం వల్లే బిఎస్‌పి అనే ఒక శక్తిగా వాళ్ళంతా ఒక సమీకరణలో రూపాంతరం చెందారు.

ములాయంసింగ్ తప్పు బిసిలందరికీ కనువిప్పు

ములాయంసింగ్ యాదవ్, మాయావతి సమాన ఫాయలో 1993లో గెలిచిన తరువాత వీరి అలైన్స్ ఎందుకు విచ్ఛిన్నమైంది? దీన్ని పరిశీలించకపోతే సామాజిక సమీకరణలను అవకాశవాదంగా భావించే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ బ్రాహ్మణులకు ప్రాతినిధ్యం వహిస్తున్నది. బిజెపి వైశ్యులకు ప్రాతినిధ్యం వహిస్తున్నది. జనతాదళ్ ఠాకూర్‌లకు నాయకత్వం వహిస్తున్నది. జనతాదళ్ సామాజిక సమీకరణ ఎలా చేసుకోవాలో ఎలా సమన్వయం పొందాలో తెలియని అనుభవరాహిత్యం వల్ల విచ్ఛిన్నమైపోయింది. జనతాదళ్ అనేక భాషల రాష్ట్రాల సంస్కృతుల ఏకీకరణకు నిదర్శనం.

ఇంగ్లీష్ భాష ప్రాతిపదిక లేని రాష్ట్రాలు జనతాదళ్‌లో ఒక్కటయ్యాయి. ఇంగ్లీష్ అనుసంధాన భాషగా లేని సామాజిక వర్గాలు గత వందేళ్ళుగా ఎదుర్కొంటున్న కమ్యూనికేషన్ గ్యాప్‌లో భాగంగానే జనతాదళ్ విచ్ఛిన్నమైపోయింది. విడిపోయింది. దాంతో ఉత్తరప్రదేశ్‌లోని జనతాదళ్‌లోని ఠాకూర్‌లు సమాజ్‌వాది పార్టీలో చేరారు. బ్రాహ్మణులు, వైశ్యులు బిఎస్‌పిలోకి చేరారు. ఈ రెండు వర్గాలు బిఎస్‌పిలో చేరడానికి సమాజ్‌వాది పార్టి ద్వారా అధికారంలోకి వచ్చిన వర్గాలు కులాలు బ్రాహ్మణుల, వైశ్యుల ఆధిపత్యాన్ని అన్ని రంగాల్లో తొలగించడానికి కృషి చేసే క్రమంలో అణిచివేత పద్ధతులను అనుసరించారు. భావజాల ప్రచారాన్ని, సిద్ధాంతాన్ని ముందుకు తీసుకువెళ్ళలేక పోయారు. ఎక్కడ భావజాల ప్రచారం వ్యాప్తి చెందకుండా అణిచివేత పద్ధతులు ముందుకు సాగుతాయో అక్కడ భౌతిక దాడులు అనివార్యమవుతాయి.

అలా ప్రభుత్వాధికారంతో సమాజ్‌వాది పార్టిలోని ఆధిపత్య కులాలు పరిపాలన యంత్రాంగం ద్వారా, తమ కులాల ద్వారా భౌతిక దాడులను చేశాయి. దాంతో మానసిక ప్రవర్తన జరగలేదు. బ్రాహ్మణుల్లో అభద్రత పెరిగింది. వైశ్యులు వ్యాపారం చేయడం ఇలా అయితే కష్టం అని భావించారు. బిజెపి వెనుక ఉన్న వైశ్య వర్గాలు కూడా బిజెపి సృష్టించే హిందూ ముస్లిం సంఘర్షణాయుత వాతావరణం శాంతియుత జీవనానికి, వ్యాపారానికి, పారిశ్రామిక ఉత్పత్తులకు నష్టమని బిజెపిని గెలిపిస్తే ఎప్పటికీ ఇదే టెన్షన్ అని వాళ్ళు మాయావతియే బిజెపి కన్నా మంచి పాలన అందిస్తుందని శాంతిభద్రతలను నెలకొల్పుతుందని విశ్వసించారు. నిజంగా మాయావతి మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన ప్రధాన సేవ కూడా శాంతి భద్రతల పరిరక్షణే. దానివల్ల ఎస్‌సిలు ఎంతో ఆత్మవిశ్వాసంతో ముందుకు కదిలారు.

బ్రాహ్మణులను వైశ్యులను అణిచివేస్తూ ఎదగాలనుకుంటున్న యాదవ, కుర్మీ, లోధి, ఠాకూర్, క్షత్రియ కులాలు చేరిన సమాజ్‌వాది పార్టీ ప్రభుత్వం బిసి, ఎస్‌సి, ఎస్టీలను అణిచివేయకుండా ఎలా ఉంటుంది? దీనికి ప్రతి క్రియగా యాదవ, కుర్మీ, లోధి, ఠాకూర్, క్షత్రియ, బ్రాహ్మణ, వైశ్య కులాలపై ఎస్‌సిలు ఎస్‌సి అత్యాచార నిరోధక చట్టాన్ని ఒక ఆయుధంగా నిరంతరం ప్రయోగించారు. వేలాది కేసులు పెట్టారు. నిన్నటిదాకా తిట్లు పడ్డవాళ్ళు ఇప్పుడు తిడితే, కొడితే కేసు పెట్టడం ఏమిటని పండ్లు కొరికారు. ఆశ్చర్యపోయారు. మాయావతి నాయకత్వంలో చట్టం తన పని తాను చేసుకుంటూ పోయింది.

మాయావతి నిబద్ధత

ఎస్‌సిలకు అనుకూలంగా చట్టాన్ని అమలు జరపాలని వారి పట్ల వివక్షతను

తొలగించాలని మాయావతి నిబద్ధతతో నిలబడింది. దాంతో సమాజ్‌వాది పార్టీ వెంట ఉన్న కులాలు సమాజంలో అభాసుపాలు అయ్యాయి. సామాజిక అధికారం వీరికివ్వడం పెద్ద పొరపాటు అని భావించారు. ఇలా ఒబిసిల్లోని కొన్ని కులాలు ఎదిగి మన రాష్ట్రంలోని కమ్మ, రెడ్డి, వెలమ, కాపు కులాల్లాగా అణిచివేత దారులుగా మారిన క్రమాన్ని సమాజ్‌వాది పార్టి ఎదుగుదల, పతనంలో గమనించవచ్చు. అనగా ఒక్కమాటలో చెప్పాలంటే సమాజ్‌వాది పార్టీ పెరిట లోహియా ఆశయాలకు భిన్నంగా అందులోని కులాలు కమ్మ, రెడ్డి, వెలమ కులాల్లాగా శూద్ర అగ్ర కులాలుగా మారే పరిణామం కోసం కృషి చేశాయని అర్థం.

స్వాతంత్ర్యానికి పూర్వం, ఓటు హక్కు లేనప్పుడు ఇవి అగ్ర కులాలుగా మారడం సాధ్యమే. అందువల్లే వీళ్ళు ఎంబిసి కులాలు, ఎస్‌సిలు ఓట్లు వేయకుండా అడ్డుకోవడం ద్వారా అధికారంలోకి రావడాన్ని అభిలషించారు. ఇదంతా రాయలసీమ ఫ్యాక్షనిజం యొక్క ఆచరణే. ఇది మనకేమీ కొత్తది కాదు. అయితే బిఎస్‌పి ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారానే వీరి ఆటలను కట్టి పెట్టవచ్చు అని భావించి రిగ్గింగ్‌ను అరికట్టడం ప్రధాన కర్తవ్యంగా స్వీకరించింది.

అందరు ఓట్లు వేయడానికి శాంతియుత వాతావరణం అవసరమని బిఎస్‌పి భావించింది. అందువల్లే ఎలాంటి సంఘటనలు లేకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగాయి. బిఎస్‌పి అధికారంలోకి వచ్చింది. ఇలా బిఎస్‌పి భారత దేశంలోని సామాజిక వర్గాల సమీకరణలో ఒక ప్రయోగశాలగా మారింది.

1960 నుండి యుపి ఒక రాజకీయ ప్రయోగశాలగా పరిణామాలు

అధికారాన్ని అందుకున్న వర్గాలకు అధికారంలోకి రాలేక పోయిన వర్గాలు, కులాలు అధికారంలోకి రావడానికి చేసే సమీకరణాలకు, ఉద్యమాలకు ఉత్తరప్రదేశ్ ఒక ప్రయోగశాలగా 1950 నుండి ముఖ్యంగా 1960 నుండి కొనసాగుతూ వస్తున్నది. భారత దేశంలో అన్ని రాష్ట్రాల్లో సుమారుగా ఇవే ప్రయోగాలు, ఇవే పరిణామాలు కొనసాగుతూ వస్తున్నాయి.

రాష్ట్రంలో సామాజిక వర్గాల పరిణామాలు

అయితే ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో శూద్ర బిసి కులాల స్థానంలో శూద్ర అగ్ర కులాలు అధికారాన్ని అందుకున్నాయి. బిహార్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో బిసిలు, ఎస్‌సిలు అధికారాన్ని 1967 నుండి అందుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి కావడంతో బ్రాహ్మణుల రాజకీయాధికారం పతనమై రెడ్డి కులాధికారం అన్ని రంగాల్లో విస్తరించింది.

నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి కాకముందు హైదరాబాద్ రాష్ట్రంలో బ్రాహ్మణ కులానికి చెందిన బూర్గుల రామకృష్ణారావు, ఆంధ్ర రాష్ట్రంలో టంగుటూరి ప్రకాశం పంతులు అధికారంలో ఉన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి బెజవాడ గోపాలరెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అటు తరువాత కాసుబ్రహ్మానంద రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు.

ఇలా రెడ్డి కుల అధికారం విస్తరించింది. కమ్మ కుల అధికారం కోసం తెలుగుదేశం పార్టీ పుట్టి తెలంగాణలో బిసిలను, కాంగ్రెస్ వెంట మాలలకు సింహభాగం దక్కింది గనుక ఎస్సిల్లో మాదిగలను కలుపుకొని అధికారంలోకి రావాలని కమ్మ మేధావులు ఆలోచించారు.

అలా తెలుగుదేశం పార్టీ కమ్మ నాయకత్వం కోసం పుట్టి పెరిగింది. బిసిలకోసం గౌతు లచ్చన్న, కొండా లక్ష్మణ్ బాపూజీ, ఎస్సిల కోసం జె. ఈశ్వరి భాయి (నేటి మంత్రి అయిన జె. గీతారెడ్డి తల్లి), టి.ఎన్. సదాలక్ష్మి, మొదలైనవారి ప్రయత్నాలు సఫలం కాలేదు. బిఎస్పి రాష్ట్రంలో అనేక వర్గాల్లో ఆశలు రేకెత్తించినప్పటికీ దాని నిర్మాణ లోపం, అనుభవరాహిత్యం వల్ల 1994లో వచ్చిన అవకాశాన్ని గెలుపుగా మలుచుకోలేక పోయింది.

నాటి బిఎస్పి నాయకత్వం అనుభవ రాహిత్యం

ఇలా బిసి, ఎస్సి వర్గాలు ఎం.బి.సి కులాలు రాష్ట్రంలో ఉత్తరప్రదేశ్ ప్రజల్లాగే ఆలోచించినప్పటికీ బిఎస్పి దాన్ని సఫలం చేయలేకపోయింది. ఇందుకు అనేక చారిత్రక కారణాలు కూడా తోడయ్యాయి. నక్సలైట్ ఉద్యమం తెచ్చిన భావజాలం, దళిత మహాసభ సృష్టించిన సామాజిక చైతన్యం రాజకీయ చైతన్యంగా మలుపు తిరగడానికి ఎదుర్కొన్న సవాళ్ళు బిసిలలోని బలమైన వర్గాలను, బలహీన వర్గాలను రెంటినీ దాని స్ఫూర్తిని అనుభవాలను అందించే నాయకత్వాన్ని తమ కన్నా ఉన్నతంగా ఎదిగిన నాయకత్వాన్ని స్వీకరిస్తే తాము తమ పెత్తనం కొనసాగించడం సాధ్యపడదని అందరినీ దూరం కొట్టారు.

దాసరి నారాయణ రావు, పి.శివశంకర్ వంటి కాపు నాయకులు, సినీనటుడు చిరంజీవితో సహా చేరి బిఎస్పిని ఒక బలమైన పార్టీగా నిర్మించాలనుకున్నారు. ఎంతోమంది ఇతర పార్టీల నుండి ప్రజా ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపిలు, ఎంపిపిలు, సర్పంచ్‌లు చేరడానికి వచ్చినప్పటికీ దూరం తరిమారు. తనలోకి ఆహ్వానించాల్సిన వర్గాలనుండి తమకు తాముగా వచ్చేవారిని అవమానించారు. కించపరిచారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి వారిని సయితం దగ్గరకు వచ్చినవారిని

దూరం చేసుకున్నారు. ఇందులో ఎవరి పాత్ర ఎంత అనేది పార్టీ శ్రేణుల్లోని సీనియర్లకు చాలా మందికి తెలుసు. కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది. రాజకీయాల్లో హత్యలుండవు, ఆత్మహత్యలే ఉంటాయి అని సామెత. ఇప్పుడు 2007లో తిరిగి కొత్త ఉత్తేజంతో కొత్త అవకాశం, కొత్త సమీకరణతో ముందుకు వచ్చింది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోగలిగే శక్తి సామర్థ్యాలు బహుజన సమాజ్ పార్టీ సాధించుకుంటుందా? లేదా? అనేది భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తుంది.

తెలంగాణ రాష్ట్ర సాధనలో బిఎస్పి పాత్ర

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం కోల్పోయిన అధికారాన్ని తిరిగి సాధించుకోవడానికి వెలమలకు రెడ్లకు, కాంగ్రెస్‌కు, టిఆర్ఎస్‌కు వాహికగా పని చేసింది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఒక జాతి ఉద్యమం. ఒక అస్థిత్వం కోసం చేస్తున్న సాంస్కృతిక సామాజిక రాజకీయ ఉద్యమం. ఈ ఉద్యమంలో ఎవరు నాయకత్వంలో ఉంటే రేపు వాళ్ళే అధికారంలోకి వస్తారు. వారి ప్రయోజనాలే నెరవేరుతాయి. తెలంగాణలో అధిక జనాభా బిసి.ఎస్సి, ఎస్టీ మైనారిటీలే. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందడం వీరికే ఎక్కువ అవసరం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే అభివృద్ధి చెందాల్సిన ఈ వర్గాలే తెలంగాణ ఉద్యమాన్ని కూడా నాయకత్వం వహించినప్పుడే ఇది సాధ్యపడుతుంది.

అందువల్ల బిసి, ఎస్సి, ఎస్టీ, మైనార్టీలకు సైద్ధాంతిక భూమికను ఇచ్చిన బహుజన సమాజ్ పార్టీ ఈ శక్తులన్నింటిని సమీకరించి తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కమిటీని ఏర్పర్చి ప్రత్యేక కార్యక్రమాలు తీసుకోవడం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావడం సాధ్యమయ్యే విషయమే.

ప్రజాతంత్ర వారపత్రిక, 13-5-2007

> "ఉత్తర ప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో బహుజన సమాజ్ పార్టీ సాధించిన విజయం చరిత్రాత్మకమైనది, విప్లవాత్మకమైనది. భారత ప్రజాస్వామ్య వ్యవస్థపై దేశంలోనూ, వెలుపలా తరచుగా వ్యక్తమవుతున్న సందేహాలను నివృత్తి చేసిన అసాధారణ పరిణామం. హింసాయుత కార్యాచరణ లేకుండా శాంతియుతంగా బ్యాలెట్ ద్వారా విప్లవం సాధించవచ్చునని నిరూపించిన అపూర్వ సన్నివేశం. సమాజాన్ని మతం పేరుతో, కులం పేరుతో చీల్చడం కంటే వివిధ వర్గాలను ఐక్యం చేయడం ద్వారా అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చునని బి.ఎస్.పి. అధినేత మాయావతి చేతలలో చూపించారు. ఇది చారిత్రక విజయం"
>
> *- ఆంధ్రజ్యోతి సంపాదకీయం, 12-5-2007*

ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర పరిచయం

భారతదేశ చరిత్రలో ఉత్తరప్రదేశ్ ఒక మహోజ్వల చరిత్రకు నిలయం. శూద్ర రాజుల నాయకత్వంలో ఉత్తరప్రదేశ్, బిహార్ మొదలైన ప్రాంతాలు ఒకే రాజ్యం గొడుగు కిందికి క్రీ.పూ. 6వ శతాబ్దంలో నందరాజుల పాలనలో తీసుకురావడం జరిగింది. వారిపై తిరుగుబాటు చేసి మౌర్య చంద్రగుప్తుడు తిరిగి శూద్ర నాయకత్వంలో మౌర్య సామ్రాజ్యాన్ని విస్తరించడం జరిగింది.

సామ్రాట్ అశోకుడు బౌద్ధం పరివ్యాప్తిలో భాగంగా శూద్ర వర్ణాల సామ్రాజ్యాన్ని భారత ఉప ఖండం అంతటా బౌద్ధ సామాజిక సాంస్కృతిక ఉద్యమాన్ని ముందుకు నడిపారు. దానికి బిహార్, ఉత్తరప్రదేశ్‌లు ప్రధాన కార్యక్షేత్రాలు. క్రీ. శ 320 - 425లో గుప్త రాజుల సామ్రాజ్యం సాగింది.

ఆ తరువాత 606-647లో హర్షుడు పరిపాలించాడు. ఆ తరువాత అనేక రాజవంశాలు ముస్లిం రాజులు, మొగలులు తమ ఏలుబడిలోకి తెచ్చుకున్నారు. హుమయూన్, అక్బర్, జహంగీర్, షాజహాన్, ఔరంగజేబు రాజ్యాన్ని విస్తరించారు.

మొగలుల కాలంలో 16వ శతాబ్దంలో ఆగ్రా పట్టణం ముఖ్య కేంద్రంగా మారింది. 1830లో బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ నార్త్ వెస్ట్ ప్రావెన్సును ఏర్పాటు చేసి దానికి ఔదును చేర్చింది.

భారత స్వాతంత్ర తొలి పోరాటం 1857లో జరిగింది. దీనికి ప్రధాన కేంద్రం ఉత్తర ప్రదేశ్. యునైటెడ్ ప్రావెన్స్ 1902లో ఏర్పడింది. ఆగ్రా ఔద్ యునైటెడ్ ప్రావిన్సెస్ అనే పేరుతో 1902 నుంచి పిలిచిన ప్రాంతాన్ని 1935లో యునైటెడ్ ప్రావిన్సుగా మార్చారు. మద్రాసు ప్రావిన్సు, సెంట్రల్ ప్రావిన్సు, కలకత్తా ప్రావిన్సు, నార్త్ ప్రావిన్సు మొదలైన ఆరు ప్రావిన్సులుగా బ్రిటిష్‌వాళ్ళు విభాగాలు ఏర్పాటు చేసుకున్నారు. స్వాతంత్ర్యం అనంతరం యునైటెడ్ ప్రావిన్సును ఉత్తరప్రదేశ్ అని

పిలిచారు.

1947 ఆగస్టు 15 నుంచి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయింది. 2001లో ఉత్తరప్రదేశ్ నుంచి 85 లక్షల జనాభా గల ఉత్తరాంచల్ రాష్ట్రం ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది.

ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం భారతదేశంలోనే అతిపెద్ద రాష్ట్రం. ఉత్తరప్రదేశ్ నైసర్గిక స్వరూపం కూడా చాలా ప్రాధాన్యత కలది. ఇది నేపాల్, బిహార్, జార్కండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరాంచల్, ఢిల్లీలను సరిహద్దులుగా కలిగి ఉంది. 243,286 చ॥ కి.మీ. వైశాల్యంతో కొనసాగుతున్నది.

ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో. భారతదేశంలోని అత్యధిక జనాభాగల మొదటి రాష్ట్రం. ఇప్పుడు జనాభా 19 కోట్లకు చేరువవుతున్నది. జనాభాలో 50-55 శాతం ఓటర్లుగా ఉంటున్నారు. 11 కోట్ల పైచిలుకు ఓటర్లు 2007లో ఓటరు లిస్టులో ఉన్నారు.

ఉత్తరప్రదేశ్‌లో ప్రస్తుతం 704 పట్టణాలు, ఒక లక్ష ఏడు వేల నాలుగువందల యాభై రెండు గ్రామాలు ఉన్నాయి. ఒకప్పుడు 86 జిల్లాలున్న ఉత్తరప్రదేశ్‌లో 70 జిల్లాలు ఉన్నాయి. బహుజన సమాజ్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత 5 జిల్లాలను బహుజన సమాజ్ పార్టీ చారిత్రక పురుషుల పేర్లతో ఏర్పాటు చేయడం జరిగింది.

1. అంబేద్కర్ నగర్‌జిల్లా. దీని జనాభా 20 లక్షలు. జిల్లా కేంద్రం అక్బర్‌పూర్.
2. గౌతమ బుద్ధ నగర్ జిల్లా. జనాభా 12 లక్షలు. జిల్లా కేంద్రం నోయిడా.
3. జ్యోతిబా ఫులే నగర్ జిల్లా. జనాభా 15 లక్షలు. జిల్లా కేంద్రం అమ్రోహ.
4. సంత్ రవిదాస్ నగర్ జిల్లా. జనాభా 13.5 లక్షలు. జిల్లా కేంద్రం జ్ఞాన్‌పూర్.
5. సంత్‌కబీర్‌నగర్ జిల్లా. జనాభా 14.2 లక్షలు. జిల్లా కేంద్రం ఖలీలాబాద్.

ఇలా బిఎస్‌పి మైనార్టీ ప్రభుత్వమైనప్పటికీ 1993 నుండి ఉత్తరప్రదేశ్ రాజకీయ సామాజిక, సాంస్కృతిక చరిత్రపై తమదైన, బలమైన ముద్ర వేసింది. ఉత్తరప్రదేశ్‌లోని 70 జిల్లాల్లో ఆగ్రా, అలీఘడ్, అజాంఘర్, బారాబంకి, బరేలీ, ఇటావా, ఫతేపూర్, ఫరూకాబాద్, గజియాబాద్, గోండా, గోరక్‌పూర్, జాన్సీ, కాన్పూర్, లలిత్‌పూర్, లక్నో, మధుర, మీరట్, మీర్జాపూర్, మొరదాబాద్, రాయబరేలీ, షాజహన్‌పూర్, ఉన్నావ్, సుల్తాన్‌పూర్, వారణాసి, ఫిరోజాబాద్, బలరామపూర్, కన్నోజ్, బాగ్‌పట్ మొదలైనవి చరిత్ర ప్రసిద్ధి చెందినవి. భారతీయులకు ఇవి సుపరిచితమైన పేర్లు.

ఉత్తరప్రదేశ్‌లో బహుశా ప్రపంచంలోనే పెద్దదైన కుంభమేళా అలహాబాద్‌లో పన్నెండేళ్ళకోసారి జరుగుతుంది. ప్రతి ఆరేళ్ళకొకసారి అర్ధ కుంభమేళా జరుగుతుంది.

గంగాతీర మైదాన ప్రాంతం అని ఉత్తర ప్రదేశ్‌ను నైసర్గికంగా పేర్కొంటారు. ఉత్తరప్రదేశ్‌లో పలు చారిత్రక టూరిస్టు కేంద్రాలు ఉన్నాయి. పురాణ ఇతిహాస పుణ్యక్షేత్రాలుగా మరికొన్ని ప్రసిద్ధి చెందాయి. వారణాసి (కాశీ, బెనారస్) బృంధావన్, వింధ్యాచల్, అయోధ్య, చిత్రకూట్, ప్రయాగ, మధుర, దేవాషరీఫ్, ఫతేపూర్ సిక్రీ, సారనాథ్, శ్రావస్తీ, ఖుషీనగర్, కౌశాంబి, ఆగ్ర, లక్నో, జాన్సి, గోరక్‌పూర్ మొదలైనవి సుప్రసిద్ధ ప్రదేశాలు.

వైదికానంతర కాలంలో ఉత్తరప్రదేశ్ బ్రహ్మర్షి మధ్య దేశంగా పేర్కొనబడింది. భరద్వాజ, గౌతమ, యాజ్ఞవల్క్య, వశిష్ఠ, విశ్వామిత్ర, వాల్మీకి మొదలైన వాళ్ళు ఇక్కడి వారే అని చెప్పుకుంటారు. ఆర్యుల పవిత్ర గ్రంధాలు ఈ ప్రాంతంలోనే కూర్చబడ్డాయి. రామాయణ, మహాభారత ఇతిహాసాలు ఉత్తరప్రదేశ్ స్ఫూర్తితో వెలువడ్డాయి అంటారు.

క్రీ.పూ. 6వ శతాబ్దంలో జైనం, బౌద్ధం ఈ ప్రాంతంలో బాగా వ్యాప్తి చెందింది. బ్రిటిష్ సామ్రాజ్యంలో ఉత్తరప్రదేశ్ బ్రాహ్మణులు ప్రభుత్వ అధికారులుగా అత్యధిక ప్రాధాన్యత వహించారు.

ఉత్తరప్రదేశ్ జనాభాలో 73 శాతం జనాభా ప్రధానంగా వ్యవసాయం మీద ఆధారపడి బతుకుతున్నారు. వీరిలో 30 శాతం దాకా ఉన్న ఎస్.సి.లు, ఎంబిసిలు భూమి లేని వ్యవసాయ కూలీలుగా వ్యవసాయంపై ఆధారపడి పేదరికంలో మగ్గుతున్నారు. 2001 మార్చి నాటికి ఉత్తరప్రదేశ్‌లో ఒక కోటి 68 లక్షల హెక్టార్లు అనగా సుమారు నాలుగు కోట్ల ఎకరాలు భూమి సాగు చేయబడుతున్నది. రెండు కోట్ల 37 లక్షల టన్నుల గోదుమలను, 95 లక్షల టన్నుల వరిని 20 లక్షల టన్నుల పప్పు దినుసులను, 6 లక్షల టన్నుల నూనె గింజలను 12 కోట్ల 10 లక్షల టన్నుల చెరకును పండించారు. మొత్తం 2002-2003 సంవత్సరంలో 3 కోట్ల 83 లక్షల టన్నుల ఆహార పదార్థాలను ఉత్తరప్రదేశ్ ప్రజలు పండించారు.

1998 నాటికి 2616 మధ్యతరహా, భారీ తరహా పరిశ్రమలు ఉన్నాయి. వాటిలోని పెట్టుబడి 41,266 కోట్లు. అవి 738582 మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. 491433 చిన్నతరహా పరిశ్రమలు యూనిట్లు, 4846 కోట్ల పెట్టుబడితో నడుస్తున్నాయి. ఇవి 18, 80, 000 మందికి ఉపాధిని కల్పిస్తున్నాయి. 52.5 లక్షల టన్నుల చక్కెరను ఉత్పత్తి చేశారు. 68 బట్టల మిల్లు యూనిట్లు నడుస్తున్నాయి. 32 ఆటోమొబైల్ యూనిట్లు, 5740 కోట్ల పెట్టుబడితో పనిచేస్తూ 20 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. (ఇండియా 2006 పబ్లికేషన్ డివిజన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పేజి నెం. 1041)

2003-2004లో 2,094.5 కోట్ల ఖర్చుతో నీటిపారుదల సౌకర్యాల కోసం కృషి చేయడం జరిగింది. అది 314.3 లక్షల హెక్టార్లకు నీరందించడానికి ఉద్దేశించబడింది. 4622 మెగావాట్ల విద్యుత్ ఉత్పన్నమవుతున్నది. ఉత్తరప్రదేశ్‌లో మొత్తం రోడ్ల నిడివి 1,10,479 కి.మీ. ఇందులో 3,986 కిలోమీటర్లు జాతీయ రహదారులు, 9,022 కి.మీ. స్టేట్ హైవేస్, 9747 జిల్లా స్థాయి రోడ్లు, గ్రామీణ రోడ్లు 72,931కి.మీ.

ఉత్తరప్రదేశ్ ఇరుగు పొరుగు రాష్ట్రాలు :

ఉత్తరాంచల్, హిమాచల్ ప్రదేశ్, హర్యాణా, ఢిల్లీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, బిహార్‌తో పాటు నేపాల్ దేశం.

జనాభా : 16 కోట్ల 61 లక్షల 98వేలు. పురుషులు 8కోట్ల 76 లక్షలు. స్త్రీలు 7 కోట్ల 86 లక్షలు. అక్షరాస్యత పురుషులు 56 శాతం. స్త్రీలు 42 శాతం.

స్త్రీ పురుషుల నిష్పత్తి : 1000 మంది పురుషులకు స్త్రీలు 898.

గవర్నర్ : టి.వి. రాజేశ్వర్.

ముఖ్యమంత్రి : కుమారి మాయావతి

మొత్తం శాసన సభ్యులు : 403

లోకసభ సీట్లు : 80; రాజ్యసభ సీట్లు : 31

ముఖ్యమైన పార్టీలు : బిఎస్‌పి, ఎస్‌పి, బిజెపి, కాంగ్రెస్, రాష్ట్రీయ లోక్‌దళ్, రాష్ట్రీయ క్రాంతి పార్టీ, అప్నాదళ్, జెడియు మొదలైనవి.

హైకోర్టు : అలహాబాద్‌లో. హైకోర్టు బెంచి లక్నోలో.

ఆర్థికం : ఖనిజాలు, సున్నపురాయి, మాగ్నసైట్, బొగ్గు, రాక్ పాస్ఫేట్, డోలమైట్, సిలికాసాండ్, పిరోఫిలైట్. పరిశ్రమలు : కాగితం, సిమెంటు, అల్యూమినియం, రైల్వే భాగాలు, తినే నూనెలు, పారిశ్రామిక రసాయనాలు, చేనేత మొదలైనవి.

బెంగాల్ విభజనను వ్యతిరేకిస్తూ మొదలైన వందేమాతరం ఉద్యమంతో బ్రిటీష్ వాళ్ళు రాజధానిని కలకత్తా నుండి 1906-07లో ఢిల్లీకి మార్చారు. ఢిల్లీ ఇటీవల ఉత్తర ప్రదేశ్ నుండి విడిపోయింది. ఢిల్లీ చక్రవర్తి అయిన సికిందర్‌లోధి 11వ శతాబ్దంలో కాశీలోని గురురవిదాస్ వద్ద జ్ఞానబోధ పొంది దాని జ్ఞాపకంగా అక్కడ జ్ఞాన వాపి మసీదు నిర్మించారు. ఉత్తర ప్రదేశ్‌లో హృషికేశ్, హరిద్వార్ మొదలుకొని అనేక పర్యాటక క్షేత్రాలుండేవి. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో అవి చేరిపోయాయి. ఆగ్రాలో సుప్రసిద్ధి చెందిన తాజ్‌మహల్ ప్రపంచ వింతల్లో ఏడవదిగా లెక్కించబడు తున్నది. ఫతేపూర్, సిక్రిని నిర్మించి అక్బర్ కొంతకాలం రాజధానిగా చేసుకున్నారు.

ఉత్తరప్రదేశ్‌లోని జిల్లాల వివరాలు

క్ర. సం.	జిల్లా	హెడ్‌క్వార్టర్స్	జనాభా (లక్షల్లో) (2001)
1	ఆగ్రా	ఆగ్రా	36.11
2	ఆలిఘర్	ఆలిఘర్	29.90
3	అలహాబాద్	అలహాబాద్	49.41
4.	అంబేద్కర్‌నగర్	అక్బర్‌పూర్	20.25
5.	ఔరియా	ఔరియా	11.79
6	ఆజంగర్	ఆజంగర్	39.50
7.	బాగ్‌పట్	బాగ్‌పట్	11.64
8	బహెరేచ్	బహెరేచ్	23.84
9.	బలియా	బలియా	27.52
10.	బలరాంపూర్	బలరాంపూర్	16.84
11.	బందా	బందా	15.00
12.	బారాబంకి	బారాబంకి	26.73
13.	బరేలి	బరేలి	35.98
14.	బస్తీ	బస్తీ	20.68
15.	బిజ్‌నూర్	బిజ్‌నూర్	31.30
16.	బదౌన్	బదౌన్	30.69
17.	బులంద్‌షహర్	బులంద్‌షహర్	29.23
18.	చందౌలి	చందౌలి	16.39
19.	ఛత్రపతి సాహుజి మహరాజ్‌నగర్	గౌరిగంజ్	
20.	చిత్రకూట్	చిత్రకూట్	8.00
21	దియోరియా	దియోరియా	27.30
22.	ఈటా	ఈటా	27.88
23.	ఇటావా	ఇటావా	13.40
24.	ఫైజాబాద్	ఫైజాబాద్	20.87
25.	ఫరూకాబాద్	ఫతేఘర్	15.77
26	ఫతేపూర్	ఫతేపూర్	23.05
27.	ఫిరోజాబాద్	ఫిరోజాబాద్	20.45
28	గౌతమబుద్ధనగర్	నోయిడా	11.91
29.	ఘజియాబాద్	ఘజియాబాద్	32.89
30.	ఘాజిపూర్	ఘాజిపూర్	30.49
31.	గోండా	గోండా	27.67
32.	గోరఖ్‌పూర్	గోరఖ్‌పూర్	37.84
33.	హమీర్‌పూర్	హమీర్‌పూర్	10.42
34.	హర్దోయి	హర్దోయి	33.97
35.	హత్రాస్	హత్రాస్	13.33
36.	జలౌన్	ఒరాయ్	14.55
37.	జౌన్‌పూర్	జౌన్‌పూర్	39.13
38.	ఝాన్సీ	ఝాన్సీ	17.46
39.	జ్యోతిబాపూలేనగర్	అమ్రోహ	14.99
40.	కన్నౌజ్	కన్నౌజ్	13.85
41.	కాన్‌పూర్(దేహాత్)	అక్బర్‌పూర్	15.84
42.	కాన్‌పూర్(సిటి)	కాన్‌పూర్	41.37
43.	కౌశాంబి	కౌశాంబి	12.94
44.	కాశీనగర్	ఫదరోనీ	28.91
45.	లఖీంపూర్ ఖేరి	ఖేరి	32.00
46.	లలిత్‌పూర్	లలిత్‌పూర్	9.77
47.	లక్నో	లక్నో	36.81
48.	మహరాజ్‌గంజ్	మహరాజ్‌గంజ్	21.67
49.	మహోబా	మహోబా	7.08
50.	మెయిన్‌పురీ	మెయిన్‌పురీ	15.92
51.	మథుర	మథుర	20.69
52.	మవూ	మవూ	16.49
53.	మీరట్	మీరట్	30.01
54	మొరదాబాద్	మొరదాబాద్	37.49
55.	ముజాఫర్‌నగర్	ముజాఫర్‌నగర్	31.41
56.	ఒరయా	కనౌజ్	11.79
57.	పిలిబిత్	ఫిలిబిత్	16.43
58.	ప్రతాప్‌ఘర్	ప్రతాప్‌ఘర్	27.27
59.	రాయ్‌బరేలి	రాయ్‌బరేలి	22.72
60.	రామ్‌పూర్	రామ్‌పూర్	19.22
61.	సహరన్‌పూర్	సహరన్‌పూర్	28.48
62.	సంత్‌కబీర్‌నగర్	కలీలాబాద్	14.24
63.	సంత్‌రవిదాస్‌నగర్ బదోహి	జ్ఞాన్‌పూర్	13.52
64.	షాజహాన్‌పూర్	షాజహాన్‌పూర్	25.49
65.	శ్రావస్తీ	శ్రావస్తీ	11.75

66.	సిద్ధార్థనగర్	నవఘర్	20.38
67.	సీతాపూర్	సీతాపూర్	36.16
68.	సోన్‌భద్ర	రాబర్ట్స్‌గంజ్	14.63
69.	సుల్తాన్‌పూర్	సుల్తాన్‌పూర్	31.90
70.	వున్నావ్	వున్నావ్	27.00
71.	వారణాసి	వారణాసి	31.47

ముఖ్యమైన రైల్వే స్టేషన్లు :

ఉత్తరప్రదేశ్‌లో లక్నో ప్రధాన రైల్వే జంక్షన్. ఆగ్రా, కాన్పూర్, అలహాబాద్, మొరదాబాద్, వారణాసి, తుండ్ల, గోరక్‌పూర్, గోండ, ఫైజాబాద్, బరేలీ, సీతాపూర్, రైల్వే జంక్షన్లు.

విమానాశ్రయాలు :

ఉత్తరప్రదేశ్‌లో లక్నో అంతర్జాతీయ విమానాశ్రయంగా రూపొందించబడింది. కాన్పూర్, వారణాసి, అలహాబాద్, ఆగ్రా, ఝాన్సీ, బరేలీ, గజియాబాద్, గోరక్‌పూర్, సహరన్‌పూర్, రాయబరేలీలలో విమానాశ్రయాలు ఉన్నాయి.

విద్య :

స్కూళ్ళు : 1లక్ష 53వేల 959

కాలేజీలు : 957

విశ్వవిద్యాలయాలు : 40

ఉపాధి :

4కోట్ల 93 లక్షల 87వేలు.

నిరుద్యోగులు : 4 శాతం.

సంస్కృతి : కథక్ నృత్యం.

ఉత్తరప్రదేశ్‌లో గ్రామాలు : 1లక్ష 7వేల 452.

పట్టణాలు : 704

భౌగోళిక స్వరూపం :

నదులు : గంగ, యమున, గోమతి, గాగ్రా, రాంగంగ, బేత్వా.

కొండలు : శివాలిక్, దిగువశ్రేణి పర్వతాలు, కైమూర్ పర్వత శ్రేణి.

వ్యవసాయ ఉత్పత్తులు :

గోదుమ, వరి, మక్క, బార్లీ, పప్పుదినుసులు, ఆలుగడ్డలు, చెరుకు, నూనెగింజలు.

ఉత్తరప్రదేశ్‌తో

నా అనుబంధం, అనుభవాలు

1985 నుంచి ఉత్తర ప్రదేశ్‌తో ప్రత్యక్షంగా అనుబంధం మొదలైంది. దానికి ప్రత్యేక చారిత్రక నేపథ్యం ఉంది. ఆ పర్యటన నా అవగాహనను కూడా మార్చింది. అయితే నిజానికి ఉత్తర ప్రదేశ్‌తో నా అనుబంధం ఈనాటిది కాదు. చిన్నప్పటినుంచి మా అమ్మ కాశీ గురించి ఎన్నో కథలు చెప్పేది. విద్యార్థి దశలో ఎన్నో కాశీ మజిలీ కథలు చదివాను. అశోకుని సార్‌నాథ్ స్థూపం, బౌద్ధ విశ్వవిద్యాలయాలు, బిహార్, ఉత్తర ప్రదేశ్‌ల్లో ఉండేవని చిన్నప్పటి నుండి విన్నాను. కాశీకి పోయిన వారు కాటికి పోయినట్టే అనే సామెత. ఆ కాలంలో రవాణా సౌకర్యాలు తక్కువ. దొంగల భయం, జంతువుల భయం ఎక్కువ. కాలినడక ప్రయాణంలో ఎక్కడ ఏం జరిగేదో తెలియదు. కాశీకి పోయి తిరిగి ఇంటికి వస్తే కాళ్ళు కడిగి నెత్తిన చల్లుకునే వారు. గంగా నది నీరును అతి పవిత్రంగా చూసేవారు.

హిందీ పాఠ్య పుస్తకాల ద్వారా సంత్ కబీర్‌దాస్, గురు రవిదాస్, దోహాలు పరిచయమయ్యాయి. మున్షీ ప్రేమ్‌చంద్ రచనల ద్వారా యుపి ప్రజలు, సంస్కృతి పరిచయమయ్యాయి. వారి రచనల ద్వారా ఉత్తర ప్రదేశ్ గ్రామీణ ప్రజలు మా వూరి ప్రజలంత సన్నిహితమయ్యారు. ప్రేమ్‌చంద్ రాసిన గోదాన్, రంగభూమి మొదలైన నవలలు ఉత్తర ప్రదేశ్ ప్రజలను తెలంగాణ గ్రామీణ ప్రజలలాగా సన్నిహితం చేశాయి. ప్రేమ్‌చంద్ 'పరదా' కథ ముస్లిం పేదరికాన్ని తెలిపింది.

ఢిల్లీ, హైదరాబాద్, లక్నో పట్టణాల మధ్య, రాజ్యాల మధ్య వందల ఏళ్ళుగా సంబంధాలు, రాకపోకలు కొనసాగుతున్నాయి. ఈ మూడు ప్రాంతాల సంస్కృతిలో అనేక పోలికలు కనబడతాయి. లక్నోనుండి ఎందరో విద్యావంతులు హైదరాబాద్ రాజ్యంలో ఉద్యోగాల కోసం వలస వచ్చి స్థిరపడ్డారు. జాతీయ పరిణామాల్లో, చరిత్ర పరిణామాల్లో ఢిల్లీ, హైదరాబాద్, లక్నో, మైసూర్, మరట్వాడా రాజ్యాల సంఘర్షణలు భారతదేశం చిత్రపటాన్ని నిర్దేశించాయి. ఔరంగజేబు నియమించిన సుబేదార్లు స్వతంత్రం ప్రకటించుకొని హైదరాబాద్ రాజ్యంలో నిజాం వంశం పాలన సాగించింది.

మోతీలాల్ నెహ్రూ, జవహర్‌లాల్ నెహ్రూల సొంత రాష్ట్రం ఉత్తర ప్రదేశ్ అని పాఠ్య పుస్తకాల్లో చదివి మహనీయులను అందించిన రాష్ట్రంగా చిన్నప్పుడు భావించాను. అలహాబాద్, ప్రయాగ, త్రివేణిసంగమం గురించి దేవలోకం పట్ల ఉండే దృష్టి ఉండేది. మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి పేదరికంలో చిన్నప్పుడు గంగానది ఈది చదువుకోవడానికి వెళ్ళేవాడని విని తాదాత్మ్యం పొందాను. రామ్ మనోహర్ లోహియా రాజకీయాలు ఉత్తరప్రదేశ్‌పై ఆసక్తి పెంచాయి. అటు తర్వాత 1967లో సోషలిస్టు పార్టీ తరపున రామ్ నరేశ్ యాదవ్ ముఖ్యమంత్రి కావడంతో బిసిలకు అధికారాన్ని ఇచ్చిన ప్రజల పట్ల, ఆ రాష్ట్రం పట్ల ఎంతో ఆసక్తి పెరిగింది.

ప్రత్యక్షంగా ఉత్తరప్రదేశ్‌తో నాకు 1985లో అనుబంధం ఏర్పడింది. నేను 1985 సెప్టెంబర్, నవంబర్ మధ్య ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో పర్యటించాను. నేను మా రచయితల, కళాకారుల, విద్యార్థి యువజనుల ప్రతినిధి బృందం దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలు పర్యటించడంలో భాగంగా ఉత్తరప్రదేశ్ పర్యటన సాగింది.

ఉత్తరప్రదేశ్‌లో లక్నో కేంద్రంగా ఇతర జిల్లాలను సందర్శించాను. కాన్పూర్, అసన్‌సోల్, గోరక్‌పూర్, బలరాంపూర్, అలహాబాద్, ఆగ్రా, ఫైజాబాద్, గోండా, ఝాన్సీ, వారణాసి, మీరట్ మొదలైన పట్టణాల్లో సభలు, సమావేశాల్లో పాల్గొన్నాము. మాకు ఎందరో ఆతిథ్యం ఇచ్చారు. వందలాది రచయితలు, కళాకారులు పరిచయమయ్యారు. విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు, పౌరహక్కుల సంఘ నాయకులు ఎందరో కలిసారు.

ఉత్తరప్రదేశ్‌లో రెండవసారి పర్యటనలో మేము కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నాము. ఒక ఉద్యమ నాయకుడు చాలా చోట్ల సభలు ఏర్పాటు చేస్తానని రమ్మని హామీ ఇచ్చారు. మేము ఝాన్సీ మీదుగా వెళ్ళే రైలులో వస్తున్నామని రైలు నెంబరుతో సహా టెలిగ్రామ్ చేశాము. మేము ఎక్కిన రైలు ఉదయం ఝాన్సీలో ఆగిపోయింది. ఏ మధ్యాహ్నానికో ఏదో ప్యాసింజెర్ బండికి మా డబ్బా తగిలించారు.

లక్నో చేరి ఆయన చెప్పిన సింగార్ నగర్ వెతుక్కుంటూ ఆయన ఇల్లు చేరేసరికి రాత్రి తొమ్మిదిన్నర దాటింది. ఆయన లేడు. ఊరికి వెళ్ళాడు పదిరోజులకు వస్తాడు అని పక్కింటి వాళ్ళు చెప్పారు. ఏం చేయాలో తోచలేదు. ఎక్కడికి పోవాలో తెలియదు. పొరపాటు ఎక్కడ జరిగిందో తెలియదు. అంతలో అక్కడికి ఆ మిత్రున్ని వెతుక్కుంటూ అతని మిత్రుడు ఒకాయన వచ్చాడు. మా ప్రయాణం గురించి చెప్పాము. ఆయన మమ్మల్ని సాదరంగా అలమాబాద్‌లో ఉన్న ఆయన ఇంటికి తీసుకువెళ్ళాడు. లక్నోలో ఉన్నన్ని రోజులు ఆయన ఇంట్లోనే ఉన్నాము.

ఆయన ఒకప్పుడు హైదరాబాద్‌కు వెళ్ళానని అక్కడ తనను మూడు నెలలు ఒక కుటుంబం సాదరంగా ఆదరించి అక్కున చేర్చుకుందని ఆనాటి అనుభవాలను, అనుభూతులను, కష్టాలను గుర్తుకు తెచ్చుకొని ఏడ్చేశారు. ఇప్పుడిలా మీకు సేవచేసే అవకాశం వచ్చిందని సంతోషించాడు.

ఆయన ద్వారా మేము లక్నో విశేషాలు తెలుసుకున్నాము. లక్నోలో చలి ఎక్కువ. చలిని అక్కడి ప్రజలు రజాయిలతో కొలుస్తారు. సన్నని దూది పొరతో కుట్టిన బొంతలను రజాయి అని పిలుస్తారు. ఈ సంవత్సరం అయిదు రజాయిల చలి పెట్టింది అంటారు. అంటే అయిదు రజాయిలు కప్పుకుంటేనే చలి ఆగుతుంది అని అర్థం. ఒకసారి ఎనిమిది రజాయిల చలి పెట్టిందని చెప్పారు. అక్కడ బస్తీల్లోని రోడ్లకు కంకరకు బదులుగా ఇటుకను పరుస్తారు. ఇటుక వరుసలే రోడ్డుగా ఉంటుంది. అక్కడి మట్టి నది ఒడ్డున ఉండే ఒండు మట్టిలా మెత్తగా ఉంటుంది. రాళ్ళు కనపడవు.

ఢిల్లీలో పరిచయమైన వినోద్ మిశ్రా ఆలోచన విధానానికి సంబంధించిన 'జన సంస్కృతి మంచ్' (విరసం వంటిది) సంబంధించిన రచయితలను లక్నోలో వెతుక్కొని వారిని కలిసాను. ఆయన ఒక ఇల్లు కట్టుకుంటున్నాడు.

అక్కడ ఇళ్ళకు పునాదికి, బేస్‌మెంట్‌కు కూడా ఇటుకనే వాడతారు. గోడలకు కూడా ఇటుకనే వాడతారు. స్లాబ్‌కు కూడా ఇటుకనే వాడుతారు. సన్నని ఇనుప సలాకలతో సెంట్రింగ్ కట్టి ఇటుకలు పేర్చి సిమెంటు ఇసుక కలిపి సందులు నింపుతారు. ఇది ఎలా ఆగుతుంది అని ప్రశ్నించాను. ఆర్.సి.సి.లాగే ఇది కూడా ఆగుతుంది. ఫస్ట్ ఫ్లోర్ కూడా వేసుకోవచ్చు అని చెప్పారు. ఆర్‌సిసి ఇండ్లు కూడా ఉన్నాయి. అయితే చల్లగా ఉంటుందని ఖర్చు తక్కువ అని ఇటుకలతో డాబా ఇళ్ళు కట్టుకుంటారు. లక్నోలో రాజాజీ నగర్ ఉండడం చూసి ఆశ్చర్యం వేసింది.

ఉత్తర ప్రదేశ్, బిహార్‌లలో స్వామి అగ్నివేశ్ నాయకత్వంలో ఇటుక బట్టీ కార్మికుల సంఘాలు విస్తృతంగా నడిచేవి. వాటిని బంధువావిముక్తి మోర్చా అనే సంస్థ పేరుతో పిలిచేవారు. వారి కార్మికుల్లో మా కోసం కొన్ని సభలు పెడితే బాగుంటుందని ఢిల్లీలో కలిసి అగ్నివేశ్‌ను కోరినప్పుడు ఆయన సరేనంటూ మరో మాట గుర్తు చేశారు. నేను, జార్జి ఫెర్నాండెజ్ మీ రాష్ట్ర ప్రజల కోసం, మీ ఉద్యమం కోసం మద్దతు ఇచ్చి మా వైపు సహకారాన్ని అందించాము. రాష్ట్ర గవర్నర్‌ని మీ తరపున కలిశాము. కరీంనగర్‌లో జరిగిన రైతు కూలీ సంఘం (22, 23మే 1983) రాష్ట్ర మహాసభల్లో పాల్గొని మీ పాద ధూళిని నా నొసట ధరిస్తాను అని వందనం చేశాను. నా వెంట వున్న పేద ప్రజలకు మీ మద్దతు కావాలి. అది ఇంతవరకు అందలేదు.

మీ పార్టీ నాయకులకు ఈ విషయం తెలిపి పరస్పర సహకారం అవసరమని గుర్తు చేయండి. మా కార్మికుల కోసం మీ రాష్ట్రంలో సభలు పెట్టగలిగితే మేము మా ప్రాంతంలో తప్పకుండా మీ కోసం సభలు పెట్టిస్తాను అని అన్నారు స్వామి అగ్నివేశ్. దాంతో మేము వెనుదిరిగాము. వారి సహకారాన్ని పొందలేకపోయాము. ఈ క్రమంలో మరో నక్సలైట్ గ్రూపుకు చెందిన మిత్రుడు పరిచయంలోకి వచ్చారు. ఆయన ఉత్తర ప్రదేశ్‌లో మీ కోసం మీటింగ్‌లు తప్పకుండా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అయితే మమ్మల్ని రిసీవ్ చేసుకోకుండానే మేము రాలేదనుకొని తన ఉద్యమం ఉన్న పలమవు జిల్లాకు (మాజీ ప్రధాని యంగ్‌టర్క్ చంద్రశేఖర్ పార్లమెంట్ నియోజకవర్గం) వెళ్ళిపోయారు. అసలు విషయం ఏమిటంటే ఝాన్సీ రూట్లో మధ్యాహ్నం ఒక ట్రైను లక్నో చేరుతుంది. ఆ ట్రైనులో మేము వస్తామనుకొని చూసి రాలేదని వెళ్ళిపోయారు.

ఆయన కోసం ఎదురుచూస్తూనే చిన్న చిన్న కార్యక్రమాలు లక్నోలో నిర్వహించాము. లక్నో మేము చూసినప్పుడు అపరిశుభ్ర నగరంగా కనిపించింది. లక్నో విధాన సభ సమీపంలో ప్రహరిగోడ సమీపంలో రోడ్డును ఆనుకొని స్త్రీలు కూడా బహిరంగంగా మూత్రం చేయడం చూసి ఆశ్చర్యం వేసింది. బాధ కలిగింది. అక్కడి బస్సులు రాష్ట్రంలోని ఆర్.టి.సి. సిటీ బస్సుల్లా సుఖంగా ఉండవు. విక్రం సెవన్ సీటర్ ఆటోలు బస్ చార్జీల మీద స్టేజీలు తిరగడం చాలా సుఖంగా ఉండేది. సిటీ బస్సులు చాలా తక్కువ.

ఉత్తరప్రదేశ్ భోజనం నాకు ఎంతగానో నచ్చింది. రొట్టెలు, కూరతో పాటు కొన్ని పచ్చి కూరగాయలు దాబాల్లో, రెస్టారెంట్లలో ఇచ్చినట్లుగా ఇళ్ళల్లోనూ ఇస్తారు. ముందు కూరలు వండి, పచ్చి కూరగాయలు కోసి వడ్డించినాక రొట్టెలు చకాచకా చేస్తూ, కాలుస్తూ ప్లేట్లలో వేస్తుంటారు. రెండు రొట్టెలు తింటే టిఫిన్. నాలుగు రొట్టెలు తింటే ప్లేటు మీల్సు. ఆరు రొట్టెలు తింటే ఫుల్ మీల్స్. ఆరు రొట్టెలకు మించి కూడా హోటల్‌లలో ఫుల్‌మీల్స్ చేయవచ్చు కానీ సాధారణంగా ఆరు రొట్టెలు ఫుల్ మీల్స్ కింద లెక్క.

అక్కడ కూరలు తెలంగాణ కూరల్లాగే ఉంటాయి. తెలంగాణలో రొట్టెలు తినడం అలవాటు. అందువల్ల నాకు రొట్టెలు తినడం కొత్తగా అనిపించలేదు. అక్కడ చింతపండు, పెరుగు వాడరు. అన్నం కూడా తింటారు. అయితే రొట్టెలకే ప్రాధాన్యత. ఆలుగడ్డలు బాగా పండిస్తారు. ఆలుగడ్డల కూరను రక రకాలుగా వండుతారు. ఆలుగడ్డలో 95శాతం నీరే ఉంటుందని అంటే నమ్మలేదు. దాన్ని పండించే కాలం, పండే తీరు బిహార్‌లో చూశాక నమ్మకతప్పలేదు.

1972-74 మధ్య లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ అవినీతి వ్యతిరేక

ఉద్యమాన్ని ప్రారంభించారు. యుపి, బిహార్‌లలో అది బాగా వ్యాపించింది. యువతరం నుండి కొత్త నాయకత్వం ఆ ఉద్యమం ద్వారా ఎదిగి వచ్చింది.

వారణాసి, బనారస్ అని పిలిచే కాశీ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి. కాశీ పుణ్యక్షేత్రాలను సందర్శించాము. కాశీ గురించి చిన్నప్పటి నుంచి ఎంతో విన్న నాకు ఆ దేవాలయం ఆ స్థాయి స్ఫూర్తి ఇవ్వలేకపోయింది. మదన్‌మోహన్ మాలవ్యా కాశీ విశ్వవిద్యాలయానికి పావలా చొప్పున విరాళాలు సేకరించి కట్టాడని చిన్నప్పుడు హిందీ పాఠంలో చదివింది గుర్తుకువచ్చింది.

వారణాసిలో టెలిఫోన్ పరిశ్రమ, ఫ్యాన్ల పరిశ్రమ బాగా అభివృద్ధి చెందింది. ఆ కార్మికులకు కార్యక్రమాలు ఇచ్చాము. అలహాబాద్‌లో కొన్ని కార్యక్రమాలు ఇచ్చాము. గోరఖ్‌పూర్‌లో అనేక మంది రచయితలు కలిశారు. టైమ్స్ ఆఫ్ ఇండియా, దైనిక్ భాస్కర్, దైనిక్ జాగరణ్, ఆజ్ మొదలైన పత్రికలు మా కార్యక్రమాల గురించి తెలుసుకుని ప్రచురించాయి. ఈ సందర్భంగా ఒక సన్నివేశం గుర్తుకు వస్తున్నది. జనసంస్కృతి మంచ్ సభ్యుడిగా ఢిల్లీలో పరిచయమైన లక్నో జర్నలిస్ట్ ఒకరోజంతా మాతో ఇంటర్వ్యూ తీసుకుని చివరిగా మా కులమేమిటని అడిగాడు. కారంచేడు ఉద్యమం సాగుతున్న సమయం అది. మేము దళితులమని చెప్పినాము. ఆయన ముఖకవళికలు మారిపోయాయి. మాటతీరు మారిపోయింది. ఎప్పుడు వదిలించుకుందామా అని అసహనానికి లోనయ్యారు. ఏదో పని ఉందంటూ పత్తా లేకుండా పోయారు. ఆ ఇంటర్వ్యూ అడ్రసు లేదు. అప్పుడు మొదటిసారిగా ప్రత్యక్షంగా ఉత్తరప్రదేశ్‌లో కులవివక్ష ఏ స్థాయిలో ఉంటుందో తెలిసింది. ఆ షాక్ నుండి మేము ఒక పట్టాన కోలుకోలేదు. పైగా ఆయన వినోద్‌మిశ్రా గ్రూపుకు చెందిన జనసంస్కృతి మంచ్ సభ్యుడు కూడా.

అలాగే గోరఖ్‌పూర్‌లో బ్రాహ్మణుల నుండి మేము అవమానాలను ఎదుర్కొన్నాము. ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో చేసిన మా పర్యటన మా అంచనాలను, అవగాహనను తలకిందులు చేసింది. కులం లేదు, వర్గమే ఉంది అంటూ మేము దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తున్నాము. ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో మావోయిస్ట్ కమ్యూనిస్ట్ సెంటర్, పార్టీ యూనిటీ సెంటర్, మాస్ లైన్ గ్రూప్ నాయకులు మాతో చర్చిస్తూ మీ రాష్ట్రంలో కులసమస్యను ఎలా పరిష్కరిస్తున్నారు? అని ప్రశ్నించారు. మాకు కులసమస్య ఎదురుకాలేదని చెప్పాము. ఎదురైన సంఘటనలు ఎలా పరిష్కరించామో చెప్పాము. వాళ్ళు 1983 నుండి కులసమస్యపై తమ ఉద్యమాలు స్తంభించిపోయాయని ముందుకు కదలడంలేదని అన్నారు. ఒక ఊళ్ళో ఒక కులం వాళ్ళు ఉద్యమంలోకి వస్తే మరో కులంవాళ్ళు బహిష్కరించేవారు. ఫలానా ఊళ్ళో మీ

కులంవాళ్ళు కూడా ఉద్యమంలో పనిచేస్తున్నారు అని చెప్పినా సరే వాళ్ళు రావడం లేదు అని వాపోయారు.

ఉత్తరప్రదేశ్‌లో అన్ని రంగాల్లో బ్రాహ్మణుల, ఠాకూర్‌ల పెత్తనం స్వయంగా చూశాము. ఉర్దూ భాషను, హిందుస్తానీ భాషను ఎలా అణచివేస్తున్నారో ముస్లిం రచయితలు అనేక సంఘటనల ద్వారా వివరించారు. వాస్తవ స్థితికి, సిద్ధాంతాలకు మధ్య పొసగడం లేదని మా పర్యటన మాకు అర్థం చేయించింది. ఉత్తరప్రదేశ్‌లో పాట కన్నా వచన కవిత గేయాలకు ప్రాధాన్యత ఎక్కువ ఇవ్వడంలో అగ్రవర్ణ స్వభావం ఉందని మొదటిసారిగా అక్కడ గమనించాము. పంజాబ్‌కు చెందిన సుప్రసిద్ధ కళాకారుడు గురుశరణ్‌సింగ్ బృందంతో కలిసి కొన్ని కార్యక్రమాల్లో పాల్గొన్నాము.

పలమౌ మిత్రుడి కోసం వచ్చిన ఒక మిత్రుడు మమ్మల్ని కలిసి బలరాంపూర్, భరత్‌పూర్ తీసుకువెళ్ళారు. ఆయన కూడా బ్రాహ్మణుడే. కాని కులవివక్ష లేని మనిషి. ఆయన కొన్ని స్ట్రీట్‌మీటింగ్‌లు పెట్టించారు. అక్కడ ఇది ఒక డిగ్రీ కాలేజి అని చూపించారు. అది పూర్వపు సంస్థానాధీశుని గడి లేదా కోట. అలా రాజప్రాసాదం డిగ్రీ కాలేజీగా ఉండడం నాకు చాలా వింత అనిపించింది. ఎందుకంటే మా రాష్ట్రంలో ఎన్నో గడీలున్నాయి. ఎవరూ అప్పటికి కాలేజీలకు వాటిని ఇవ్వలేదు. మనకన్నా ఇక్కడనే నయమున్నట్టుంది అనిపించింది. ఈ బలరాంపూర్ మిత్రునికి ఒక ఊతపదం అలవాటుండేది. మల్లబ్ అని ప్రతిమాటకు ముందు వాడేవాడు. మాకు దాని అర్థం తెలిసేది కాదు. మతలబ్ అనే పదాన్ని మల్లబ్ అని పలికేవారు. మతలబు అని తెలుగులో వాడుతూనే ఉంటాం. మతలబ్, కి అనే రెండు పదాలు హిందీలో విరివిగా వాడుతుంటారు. అంటే అనే పదం యొక్క అర్థం కోసం వీటిని వాడుతుంటారు. నకో అంటే వారికి తెలిసేది కాదు. నహీ చాహియే అని చెపితే వారికి అర్థమవుతుంది. మేము దుమువులు తీసేసి సంస్కృత పదాలను హిందీలాగా వాడేవాళ్ళం. హిందీ పదాలు దొరకని చోట ఇంగ్లీషు పదాలను వాడేవాళ్ళం. భాష మాకు ఎక్కడా అడ్డంకి కాలేదు. ప్రజల ఆత్మీయత, రచయితల సంబంధాలు, పౌరహక్కుల సంఘాల నాయకుల సంబంధాలు, ఎంసిసి గ్రూపుకు చెందిన క్రాంతికారి లేఖక్ సంఘ్, విద్యార్థి సంఘాలతో కలిసి అనేక ప్రాంతాల్లో తిరిగాము. సభల్లో పాల్గొన్నాము. మళ్ళీ ఎప్పుడైనా అవన్నీ చుట్టివస్తే బాగుంటుందని ఎన్నాళ్ళుగానో అనుకుంటున్నాము.

చివరకు మమ్మల్ని యుపికి రమ్మని పిలిచిన మిత్రుడు కూడా లక్నో చేరి మాకోసం కొన్ని సభలు పెట్టించాడు. విధానసభ, సెక్రెటేరియట్, చిడియాఘర్ (పక్షుల పార్కు) మొదలైనవి చూశాము. మేము వెళ్ళిపోయేముందు మాకు భోజన వసతి ఏర్పాటు చేసిన అలమాబాద్ మిత్రుడు బిగ్గరగా కౌగిలించుకొని ఏడ్చేశాడు. ఎక్కడ పుట్టామో,

ఎక్కడ పెరిగామో, ఎక్కడి అనుబంధాలో! మనిషిని మనిషి ప్రేమించే ఇలాంటి సమాజం కోసమే కదా మేము ఉద్యమిస్తున్నది అని ఒక ట్రాన్స్‌లోకి వెళ్ళాము. అలాంటి ఎన్నో జ్ఞాపకాలతో తిరిగి ఢిల్లీ చేరుకున్నాము.

అంతకుముందు ఢిల్లీలో ఇంగ్లీషు నుండి హిందీకి అనువాదం చేయించుకొని తీసుకువెళ్ళిన పత్రికా ప్రకటనలు చూసి ఇదేమి హిందీ అని ఢిల్లీ వాళ్ళ హింది ఇలాగే ఏడుస్తుందని దాన్ని పక్కన పడేసి లక్నోలో మళ్ళీ హిందీలోకి కొత్తగా అనువాదం చేశారు. లక్నోలో అనువాదం చేసిన హిందీ ప్రతులను ఢిల్లీలో చూపిస్తే ఇదేమీ హిందీ అని హేళన చేశారు. అంతగా ఢిల్లీ హిందీకి, లక్నో హిందీకి తేడా వుంటుంది.

లక్నోలో ప్రభుత్వ పాఠశాలను రాజకీయ పాఠశాల అని పిలుస్తారు. మొదట ఈ పేరు చదివి ఇదేదో పొలిటికల్ సైన్స్ పాఠశాల అనుకున్నాము. అక్కడ బ్రాందీ షాపును అంగ్రేజి షరాబికి దుకాన్ అని పిలుస్తారు. సాయుధ పోరాటం అనే పదాన్ని సశస్త్ర సంగ్రామ్ అంటారు. విప్లవం అనే పదాన్ని క్రాంతి అంటారు. మై ఆగ్రహ కర్తాహు కి ఇనే భాషణ్ దేనే కే లియే అంటారు. అంటే వీరిని ప్రసంగించాల్సిందిగా కోరుతున్నానని అర్థం. అగ్రహ అనే పదాన్ని తెలుగులో కోపం కోసం వాడతాము. వాళ్ళు హిందిలో అనుగ్రహం, కోరడం అనే అర్థంలో వాడతారు. విప్లవ రచయితలను క్రాంతికారి లేఖఖ్ అని పిలుస్తారు. ప్రజాస్వామ్యాన్ని లోక్‌సత్తా అని, లోక్‌షాహి అని పిలుస్తారు.

ఇలా ఉత్తర ప్రదేశ్ నా జీవితంలో భాగమైపోయింది. ఉత్తర ప్రదేశ్, బిహార్‌లలో చూసిన కుల సమస్య, కుల వివక్ష నా అవగాహన మార్చింది. కుల సమస్యపై సీరియస్‌గా స్టడీ చేయాలని నిర్ణయానికి రావడానికి ఈ పర్యటన దోహదం చేసింది. దాంతో పీపుల్స్ వార్ పార్టీలో కుల సమస్యపై అంబేద్కర్ దృక్పథాన్ని, అంబేద్కర్ కృషిని గుర్తించి అధ్యయనం చేయాలని భారతీయ సామాజిక సంస్కర్తగా, విప్లవ కారుడిగా గుర్తించాలని పార్టీలో చర్చలు చేయడం జరిగింది. పార్టీ దాన్ని నిరాకరించింది. బహుజన సమాజ్ పార్టీ, కాన్షీరామ్ చెపుతున్న సిద్ధాంతాలు, ఆచరణ ఎంతో వాస్తవికంగా వున్నాయని గమనిస్తూ వచ్చాను. మా మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానంలో అంబేద్కరిజాన్ని కనీసం కుల సమస్య మేరకైనా స్వీకరించాల్సిన అవసరం వుందని అలా అధ్యయనం చేస్తూ ముందుకు సాగాను. అప్పుడు కుల సమస్య విశ్వరూపం ప్రత్యక్షమైంది.

1990 ఏప్రిల్‌లో నేను రహస్య జీవితం నుండి బహిరంగ జీవితంలోకి వచ్చాక సూర్యప్రకాశ్ పరిచయంలోకి వచ్చాడు. ఉస్మానియా యూనివర్సిటీలో ఆర్గనైజేషన్ కోసం ఉన్నప్పుడు సూర్యప్రకాశ్ 1984 నుండి పాత పరిచయం. స్నేహం కూడా. ఆయన బిఎస్‌పిలోకి ఎలా వచ్చిందీ తెలుపుతూ, బిఎస్‌పి భావజాలాన్ని కాన్షీరామ్

విశిష్టతను పరిచయం చేశారు. 1990 నుండి విరసంలో వుంటూనే రాష్ట్ర వ్యాప్తంగా బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రచయితలను, కళాకారులను, మేధావులను అంబేద్కరిజం, బిఎస్‌పి సైద్ధాంతిక దృక్పథంతో సమీకరించాను.

'గతితర్క తత్వదర్శన భూమిక' అనే గ్రంథంలో ఈ అనుభవాలన్నిటిని సూత్రీకరించి చర్చించాను. అలా భారతదేశంలో వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ అన్ని రంగాల్లో, అన్ని ఉద్యమాల్లో, అన్ని పార్టీల్లో ఎలా కొనసాగుతున్నదో విశ్లేషిస్తూ వందలాది వ్యాసాలు, ప్రసంగాలు, పుస్తకాలు వెలువరించాను.

1992లో దళిత రచయితల కళాకారుల, మేధావుల ఐక్యవేదిక ఏర్పాటు చేసి దానికి కన్వీనర్‌గా, వ్యవస్థాపక అధ్యక్షుడిగా రాష్ట్రమంతటా పర్యటిస్తూ అంబేద్కరిజాన్ని అన్ని రంగాలకు అన్వయిస్తూ విశ్లేషించాను. 'గతితర్కం అంబేద్కరిజం మార్క్సిజం', 'అంబేద్కరిజం సోషలిజం', 'బహుజనతత్వం', 'బిసిలు ఏంచేయాలి?' మొదలైన గ్రంథాలను వెలువరించాను. 'అంబేద్కరిజం-సోషలిజం' గ్రంథాన్ని కాన్షీరామ్ 1994 మే నెలలో నిజామాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో ఆవిష్కరించారు.

సాహిత్య, అలంకార శాస్త్ర దృక్పథాలను అంబేద్కరిజంతో విశ్లేషిస్తూ సాహిత్య విమర్శను, అలంకార శాస్త్రాలను, కథా రచనలను కొనసాగించాను. కథలబడి-కథా సాహిత్య అలంకార శాస్త్రం, సమగ్ర సామాజిక కథ-50ఏళ్ళ తెలుగు కథ తీరు తెన్నులు, సాహిత్య చరిత్రను కొత్తచూపుతో తిరగరాయాలి మొదలైన సాహిత్య గ్రంథాలను ప్రచురించాను.

1990లో నాకు పరిచయమైన బిఎస్‌పి ముందుకు తెచ్చిన చరిత్ర వారసత్వాన్ని రాష్ట్రం నలుమూలలా వ్యాప్తి చేయడంలో నా వంతు కర్తవ్యం నిర్వహించాను. బిఎస్‌పి కార్యకర్తలకు, నాయకులకు అనేక శిక్షణా శిబిరాలు నిర్వహించినప్పుడు పాల్గొన్నాను. వామపక్ష భావజాలంతో బిఎస్‌పి సిద్ధాంతాలపై, ఆచరణపై దాడి చేసినప్పుడు దరకమే ఐక్య వేదిక నుండి దాన్ని ఎదుర్కొన్నాము. అంబేద్కరిజం వెలుగులో 200కు పైగా పుస్తకాలు వెలువడ్డాయి. ఇందుకు దరకమే ఐక్యవేదిక స్ఫూర్తి ఎంతో ఉంది. రాష్ట్రంలో బహుజన దృక్పథం, బహుజన రచయితలు ఎదగడానికి దరకమే వేదిక ఒక స్ఫూర్తి అయ్యింది. 1994 తర్వాత రాష్ట్రంలో బిఎస్‌పి వెనకడుగు వేసినప్పుడు దాని సిద్ధాంత స్ఫూర్తిని సాహిత్య, సామాజిక రంగాల్లో నిలబెట్టడంలో క్షతగాత్రులమయ్యాం.

రాష్ట్రంలో కాన్షీరామ్ పాల్గొన్న అనేక సభల్లో పాల్గొన్నాను. వినుకొండలో జాషువా మేళాను నిర్వహించడలో క్రియాశీలంగా పాల్గొన్నాము. ఇలా ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం, కాన్షీరామ్ కృషి నా అవగాహనను మలుపు తిప్పింది. తద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సాహిత్య, సామాజిక, సైద్ధాంతిక రంగాల్లో నా వంతు కృషి కొనసాగిస్తున్నాను.

మాయావతి గెలుపు

తెలంగాణ రాష్ట్ర సాధనలో మలుపు కావాలి

ఉత్తర ప్రదేశ్ భారత రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తూ వస్తున్నది. ఉత్తర ప్రదేశ్ తర్వాత భారత రాజకీయాల్లో కీలక పాత్ర ఆంధ్రప్రదేశ్‌దే. 1977లో జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినా ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారం కొనసాగింది. కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఆసరాతో ఇందిరాగాంధీ కేంద్రంలో తిరిగి 1980లో అధికారంలోకి వచ్చింది. తెలుగుదేశం పార్టీ 1983లో అధికారంలోకి వచ్చాక జాతీయ రాజకీయాల్లో ఆంధ్రప్రదేశ్ మరింత కీలక పాత్ర పోషించింది. జనతాదళ్ ప్రభుత్వం కేంద్రంలో ఏర్పడడానికి, 2004లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడానికి ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రాధాన్యత చరిత్రాత్మకమైనది. ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌లో మాయావతి, బహుజన సమాజ్ పార్టీ సొంత బలంతో అధికారంలోకి రావడం ద్వారా భారత రాజకీయాల్లో ఉత్తర ప్రదేశ్‌కు తిరిగి ప్రాధాన్యత పెరిగింది.

మాయావతి గెలుపు భారత రాజకీయాల్లో ఒక మహోన్నతమైన మలుపు. ఇదొక చరిత్రాత్మక విజయం. దళితుల నాయకత్వంలో విభిన్న వర్గాలు ఒక్కటై అధికారంలోకి రావడం మాయావతి గెలుపు స్పష్టం చేస్తున్నది. భారత రాజకీయాల్లో బిసిల నాయకత్వంలో అనేక రాష్ట్రాల్లో కేంద్రంలో ప్రభుత్వాలు ఏర్పడినప్పటికీ కొన్ని విజయాలు సాధించారే గాని, భారత రాజకీయాలను మలుపు తిప్పలేక పోయారు. తాము భారత రాజకీయాలకు నాయకత్వంగా నిలదొక్కుకోలేక పోయారు. అధికార వ్యామోహం, వ్యక్తిగత స్వార్థం, సిద్ధాంత రాహిత్యం, సామాజిక న్యాయ దృష్టి కొరవడడం ఇందుకు ప్రధాన కారణం. ఇందుకు భిన్నంగా మాయావతి బిఎస్‌పి భారత రాజకీయాల్లో తన ఆరంభం నుండే కీలకమైన పాత్ర వహిస్తూ వస్తున్నది. మేము

గెలువక పోయినా ఎవరు ఓడాలో నిర్ణయించగలం అని కాన్షీరాం తొలిదశలో స్పష్టం చేసి కాంగ్రెస్‌ను ఉత్తర ప్రదేశ్ నుండి తరిమేసి చూపించారు.

వంద ఏళ్ళ పైన చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ మాతో కొన్ని సీట్ల కోసం ఒప్పందం పెట్టుకోవడం మా విజయం అని కాన్షీరామ్ ప్రకటించినప్పుడు అతిశయ ప్రకటన అనుకున్నారు. కానీ దాన్ని నిజం చేశారు. ములాయంసింగ్ సమాజ్‌వాది పార్టీ, బిఎస్‌పి కలిసి ప్రభుత్వాన్ని 1994లో ఏర్పాటు చేశాయి. కాని ఒప్పందం ప్రకారం ములాయంసింగ్ యాదవ్ బిఎస్‌పిని గౌరవించకపోగా అవమానించారు. దాంతో బిఎస్‌పి బిజెపితో చేతులు కలిపింది. ఇలా బిసిల పేరు చెప్పుకుని ములాయంసింగ్ యాదవ్ బిఎస్‌పిని గౌరవించాల్సింది పోయి శత్రువుగా దూరం కొట్టడం వల్ల అగ్రవర్ణాలతో బడా పారిశ్రామిక వేత్తలతో చేతులు కలపడం వల్ల బిసిలు ఎంతో నష్ట పోయారు. చంద్రభాను ప్రసాద్ వంటి జర్నలిస్టులు కాన్షీరామ్ చెప్పిన బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీ ఐక్య సంఘటన ఫార్ములాకు భిన్నంగా ఇందులోంచి బిసిలను తొలగించి అగ్రవర్ణాలను చేర్చుకుని కొత్త ఫార్ములాను తయారు చేశారు. ఈ కొత్త ఫార్ములా ద్వారా బిఎస్‌పి ఇప్పుడు సంపూర్ణ మెజార్టీతో ఉత్తర ప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చింది.

చరిత్రలో బిసిలకు జరిగిన నష్టం – బిసి మేధావులు చేసిన పొరపాటు

ములాయం సింగ్ యాదవ్ బిసి నాయకుడని సమర్థించుకుంటూ బిసిలు బిసి సమాజానికి చేసిన నష్టం భారత రాజకీయాలలో బిసిలను తిరిగి వెనక్కి నెట్టేదిగా మలుపు తిరిగింది. ములాయం సింగ్ యాదవ్‌ను ఆనాడే నిలదీసి మధ్యవర్తిత్వం వహించి బీసీ వర్గాలు బిఎస్‌పి, ఎస్‌పి పార్టీల మధ్య సమన్వయం అవగాహన పెంపొందించి ఉంటే భారత రాజకీయాలు ఇలా ఉండేవి కావు. జాతీయ ఉద్యమ కాలంలో అంబేద్కర్ నాయకత్వాన్ని చిన్న చూపు చూసి అగ్రవర్ణాల పంచన చేరిన బిసి నాయకత్వం తద్వారా గత 70 ఏళ్ళుగా చట్టసభల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో, బడ్జెట్లలో తమ వాటాని రిజర్వేషన్లను కోల్పోయారు. ఇప్పటికీ ఆ నష్టం పూరించబడలేదు.

ములాయం సింగ్ యాదవ్ ముఖ్యమంత్రి కావడం కోసం బిసి మేధావులు నాయకులు తిరిగి జాతీయ ఉద్యమంలో చేసిన పొరపాటునే మళ్ళీ చేశారు. తద్వారా బిఎస్‌పి బిసిలను స్థానంలో అగ్రవర్ణాలను చేర్చుకుని ఫార్ములా మార్చి విజయం సాధించింది. బిసిలు ఎప్పుడూ ఎస్సీలను చిన్న చూపు చూస్తూ అగ్రకులాల పంచన అనుచరులుగా చేరి నాయకులమైపోయామని విర్రవీగుతుంటారు. సొంత బలం లేని బిసిలు, సొంత బలం ఉన్న బిసిలు కూడా బిసి ప్రజల ఆకాంక్షలను అగ్రకులాలకు

తాకట్టు పెడుతున్నారు. తెలుగు దేశం పార్టీలోని బిసిలు, కాంగ్రెస్‌లోని బిసిలు, టిఆర్ఎస్‌లోని బిసిలు రాష్ట్రంలో ఇదే పని చేస్తున్నారు.

బిఎస్‌పి ఎదిగితే మంచిదేనని బిసి నాయకులు కోరుతున్నది నిజమే. కానీ వాళ్ళు బిఎస్‌పి ఎదిగితే తామున్న పార్టీలలో బేరం చేసే శక్తి పెంచుకోవచ్చుననే స్వార్థం తప్ప బిఎస్‌పికి మద్దతు ఇవ్వాలని బిఎస్‌పిలో చేరాలనే బిఎస్‌పిని బలోపేతం చేయాలని వారు భావించడం లేదు. కె. కేశవరావు మొదలుకొని టి. దేవేందర్ గౌడ్ దాకా అందరూ ఇలాంటివారే. అయితే బిసిల మద్దతు లేకుండా బిఎస్‌పి ఎలా మద్దతు పుంజుకుంటుంది? ఉత్తర ప్రదేశ్‌లో లాగా బిఎస్‌పి రాష్ట్రంలో కూడా అగ్ర కులాలకు ప్రాధాన్యత ఇచ్చి ముందుకు సాగాలనుకుంటే బిసి రాజకీయాలు ఏమౌతాయి? ఉత్తర ప్రదేశ్‌లో లాగా ఇక్కడ ములాయంసింగ్ వంటి సొంత పార్టీతో సొంత నాయకులుగా ఎదిగిన నాయకులు బిసిల్లో ఎవరూ లేరు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఆ అవకాశం ఇచ్చినప్పటికీ తెలంగాణలోని బిసి నాయకులు ఈ చారిత్రక అవకాశాన్ని చేజేతులారా కాలదన్నుకున్నారు. వాళ్ళు కాంగ్రెస్‌లో బిజెపిలో, తెలుగుదేశంలో, టిఆర్ఎస్‌లో తమ అదృష్టాన్ని, రెండవ స్థానాన్ని, మూడవ స్థానాన్ని వెతుక్కునే ప్రయత్నంలో కొనసాగుతున్నారు. వీరి బతుకు కేసిఆర్ అన్నట్టు బండి కింది కుక్క లాగా కొనసాగుతున్నది. బండి కింద నడిచే కుక్క బండిని నడిపే యజమాని విసిరేసే బొక్కలను తింటూ బండిని నేనే నడుపుతున్నానని అనుకుంటుందట! అగ్ర కులాల్లోని బిసి నాయకత్వం ఇలాంటి భ్రమల నుండి బయట పడడం లేదు. వాళ్ళ మరణ శాసనాన్ని వాళ్ళు రాసుకుంటే అభ్యంతరం లేదు. కానీ అది బిసిల సామాజిక రాజకీయ అభివృద్ధికి మరణ శాసనంగా పరిణమించడం ఘోరం.

రాష్ట్రంలో 13ఏళ్ళ తర్వాత బిఎస్‌పికి కలిగిన కొత్త అవకాశాలు

అందువల్ల ఆంధ్రప్రదేశ్‌లో బిఎస్‌పి పార్టీకి 13 ఏళ్ళ తరువాత తిరిగి ఒక కొత్త ఉత్తేజం కలిగింది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని బిఎస్‌పి తన నాయకత్వంలో ముందుకు తీసుకొని పోతూ అన్ని కులాలతో, అన్ని పార్టీలతో కలసి పనిచేస్తూ తెలంగాణ రాష్ట్ర సాధన ఐక్య ఫ్రంట్‌కు నాయకత్వం వహించాలి. అందుకు పూనుకోవాలి. ఆ ఒప్పందం పై తెలంగాణలోని బిసి నాయకులు ఇతర నాయకులు బిఎస్‌పితో జత కట్టి తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడం ద్వారా బహుజన సమాజ్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజకీయ చారిత్రక పరిణామాల్లో గెలుపు వైపు సాగడం సాధ్యపడుతుంది.

తెలంగాణ రాష్ట్రం కోరుతున్న వ్యక్తులు, శక్తులు, ప్రజాస్వామిక వాదులు బిఎస్‌పి

రాష్ట్ర నాయకత్వం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అంకితమై కృషి చేయాలని అందుకు తామంతా సహకరిస్తామని డిమాండ్ చేసి బిఎస్పిని ఉద్యమ పార్టీగా అందరూ కలిసి నడిచే పార్టీగా మార్చవలసి ఉన్నది.

ఉత్తర ప్రదేశ్ ప్రయోగాన్ని రాష్ట్రంలో కాస్త సవరించుకోవాలి

ఉత్తర ప్రదేశ్ ప్రయోగం ఆంధ్రప్రదేశ్‌లో అవసరమా? ఆంధ్రప్రదేశ్ పరిస్థితులననుసరించి దాన్ని మార్చుకోవాలి. ఉత్తర ప్రదేశ్ పరిస్థితులు ఇక్కడ లేవు. అగ్ర వర్ణాలను బిఎస్పిలో ఇక్కడ చేర్చుకో నవసరం లేదు. ఒక వేళ ఉంటే బిసిలను, తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకులను పూర్తిగా చేర్చుకున్న తర్వాత ఉండే ఖాళీలో అగ్రకులాలల్లోని కులతత్వంలోని సెక్యులరిస్టులకు, ప్రజాస్వామిక వాదులకు చోటు ఇవ్వడం అవసరం. ఈ పని చేయకుండా బిఎస్పి అగ్రకులాలకే పెద్ద పీట వేస్తే ఆంధ్రప్రదేశ్‌లో ములాయం వ్యతిరేకులు లేకున్నా లేని చోట తనకు తానే బిసిల్లో సృష్టించుకున్నట్టుగా అవుతుంది. అది బిఎస్పి అధికారానికి చేరువ కాకుండా అడ్డుకుంటుంది.

రాష్ట్ర బిఎస్పి నాయకత్వం, సామాజిక రాజకీయ సైద్ధాంతిక రంగాల్లో, అవగాహనల్లో, రాజకీయ వ్యూహం ఎత్తుగడల్లో తనకు తాను స్వయంగా ఎదగాలి. మాయావతి కడుపు నిండితే రాష్ట్ర బిఎస్పి ఆకలి తీరినట్టు కాదు. రాష్ట్ర బిఎస్పి తనకు తాను ఆహారాన్ని సంపాదించుకోవాలి. కడుపు నింపుకోవాలి. తన బలం తాను పెంచుకోవాలి. ప్రజల్లోకి విస్తరించాలి.

ఇతరుల మీద, ఇతర రాష్ట్రాల మీద ఆధారపడి గెలవాలనుకునే అనుచర మనస్తత్వాన్ని వదులు కోవాలి. కొందరు రష్యాను, చైనాను, కొందరు అమెరికాను, కొందరు కాంగ్రెస్‌ను, కొందరు టిడిపిని, కొందరు ఉత్తర ప్రదేశ్‌ను అనుసరించినట్టుగా రాష్ట్రంలోని బిఎస్పి అదే క్రమాన్ని అనుసరిస్తే తిరిగి యథా స్థానంలోనే ఉండి పోతుంది. మూడు సార్లు ఉత్తర ప్రదేశ్‌లో ముఖ్యమంత్రి అయినా ఆంధ్రప్రదేశ్‌లో బిఎస్పి ఎందుకు గెలువ లేదో అదే తిరిగి కొనసాగుతుంది.

రాష్ట్రంలో బిసిలను, సెక్యులర్, ప్రజాస్వామిక శక్తులను కలుపుకోవాలి

అందువల్ల ఉత్తర ప్రదేశ్ ఉత్తేజం ఉండాలి కానీ, ఉత్తర ప్రదేశ్ ప్రయోగం ఆంధ్రప్రదేశ్ లో యథాతథంగా ఉండాలనేదేమీ లేదు. ఎస్సి, బిసి ఎస్టి, మైనార్టీలతో పాటు సెక్యులర్ ప్రజాస్వామిక శక్తులను కలుపుకొని బలోపేతం కావడం ఇక్కడి అవసరం. తద్వారా మనువాదులతో చేతులు కలిపారనే మాటకు ఆస్కారంలేకుండా

పోతుంది. టిఆర్ఎస్‌లోని వెలమ రాజకీయ నాయకత్వంపై అందరూ అసంతృప్తితో ఉన్నారు. కాంగ్రెస్, తెలుగు దేశంలలోని అగ్ర కుల నాయకత్వంపై అందరూ ఆగ్రహంతో ఉన్నారు. ఈ ఆగ్రహాన్ని బిఎస్పి తన రాజకీయ చైతన్యంతో, రాజకీయ చతురతతో, తన గెలుపుగా మార్చుకుంటుందా? లేదా? అనేది భవిష్యత్ నిర్ణయిస్తుంది.

మాయావతి విజయం అంబేద్కర్ రాజ్యాంగ సభలో చేరి రాజ్యాంగాన్ని రాసిన రోజులను గుర్తుకు తెస్తున్నది

మాయావతి విజయం అంబేద్కర్ రాజ్యాంగ సభలో చేరి రాజ్యాంగాన్ని రాసిన నాటి రోజులను గుర్తుకు తెస్తున్నది. భారత దేశంలోని బహుజనులకు ఒక ఆశాజ్యోతిని అందిస్తున్నది. జాతీయ రాజకీయాల్లో బహుజనులు నిర్వహించబోయే పాత్ర మహత్తరమైనదని గొప్ప ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తున్నది. ఇది యాభై ఏళ్ళ భారతీయ చరిత్రలో ఒక మహోన్నతమైన మలుపు. భారత రాజకీయాలు ఓట్ల ద్వారా శాంతియుత పద్ధతుల్లో బహుజనులకు అనువుగా వారి అధికార భాగస్వామ్యం కోసం ఇక నుండి ముందుకు సాగడం ఎంతో దూరంలో లేదు అని బిఎస్పి గెలుపు స్పష్టం చేస్తున్నది. ప్రాంతీయ పార్టీలతో ఇక నుండి బిఎస్పి నాయకత్వంలో మూడవ ఫ్రంట్ ఏర్పడాల్సిన చారిత్రక దశ ఆసన్నమైంది. బహుజన సిద్ధాంత కర్తలు, మేధావులు, నాయకులు ఈ వైపుగా దృష్టి సారించి బిజెపి కాంగ్రెస్‌ల నాయకత్వంలోని ఫ్రంటుల స్థానంలో మూడవ ఫ్రంటు రెండవ జాతీయ పార్టీగా ఎదుగుతున్న బిఎస్పి కర్తవ్యాలను విస్తరించాల్సిన అవసరం ఉంది.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బిఎస్పి చిత్తశుద్ధితో కృషి చేయాలి

ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బిఎస్పి చిత్తశుద్ధితో కృషి చేయాలి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కృషి చేస్తున్న అన్ని శక్తులను, అన్ని పార్టీలను తన నాయకత్వంలో ఫ్రంటుగా ఏర్పర్చి ముందుకు సాగాలి. రాబోయే సినిమా తారల పార్టీని కూడా బిఎస్పిలో విలీనం చేసుకోగలగాలి. ఇందుకు అన్ని వైపుల నుండి కృషి జరగాలి. తెలంగాణ రాష్ట్రం కోసం కృషి చేసే సామాజిక ఉద్యమకారులు, కళాకారులు, బి.ఎస్.పికి పూర్తి సహకారాన్ని అందిస్తారనే విషయం తద్వారా బిఎస్పి రాజకీయాలకు ఒక గొప్ప మలుపును ఇస్తుంది అనే విషయం మర్చిపోకూడదు.

ప్రజాతంత్ర దినపత్రిక, -5-2007

ఉత్తరప్రదేశ్ ఎన్నికల విశేషాలు

క్రీ.శ. 2007 ఏప్రిల్, మే నెలల్లో ఉత్తరప్రదేశ్ శాసన సభకు జరిగిన ఎన్నికల్లో గమనించవలసిన విశేషాలు ఎన్నో ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ సామాజిక స్థితి గతులను తెలుసుకోవడానికి కొంత ఉపకరిస్తాయి.

రిగ్గింగ్, గూండాయిజాన్ని అరికట్టడానికి ఏడు దఫాలుగా సాగిన పోలింగ్

ఉత్తరప్రదేశ్‌లో ఈ సారి ఏడు దఫాలు పోలింగ్ నిర్వహించడం జరిగింది. ఒకే రోజు పోలింగ్ జరపడం ఒక ఆదర్శమే గాని, ఆచరణ సాధ్యం కాదు. చేసుకున్నోళ్ళకు చేసుకున్నంత రిగ్గింగ్‌కు అది అవకాశం ఇస్తుంది. ఈ సారి అఖిలపక్ష సమావేశంలో అన్ని పార్టీలు ఉత్తరప్రదేశ్‌లోని పోలీసులను ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ డ్యూటీల్లో నియమించ కూడదని కోరడం జరిగింది. ములాయంసింగ్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి, మాఫియా, గూండా యిజానికి పేరెన్నికగన్నది. అందుకని సమాజ్‌వాది పార్టీ తప్ప అన్ని పార్టీలు పారా మిలటరీ దళాల సహాయంతో ఎన్నికలు నిర్వహించాలని కోరాయి. పారా మిలటరీ దళాలు ఒక చోటు నుంచి మరొక చోటికి వెళ్ళడానికి అనువుగా ఏడు దఫాలు ఎన్నికల పోలింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇతర రాష్ట్రాల ఉన్నతాధికారులే ఎన్నికల పరిశీలకులు.

ప్రజలు తమ ఓటు తామే వేసుకోవడానికి ఎన్నికల సంఘం ఎంతగా శ్రమించిందో

పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం పేరిట కొత్త వాళ్ళు ఇతర జిల్లాల నుండి రావడాన్ని పోలీసులు నిరోధించారు. తద్వారా మాఫియాలు, గ్యాంగులు, రిగ్గింగులు జరిపే కార్యక్రమాలు నిరోధించబడ్డాయి.

పోలింగ్ స్టాఫ్ సొంత జిల్లా నుండి అసలే ఎన్నిక చేయలేదు. బయట జిల్లాల నుండి ఎన్నిక చేశారు. ఎన్నికల అధికారులకు అది సొంత జిల్లా కాకూడదు. ఎక్కువ కాలం అక్కడ గతంలో పని చేసి ఉండకూడదు. ఇందుకు గాను వీరిని కంప్యూటర్ రాండమైజేషన్ ద్వారా ఎన్నిక చేశారు.

స్త్రీల పోలింగ్ తక్కువగా ఉండడానికి కారణాలు

స్త్రీలు పోలింగ్‌లో తక్కువ మంది పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో స్త్రీల జనాభా సగానికన్నా తక్కువేమీ లేదు. కానీ ఓటర్ల లిస్టుల్లో స్త్రీల పేర్లు తక్కువగా నమోదు అయ్యాయి. వెయ్యి మంది పురుష ఓటర్లు ఉంటే 800 మంది నుండి 900 వరకు మాత్రమే మహిళా ఓటర్లు నమోదయ్యారు. ఇందుకు కారణం ఏమంటే పెళ్ళి కాని ఆడపిల్లలను 'పరాయిధనము' అంటూ ఇతరుల సొమ్ము అనే భావనతో తల్లి దండ్రులు ఆడపిల్లలను ఓటర్లుగా నమోదు చేయలేదు. అత్తవారింటిలో ఓటర్ల లిస్టులో నమోదు కావడం సమయం తీసుకునేది. ఈ కారణాల రీత్యా మహిళా ఓటర్ల సంఖ్య బిహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో తక్కువ ఉంటున్నది.

నిజానికి దేశవ్యాప్తంగా పురుష ఓటర్ల కన్నా స్త్రీల ఓటర్లు ఎక్కువగా నమోదు అవుతుంటారు. ఎందుకంటే పురుషులు ఇతర ప్రాంతాలకు వలస వెళుతుంటారు. పిల్లలు, స్త్రీలు, వృద్ధులు ఇంటి వద్దే ఉండిపోతారు. స్త్రీల జీవన ప్రమాణాలు పురుషుల కన్నా 3 ఏళ్ళు హెచ్చు. ఈ కారణాల రీత్యా పురుష ఓటర్ల కన్నా స్త్రీల ఓటర్లు ఎక్కువ నమోదు అవుతుంటారు.

స్త్రీలు దళితులతో సహా అందరూ మొహం కనపడకుండా చీరకొంగును కప్పుకుంటారు. పరదా పాటిస్తారు. ఓటర్లను గుర్తు పట్టడంలో ఇబ్బందిగా ఉంటుంది. దీని వల్ల కూడా స్త్రీల ఓట్లు తగ్గిపోయాయి. ఈ సారి ఎన్నికలు మంచి ఎండల్లో వచ్చాయి. ఎండల వల్ల కొంత మంది ఓటు వేయలేదు. చాలా మంది వ్యవసాయ పనుల వల్ల ఓటు వేయలేదు. ఈ ఎన్నికల కాలంలో పంటల సీజన్. చెరుకు, గోధుమ, ఆలుగడ్డలు పంట కోతకొచ్చే కాలం కనుక పొలం పనుల్లో ఉండి పోలింగ్‌లో పాల్గొనడం జరగలేదు.

ఓట్లు తక్కువ శాతం ఎందుకు పోలయ్యాయి?

ఈ ఎన్నికల్లో 48 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఇందుకు కారణం దేశవ్యాప్తంగా ఎన్నికల పట్ల ఆసక్తి తగ్గడం. ఉత్తరప్రదేశ్‌లో ఇతర కారణాలు కొన్ని ఉన్నాయి. ఈ సారి రిగ్గింగ్‌కు, దొంగ ఓట్లకు అసలు అవకాశం లేకుండా పోలింగ్ యంత్రాంగం పారా మిలటరీ దళాలు పకడ్బందీగా కృషి చేశాయి. దాంతో పది నుండి ఇరవై శాతం దాకా జరిగే రిగ్గింగ్, దొంగ ఓట్లు ఆగిపోయాయి. దాని వల్ల ఓట్ల పోలింగ్ శాతం తగ్గినట్టు కనపడుతున్నది.

జీవితంలో మొదటిసారి ఓటు వేసుకోగలిగిన దళితులు

ఈ ఎన్నికల్లో మరొక విశేషం ఉంది. ఈ సారి దళితులు జీవితంలో మొదటి

సారిగా స్వయంగా ఓటేసిన వాళ్ళు లక్షలాది మంది ఉన్నారు. గతంలో వీరి ఓట్లను ఇతరులు వేసేవాళ్ళు.

దళిత వాడల్లో పోలింగ్ బూత్ ఉన్నప్పుడు దళితులు కొంత స్వేచ్ఛగా ఓటు వేసేవాళ్ళు. కానీ దానికి కూడా అనేక పరిమితులు ఉండేవి. ఓటర్ల లిస్టులో మీ పేరు లేదు అని అబద్ధం చెప్పి వాపసు పంపేవాళ్ళు. వారి ఓటును ఇతరులు వేసుకునేవాళ్ళు.

దళితులు ఓటు వేయకుండా అడ్డుకునే మార్గాలెన్నో

ఓటరు ఐడెంటిటీ కార్డు, లేదా రేషన్‌కార్డు చూపిస్తే ఓటు వేయనిస్తారు. ఓటరు ఐడెంటిటీ కార్డులను ప్రభుత్వ అధికారులు ప్రజలకు పంచకుండా గ్రామంలోని విలేజ్ ఆఫీసర్లకు, ప్రధాన్(సర్పంచ్)లకు, రేషన్‌షాపు డీలర్లకు ఇచ్చేవారు. వాళ్ళు వారి వద్దనే ఉంచుకునే వారు. ఫలానా వారికి ఓటు వేస్తేనే ఇస్తాం అని దళితులను బెదిరించేవాళ్ళు. అలా దళితుల ఓట్లు వేయకుండా అడ్డుకునేవాళ్ళు.

ఊర్లో పోలింగ్ బూత్ ఉండి దళితవాడ నుండి ప్రజలు ఊర్లోకి ఓటు వేయడానికి వెళ్ళాల్సి వచ్చినప్పుడు దళితులు ఓటు వేయడానికి జంకేవారు. అసలు పోలింగ్‌కే వెళ్ళేవారు కాదు. మొదట్లో పోలింగ్‌కు వెళ్ళొద్దని గూండా గ్యాంగ్‌లు బెదిరించేవి. దాన్ని ఎన్నికల యంత్రాంగం అడ్డుకోవడంతో కొన్ని కొత్త పద్ధతులు ప్రవేశపెట్టారు. ఊరికి దళితవాడకు నడుమ పొలాలు ఉంటాయి. ఆ పొలాల్లో ఠాకూర్‌లు, చౌదరీలు, మంచాలు వేసుకొని ఊరకే బాతాఖానీ కొట్టేవాళ్ళు. వాళ్ళను చూసి దళితులు ఓట్లు వేయడానికి బయలుదేరడమే బందయ్యేది.

పల్లెల నుండి ఇప్పుడిప్పుడే పట్టణాలకు సాగుతున్న ప్రజలు

ఉత్తరప్రదేశ్ చాలా వెనుకబడిన ప్రాంతం. ఇటీవలే దళితులు పల్లెల నుండి టౌనులకు వలసవెళ్ళి పనులు వెతుక్కోవడం ప్రారంభించారు. దళితులు వ్యవసాయ కూలీలుగా జీవిస్తుంటారు. ప్రజలు ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. గంగాతీర మైదానం అని ఉత్తరప్రదేశ్, బిహార్ ప్రాంతాలను పిలుస్తుంటారు. పల్లెల నుండి పాలు, కూరగాయలు టౌన్లకు తీసుకువెళ్ళి అమ్ముతుంటారు. పల్లెల నుండి టౌన్లకు వెళ్ళి బతకడం తక్కువ.

ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల సామాజిక చైతన్యం పెరుగుతున్నది. చరిత్రను దళితులు, బిసిలు తమకు స్ఫూర్తిని, ఉత్తేజాన్ని ఇచ్చే అంశాలను వెలికితీస్తూ తిరగరాస్తున్నారు. అది పూర్తి స్థాయిలో కాకుండా చిన్న చిన్నగా, విడివిడిగా జరుగుతున్నది. కర పత్రాల ద్వారా చిన్న పత్రికల ద్వారా తమ చరిత్రను, సంస్కృతిని చరిత్రలో తమ పూర్వీకులు

నిర్వహించిన మహత్తర పాత్రను వెలికి తీస్తున్నారు.

ప్రథమ స్వాతంత్ర పోరాటం అని ప్రసిద్ధి చెందిన 1857 తిరుగుబాటులో, ఆ తిరుగుబాటుకు ముందు కూడా ఎందరో దళితులు, బిసిలు బ్రిటిష్ వలస పాలకులకు వ్యతిరేకంగా తిరుగుబాట్లు చేశారని అలాంటి నాయకుల చరిత్రను అగ్ర కులాల వాళ్ళు మరుగున పడవేశారు. ఆ చరిత్రను వెలికితెస్తున్నారు.

ఉత్తరప్రదేశ్‌లో టూరిజం, పర్యాటకుల ఆకర్షణ హెచ్చు. అయినప్పటికీ విశాలమైన ప్రాంతం దక్షిణాది రాష్ట్రాల పట్టణాలతో, నగరాలతో పోల్చితే ఎంతో వెనుకబడినట్టు ఇట్టే తెల్సిపోతుంది. అక్కడ స్కూటర్లు, సైకిల్‌మోటర్లు ఆంధ్రప్రదేశ్‌లో లాగా ఎక్కువ సంఖ్యలో లేవు. కార్ల, ఆటోల నిష్పత్తి కూడా తక్కువ. ఉత్తరప్రదేశ్ గ్రామాల్లో ఇప్పటికీ సైకిల్లే ఎక్కువ కనబడుతాయి. సాంస్కృతికంగా హిందూమత వివక్షతతో వెనుకబడిన తీరు స్పష్టంగా కనపడుతుంది. పూణే, ముంబాయి, బెంగుళూరు, హైదరాబాద్, ఢిల్లీ, కోల్‌కటా, నాగ్‌పూర్, విజయవాడ, చెన్నై నగరాల్లో లాగా ఆధునిక సంస్కృతి కనపడకుండా ప్రత్యేకంగా కనపడతాయి. మహారాష్ట్ర గ్రామీణ ప్రాంతాలు, మధ్యప్రదేశ్, బీహార్, ఒరిస్సా, రాజస్థాన్ ఉత్తరప్రదేశ్ ప్రాంతాలు సుమారుగా ఇలాగే ఉంటాయి. వ్యవసాయం, పశువుల పెంపకం, కూరగాయల పంట, సంప్రదాయ వ్యవసాయ పంటల నుండి ఇంకా ఎంతో ఎదగవలసి ఉంది.

ఉత్తర ప్రదేశ్ రాజకీయ పరిణామాలు సామాజిక, సాంస్కృతిక రంగాలను కూడా ప్రభావితం చేశాయి. బ్రాహ్మణులకు ఎమ్మెల్యే టిక్కెట్లు ఇచ్చినందుకు బ్రాహ్మణ స్త్రీలు బహుజన స్త్రీలకు స్వయంగా వండి వడ్డించారు. వారి ఇళ్ళల్లో స్వయంగా వండి వడ్డించడం దళిత స్త్రీలు తమ జీవితంలో ఎన్నడూ ఊహించి ఉండలేదు. పది అడుగుల దూరం వుండి భూమికి వంగి నమస్కరిస్తే పది అడుగుల దూరంలో ఉన్న బ్రాహ్మణుడు తన కాలికింది మట్టిని ఛీ అంటూ ఛీ కొడుతూ ఆ నమస్కారాన్ని తిరస్కరించే వారు. అలాంటి వైషమ్యాలు ఈ ఎన్నికల ప్రక్రియ ద్వారా బాగా తగ్గాయి. వైషమ్యం తగ్గి సోదర భావం పెరిగింది. దళితుల ఇళ్ళల్లోకి బ్రాహ్మణ స్త్రీలు వచ్చి దళిత స్త్రీలు వడ్డి వండించింది తిన్నారు. ఆత్మీయంగా కౌగిలించుకున్నారు. ఇలా "భాయి చారా" పెరిగింది. ఇది ఎవరూ ఊహించని పరిణామం.

బ్రాహ్మణుల ఇళ్ళు ఎలా ఉంటాయో వారి వంటలు, అలవాట్లు ఎలా ఉంటాయో దళిత స్త్రీలు ఇలా మొదటిసారిగా చూశారు. అలాగే దళిత స్త్రీలు ఎలా బతుకుతున్నారో వారి జీవన విధానం ఏమిటో, వారి పిల్లల చదువులు, బాగోగులు ఎలా వున్నాయో బ్రాహ్మణ స్త్రీలు తెలుసుకోగలిగారు. వామపక్ష ఉద్యమాల్లో ఇది సాధ్యం కాలేదు.

వామపక్ష ఉద్యమాల్లో కుటుంబాలు పాల్గొనకుండా కేవలం వ్యక్తులు పాల్గొంటూ తమ స్త్రీలు భిన్నాభిప్రాయాలు కలిగి వున్నారని తప్పించుకుంటారు. నక్సలైట్ల ముప్పయ్యేళ్ళ ఉద్యమంలో సైతం దళిత స్త్రీలు, అగ్రవర్ణ, బ్రాహ్మణ స్త్రీలు పరస్పరం కలుసుకోవడం, ఆదరించుకోవడం, వండివడ్డించుకోవడం, ఒకరి వాడకు ఇంటికి మరొకరు వెళ్ళడం జరగలేదు.

ఉత్తరప్రదేశ్‌లో బహుజన సమాజ్ పార్టీ సాధించిన ఈ విజయం ఆశ్చర్యకరమైనది. రాజకీయ అధికార పరిణామాలననుసరించి అగ్రవర్ణాల స్త్రీ, పురుషులు తమను తాము మార్చుకుంటున్న క్రమం ఇందులో కనపడుతుంది. ఉత్తరప్రదేశ్‌లోని నా అనుభవాల్లో పేర్కొన్న బ్రాహ్మణాధిపత్యం, కుల అహంకారం ఇరవయ్యేళ్ళ క్రితం ఎలా వుండేవో స్వీయానుభవాలను కొన్ని పేర్కొన్నాను. వాటి నుంచి చూస్తే ఈ ఇరవయ్యేళ్ళలో బహుజన సమాజ్ పార్టీ ఎదుగుతున్న క్రమంలో సమాజంలో, కుల సంస్కృతిలో, కుల వివక్షతలో అనేక పరిణామాలు వచ్చాయని వైషమ్యం తొలుగుతూ స్నేహం, మైత్రి, పరస్పర సహకారం పెరుగుతున్న క్రమం తెలుస్తున్నది. దళిత స్త్రీలు, బ్రాహ్మణ స్త్రీలు కలిసి చెట్టా పట్టాలేసుకొని ఎన్నికల ప్రచారం చేయడం అదొక మహత్తర చైతన్యం. దళితుల వీరనారి జానపద గాథలను బ్రాహ్మణ స్త్రీలు కూడా ప్రచారం చేశారు. ఇలా కలిసి తిరగకపోతే దళితుల ఓట్లు బ్రాహ్మణులకు, బ్రాహ్మణుల ఓట్లు దళితులకు పడేవి కావు. బ్రాహ్మణ, వైశ్య ఓటు బ్యాంకు బిజెపి నుంచి మొత్తంగా ఎలా తగ్గిపోయిందో, ఎందుకు తగ్గిపోయిందో బిఎస్‌పి ఓటు బ్యాంకు ఎలా పెరిగిందో ఇలాంటి సంఘటనలు సాక్ష్యం ఇస్తాయి. ఇలాంటి అనేక విశేషాలను సూర్యప్రకాశ్, ఎన్నికల పరిశీలకులుగా వెళ్ళిన ఉన్నతాధికారి ఎ.విద్యాసాగర్‌గార్లు ఇంకా ఎన్నో తెలిపారు. ఇప్పటికి ఇవి చాలు.

మహిళగా మాయావతి మహిళల చైతన్యంపై వేసే ప్రభావం

ఉత్తరప్రదేశ్‌లో ఓబిసిల్లో, ఎంబిసిల్లో, ఎస్సీల్లో సాంస్కృతిక చైతన్యం మొదలైంది. అది వేగం పుంజుకుంటున్నది. మాయావతి ముఖ్యమంత్రిగా ఇప్పుడు పూర్తి మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. కనుక ఉత్తరప్రదేశ్‌లోని ఆడపిల్లలు తాము కూడా బాగా చదువుకోవాలని మాయావతిలాగా ఎదగాలని అందుకు పెళ్ళిల్లను వాయిదా వేసి విద్యకు, ఉద్యోగానికి జీవితంలో ఏదో ఒకటి సాధించాలనే లక్ష్యాన్ని స్వీకరించడం వేగం పుంజుకుంటుంది. ప్రధానిగా వున్నప్పుడు ఇందిరమ్మ నుండి మన మహిళ అని గొప్ప స్ఫూర్తి పొందారు. సరిగ్గా మాయావతి నుండి కూడా గొప్ప స్ఫూర్తి, ఉత్తేజం పొందుతారు. ఇది సామాజిక మార్పును వేగవంతం చేస్తుంది.

ఉత్తరప్రదేశ్‌లో బిఎస్‌పి

జానపద వీర గాథలను విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చింది

ఉత్తరప్రదేశ్‌లో మాయావతి విజయం సాధించడం వెనుక బిఎస్‌పి పార్టీ కార్యకర్తల నిర్మాణదక్షత ఎంతో ఉంది. అనుక్షణం మారే ఎత్తుగడల ప్రాధాన్యత చెప్పనవసరం లేదు. వీటికి తోడుగా బిఎస్‌పి చరిత్ర పునాదులను నిర్మించి ప్రజల్లో ఒక ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని కలిగించింది.

1857 మొదటి స్వాతంత్ర్య పోరాటాన్ని దళిత వర్గాలకు చెందిన వీరులే ప్రారంభించారన్న విషయాన్ని విస్తృతంగా బిఎస్‌పి ప్రచారం చేసింది. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా అవధ్, అలహాబాద్, కాన్పూర్ ప్రాంతాల్లోని గ్రామాల్లో దళితులు ఎలా పోరాటాలు చేశారు. ఆ స్థానిక చరిత్రలను త్యాగాలను బిఎస్‌పి విస్తృతంగా ముందుకు తెచ్చింది. 1857 సైనికుల తిరుగుబాటు మొదటగా చేసిన 'మాతాదిన్ భంగి' భారక్‌పూర్ కంటోన్మెంటులో పంది కొవ్వు, ఆవుకొవ్వు కలిపిన తూటాలు ఇవ్వబడుతున్నాయి అని మంగళ్‌పాండేకు చెప్పింది కూడా అతడే అని విస్తారంగా ప్రచారం చేశారు.

మహారాష్ట్ర దళిత ఉద్యమ వీరులను తిరిగి కొత్తగా ఉత్తరప్రదేశ్ రాజకీయాలకు అనువుగా ఉత్తేజంతో ప్రచారం చేశారు. స్థానిక దళిత వీరులను, వీర నారీమణులను చరిత్రను ప్రచారంలో ఉన్నవాటిని మరింత విస్తృతంగా దళితుల రాజకీయ అధికార సాధనలో ఒక స్ఫూర్తికోసం ముందుకు తెచ్చారు. చౌరస్తాల్లో, బహిరంగ ప్రదేశాల్లో స్థానిక కులాల వీరుల విగ్రహాలను నెలకొల్పారు. వారిని జ్ఞాపకం చేయడానికి పార్కుల్లో విగ్రహాలు పెట్టారు. వారి పేరిట జాతరలు నిర్వహించారు. అవన్నీ కలిసి దళితుల ఆత్మ గౌరవంగా రూపాంతరం చెందాయి.

ఉత్తర భారత దేశంలో దళిత మహిళా వీర నారుల గురించి బద్రీ నారాయణ్ ఎంతో చరిత్రను వెలికి తెచ్చారు. ఉత్తరాదిలోని సంస్కృతి అస్తిత్వం, రాజకీయాలు జానపద గాథల నుండి ఎలా కొనసాగుతూ వస్తున్నాయో అవి రాజకీయ అధికార సాధనలో కొత్త జవసత్వాలను సాధించుకొని ఎలా వ్యాప్తి చెందుతున్నాయో ఆయన వివరించారు. ఇది దళిత కులాల సాంస్కృతిక మూలాలను, వనరులను వెలికితీసి పునర్నిర్ణయించడం జరిగింది. అది నూతన సామాజిక రాజకీయ పరిణామంలో వర్తమాన దళిత ఐడెంటిటీ పెంచడంలో ఉపయోగించుకోవడం కోసం ముందుకు తేవడం జరిగింది.

జానపద గాథలు, జ్ఞాపకాలు, సంస్కృతి చిహ్నాలు, విశ్వాసాలు చారిత్రక అంశాలుగా వాటి మూలాధారాలను వెలికితీయడం ద్వారా బిఎస్‌పి ఎన్నికల రాజకీయాల్లో బలమైన శక్తిగా ఎదుగుతూ వచ్చింది. గ్రామాల్లోని జానపద గాథల్లోని దళిత వీరనారీమణులైన ఝూల్కరి బాయి, ఉదాదేవి, మహావీర్ దేవి, అవంతిబాయి, మొదలైనవారిని విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా మాయావతి ప్రతిష్ఠను పెంచడం జరిగింది. ప్రథమ భారత స్వాతంత్ర్యంలో పాల్గొని బ్రిటీష్ వాళ్ళకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన మహరాణి ఝాన్సీలక్ష్మీ బాయి గాథను విస్తృతంగా ప్రచారం చేశారు. వారందరి వారసురాలిగా, వీర నారిగా మాయావతి ఒక ఆరాధనీయురాలుగా వ్యక్తిత్వ నిర్మాణం ప్రజల్లో స్థిరపడింది.

ఈ జానపద వీరులు, వీరనారులు భారతజాతి చరిత్రలో ముఖ్యమైన పాత్ర గతంలో నిర్వహించారని వర్తమానంలో పరిపాలకులుగా ఎదగడానికి ఒక సామాజిక అంగీకారాన్ని ఈ చరిత్ర ప్రచారం ద్వారా సాధించడం జరిగింది. అందువల్ల తాము ఈ సామాజిక సంక్షేమం కోసం సామాజిక మలుపు కోసం ఇతరుల కన్నా ఎక్కువ కృషి చేసే కమిట్‌మెంట్ తమకే ఉందని చెప్పడం ద్వారా ప్రజల్లో విశ్వాసం కలిగించారు. చరిత్రలో ఎందరో దళిత వీర నారీమణులను దళిత జాతి అందించిందని దాని వారసత్వ క్రమమే మాయావతి అని ప్రజలు భావించారు. ఇలా జానపద సాహిత్య, సాంస్కృతిక గాథలను, విశ్వాసాలను బహుజన సమాజ్ పార్టీ చరిత్రతో లంకెవేసి ఒక మహోన్నతమైన చారిత్రక వారసత్వాన్ని ప్రజల హృదయాల్లో నిలిపింది.

బహుజన సమాజ్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఈ పని విస్తృతంగా చేపట్టాల్సి ఉంది. సమ్మక్క – సారక్క వంటి వీర నారీ మణులను, రాణీ రుద్రమ దేవి వంటి కాకతీయ రాణులను, స్థానిక దేవతలుగా, వీరులుగా, వీర నారీమణులుగా వెలసిన గుళ్ళను, గాథలను, ఇతిహాసాలను, విశ్వాసాలను చరిత్రతో జోడించి విస్తృతంగా

ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది.

జాంబవంతుల కథలోని శివుడు తిరిగి జాంబవులు రాజులుగా భారత దేశాన్ని కలియుగంలో పరిపాలిస్తారని వరమిచ్చిన కథను చరిత్రలో భాగంగా ఇతిహాసాల్లో భాగంగా ప్రజల్లో ప్రచారం చేయాలి. అలాగే పోతులూరి వీరబ్రహ్మం గారు దళితులు అధికారంలోకి వచ్చి రాజ్యాలు ఏలుతారు అని చెప్పిన విషయాన్ని ఆయన మాటల్లోనే ముందుకు తేవాలి. రేణుక ఎల్లమ్మ కథలో జమదగ్ని రేణుకను దళితులు కాపాడినందుకు పెట్టిన శాపం రేణుకను తిరిగి బతికించాలని పరుశరాముడు కోరిన తరువాత రేణుక తిరిగి బతుకుతుంది. రేణుకను కాపాడిన దళితుల పట్ల ఉన్న శాపాన్ని ఉపసంహరించుకుంటూ తిరిగి మీరు కలియుగంలో రాజ్యాలు ఏలే అవకాశం ఇస్తున్నాని ప్రకటించిన విషయాన్ని ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది.

అలాగే హరిశ్చంద్ర కథలోని వీరబాహువు, మాతంగ కన్యలు రాజులని, రాజపుత్రికలని ఇతిహాసాలనుండి వెలికితీసిన బి. విజయభారతి వ్యాసాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన అవసరం ఉంది.

గోండుల, ఎరుకలి వారి, లంబాడీ, చాకలి, మంగళి, పద్మశాలి, గౌడ, గంగపుత్ర, కుమ్మరి, బుడుగ జంగాల మొదలైన బిసి, ఎస్‌సి, ఎస్‌టి కులాల స్థానిక వీరులను, వీర నారీమణులను, నాయకులను జానపద గాథల నుండి సంస్కృతి నుండి విశ్వాసాల నుండి వెలికితీసి నేటి రాజకీయ అధికార సాధనతో లంకెవేసి ప్రచారంలోకి తేవాల్సిన అవసరముంది. ఇలాంటి వందలాది నాయకులను వీరులను గురించి కళా రూపాలను చిన్న పుస్తకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన అవసం ఉన్నది.

శాతవాహనులు గిరిజన రాజులని, చాళుక్యులు జొన్నలు పండించే కులానికి చెందిన రాజులని, కాకతీయులు పందుల పెంపకం వృత్తిగా గల ఎరుకలి, దొమ్మరి, వడ్డెర మొదలైన కులాల రాజులని, కృష్ణదేవరాయలు కూడా శూద్ర రాజులని మరుగున పడేసిన విషయాలను తిరిగి ముందుకు తేవడం అవసరం.

ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ, గంగానమ్మ, ముత్యాలమ్మ మొదలైన స్థానిక దేవతలుగా కొలుస్తున్న వాళ్ళంతా మాతృస్వామిక సమాజంలోని వీరనారులే. సింధు నాగరికత, మెసపుటోమియా, సుమేరు నాగరికతలతో వీరి చరిత్ర ముడివడి వున్నది. నేను, కంచ అయిలయ్య, పపుల్ జయకర్, కోశాంబి మొదలైన వారు వెలికి తెచ్చిన మాతృస్వామిక వీరమాతల చరిత్రను, జానపద ఇతిహాసాలను విస్తృతంగా ప్రచారం చేయడం అవసరం. సర్దార్ సర్వాయ్ పాపన్న, కన్నెకంటి హనుమంతు మొదలైన వీరుల గాథలను తిరిగి చరిత్ర నుండి తవ్వి వెలికి తీసి ప్రచారం చేయాలి.

రాజకీయ అధికార సాధనలో

సామాజిక సమీకరణాలలో కులం

చాలా కాలంగా కులాల వారీగా ఓటు బ్యాంకులుగా ప్రజలు కలిసికట్టుగా ఉంటూ ప్రయోజనాలు, రాజకీయాధికారం సాధించుకోవాలని చాలా మంది మేధావులతో పాటు మరికొన్ని పార్టీలు ప్రచారం చేస్తున్నాయి. బీహార్, ఉత్తరప్రదేశ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ మొదలైన రాష్ట్రాల్లో యాదవులు, జాట్‌లు, ఠాకూర్‌లు కులాల వారీగా సమీకృతమై ఇతర కులాలను కలుపుకొని రాజకీయాధికారానికి కృషి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో తొలుత రెడ్లు, తరువాత కమ్మలు కులాల వారీగా సమీకృతమై ఇతర కులాలను కలుపుకొని రాజకీయాధికారానికి కృషి చేశారు. అధికారాన్ని కూడా సాధించుకున్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో రెండు మూడు జిల్లాలకు మించి లేని వెలమలు తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని తెలంగాణలో తాము అధికారంలోకి రావడానికి సాధనంగా మలచుకొని ముందుకు సాగుతున్నారు.

కొన్ని కుల సంఘాలు కులాలవారీగా ఓటు బ్యాంకులుగా మారాలని ఒక్క కులం వాళ్ళు మరొక కులం వల్ల అభ్యర్థికి మద్దతు ఇచ్చి మరో చోట తమ కులం అభ్యర్థికి మద్దతు పొందాలని ఇలా ఓటు బ్యాంకుల ఓటు మార్పిడి సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారు. ఎవరి ఆశ వారిది. ఎక్కడ వారికి బలం ఉందని భావిస్తారో దాన్ని తీసుకొని అధికార సాధనకు ప్రయత్నిస్తుంటారు. బహుజన సమాజ్ పార్టీ దళితుల నాయకత్వంలో ఓబీసిలను, ఎంబిసిలను, మైనారిటీలతో పాటు ఇతర పార్టీల్లో స్థానం దక్కని బ్రాహ్మణ, వైశ్య వర్గాలను కూడా కలుపుకొని ఉత్తరప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చింది. ములాయంసింగ్ యాదవ్ సమీకరించిన సామాజిక వర్గాలనుండి కొంత, ఇతరుల నుండి కొంత తన ఓటు బ్యాంకులోకి సమీకరించుకొని మాయావతి అధికారంలోకి వచ్చాక కుల సమీకరణల ప్రాధాన్యత తిరిగి ముందుకు వచ్చింది.

అదంతా వద్దన్నా సాగుతూనే ఉంటుంది. జాతీయోద్యమం నుంచి

కులసమీకరణలు కులాలకు అనుబంధంగా మలచుకోవడం మొదలైనవి సాగుతూనే ఉన్నాయి. అప్పుడు ప్రైవసీలో భాగంగా చర్చించుకొని జనాంతికంగా సమాజం గురించి, దేశం గురించి మాట్లాడేవాళ్ళు. బ్రాహ్మణ, రెడ్డి, కమ్మ, వెలమ కులాలు ఇప్పటికీ తమ కులాల ఆధిపత్య రాజకీయాలను ప్రైవసీలో భాగంగా చర్చించుకొని పబ్లిగ్గా ప్రజా సంక్షేమం గురించి మాట్లాడుతుంటారు. కొన్ని కులాలు ముఖ్యంగా అధికారంలో లేని కులాలు తమ కులం రాజకీయాధికారాన్ని చేపట్టాలని ప్రచారం చేస్తుంటారు. వీళ్ళు ప్రజల దగ్గరకు వెళ్ళకుండా పత్రికల ద్వారా, మీడియా ద్వారా ఆకాశం దద్దరిల్లేటట్లు బీసి, ఎస్సీ, ఎస్టీలకు రాజకీయాధికారం కావాలని నినదిస్తుంటారు. ఏ ప్రజలకు రాజకీయాధికారం కావాలో ఆ ప్రజలను ఆ కులాల వారిని చేరే నిర్మాణం కార్యకర్తలు, కార్యక్రమాలు ఉంటే వీళ్ళు కూడా ఆ నిర్మాణం ద్వారా తమ కులాల రాజకీయాధికారం గురించి రహస్యంగా మాట్లాడుకుంటారు. బహిరంగంగా ఈ సమాజాన్ని ఎలా ముందుకు నడపాలో చెప్తుంటారు. వీరికి నిర్మాణం లేకపోవడం వల్ల పత్రికల ద్వారా, మీడియా ద్వారా ప్రచారానికి ఉద్యమిస్తుంటారు. దీనివల్ల నిర్మాణం జరగకుండానే కార్యకర్తలు ఎదగకుండానే అవతలి పక్షం వీరిలో చీలికలు తీసుకురావడానికి పరస్పరం ఆయా కులాలు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తూ సంఘర్షించుకోవడానికి పనికివస్తుంది. తద్వారా బలం పుంజుకోక ముందే ఓటమి ఎదురవుతున్నది. అతి ప్రచారం అనర్థహేతువు.

ఉత్తరప్రదేశ్‌లో ఇందుకు భిన్నంగా బియస్‌పి ముందుకు సాగింది. అది ఎప్పుడు మీడియా మీద ఆధారపడలేదు. తన రాజకీయ అధికార ఆకాంక్షను ఆయా కులాల కార్యకర్తల సమీకరణలో భాగంగా రెడ్డి, కమ్మ, వెలమ కులాల్లాగే ప్రైవసీలో భాగంగా చర్చించుకుంటారు. వారు అధికారంలోకి వచ్చేదాకా చాపకింద నీరులా పనిచేస్తుంటారు. దానివల్ల రెడ్లు, కమ్మలు, వెలమలు అకస్మాత్తుగా అన్ని పార్టీల్లో అధిక సంఖ్యలో సీట్లు ఎలా గెలిచారబ్బా అని ఆశ్చర్యపోవడం జరుగుతుంది. సరిగ్గా ఇలాగే 2007 మే ఎలక్షన్లలో ఉత్తరప్రదేశ్‌లో మాయావతి నాయకత్వంలో బియస్‌పి గెలవడం ప్రజలందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది.

ఆంధ్రప్రదేశ్ సామాజిక రాజకీయ ఉద్యమాలు విచిత్రమైనవి. వీటికి ప్రచారంమీద ఉన్న ధ్యాస నిర్మాణం మీద చాలా తక్కువ. పది మంది ఉంటే వెయ్యి మంది ఉన్నట్లు భ్రమ కల్పిస్తుంటారు. ఓట్ల పండగ రాగానే అసలు విషయం బయటపడి రెండు మూడు వేల ఓట్లు కూడా రావు. ఇలా జరిగిపోయాక ప్రజలు మోసం చేశారని, ప్రజలు అమ్ముడుపోయారని, ప్రజల నిర్ణయశక్తిని అవమానించడానికి కూడా

సాహసిస్తుంటారు. తమ తప్పును కప్పిపుచ్చుకుంటారు. నిర్మాణం ఏమీ లేకుండానే తుంపిర్ల బలంతో మంత్రాలు వస్తాయని నమ్మిస్తుంటారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వంద మందైనా లేని పార్టీలు లక్షలాది మంది మా వెంట ఉన్నారని మీడియా సహకారంతో కులసంఘాలు బీసి, ఎస్సీ, ఎస్టీ సంఘాలు, పార్టీలు కొనసాగుతున్నాయి. వీరిలో ఏ ఒక్క అభ్యర్థికి గెలవడం అటుంచి ఓ ఇరవై అయిదు వేల ఓట్లు అయినా రాలేదు. ఉదాహరణకు మంద కృష్ణ మాదిగ గతంలో ఫ్రంటు పెట్టి పోటీ చేస్తే ఒక్క శాతం ఓట్లు కూడా రాలేదు. అయినప్పటికీ 6 శాతం ఉన్న మాదిగలందరికీ నాయకుడిగా ప్రచారం చేయబడుతున్నాడు. ప్రజలను కూడగట్టకుండా తమ పార్టీలను నిర్మించుకోకుండా ఇతరులను దూషిస్తుంటారు. కేవలం విమర్శ ద్వారా వారితో సమానంగా బలమున్నట్లు, ప్రజల కన్నా గొప్పవాళ్ళైనట్లు మాట్లాడుతుంటారు. ఇలాంటి కుల సంఘాలు, సంస్థలు, పార్టీలు తమ నిర్మాణాన్ని, కార్యకర్తలను పెంచుకొని కార్యక్రమాలను విస్తరించి ప్రజల అభిమానాన్ని ఉత్తరప్రదేశ్‌లోని బియస్‌పి లాగా ఓట్లుగా మార్చుకునే శక్తి సామర్థ్యాలు సాధించుకోవాలి.

సామాజిక శాస్త్రవేత్తలు ఎన్ని చెప్పినప్పటికీ ఒక విషయం మరిచిపోకూడదు. జాతీయోద్యమ కాలం తరువాత స్వాతంత్రం వచ్చాక రాజకీయ అధికార సాధనలో భావజాలం, జాతీయ స్ఫూర్తి, సామాజిక సమగ్రత స్థానం క్రమంగా బలహీనపడుతూ కులం, ప్రాంతం, మొదలైన అస్తిత్వంలో ఉన్న సమస్యల నిర్దిష్ట భావజాలం ఆయా సామాజిక వర్గాల రాజకీయ అధికార సాధన కోసం చేస్తున్న ప్రయత్నాలు ప్రాధాన్యతలోకి వచ్చాయి. ఆయా సామాజిక వర్గాలు కులాల, మతాల, ప్రాంతాల సమీకరణలను తమకనుకూలంగా మలుచుకోవడం కోసం కృషి చేయడం సహజమైన విషయం. అయితే సామాజిక శాస్త్రవేత్తలు జాతీయ సమగ్రతను నిలపడానికి నిరంతరం కృషి చేయడం కనీస కర్తవ్యం.

ఆంధ్రభూమి, 29.05.07

> "భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో మరోసారి అద్భుతం చోటుచేసుకుంది. 1995 ఎన్నికల్లో ఉన్నత వర్గానికి చెందిన మాజీ ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు దళితులకు ప్రాధాన్యత ఇచ్చి వారి మద్దతును సాధించగా నేడు ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో దళిత నాయకురాలైన బహుజన సమాజ్ పార్టీ సుప్రీం మాయావతి బ్రాహ్మణులు, ఇతర ఉన్నతవర్గాల మద్దతును కూడగట్టుకోవడం ద్వారా విజయఢంకా మోగించారు. పార్టీని విజయపథాన నడిపించారు. నవ చరిత్రకు నాంది పలికారు."
>
> *– ఆంధ్రభూమి, లక్నో, 12-5-2007*

జాతీయోద్యమ కాలం నుండి కుల సమీకరణలు
రాజకీయ అధికార సాధనలో

సామాజిక వర్గాల సమీకరణ ఎలా జరిగింది ?

ఆధునిక భారతీయ జాతీయోద్యమ చరిత్ర ఎప్పటి నుంచి ప్రారంభమైంది అనే విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. 1857 సిపాయిల తిరుగుబాటు లేక ప్రథమ భారత స్వాతంత్ర్య పోరాటం నుండి ఆధునిక భారతీయ జాతీయోద్యమ చరిత్ర ప్రారంభమైందని చాలామంది భావిస్తారు. అయితే మహాత్మా జ్యోతిబాపూలే ఈ స్వాతంత్ర్య పోరాటాన్ని వ్యతిరేకించారు. ఇది ఫ్యూడల్ శక్తులు సమాజాన్ని తిరిగి వెనక్కి నడపడానికి చేసిన ప్రయత్నం అని అన్నారు. అది ఓడిపోవడం మంచిదైందని జ్యోతిబాపూలే అభిప్రాయ పడ్డారు. కానీ మార్క్స్ ఈ తిరుగుబాటును ప్రథమ భారత స్వాతంత్ర్య పోరాటం అని ప్రశంసించారు. పెద్ద పుస్తకం రాశారు.

ప్రథమ భారత స్వాతంత్ర్య పోరాటం, 1862లో ప్యారిస్ కమ్యూన్ పేరిట జరిగిన కార్మికుల తిరుగుబాటు ప్రపంచంలోని పెట్టుబడిదారీ పారిశ్రామిక వర్గాల దృక్పథాన్ని సమూలంగా మార్చాయి. అందరికీ ప్రజాస్వామ్య విధానం అందించడం ద్వారానే తమ ఉనికి కొనసాగించవలసి ఉంటుందని భావించారు. అందులో భాగంగా ప్రజాస్వామ్య ప్రక్రియలను వలస దేశాల ప్రజలక్కూడా నేర్పాలని నిర్ణయించుకున్నారు. అలా భారతదేశంలో స్థానిక సంస్థల్లోకి భారతీయులను తీసుకున్నారు. 1885లో హ్యూమ్ కాంగ్రెస్‌ను స్థాపించి విజ్ఞప్తి ద్వారా బ్రిటీష్ ప్రభుత్వానికి తెలుపుకోవాలని భావించారు. కాంగ్రెస్‌లో మొట్టమొదటగా భారతీయుల నుండి బ్రాహ్మణులే పెద్ద సంఖ్యలో చేరారు. బ్రిటీష్ ప్రభుత్వంలో బ్రాహ్మణులే పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు పొందారు. కాంగ్రెస్ పార్టీ క్రమంగా బ్రాహ్మణ, వైశ్య కులాలకు ప్రాతినిధ్యం వహించే పార్టీగా మారింది.

ఇతర కులాలు ఇతర పార్టీలను, సంస్థలను పెట్టుకొన్నాయి. మహాత్మా జ్యోతిబా పూలే నడిపిన సత్యశోధక ఉద్యమం, దాని తాత్వికత మరుగు పరచబడింది. బాలగంగాధర తిలక్ వంటి బ్రాహ్మణ వాదులు మహాత్మా పూలేను విమర్శిస్తూ తన పత్రికలో పుంఖానుపుంఖాలుగా వ్యాసాలు, వ్యాఖ్యలు ప్రచురించేవారు. ఇలా జాతీయోద్యమ పుట్టుక నుండే కులాల సమీకరణలు జరుగుతూ వచ్చాయి. కాంగ్రెస్‌లో ఇతర శూద్ర కులాలకు స్థానం లేకుండా చూశారు. కొన్ని కుల సంఘాలను వారి కుల వృత్తుల రక్షణ కోసం పని చేసే పరిమితిలో కాంగ్రెస్ తనకు అనుబంధంగా ఉంచుకుంటూ వచ్చింది.

1921లో స్థాపించిన కమ్యూనిస్టు పార్టీ బ్రాహ్మణుల, ముస్లింల నాయకత్వంలోనే సాగింది. అందులో కూడా శూద్రులకు, అంటరానివారికి స్థానం లేకుండా పోయింది. మద్రాసు ప్రావిన్స్‌లో బ్రాహ్మణేతర కాపు తదితర శూద్ర కులాల జమిందార్లతో ప్రజాస్వామిక వాదులతో 1907లో జస్టిస్‌పార్టీ ఏర్పడింది. 1907లోనే వైశ్య సంఘం, రెడ్డి సంఘం ఏర్పడ్డాయి. తమ రాజకీయ అధికారం కోసం, బ్రిటీష్ ప్రభుత్వంలో తమ ఉద్యోగాల కోసం అవి కొన్ని ఉద్యమాలు చేశాయి. విజ్ఞప్తులు చేశాయి. 1921లో ఏర్పడిన పద్మశాలి సంఘం కేవలం కులవృత్తి డిమాండ్లకు పరిమితమై రాజకీయ అధికార వాంఛను వదిలివేసింది. ఆ తరువాత ఏర్పడిన చేతివృత్తి కులాల సంఘాలు కూడా ఈ బాటనే పట్టాయి. అలా రాజకీయాధికారాన్ని ఎజెండా లేకుండా చేసుకున్నాయి.

ఇవన్నీ ఉన్నప్పటికీ రాజకీయ అధికార సాధనలో జాతీయోద్యమ కాలం నుండి కొనసాగుతున్న భావజాల ప్రాధాన్యత, జాతీయ స్ఫూర్తి, సామాజిక సమగ్రత, ప్రజా సంక్షేమంల స్థానం స్వాతంత్ర్యానంతరం క్రమంగా బలహీనపడుతూ కులం, ప్రాంతం, పారిశ్రామికవేత్తల లాబీ, కాంట్రాక్టర్ల లాబీ, రియల్ ఎస్టేట్‌ల లాబీ మొదలైన వారి అస్తిత్వం తాలూకు నిర్దిష్ట భావజాలం, ప్రయోజనాలు, ప్రయత్నాలు ప్రాధాన్యతలోకి వచ్చాయి.

చాలా మందిలో బహుజన సమాజ్‌పార్టీ జాతీయ చర్చలోకి వచ్చాక తమ కులాలకు రాజకీయ అధికారం కావాలనే చైతన్యం పెరిగింది. ఆయా కులాలు రాజకీయ అధికారం కోసం నినాదాలు ఇస్తున్నాయి. అవి నినాదాల వరకే పరిమితం అవుతున్నాయి. పాలక వర్గ పార్టీల్లో వాల్ల కులాల వాళ్ళు వీళ్లను చూపి బేరం చేసి ఒకటి రెండు టికెట్లు తెచ్చుకొని గెలిచి తిరిగి అగ్ర కులాలకు అణకువగా సేవ చేయడానికి పనికి వస్తున్నది.

లాబీలు, సామాజిక సమీకరణలు : చరిత్రలో 1967 ప్రాధాన్యత

ఇలా పాలక వర్గాలలోని లాబీలు కొన్ని సామాజిక సమీకరణాలను ముందుకు తెస్తున్నారు. పాలిత వర్గాలలోని లాబీలు మరికొన్ని సామాజిక సమీకరణాలను ముందుకు తెస్తున్నారు. పాలక వర్గాలు ఏ కులాల నుండి, ఏ మతాల నుండి, ఏ ప్రాంతాల నుండి వచ్చినా వారి ఉమ్మడి ప్రయోజనాల లక్ష్యం కోసం ఘంటులుగా అలయెన్సులుగా కూడుతుంటారు. విడిపోతుంటారు. మళ్ళీ కూడుతుంటారు. జాతీయోద్యమ కాలం నుండి ఇలా ఎన్నో పార్టీల రూపంలో పాలక వర్గాల ప్రయోజనాలకు అనువుగా కూడికలు, విడిపోవడాలు జరుగుతూనే ఉన్నాయి. స్వాతంత్ర్యానంతరం ఇవి మరింత వేగం పుంజుకున్నాయి. వీటిలో భాగంగా స్థానిక, ప్రాంతీయ పార్టీల అస్థిత్వం, పుట్టుక పెరుగుదల ముందుకు వచ్చాయి. క్రమంగా ఆయా పార్టీల అస్థిత్వాలు అధికారానికి చేరువై జాతీయ పార్టీలు 1962 నుండి బలం కోల్పోయి 1967లో కాంగ్రెస్ పార్టీ దేశంలోని సగం రాష్ట్రాల్లో అధికారం కోల్పోయి ఇతర పార్టీలు అధికారంలోకి వచ్చాయి.

నాటి జస్టిస్ పార్టీ నేటి డిఎంకె పార్టీగా మారినతీరు

తమిళనాడులో 1967లో డిఎంకె అధికారంలోకి వచ్చింది. అప్పటినుండి డిఎంకె, దాని నుంచి చీలిపోయి ఏర్పడిన అన్నా డిఎంకె అధికారంలోకి వస్తున్నాయి. 1967లో డిఎంకె పార్టీ తరపున పోటీ చేసిన విద్యార్థి నాయకుడి చేతిలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడైన కామరాజు నాడార్ ఓడిపోయారు. కామరాజు కూడా బిసి ఉద్యమాన్ని నడిపిన వారే. ఓడించిన డిఎంకె కూడా బిసి, ఎస్.సి ఉద్యమాలను నడిపించిన బలంతోనే కామరాజును ఓడించడం జరిగింది. డిఎంకెకు ముందు ద్రవిడ కజగం సామాజిక ఉద్యమంగా కొనసాగింది. దీనికి పెరియార్ రామస్వామి నాయకత్వం వహించారు. 1907లో ఏర్పడిన జస్టిస్ పార్టీ 1917లో మద్రాస్ ప్రావిన్స్‌లో అధికారంలోకి వచ్చి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసింది. 1927లో జస్టిస్ పార్టీ అధ్యక్షుడిగా రామస్వామి నాయకర్ ఎన్నికయ్యారు. ఆయన జస్టిస్ పార్టీ పేరును ద్రవిడ కజగంగా మార్చేశారు. అనగా డిఎంకె 1917 నుండి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మద్రాసు ప్రావిన్సులో అధికారంలోకి వచ్చిన జస్టిస్ పార్టీ వారసురాలు. జస్టిస్ పార్టీ ఉదారవాద ప్రజాస్వామ్య వాదులైన నాన్ బ్రాహ్మణ్ భూస్వాముల, జమిందారుల పార్టీగా ఉండేది. పేద ప్రజల పట్ల, భూ సంస్కరణల పట్ల మొగ్గు చూపేది. దీన్ని కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేక పోయారు. రామస్వామి నాయకర్ నాన్ బ్రాహ్మణ్ ద్రవిడ పార్టీగా మరో వైపుకు వేగంగా నడిపించారు. దాన్నించి అతని శిష్యులైన సి.

అన్నాదురై, కరుణానిధి డిఎంకె అనే పార్టీని ఏర్పాటు చేశారు. డిఎంకె ఇలా రాజకీయ పార్టీగా రూపుదిద్దుకొని 1967 నుండి పూర్తి స్థాయి అధికారంలో కొనసాగుతున్నది. జస్టిస్ పార్టీ డిఎంకె పార్టీగా మారిన తరువాత పార్టీలో కులాల సమీకరణలు మారిపోయాయి. డిఎంకెలో సూద్ర కులాలు, బిసిలు నాయకత్వంలోకి వచ్చారు. ఆ ప్రజలపై ఆధారపడి ఓటు బ్యాంకును సమకూర్చుకున్నారు.

ఉత్తరప్రదేశ్‌లో రామమనోహర్ లోహియా సోషలిస్టు పార్టీ ప్రయోగాలు

ఉత్తరప్రదేశ్‌లో సోషలిస్టు పార్టీ రామ మనోహర్, రాజ్ నారాయణ్ నాయకత్వంలో బిసిలకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి వారి నుంచి నాయకులను, ఓటు బ్యాంకును అభివృద్ధి పరిచింది. 1967లో రామ నరేష్ యాదవ్ అధికారంలోకి వచ్చి బ్రాహ్మణుల అధికారాన్ని కూలదోశారు. బెంగాల్‌లో కూడా కాంగ్రెస్‌లోని బ్రాహ్మణుల అధికారాన్ని కూలదోసి మార్క్సిస్టు పార్టీ నాయకత్వంలో జ్యోతిబసు అధికారంలోకి వచ్చారు. మహారాష్ట్రలో రిపబ్లికన్ పార్టీ అధికారం కోసం అంబేద్కర్ భావజాలంతో ముందుకు వచ్చింది. దళితపాంథర్స్ అనే సామాజిక సాహిత్య సంస్థను ఏర్పరిచారు. చీలికలు పేలికలై ఇప్పటికీ అధికారానికి చాలా దూరంగా ఉండిపోయారు. ఇలా సామాజిక, సాహిత్య, సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో జరిగే సామాజిక రాజకీయ ఉద్యమాల వల్ల అధికారం మహారాష్ట్రలో అందకుండా పోయింది. రాజకీయ ఉద్యమాల వల్లనే ఇతర రాష్ట్రాల్లో డిఎంకె, సోషలిస్టు పార్టీ, సిపిఎం అధికారంలోకి వచ్చాయి.

బెంగాల్‌లో అధికారాన్ని కింది కులాలకు ప్రవహించకుండా అడ్డుకున్న సిపిఎం

బెంగాల్‌లోని కాంగ్రెస్ బ్రాహ్మణులు ఉదారవాద బ్రాహ్మణులు కాగా మార్క్సిస్టు పార్టీలో కరడుగట్టిన బ్రాహ్మణులు, కాయస్తులు, బాబూలు నాయకత్వంలోకి వచ్చారు. అంతకన్నా ముందు సామాజిక ఉద్యమంగా 1960 నుండి నామ శూద్ర ఉద్యమం హరిచంద్, గుర్‌చంద్ ఠాకూర్ మొదలైన చండాలుల నాయకత్వంలో వేగం పుంజుకుంది. ముస్లింల నాయకత్వంలో పీజెంట్స్ & వర్కర్స్ పార్టీ ముస్లిం లీగ్ మొదలైనవి ప్రజాస్వామ్య యుతంగా పని చేశాయి. ప్రత్యేక నియోజక వర్గాలను డిమాండ్ చేశాయి. అలాంటి ఉద్యమాలను క్రమ క్రమంగా అణగదొక్కుతూ మహారాష్ట్రలో బాల గంగాధర్ తిలక్ నిర్వహించిన పాత్రను బెంగాల్‌లో మార్క్సిస్టు పార్టీ నిర్వహించి కరడుగట్టిన బ్రాహ్మణవాదులకు ప్రతినిధిగా మార్క్సిస్టు పార్టీ ఎదిగింది. ఒక రాష్ట్రంలో ఆర్ ఎస్ఎస్ మరొక చోట తిలక్, కేరళలో నంబూద్రి బ్రాహ్మణులు బ్రాహ్మణ మనువాద ప్రాతినిధ్యాన్ని నిలబెట్టారు.

ఆంధ్రప్రదేశ్‌లో మధ్యలో ఆగిపోయిన అధికార మార్పిడి

ఆంధ్రప్రదేశ్‌లో కూడా పాలక వర్గంగా మారుతున్న రెడ్డి, కమ్మ, బ్రాహ్మణ కులాల నుండే కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం రావడం వల్ల వారి నాయకత్వంలో క్రమ క్రమంగా బిసి. ఎస్‌సి నాయకత్వాన్ని అణిచివేస్తూ వచ్చారు. 1910లో వేగం పుంజుకున్న త్రిపురనేని రామస్వామి, కట్టమంచి రామలింగారెడ్డి మొదలైన వారి నాయకత్వంలో వేగం పుంజుకున్న నాన్ బ్రాహ్మణ్ ఉద్యమాన్ని కమ్యూనిస్టు పార్టీలోని బ్రాహ్మణులు, రెడ్లు, కమ్మలు ధ్వంసం చేశారు. అగ్ర కులాల ఆధిపత్యాన్ని తిరుగు లేనిదిగా నెలకొల్పుకున్నారు. ఎన్.జి.రంగా జస్టిస్ పార్టీ స్ఫూర్తితో జమిందారీ వ్యతిరేక పోరాటాలు నిర్వహించారు. కాపులకు కొంత భూమి, హక్కులు, అధికారం అందడంతో ఆ ఉద్యమం ఆగిపోయింది. కాపులు ఒక రాజకీయ శక్తిగా ఎదిగే క్రమం దాంతో కుంటుపడింది. వాళ్ళు తమ కన్నా కింది కులాలకు అవే హక్కులను, అవకాశాలను ఇవ్వడాన్ని నిరాకరించడం వల్ల ఇలా జరిగింది. కమ్మలు త్రిపురనేని రామస్వామి చూపిన ఆర్థిక బాటలో క్రమంగా పుంజుకున్నారు.

బెంగాల్ ఆంధ్రప్రదేశ్‌లలో అధికార వర్గాలు

ఇలా బెంగాల్‌లో, ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక ఉద్యమాలను మార్క్సిస్టులు, కమ్యూనిస్టులు, సామాజిక సమీకరణల్లో బిసి, ఎస్.సిల నాయకత్వం రాకుండా నిరోధిస్తూ వస్తున్నారు. కాగా తమిళనాడు, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో బిసిలే సామాజిక పరిణామ క్రమం సహజ పద్ధతిలో సాగి అధికారంలోకి వచ్చారు. మహారాష్ట్రలో దళితులు చీలికలు పేలికలై కాంగ్రెస్ పార్టీ తిరిగి నాయకత్వంలోకి వచ్చింది. పూలే వారసత్వంలోని సత్యశోధక ఉద్యమాన్ని కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు ఆ తరువాత కాలంలో శివసేన సొంతం చేసుకుని తిరిగి అగ్రవర్ణ అధికారానికి మల్లించింది.

అలా ఇప్పటికీ బిసి, ఎస్సీలను నిరోధిస్తూ మహారాష్ట్రలో కాంగ్రెస్, కేరళ బెంగాల్‌లలో మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి వచ్చాయి. కేరళలో నారాయణగురు ఉద్యమాన్ని, నాయర్స్ ఉద్యమాన్ని ధ్వంసం చేసి తిరిగి బ్రాహ్మణులు అగ్ర కుల నాయకత్వంలో అగ్రకుల ఆధిపత్యాన్ని పునరుద్ధరించింది. బెంగాల్‌లో కూడా అగ్ర కులాధిపత్యాన్ని పునరుద్ధరించింది. 1857నుండి 1947 వరకు బ్రిటిష్ పరిపాలనలో కోల్పోయిన ఆధిపత్యాన్ని ఇలా తిరిగి నెలకొల్పారు. చట్ట బద్ధంగా పునరుద్ధరించారు. మార్క్సిస్టు పార్టీ గానీ, శివసేన గానీ, ఆర్ఎస్ఎస్ గానీ పూర్వం కోల్పోయిన బ్రాహ్మణ అగ్రకుల ఆధిక్యతను పునరుద్ధరించాయి. బ్రిటిష్‌వాళ్ళు ఉదార

ప్రజాస్వామ్యవాదులుగా నాన్ బ్రాహ్మణ్ కులాలకు కూడా కొంత ప్రయోజనం చేకూర్చడాన్ని బ్రాహ్మణులు సహించలేక పోయారు. ఇలా బ్రాహ్మణ ఆధిక్యతకు మార్పిజం, ఆర్ఎస్ఎస్ వాదం, శివసేన వాదం, జాతీయవాదం ముసుగుగా కొనసాగుతూ వస్తున్నది. కాంగ్రెస్ జాతీయ వాదం బ్రాహ్మణ జాతీయవాదం తప్ప బహుజన జాతీయ వాదం కాదు.

ఇంగ్లీష్ భాష లింక్ లేకపోవడం వల్ల ప్రాంతీయ ఉద్యమాలకు జరిగిన నష్టం

భారత దేశంలోని భిన్న భాషల వల్ల నాన్ బ్రాహ్మణ్ ఉద్యమాలు ఇంగ్లీషు భాష లింక్ లేక పోవడం వల్ల విడి విడిగా ఉండి పోయాయి. బ్రాహ్మణులకు సంస్కృతం, ఇంగ్లీషు లింకు భాషలుగా ఉండడం వల్ల వాళ్ళు భిన్న ప్రాంతాల్లో విడి విడిగా ఉన్నప్పటికీ జాతీయ స్థాయిలో ఒక్కటిగా కలిసి పరస్పరం సహకరించుకుంటూ శక్తిగా ఎదిగారు.

దేశీయ భాషల్లో చేసిన నాన్ బ్రాహ్మణ్ ఉద్యమాలు బ్రాహ్మణ నాయకత్వంలో సాగిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యపుస్తకాల్లో చేరకుండా ప్రచారంలోకి రాకుండా అణిచివేశాయి. దేశంలో మొదటి సారిగా వీరందరినీ జాతీయ స్థాయిలో సమైక్యతతో కాన్షీరామ్, బిఎస్‌పి పార్టీ ముందుకు తేవడం ద్వారా జాతీయ స్వభావాన్ని సంతరించుకుంది. అంతకు ముందున్న డిఎంకె, ఉత్తరప్రదేశ్, బిహార్‌లలోని సోషలిస్టు పార్టీ ఇలాంటి చరిత్ర వారసత్వాన్ని స్వీకరించలేదు. జాతీయ స్థాయి సంతరించుకోలేదు. తమ పార్టీ వారిని మాత్రమే ప్రచారం చేసుకున్నారు.

నాన్ బ్రాహ్మణ్, సమాంతర దృక్పథంతో జాతీయ సమగ్రతను ముందుకు తెచ్చిన మొట్టమొదటి పార్టీ బిఎస్‌పి

బహుజన సమాజ్ పార్టీ వందేళ్ళలో భారత దేశంలో మొట్టమొదటి సారిగా నాన్ బ్రాహ్మణ్ సామాజిక రాజకీయ ఉద్యమాలను, వాటిని చరిత్రను నాయకులను జాతీయ స్థాయిలో ఒక శక్తిగా చరిత్రను సమన్వయిస్తూ ముందుకు తెచ్చింది. చరిత్ర ప్రాధాన్యతను బాగా గుర్తించిన కాన్షీరామ్ దేశంలోని అనేక ప్రాంతాల ప్రజల ఉద్యమాలను వారి నాయకత్వాలను విస్తృతంగా, మహనీయులుగా పరిచయం చేసింది. ప్రజలు సొంతం చేసుకునేట్టు చేసింది.

కింది వర్గాలకు అధికారం ప్రవహించడానికి డిఎంకె, సోషలిస్టు పార్టీ బిఎస్‌పిలే ఆదర్శంగా తీసుకోవల్సిన పార్టీలు

వందేళ్ళలో నేటికీ బతికిఉన్న పార్టీల్లో భారత దేశంలో బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు ఇలా సామాజిక, రాజకీయ అధికారం క్రమ క్రమంగా శాంతియుత పద్ధతుల్లో పై

నుండి కిందికి మారే క్రమానికి డిఎంకె, సోషలిస్టు పార్టీ, బిఎస్‌పి మాత్రమే దేశంలోని అన్ని పార్టీల్లో ఆదర్శంగా తీసుకోవాల్సిన పార్టీలు. సోషలిస్టు పార్టీ ఉత్తరప్రదేశ్‌లో ములాయం సింగ్ నాయకత్వంలో సమాజ్‌వాదీ పార్టీగా బిహార్‌లో లాలు ప్రసాద్ నాయకత్వంలో ఆర్‌జెడిగా ప్రాంతీయ పార్టీలుగా పరివర్తన చెందింది. సోషలిస్టు పార్టీ ఇంకా ఎన్నో చీలకలైంది. అవన్నీ ప్రస్తుత చర్చకు అవసరం లేదు.

ఇలా సామాజిక సమీకరణలు మారడానికి తీసుకోవాల్సిన కార్యక్రమాలు ఏమిటి? ఉద్యమాలు ఏమిటి రాజకీయ పార్టీగా పని చేయాలనుకున్నప్పుడు, ఎన్నికల్లో అభ్యర్థులుగా పోటీ చేయాలనుకున్నప్పుడు ఇవన్నీ స్థానిక నియోజక వర్గ స్థాయిలో కూడా అధ్యయనం చేయడం అవసరం. సామాజిక వర్గాల, కులాల పొందిక ఎలా ఉంది? ఏ ఏ కులాల, వర్గాల, వ్యక్తుల పలుకుబడి ఓట్లను వేయడంలో ఎలా ప్రభావితం చేస్తుంది. అనేవి పరిశీలించడం బలా బలాలను తూకం వేయడం అవసరం.

ఉదాహరణకు కాంగ్రెస్ పార్టీకి, బిజెపికి, టిడిపికి స్థిరమైన ఓటుబ్యాంకు ఎంత ఉంది? అలాగే ఏ ఏ పార్టీకి స్థిరమైన ఓటు బ్యాంకు మినిమం ఎంత ? మాగ్జిమం ఎంత? 1990 నుండి శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లో ఏ ఏ పార్టీలకు ఎన్ని ఓట్లు వచ్చాయి ? ఏ ఏ కులాల అభ్యర్థులు నిలబడ్డారు ? ఏ ఏ కులాల వాళ్ళు ఎంతెంత మేరకు ఓట్లు వేశారు ? గణాంకాలు సేకరించాలి. పత్రికల నుండి ప్రభుత్వం నుండి పార్టీల నుండి సేకరించడంతో పాటు నియోజక వర్గాల్లో తెలిసిన వారితో చర్చించి నిర్ధారించుకోవాలి.

'మీ ఊరిని మీరే అధ్యయనం చేయండి' అనే పుస్తకంలో నేను ఇచ్చిన పట్టికలను అనుసరించి వాటిని ఒక నమూనాగా తీసుకొని ప్రతి గ్రామాన్ని అధ్యయనం చేయాలి. రాజకీయ సమీకరణలకు మరికొన్ని పట్టికలను పై విధంగా రూపొందించుకోవాలి. తద్వారా ప్రతి గ్రామంపై ఒక పట్టు వస్తుంది. అంచనా వస్తుంది.

నియోజక వర్గంలోని ఓటర్ల లిస్టును తీసుకోవాలి. వాటిని గ్రామాల వారిగా స్థానికులతో ఇరుగుపొరుగు గ్రామాల వారితో చర్చించి వారి ఊరి ఓట్లు ఏ ఏ పార్టీలకు ఎన్నెన్ని పడతాయో అందులో అందుకు భిన్నంగా మనం మన కోసం మన పార్టీ కోసం మన అభ్యర్థి కోసం 'మలుపుకో గలిగే ఓట్లు' ఎన్ని? వారిని చేరడం, పలకరించడం ఎలా ? మనం మలుపుకోగలిగే ఓట్లే కీలకం. మిగతాదంతా పలుకుబడి పెంచుకోవడానికి పనికి వచ్చే ప్రచారమే. ఉద్యమాలు చేయడం, సహాయం చేయడం, ఆర్థిక పోరాటాలు చేయడం, ట్రేడ్ యూనియన్‌లు అన్నీ మనం మలుపుకోగలిగే ఓట్లను మలుపుకోవడానికే అనే విషయం మరిచిపోయేవాళ్ళు రాజకీయ నాయకులు కాలేరు. వాళ్ళు సామాజిక కార్యకర్తలు అవుతారు. ఓటుబ్యాంకు ఎంత

ముఖ్యమో అదనంగా మలుపుకోగలిగే ఓటర్లను ఆకర్షించడం కూడా అంతే ముఖ్యం.

బిఎస్‌పి ఎన్ని చెప్పినా బిసి, ఎస్‌సి, ఎస్‌టిల నుండి ఎదిగే లాబీలకు ఎక్కువ సహకరిస్తుంది. మిగతావారికి ఆ తర్వాతే ప్రాధాన్యత. ఇది కాంగ్రెస్ మొదలు కొని టిడిపి, సిపిఐ, సిపిఎం, బిజెపి, నక్సలైట్ పార్టీలదాకా అందరికీ ఇష్టం లేని విషయం. బహుజనుల్లో ప్రజా స్వామిక వాదులను, జాతీయ బూర్జువాలను, అంతర్జాతీయ బూర్జువాలను, రాజకీయ నాయకులను, కాంట్రాక్టర్లను, పారిశ్రామిక వేత్తలను, ప్రభుత్వ బ్యూరొక్రసీ యంత్రాంగాన్ని తయారు చేయడానికి బిఎస్‌పి ప్రాధాన్యత ఇస్తుంది. ఇది అన్ని పార్టీల్లోని అగ్ర కులాలకు వాటి లాబీలకు, వాటి ప్రయోజనాలకు వ్యతిరేకమైన లాబీల నిర్మాణం. అందువల్ల వాళ్ళు యథాతథ స్థితిని కోరుకుంటారు. అందుకే బిఎస్‌పి దాన్ని బద్దలు కొట్టడం కోసం డిస్టర్‌బెన్స్ ఇజ్ అవర్ ఫిలాసఫీ అని కాన్షీరామ్ స్పష్టం చేశారు.

బలమైన స్థిరమైన పార్టీలను అస్థిరతపాలు చేయకుండా వాటి నుంచి ప్రజలను తనవైపుకు తిప్పుకోవడం అసాధ్యమైన విషయం. ఒక్కసారి అవతలి పక్షానికి, మరొక సారి ఇవతలి పక్షానికి మద్ధతు ఇస్తూ తన చిన్నపాటి బలాన్ని ఎవరు ఓడాలో, ఎవరు గెలువాలో నిర్ణయించే స్థాయిలో నిర్ణయాత్మక శక్తిగా మలుచుకోవడమే ముఖ్యం అని కాన్షీరామ్ స్పష్టం చేసేవారు.

తమ బలం ఒక తులం అయితే ఇరుపక్షాల బలం సమానమైతే తన తులం బలంతో ఏ పక్షం గెలవాలో నిర్ణయించే శక్తి తనలోనే నిక్షిప్తమై ఉంటుంది. కాన్షీరామ్ నినాదాల్లో ప్రధానమైనది మరొకటి ఉంది. హరో, హరావో, జీతో అనగా ఓడిపో, ఓడించు, గెలువు అనేది ఆ నినాదం. తాను మొదటి దశలో పోటీ చేసినప్పుడు ఓడిపోవడం సహజం. అయితే తాను ఓడిపోవడమే కాకుండా గెలువాల్సిన అభ్యర్థిని ఓడించేట్టుగా తన ఓట్ల శాతం పెరుగుదల ద్వారా ఇతరులను ఓడించడం అనే శక్తిని సంపాదించుకోవాలి. మూడవ దశలో తానే గెలుపొందే దిశగా విస్తరించాలి. ఇలా ఓడు, ఓడించు, గెలువు అనే నినాదాన్ని తాను స్వయంగా ఆచరించి చూపారు కాన్షీరామ్.

స్థిరమైన పార్టీలను కుదుపులతో నిరంతరం అశాంతితో పరిగెత్తించే విధంగా ఎన్నికల ఎత్తుగడలను తీసుకోవాలి. అందుకు వెంటది వెంట ఎన్నికలు వస్తే ప్రజల్లో మార్పు తొందరగా వస్తుంది కనుక పార్టీలకు మద్ధతు ఇచ్చి స్థిరంగా పరిపాలన సాగించే విధంగా చేయడం కాకుండా అవి కూలిపోయి తిరిగి ఎన్నికలు జరిపే అవసరాన్ని ముందుకు తెస్తే వాటి బలా బలాలు తేలిపోతాయి. తమ బలం నిరంతరం పెంచుకునే అవకాశం పెరుగుతుంది.

అందుకని ఉప ఎన్నికలు ఎంత తొందరగా వస్తే అంత మంచిదని కుండ బద్దలు కొట్టారు కాన్షీరామ్. ఎన్ని సార్లు ఎన్నికలు వస్తే పాలకవర్గాల పార్టీల లాబీల ధనం అంత ఖర్చు అవుతుంది. బి.ఎస్.పి. ప్రజల నుంచే చిన్న మొత్తంలో ఎక్కువ మంది నుంచి సేకరిస్తుంది. కనుక దానికి ధనం అంత ఖర్చు కాదు. కార్యకర్తల మీద ఆధారపడే నిర్మాణం కాబట్టి అది ఎన్నిసార్లు ఎన్నికలు వచ్చినా బలం పెరగడమే తప్ప ఖర్చు పెరగడం ఉండదు. ఈ ఎత్తుగడల మీద ఏ పార్టీ కూడా పోటీగా నిలబడలేక పోతున్నది. అదే బిఎస్‌పి విజయ రహస్యం.

ప్రజాస్వామ్యంలో సొంత బలం పెంచుకోకుండా ఎక్కువ ప్రచారం చేసుకుంటే నష్టం జరుగుతుంది. ప్రచారాన్ని చూసి నిజంగానే బలం పెరిగిందని భ్రమలు కలుగుతాయి. తద్వారా ప్రచారం మిగులుతుంది. గెలుపు అందకుండా ఓటమి మిగిలిపోతుంది. పని సక్సెస్ కాక ముందే ప్రచారం జరిగితే నెగెటివ్ వాయిస్ మరింత ముందుకు వస్తుంది. తద్వారా మన బలం అడ్డగించబడుతుంది. అందువల్ల మీడియా ప్రచారానికి దూరంగా ఉండాలి అని కాన్షీరామ్ మాయావతి స్పష్టం చేసి ఆచరించి గ్రౌండ్ రియాలిటీలో తమ సొంత బలాన్ని పెంచుకొని విజయం సాధించారు.

విజయం సాధించాక మీడియా దానంతట అదే ఆ విజయాన్ని ప్రచారం చేస్తుంది. ఇదే బిఎస్‌పి విజయ రహస్యాల్లో మరొక ముఖ్యాంశం. ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని పార్టీలు కొన్ని రచయితల సంఘాల లాగా, పౌర హక్కుల సంఘాల లాగా కేవలం మీడియా మీద ఆధారపడి పార్టీలు ఎంతో ప్రజా పునాది ఉన్నట్టు భ్రమ కల్పిస్తుంటాయి. ఎన్నికల్లో నిలబడ్డప్పుడు వచ్చే ఓట్లు వాళ్ళ అసలు శక్తిని బహిర్గతం చేస్తాయి. ఉదాహరణకు ఇటీవల లోక్‌సత్తా పేరిట ఒక పార్టీ మీడియా ప్రచారంతో ప్రజల్లో ఎంతో పుంజుకున్నట్టు ప్రచారం ఇవ్వబడుతున్నది.

విడిపోయినవాళ్ళు తిరిగి ఒక్కటి కావాలి

ఉత్తరప్రదేశ్‌లో బహుజన సమాజ్ పార్టీ మాయావతి నాయకత్వంలో స్పష్టమైన మెజారిటీతో అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని బహుజనులు ఏ కాస్త అయినా టిడిపి వెంట నడిచిన వాళ్ళు దాన్ని వదిలి తిరిగి బిఎస్‌పి వెంట నడిచే క్రమాలు మొదలయ్యాయి. బి.ఎస్.పి. వంటి బహుజనుల పార్టీలు గెలువకుండా ఉండడం కోసం వర్గీకరణ చిచ్చు రావణ కాష్టంలా మార్చి ఏళ్ళ తరబడి సాగదీస్తూ తెలుగుదేశం, కాంగ్రెస్ తమకు అనుకూలంగా మాల మాదిగలను రెండు వర్గాలను కూడా సమీకరించుకోగలుగుతున్నాయి. ఈ స్థితి ఎంతో కాలం ఉండదు.

అలా అగ్ర కులాలు పన్నాగాలను నిరంతరం కొనసాగిస్తూనే ఉంటారు. ఈ

విషయం బహుజనులు ఉత్తరప్రదేశ్‌లో పూర్తి మెజారిటీతో అధికారంలోకి వచ్చాక తిరిగి కొత్తగా అధ్యయనం చేస్తున్నారు. రాబోయే రెండేళ్ళలో దళితులను చీల్చే ఈ కుట్రలకు పూర్తిగా తెరపడుతుంది. ఈ రెండు వర్గాలు కూడా ఒక్కటై తమ స్వీయ రాజకీయ అధికారం కోసం కలిసి పని చేస్తాయి. కలిసి పనిచేయాలి.

తెలుగుదేశం పార్టీ చీలదీసి రెంటినీ కలవకుండా చేయడంలో సాధించిన విజయం ఉత్తరప్రదేశ్‌లో బహుజనులు గెలువడంతో వమ్ము కానుంది. కమ్మ కుల సంఘం తెలంగాణ ఏర్పాటును ఆమోదిస్తూ తీర్మానం ఎప్పుడో చేసింది. ఇలా సామాజిక సమీకరణలో మారుతున్న క్రమంలో తెలుగుదేశం పార్టీ ఓటు బ్యాంకును అన్ని విధాలుగా కోల్పోయే క్రమం మొదలైంది. తెలంగాణ ప్రజలు తెలుగుదేశం పార్టీ వెంట ఉన్న వాళ్ళు కూడా క్రమంగా దాన్ని వదిలేస్తున్నారు. టిడిపికి రాబోయే కాలంలో నాయకులు కార్యకర్తలు తప్ప ప్రజలు వెంట ఉండే అవకాశం సన్నగిల్లుతున్నది. గద్దర్ తదితరుల ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర సాధన ఏకైక లక్ష్యంగా చిన్నా, చితక పార్టీలన్నీ ఫ్రంటుగా ఏర్పడి రంగంలోకి దిగుతున్నాయి. ఇలాంటి తెలంగాణ రాష్ట్ర వాదులను ఆకర్షించి బిఎస్‌పి ఇతరుల కన్నా ఎక్కువ పట్టుదలతో తెలంగాణలో ఉద్యమాలు నిర్మించడం ద్వారా మరో కొత్త ప్రయోగంతో ఉత్తరప్రదేశ్‌లో లాగా తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో బిఎస్‌పి గెలిచే అవకాశాలు మెరుగవుతాయి.

దేశంలోని ఉత్తరాదికి, దక్షిణాదికి మధ్య చరిత్ర పరిణామంలో అనేక వ్యత్యాసాలున్నాయి. రాజకీయ పరిణామాలు కూడా ఇలాగే వ్యత్యాసంతో సాగుతున్నాయి. హిందూ మతం పతనావస్థకు చేరినప్పుడల్లా దక్షిణాది నుంచే ఆది శంకరాచార్య, రామానుజాచార్య, మధ్వాచార్య, రామానంద మొదలైన వాళ్ళు ఉత్తరాదికి పర్యటించి హిందూ భావజాలాన్ని లేదా శైవ, వైష్ణవ మత ఉద్యమాలను వ్యాపింప చేశారు. 1977లో దేశమంతటా ఇందిరాగాంధీ పార్టీ ఓడిపోతే ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీనే ప్రజలు గెలిపించారు. ఇందిరాగాంధీకి రాజకీయ పునర్జన్మను దక్షిణాదిలోని మర్రి చెన్నారెడ్డి, దేవరాజ్ అర్స్ ప్రసాదించారు. అలాగే జాతీయ రాజకీయాల్లో డిఎమ్‌కె, అన్నాడిఎమ్‌కె కేంద్ర ప్రభుత్వాల ఉత్థాన పతనాల్లో కీలక పాత్ర వహిస్తున్నాయి.

డిఎమ్‌కె బిసిల నాయకత్వంలో 1967 నుండి అప్రతిహతంగా కొనసాగుతున్నది. దీని నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని బిసిలు స్ఫూర్తి పొంది సొంత పార్టీలను ఏర్పాటు చేసుకొని అధికారంలోకి రాలేకపోయారు. బిసిలు ఆంధ్రప్రదేశ్‌లో 1962 నుండి అధికారంలోకి వస్తారని రామమనోహర్ లోహియా అనేక ప్రసంగాల్లో ఆశాభావం వ్యక్తం చేశారు. కానీ అది సాకారం కాలేదు. ఆనాటికి విస్తృతంగా బలం

పుంజుకుంటున్న డిఎమ్‌కెను దాని నిర్మాణాన్ని రాష్ట్రంలోని బిసిలు అధ్యయనం చేయలేదు.

బిసిలు ఉత్తర ప్రదేశ్‌లో బిఎస్‌పి అధికారంలోకి వస్తే సంతోషించే బదులు బ్రాహ్మణులను చేరదీశారని కినుక వహిస్తున్నారు. అంతేగాని వాళ్ళు నలభయ్యేళ్ళుగా బిసిల నాయకత్వంలో తమిళనాడులో సాగుతున్న డిఎమ్‌కె పార్టీని, దాని నిర్మాణాన్ని, పని విధానాన్ని, ప్రభుత్వ పాలనా విధానాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం వుందని అదే తమకు అనుగుణంగా ఉంటుందని భావించలేకపోయారు. ఇలా ఎందుకు జరిగిందో తెలియదు. సి.అన్నాదురై, కరుణానిధి మొదలైన నాయకులంతా తమిళనాడులో బిసి ఓటు బ్యాంకును ద్రావిడ భావజాలంతో సమన్వయించి ఒక శక్తిగా మలిచారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యంగా కోస్తా రాష్ట్రంలో బిసిలు అధికారంలోకి రావడానికి తమిళనాడు డిఎమ్‌కె పార్టీని సీరియస్‌గా అధ్యయనం చేయడం అవసరం. ఈ అధ్యయనమేమీ చేయకుండా నలభయ్యేళ్ళ బిసి నాయకత్వాన్ని తెలుసుకోకుండా దాని గుణపాఠాలను నేర్చుకోకుండా ఇటీవలి బిఎస్‌పి పార్టీ గురించి అందునా దూరంగా వున్న ఉత్తరాది ఉత్తర ప్రదేశ్ పరిణామాలపై తోచినట్లు మాట్లాడుతున్నారు. ముందు బిసిలు తమిళనాడు బిసి రాజకీయాలను అధ్యయనం చేయాలి. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు ఎలా సాధ్యమయ్యాయో, ఎందుకు అవసరమయ్యాయో తెలుసుకోవడం అవసరం. గ్రామ స్థాయి నుండి పార్టీ నిర్మాణం, ఉద్యమ నిర్మాణం అధ్యయనం చేసి బిసి పార్టీలను నిర్మించుకోవలసి వుంది.

తమిళనాడుకు, ఆంధ్రప్రదేశ్‌కు అనేక విషయాల్లో పోలిక వుంది. సినిమా రంగం ప్రభావం, మీడియా ప్రభావం ఈ రెండు రాష్ట్రాల్లో అన్ని రంగాల్లో ప్రధాన పాత్ర వహిస్తున్నది. సినిమా రంగంలో పెట్టుబడి పెట్టిన కమ్మలు 1983 నుండి అధికారంలోకి వస్తున్నారు. అనగా తమిళనాడులో సినిమా రంగాన్ని ఆసరా చేసుకొని బిసిలు అధికారంలోకి వస్తే ఇక్కడ దాన్ని కమ్మలు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. తమిళనాడులోని పాపులర్ నినాదాలను రాష్ట్రంలోని టిడిపి తనకు అనుకూలంగా మలచుకొని ముందుకు సాగింది. ఇలా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల రాజకీయ, సామాజిక, ఆర్థిక, రవాణా, సమాచార రంగాల్లో అనేక పోలికలు వున్నాయి. కనుక బిఎస్‌పి బిసిలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదనే విమర్శను వదిలేసి డిఎమ్‌కె నుండి పొందాల్సిన స్ఫూర్తిని పొందడం కోసం అధ్యయనం చేయాల్సి వుంది. బిఎస్‌పి బిసిలకు ఇస్తున్న ప్రాధాన్యత సరైనదే అనే విశ్వసించే వాళ్ళు కూడా చాలా మందే వున్నారు. వాళ్ళు బిఎస్‌పిలో చేరి బిసిల నాయకత్వాన్ని బలోపేతం చేసి అధికారాన్ని అందుకోవలసి వున్నది.

ఎన్నికల్లో పోటీ చేయనివారు

రాజకీయ నాయకులవుతారా..?

ఎన్నికల్లో పోటీ చేయనివారు రాజకీయ నాయకులవుతారా? రాజకీయ నాయకులంటే ఎన్నికల్లో పోటీ చేయవలసినదేనా? ఎన్నికల్లో పోటీ చేయకుండా రాజకీయ నాయకులు కాకూడదా? రాజకీయాలను నడిపే వాళ్ళంతా రాజకీయ నాయకులేనా? మొదలైన ప్రశ్నలు ఆసక్తిని కలిగిస్తాయి. చూడ్డానికి తెలిసినవే అనిపిస్తాయి కానీ, ఏమీ తెలియదని చర్చిస్తే తెలుస్తుంది.

ఇటీవల బహుజన సమాజ్ పార్టీ ఉత్తరప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని బహుజనుల్లో గొప్ప ఆశలు చిగురించాయి. సంవత్సరాల తరబడి బిసి, ఎస్‌సి, ఎస్‌టి సంఘాల్లో పని చేస్తున్న నాయకులు తాము కూడా స్థానిక పరిస్థితులను అనుసరించి ఒక్కటై అధికారం చేజిక్కించుకోవాలని చిన్న చిన్న గ్రూపు డిస్కషన్లు చేస్తున్నారు. వారిలోని రాజకీయ అధికార సాధన లక్ష్యం స్వాగతించవలసినదే.

ఎన్నికల్లో పోటీ చేయనివాళ్ళు రాజకీయ నాయకులు కాదు. ఎన్నికల్లో పోటీ చేసేవాళ్ళే రాజకీయ నాయకులు. ఎన్నికల్లో పోటీ చేయకుండా రాజకీయ నాయకులు కాకూడదు. ఎన్నికల్లో పోటీ చేయకుండా రాజకీయాలను నడపడం దేశానికి, ప్రజలకు చాలా నష్టం చేస్తుంది. అది ప్రజల ఓటు హక్కును గౌరవించకుండా ఉండే దశకు సంబంధించింది. అనగా రాజరికాల కాలానికి సంబంధించిన పని విధానం. అందువల్ల దశాబ్దాల తరబడి రాజకీయాల గురించి మాట్లాడుతూ రాజకీయాలను ప్రభావితం చేస్తూ వస్తున్న నాయకులు నిజంగా రాజకీయ నాయకులు కారు. రాజకీయ నాయకులుగా వారికి శక్తి సామర్థ్యాలు లేవు అని అర్థం. ఇలా 25 ఏళ్ళుగా బిసి సంఘాల్లో ఎస్‌సి సంఘాల్లో నాయకులుగా పని చేస్తున్నవాళ్ళు రాజకీయాల గురించి పట్టు విడువ కుండా మాట్లాడుతూనే ఉన్నారు. కానీ ఎన్నడూ ఎన్నికల్లో పోటీ చేసింది లేదు.

జాతీయోద్యమంలో పాల్గొన్న మహనీయులు ఎందరో స్వాతంత్ర్యానంతరం ఎన్నికల్లో పోటీ చేశారు. రాజ్యాంగ నిర్మాతలు కూడా తాము రూపొందించిన రాజ్యాంగ పరిధిలో ఎన్నికల్లో పోటీ చేశారు. డా॥ బి.ఆర్. అంబేద్కర్, నెహ్రూ, వల్లభాయ్ పటేల్, అబుల్ కలాం ఆజాద్ మొదలైన వాళ్ళంతా ఎన్నికల్లో పోటీ చేసిన వారే. కానీ ఇటీవల రాష్ట్రంలో ఏళ్ళ తరబడి కుల సంఘాల పేరిట, బిసి, ఎస్‌సి, ఎస్‌టి సంఘాల పేరిట నాయకులుగా ఎదిగినవారు బిఎస్‌పి యుపిలో 1993లో అధికారంలోకి వచ్చాక రాజకీయ అధికారం సాధించాలి అని చెప్తూనే వస్తున్నారు. కానీ వారు గానీ, వారి తరపున గానీ ఎన్నికల్లో పోటీ చేసిన సందర్భాలు తక్కువ. పోటీ చేసినవాళ్ళు కాంగ్రెస్, టిడిపి, బిజెపి, టిఆర్‌ఎస్, సిపిఐ మొదలైన పార్టీలకు చెందిన వారైతే వారిని ఈ కుల సంఘాల ప్రతినిధులుగా పోటీ చేశారని లెక్కకట్టలేము. ఎందుకంటే ఆ పార్టీలకు బహుజనులు నాయకత్వంలో ఉండాలని బహుజనులే రాజ్యాధికారం సాధించాలని ఎజెండా లేదు.

గత 15 సంవత్సరాలుగా దళిత మహాసభ, బిఎస్‌పి తెచ్చిన సామాజిక దృక్పథంతో, బిఎస్‌పి తెచ్చిన బుద్ధుడు మొదలుకొని ఫూలే, అంబేద్కర్‌ల చారిత్రక వారసత్వాన్ని స్వీకరించి నూతన ఉత్తేజంతో ముందుకు సాగిన కుల సంఘాలు సామాజిక, ఆర్థిక రంగంలో ముఖ్యంగా ఆత్మగౌరవ పోరాటంలో ఎంతో ఆదర్శవంతమైన పాత్రను నిర్వహించాయి. ప్రజాస్వామిక లౌకిక సంస్కృతిని ప్రజల్లోకి తీసుకువెళ్ళాయి. మారోజు వీరన్న నాయకత్వంలో ముందుకు వచ్చిన కులాలు, గిరిజన తెగల సంఘాలు వెనుకటి సాంప్రదాయక కుల సంఘాల వంటివి కావు. ఇలాంటి నూతన చైతన్యంతో మహాజన ఫ్రంటు వంటి ప్రయోగాలు రాజకీయ రంగంలో జరిగాయి. అవి కంటిన్యూ కాలేదు. మళ్ళీ సామాజిక రంగంలో ఆయా కుల సంఘాలు, గిరిజన తెగల సంఘాలు దేనికది విడిగా సొంత అస్తిత్వంతో కొనసాగుతున్నాయి. ఇవి ఒక రాజకీయ శక్తిగా ఇప్పుడైనా ఒక్కటై ప్రజల్లోకి విస్తరించి రాజకీయ అధికారాన్ని ఎన్నికల్లో నిలబడి సాధించుకోవల్సిన అవసరం ఉన్నది.

మరికొన్ని సాంప్రదాయ, సంస్కరణ వాద, అగ్రకుల ఆధిపత్యంలోని పాలక వర్గ పార్టీల కుల సంఘాలు, బిసి, ఎస్‌సి, ఎస్‌టి సంఘాలు, మైనారిటీ సంఘాలు మొదలైన బిఎస్‌పి రాజకీయ శక్తిగా ఎదిగాక బహుజనులకే రాజ్యాధికారం అనే నినాదాన్ని ముందుకు తీసుకొని ప్రచారం చేస్తున్నాయి. ప్రచారం వద్దే ఆగిపోతున్నాయి. పాలక వర్గ పార్టీల్లో ఒకటి రెండు టికెట్లు సాధించుకోవడానికి ఆయా కుల సంఘాల రాష్ట్ర ఉద్యమాలు, వాటి నాయకత్వాలు ఉపయోగపడుతున్నాయి. మొత్తం ఆ కులం

గానీ, ఆ బిసి, ఎస్సి, ఎస్టి వర్గాలు గానీ రాజకీయ చైతన్యంతో కలిసికట్టుగా ఒక శక్తిగా ఎదిగి ఎన్నికల్లో పోటీ చేసిన జాడ లేదు. కానీ రాష్ట్ర నాయకులుగా తిరిగేవాళ్ళు రాజకీయ అధికారం గురించి మాట్లాడుతూనే ఉన్నారు. అయినా వీళ్ళు పోటీ చేయడం లేదు. ఇలా ఏళ్ళతరబడి పోటీ చేయకుండా రాజకీయ అధికారం గురించి మాట్లాడేవాళ్ళు రాజకీయ నాయకులు అవుతారా? వీళ్ళు అంబేద్కర్, నెహ్రూ మొదలైన వారికన్నా గొప్ప రాజనీతి శాస్త్రవేత్తలు అనుకుంటున్నారా? ఎన్నికల్లో నిలబడడం అంటే వీరికి ఇంత భయం ఎందుకు? ఎన్నికల్లో నిలబడకుండా రాజకీయ నాయకుడిగా గౌరవం పొందాలని కోరుకోవడం దేనికి ?

కాంగ్రెస్, బిజెపి, టిడిపి, సిపిఐ, సిపిఎం, టిఆర్ఎస్ మొదలైన అన్ని పార్టీల నాయకులకు తమ తమ జేబు సంస్థలుగా అనేక బిసి, ఎస్సి, ఎస్టి సంఘాలను నడిపిస్తున్నారు. వాటికి మాకు సంబంధం లేదని కూడా చెప్తుంటారు. కానీ వారికి అనుకూలంగా పని చేయాలని నిర్ధేశిస్తారు. ఇలాంటి కుల సంఘాల నాయకులు బహుజన సమాజ్‌పార్టీ తెచ్చిన ఉత్తేజాన్ని నిర్వీర్యం చేయడం కోసమే స్వతంత్రంగా మళ్ళీ ఫ్రంటులు అంటూ ముందుకు వస్తారు. ప్రజలను చీలుస్తారు. పాలక వర్గాలను గెలిపిస్తారు. బిఎస్‌పిని తిరిగి నిర్వీర్యం చేసే దాకా ఇదే పని చేస్తూనే ఉంటారు. 1994 నుండి ఇదే పని చేశారు. ఇప్పుడూ ఇదే పని చేస్తున్నారు. వీరిపట్ల ప్రజలు జాగ్రత్త వహించాలి. వారి ముసుగులను తొలగించి వారి జేబుల్లో ఉన్న అమ్ముడుపోయే రేటు చిట్టీలను ఎవరికి బ్రోకర్లుగా పని చేస్తున్నారో ప్రజల్లో బట్టబయలు చేయకపోతే బిఎస్‌పి యుపి విజయం తెచ్చిన ఉత్తేజం తిరిగి నిస్తేజం అవుతుంది.

ఇండిపెండెంటుగా ఎంతో మంది పోటీ చేస్తున్నారు. ఎంతో మంది పార్టీలు మారుతున్నారు. పార్టీ మారినప్పుడు అతని అనుచరులు కూడా అతనితోపాటు పార్టీ మారుతున్నారు. ఇండిపెండెంట్లు కూడా గెలుస్తున్నారు. గెలవక పోయినా గణనీయమైన ఓట్లు సాధించుకుంటున్నారు. టిక్కెట్టు రాని వారు తిరుగుబాటు అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఫ్రంటు ఏర్పడకుండా, పార్టీ ఏర్పడకుండా ఎలా పోటీ చేస్తారు? అని ప్రశ్నించే వారికి ఈ విషయాలు తెలియకపోతే రాజకీయాలు మాట్లాడడం మానేయాలి. ఎందుకంటే ఇప్పటికే బోలెడు పార్టీలున్నాయి. వీళ్ళు చెప్పే సిద్ధాంతాలు ఆ పార్టీల్లో ఏదో ఒక దానికి సంబంధించినవే తప్ప వేరు కాదు.

ఎన్నికల్లో స్వయంగా తన నియోజక వర్గంలో కృషి చేసి కార్యకర్తలను, ప్రజలను, ఓటర్లను సమీకరించడం ద్వారానే రాజకీయ నాయకుడు ప్రజలకు చేరువవుతారు. తద్వారా ప్రజలను కలిసినప్పుడు ప్రజలకు అందుబాటులోకి వస్తారు. ప్రజల

హృదయాలను గెలుచుకోవడానికి తన వ్యక్తిత్వంలో, స్వభావంలో ఆలోచన విధానంలో, భావ అభివ్యక్తిలో అనేక మార్పులు చేసుకుంటారు. ప్రజల దగ్గరికి చేరే క్రమంలో ప్రజాస్వామ్య స్వభావాన్ని ఇలా సంతరించుకుంటాడు.

ప్రజల దగ్గరికి ఓట్ల కోసం వెళ్ళని రాజకీయ నాయకులకు ఈ ప్రజాస్వామ్య స్వభావం అబ్బడం కష్టం. వాళ్ళు కలెక్టర్లలాగా అధికారాన్ని కార్యకర్తలకు, పార్టీపై చెలాయించడానికి అలవాటు పడతారు. వారి పని విధానంలో బ్యూరోక్రసి ఉంటుంది. తాను చెప్పిందే పార్టీ వినాలని కార్యకర్తలు చేయాలని ఒక అహంకారం, ఆత్మవిశ్వాసం ఉంటుంది. కార్యకర్తలకు అనువుగా, ప్రజలకు అనువుగా వాళ్ళు మారే అవకాశం తక్కువ. ఉన్నత స్థాయి నాయకులుగా ఉంటే నాయకులను అనుచరులను తనను ప్రశ్నించేవారిని వెనిక్కి నెట్టేస్తారు. అనిచివేస్తారు. అలా కుల సంఘాలను, పార్టీలను బిసి, ఎస్సి, ఎస్టి సంఘాలను తమ నాయకత్వం కోసం ఎదగకుండా చేస్తారు. కొత్తవారిని రాకుండా చూస్తారు. అలా దశాబ్దాల తరబడి వాళ్ళే నాయకులుగా కొనసాగుతారు. దశాబ్దాల తరబడి నాయకులుగా కొనసాగే ప్రతి నిర్మాణంలో జరిగేది ఇదే. అందువల్ల వీళ్ళు మారాలంటే ఓట్లు తప్ప వేరే మార్గమేమీ లేదు. ఎన్నికల్లో పోటీ చేయడం, తన అనుచరులను పోటీ చేయించడం ద్వారా ఓట్లు సంపాదించి తన బలమెంతో నిరూపించుకోవడమే తద్వారా ప్రతి ఓటరును కన్విన్సు చేసుకొని అతని జేబులో నుండి ఓటును పోలింగ్ బూతుకు వచ్చి తన జేబులోకి వేయించుకోవడం జరుగుతుంది. ఈ ప్రక్రియ ద్వారా నాయకుల బలం ఎంతో తెలుస్తుంది. అతని అనుచరుల బలం ఎంతో తెలుస్తుంది. తన బలం ఎలా పెంచుకోవాలో అనే విషయాలు కూడా తెలుస్తాయి. తన నిజమైన బలం ఎంతో స్పష్టమవుతుంది.

ఇలా ఎన్నికల్లో పోటీ చేయకుండా రాజకీయ నాయకులుగా రాజకీయాల గురించి మాట్లాడే వాళ్ళంతా రాజకీయ నాయకులు కారు. వాళ్ళకు ప్రజలంటే భయం. ప్రజల నిర్ణయ శక్తి పట్ల భయం. అందువల్ల ప్రజలను గౌరవించడానికి సిద్ధంగా ఉండరు. తాము చెప్పింది వినే వాళ్ళను చుట్టూ జమచేసుకుంటారు.

ఏ క్రమశిక్షణకు కట్టుబడి ఉండకుండా, సమిష్టి నాయకత్వంలో పని చేయడానికి సిద్ధపడకుండా తమ గుర్తింపు ఆరాటం కోసం తమ బేరం చేసే అవకాశం కోసం రాజకీయాధికారం చేపట్టాలి, ఫ్రంటుగా ఏర్పడాలి అని ఇలాంటి వాళ్ళందరూ కూడినప్పుడు ఉద్బోధిస్తుంటారు. ఏ విషయంలోనూ మళ్ళీ వాళ్ళు కలిసి పని చేయరు. వారి స్వభావంలోనే ఈ స్వార్థపూరిత లక్షణం కొనసాగుతున్నది. తమ స్వార్థం కోసం తమ ఒంటరి నాయకత్వం గుర్తింపు పొందడం కోసం ఎంతకైనా దిగజారే

మహానుభావులు వీరు. వీరు సమిష్టి నాయకత్వంగా ఏర్పడి పరస్పరం గౌరవించుకుంటూ ఒక శక్తివంతమైన పార్టీగా, ఫ్రంటుగా ఏర్పడడం అసాధ్యమైన విషయం.

వీళ్ళ జేబుల్లో ఆర్టిస్టుల చిత్రాలకు రేటు చిట్టీలు అతికించినట్టుగా వీళ్ళు అమ్ముడుపోయే రేటు చిట్టీలు ఎప్పుడూ రడీగా ఉంటాయి. ఎవరికైనా వీళ్ళు అమ్ముడు పోతుంటారు. ఆ కులాలను, ఆ బిసి, ఎస్సి, ఎస్టి సంఘాలను అమ్మేస్తుంటారు. ఆశ్చర్యకరమైన, అన్యాయమైన విషయం ఏమిటంటే వీరు చాలా చౌకగా అమ్ముడుపోతుంటారు. తాము ఎవరికి అమ్ముడు పోయారో వారికే ఎందుకు ఓట్లు వేయాలో చక్కని సిద్ధాంతాలు చేస్తుంటారు. ప్రజలను చీలుస్తుంటారు. ఆయా కులాల ఓట్లను చీల్చి పాలక వర్గాల గెలుపును సునాయాసం చేస్తుంటారు. మాదిగ దండోరా, ఎబిసిడి వర్గీకరణ ఉద్యమం, దాన్ని వ్యతిరేకించే మాలనాడు ఉద్యమం రెండూ 15 ఏళ్ళుగా చక్కగా పాలక వర్గాలు దళితుల వీపుల మీదుగా అధికార సోపానాలకు చేరుకోవడానికి సహకరిస్తున్నాయి.

ఇటీవల కొన్ని రాజకీయ పార్టీల్లో ఉన్న నాయకులు తమ జేబు సంస్థలుగా కొన్ని స్వచ్ఛంద సంస్థలను రాజకీయ చైతన్యం పేరిట పెంచి పోషిస్తున్నారు. రాజకీయాల్లో చేరి కోట్లాది రూపాయలు సంపాదించిన తరువాత దాన్ని కాపాడుకోవడం కోసం తిరిగి తనకు మద్ధతుగా నిలిచే కొన్ని శక్తులను తయారు చేసుకోవడం అవసరం అవుతున్నది. అందుకు వాళ్ళు దారాళంగా విరాళాలు ఇస్తారు. ఇప్పిస్తారు. ఆయా సభలకు ముఖ్య అతిథులుగా వస్తారు. పోతారు. వీరికనుసన్నల్లో ఆ ఉద్యమాలు కొనసాగుతాయి. అవి రాజకీయాధికారం సాధిస్తామని నిరంతరం ఊదరగొడుతుంటాయి. ఎవరినీ చక్రంలోని పల్లలా ఇరికించి ముందుకు సాగకుండా చేస్తాయి. వారిలోని చొరవను కూడా చంపేస్తాయి. అయినా ఒక సామాజిక శక్తిగా కనబడే మేరకు పని చేస్తుంటారు. ఇలాంటి వాళ్ళు స్వదేశీ పాలక వర్గాలకే కాకుండా అప్పుడప్పుడు అమెరికాలోని సిఐఏ ఏజెంట్లకు కూడా అమ్ముడు పోతుంటారు. తాము అమ్ముడుపోవడమే కాకుండా ఉద్యమాలను వాటికి అమ్మేస్తుంటారు. ఇలా బిసి, ఎస్సి, ఎస్టి కుల సంఘాలు, ఉద్యమాలు, ఉద్యమ నాయకులు అటు పేరుకు పేరు, ఇటు డబ్బుకు డబ్బు సంపాదించుకుంటూ జీవితాంతం కబుర్లు చెబుతూ బతికేస్తుంటారు. వీళ్ళు పచ్చగడ్డిలో పచ్చగడ్డిలా కనబడే పచ్చపాములు. వారిని గుర్తుపట్టడం కూడా కష్టం. వాళ్ళు నిజంగా ఆయా కులాల నాయకులే, ఆ కులాలకు మేలు చేయడం కోసమే పని చేస్తున్నామని భ్రమ కల్పిస్తారు.

ఎన్నికల్లో పోటీ చేయని నాయకులు, నియోజకవర్గంలో లింకులేని రాజకీయ నాయకులు ఎవరికి జవాబుదారీ? ఒక నియోజకవర్గం ఎన్నుకొని పోటీ చేసే నాయకులు ఆ నియోజకవర్గ ప్రజలకు అక్కడి నాయకులకు, సమస్యలకు కనీసం జవాబుదారి అవుతారు. స్థానిక నాయకులకు, కుల సంఘాల నాయకులు, మహిళా నాయకులకు, ప్రభుత్వ ఉద్యోగులకు, పేదలకు జవాబుదారీగా ఉంటారు. తద్వారా దేశంలో ఏ పరిస్థితి ఉందో సమస్యల పట్ల కనీస అవగాహన ఏర్పడే అవకాశం ఉంది. ఇలా నియోజకవర్గంతో లింకు లేకుండా, పోటీ చేయకుండా రాజకీయ నాయకులుగా చెలామణి అవుతూ నగరాల్లో వుంటూ ఏసీల్లో వుంటూ ఏమీ తెలియకుండానే అంతా తెలిసినట్లు మాట్లాడేస్తు వుంటారు. ఉదాహరణకు బిజెపి వెంకయ్య నాయుడు మొ॥ వారు.

దీనంతటికీ పరిష్కారం ఏమంటే రాజకీయాల గురించి మాట్లాడే ఇలాంటి వాళ్ళంతా స్వయంగా ఎన్నికల్లో పోటీ చేయడమే. అప్పుడే వాళ్ళు ప్రజలను వాళ్ళ నిర్ణయశక్తిని గౌరవించే నాయకులుగా ఎదిగినట్టు. అందువల్ల రాజకీయాల గురించి ఎవరు ఎంత మాట్లాడినా వాళ్ళు రాజకీయ నాయకులు కారు. అలా మాట్లాడేవాళ్ళంతా రాజకీయ నాయకులు అయ్యేదైతే లెక్చరర్లంతా ఎప్పుడో రాజకీయ నాయకులుగా ఎన్నికై ఉండేవాళ్ళు. రాజకీయాల గురించి మాట్లాడగలిగినంత మాత్రాన ఎవరూ రాజకీయ నాయకులు కారు. పొలిటికల్ ఇంజనీరింగ్, ఎలక్టోరల్ ఇంజనీరింగ్ సమర్థవంతంగా నిర్వహించిన వారే రాజకీయ నాయకులు. మిగతావారు రాజకీయాల గురించి మాట్లాడే ఉపన్యాసకులు, మేధావులు, వ్యాఖ్యాతలు, జర్నలిస్టులు, కళాకారులు, విద్యావంతులు మాత్రమే. రాజకీయాల గురించి మాట్లాడే నాయకులు తమ సంఘాల తరపున తామే ముందు పోటీ చేసి ఆదర్శంగా నిలబడాలి. అప్పుడే రాజకీయ అధికారం సాధించాలనే మాటను ఆచరణలో ముందుకు తీసుకువెళ్ళిన వాళ్ళవుతారు.

> "ఆమె ఎవరు? అద్భుతమా? దేవతలకు ప్రతిరూపమా? ఏకవ్యక్తి సైన్యమా? పీవీ నరసింహారావు అభివర్ణించిన ప్రకారం ఆమె భారత ప్రజాస్వామ్యంలో ఓ అద్భుతం. తనకు తాను వర్ణించుకున్న ప్రకారం ఆమె దేవత. రాజకీయ విశ్లేషకులు ఇచ్చిన బిరుదు 'ఏకవ్యక్తి సైన్యం' ఆమె మరోవరో కాదు.... బిఎస్పీ నాయకురాలు మాయావతి."
>
> – *ఈనాడు, 12-5-2007*

బిఎస్‌పి సిద్ధాంతం-దృక్పథం

కుల సంఘాల నాయకత్వంలో

రాజకీయ అధికార సాధన సాధ్యమా?

భారత దేశంలో స్వాతంత్ర్యానంతరం పుట్టి పెరిగిన పార్టీల్లో జాతీయ పార్టీగా ఎదిగిన మొదటి పార్టీ బిఎస్‌పియే. మిగతా జాతీయ పార్టీలు స్వాతంత్ర్యానికన్నా ముందు పుట్టి స్వాతంత్ర్యం తరువాత చీలికల ద్వారా ఏర్పడినవే. జన సంఘ్ స్వాతంత్ర్యానంతరం పుట్టి జాతీయ పార్టీగా ఎదిగినదే అని వారు వాదిస్తుంటారు. ఏమైనప్పటికీ భారత దేశంలో 2007 నాటికి కాంగ్రెస్, బిజెపి తరువాత దేశంలో మూడవ అతిపెద్ద జాతీయ పార్టీ బిఎస్‌పియే. నాలుగవ జాతీయ పార్టీగా సిపిఎం, ఐదవ జాతీయ పార్టీగా సిపిఐ కొనసాగుతున్నాయి.

బిఎస్‌పి నిర్మాణ పని విధానం మిగతా రాజకీయ పార్టీలకన్నా భిన్నమైనది, విశిష్టమైనది. ఆచరణాత్మకమైనది. బిఎస్‌పి నిర్మాణం, పని విదానంలో కాగితం పుల్లకు స్థానం లేదు. ప్రజల పునాది లేకుండా మీడియా ద్వారా నాయకులుగా చలామణీ అయ్యేవారికి ఈ నిర్మాణంలో అవకాశం లేదు. ఇది పార్టీ నిర్మాణానికి, కార్యక్రమాలకు అంకితమైన నిర్మాణం, పని విధానం.

సామాజిక పరివర్తన అంతిమ లక్ష్యంగా బిఎస్‌పి పని చేస్తుంది. సామాజిక పరివర్తన అన్ని రంగాల్లో జరగాలి. ముఖ్యంగా ఐదు రంగాల్లో సామాజిక పరివర్తన జరగాలి. రాజకీయాధికారం ద్వారా ఈ సామాజిక పరివర్తనను సాధించడం బిఎస్‌పి లక్ష్యం. సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్య, ఉద్యోగ, సాంస్కృతిక, సాహిత్య భావజాల రంగాల్లో వర్ణాధిక్యతను తొలగించడం బహుజనులు అన్ని రంగాల్లో ఎదగడం బిఎస్‌పి సామాజిక పరివర్తన ప్రధాన లక్ష్యం.

బుద్ధుడు, చార్వాకులు మొదలుకొని భక్త కవులు సంత్‌రవిదాస్, కబీర్‌దాస్, అమీర్‌ఖుస్రో, యోగి వేమన, నారాయణ గురు, మహాత్మాజ్యోతిబా ఫూలే, ఛత్రపతి సాహూజీ మహరాజ్, పెరియార్ రామస్వామి నాయకర్, డా॥ బి.ఆర్. అంబేద్కర్‌ల చారిత్రక వారసత్వాన్ని సిద్ధాంత వారసత్వాన్ని బహుజన సమాజ్ పార్టీ తన వారసత్వంగా

స్వీకరించింది. దీన్ని ఒకే మాటలో అంబేద్కరిజం బిఎస్‌పి ప్రాపంచిక దృక్పథం అని ప్రకటిస్తుంది.

బహుజన సమాజ్ పార్టీ అవగాహన ప్రకారం సామాజిక పరివర్తన జరగాలన్నా, లేదా ఆర్థిక విముక్తి జరగాలన్నా మూడు ముఖ్యమైన విషయాలున్నాయి.

1. సిద్ధాంతం
2. నాయకత్వం
3. పార్టీ

1 నాయకత్వం ఉండి సిద్ధాంతం, పార్టీ లేకపోయినా సామాజిక పరివర్తన సాధ్యం కాదు.

2 సిద్ధాంతం, నాయకత్వం ఉండి పార్టీ లేకున్నా సామాజిక విప్లవం సాధ్యం కాదు.

3. పార్టీ, సిద్ధాంతం ఉండి నాయకత్వం లేకున్నా సామాజిక విప్లవం సాధ్యం కాదు.

సామాజిక ఉద్యమాలకు రాజకీయ ఉద్యమాలకు మధ్య ప్రధానమైన తేడా ఉంది. అది...

1. సామాజిక ఉద్యమాలకు నాయకత్వం ఉంటుంది. సిద్ధాంతం ఉంటుంది. కానీ పార్టీ ఉండదు.

2. సిద్ధాంతం, నాయకత్వం ఈ రెంటి ద్వారా సామాజిక ఉద్యమాలు నిర్వహించగలుగుతారు. కానీ సామాజిక విప్లవం లేదా సామాజిక పరివర్తన తీసుకురావడం సాధ్యం కాదు.

3. కనుక రాజకీయ పార్టీ అవసరం.

కొందరు నాయకులు సిద్ధాంతం లేకుండానే ఉద్యమాలను నడుపుతారు. వారికి చరిత్ర వారసత్వం కూడా ఉండదు. ఇవి తాత్కాలికమైనవి. వ్యక్తి పరంగా నడిచేవి. ఇవి ఆయా రంగాల్లో కొంత మార్పుకు కారణం అవుతాయి. అవి మొత్తం సమాజాన్ని అన్ని రంగాల్లో మార్చలేవు. అలాగే కొన్ని సంఘటనల సందర్భంగా ఉద్యమాలు వెల్లువెత్తుతాయి. ఆ తరువాత సామాజిక ఉద్యమంగా విస్తరిస్తుంది. ఇవి కూడా అంతే. అన్ని రంగాలను మార్చలేవు.

అంబేద్కర్ సంఘాలు, దళిత సంఘాలు, బిసి సంఘాలు, కొన్ని చైతన్యపూరిత

కుల సంఘాలు, నేతలు రాజకీయ అధికారం చేజిక్కించుకోవడమే మా లక్ష్యం అని ఉపన్యాసాలిస్తున్నారు. రాజకీయ పార్టీ లేకుండా రాజకీయ అధికారం ఏ విధంగా సాధిస్తారో తెలియని అమాయకత్వం వారిది. వీరిది ఉత్సాహమే తప్ప సిద్ధాంత అవగాహన గానీ, పార్టీ ఆవశ్యకత గానీ పూర్తి స్థాయిలో అవగాహన చేసుకోలేకపోయిన మధ్యతరగతి విద్యావంతులది ముఖ్యంగా ఉద్యోగ రంగంలో పని చేసే వారికి పరిమితమైనది. ఉద్యోగ రంగంలో పని చేసే వాళ్ళు రాజకీయాల గురించి పని చేయాలంటే ధైర్యం ఉండాలి. రాజకీయ పార్టీతో సంబంధంలో ఉండాలి. తద్వారా తమ ఉద్యోగ జీవితానికి కష్టాలు వస్తాయని పార్టీ ఆవశ్యకత గురించి మాట్లాడకుండా, బిఎస్పితో సహా తాము అభిమానించే సిద్ధాంతాలను ముందుకు తీసుకువెళ్ళే పార్టీలను అన్నిటినీ ఏదో ఒక కారణం చూపి విభేదిస్తారు. దూరంగా ఉండే ప్రయత్నం చేస్తారు. దానికి వాళ్ళు సామాజిక ఉద్యమం అని పేరు పెట్టి రాజకీయాలు మాత్రం బోలెడు మాట్లాడేస్తుంటారు. రాజకీయ రంగంలో పని చేయకపోగా ఇలాంటి వారి కృషి వీరు సృష్టించే విచ్ఛిన్నత వల్ల రాజకీయ రంగంలో ఎంతో నష్టం జరుగుతుంది. వీళ్ళు ఎన్నికలు రాగానే ఏదో ఒక అగ్రకులాల పార్టీకి ఏదో ఒక కారణం చేత ఓటు వేయాలని ప్రచారం చేస్తారు.

అయిదు సంవత్సరాల పాటు అంబేద్కర్ గురించి, బిసిల గురించి, ఫూలే గురించి, నాస్తిక హేతువాదాల గురించి, విప్లవం గురించి, సామాజిక చైతన్యం గురించి, ఆయా కులాల ప్రయోజనాల గురించి మాట్లాడే ఆయా సంఘాల నాయకులు ఎన్నికలు సమీపించగానే ఇలా అగ్ర కుల పార్టీలకు ప్రయోజనం చేకూర్చే విధంగా ప్రచారం చేస్తారు. ఓట్లు వేస్తారు. అలా అగ్రకుల పార్టీలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తూ తమ ప్రయోజనాలు నెరవేర్చుకుంటారు.

ఆయా సంఘాల అధ్యక్షులు, ప్రధానకార్యదర్శులు, తక్కిన నాయకులు కొంత మంది గాంధీభవన్లో, కొంత మంది ఎన్టిఆర్ భవన్లో, ఇంకొంత మంది బిజెపి భవన్లో మా జనాభా ఇంత ఉంది నాకు సీటిస్తే నా కులంలో ఉన్న ఓట్లన్నీ మీ పార్టీకి ఏపిస్తా అంటూ తిరుగుతారు. మా కులపోల్లంతా నా జేబులోనే ఉన్నారు. అని నమ్మబలుకుతారు.

ఇలా ఐదేళ్ళు రాజకీయ పార్టీల నిర్మాణం కోసం కృషి చేయకుండా లక్ష్మణుడి భార్య వలె 'ఊర్మిళ నిద్ర'పోయి ఇక ఎన్నికల ప్రక్రియ కొద్ది నెలల్లో ప్రారంభమౌతుందనే మేరకు ఈ సారి తప్పనిసరిగా రాజకీయ పార్టీ పెడతం. ఈ రాష్ట్రం ఫలానా రెండు మూడు పార్టీల అగ్రకులాల గుత్తసొత్తు కాదు. ఫలానా, ఫలానా సామాజిక వర్గాలను

కలుపుకొని మేమే ప్రత్యామ్నాయం కాబోతున్నాం అని ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతారు. వాన పడగానే రక రకాల పిచ్చి మొక్కలన్నీ మొలిచినట్టు ఎన్నికల వాన తొలకరి చినుకులకు ఇలాంటి పిచ్చి మొక్కల పార్టీల ప్రకటనలు, సభలు అగ్రకుల రాజకీయ పార్టీల సహకారంతో పెద్ద ఎత్తున మొదలవుతాయి. రాష్ట్రంలో 5వేల అంబేద్కర్ సంఘాలు రిజష్టరై ఉన్నాయి. ఒకే సంఘం గొడుగు కింద పని చేయడానికి వీళ్ళు ఎవరూ సిద్ధంగా లేరని దీని అర్థం.

ఇప్పుడు జాతీయ నాయకుల పేరిట సంఘాల రిజిష్టేన్ పేరును నిలిపివేశారు. లేక పోతే ఇంకా ఎన్ని వేల సంఘాలు నమోదయ్యేవో!

ఒక అగ్రవర్ణ పార్టీ నాయకుడు అన్నట్టు ఆయా సామాజిక వర్గాల కులాల నాయకులు మొరిగే కుక్కలే గానీ, కరిచే కుక్కలు కాదని అందుకే వారితో మేము ప్రేమ పూరితంగా మాట్లాడుతాం. విందుకు ఆహ్వానిస్తాం. భుజాల మీద చేతులు వేస్తాం. టిక్కెట్లు తప్పకుండా ఇస్తామని హామీలు ఇస్తాం అని అంటాము. అని అన్నారు. కానీ ఆ అధినేతలు సీట్లు ఇవ్వరు, వాళ్ళ మాటలు, పెట్టే ఆశలు చూసి ఇక పార్టీ పెట్టాలనేవి మర్చిపోతారు. సీట్లు ఇవ్వకుండా ఈ సారి టైట్ పొజిషన్ ఉంది ఏమనుకోవద్దు అని చావు కబురు సమయం మించిపోయాక చల్లగా చెబుతారు. ఏదో పాతిక, పరక వేలు ఇస్తారు. దాంతో ఆయా కుల సంఘాల నాయకులు కుక్కకు బొక్క దొరికినట్లు వారి చుట్టూ తిరుగుతూ వారికి ప్రచారం చేస్తారు. ఇంకా కొద్దిగా బలం ఉన్న, లేదా పౌరుషం ఉన్న నాయకులు వాదిస్తే వారికి ఏదో ఒక చిన్న పనికి రాని పార్టీ పోస్టు ప్రకటిస్తారు. కానీ చాలా మంది ఇలాంటి నాయకులకు ఆయా పార్టీల్లో తమ కులం సెల్లో నైనా స్థానం ఉండదు. పాతిక పరకతో సంతృప్తి పడాల్సిందే.

మరికొందరుంటారు. వీళ్ళు నామినేషన్ కూడా వేస్తారు. పోస్టర్ కూడా వేస్తారు. ప్రచారం కూడా చేస్తారు. విస్తృతంగా ఎన్నికల ఫండు వసూలు చేస్తారు. ఫండు వసూలు టార్గెట్ నిండగానే పోలింగ్కు అయిదు రోజుల ముందు ప్రచారం నిలిపివేస్తారు. అడ్రసు లేకుండా పోతారు. లేదా ఫలానా అభ్యర్థికి మద్దతుగా ఉప సంహరించుకున్నాను. అని వారికి ఓటెయ్యండని చెప్తారు. అందుకు కూడా ఫండు వసూలు చేస్తారు.

ఇలాంటి వాళ్ళలో రాజకీయాలకు, రాజకీయ ఆచరణకు, సిద్ధాంతాలకు ఎలాంటి మార్పులు చేర్పులు చేసుకోవాలో, ప్రజల్లోకి ఎలా వెళ్ళాలో వాళ్ళు లారీల కొద్దీ సిద్ధాంతాలు, ఎత్తుగడలు ప్రచారం చేస్తుంటారు. ఉచిత సలహాలు ఇస్తుంటారు.

వ్యాసాలు రాస్తుంటారు. ఒక పాతిక మందిని కూడేసి సదస్సులంటూ పెట్టి ఊదరగొడుతుంటారు. కానీ వాళ్ళు మాత్రం వాటిని ఆచరించరు. ఎదుటివారికి చెప్పేందుకే ఆ సిద్ధాంతాలు, నిర్మాణాలు.

ఒకాయన మార్క్సిజం, అంబేద్కరిజం, సోషలిజం కలిపి పని చేద్దాం. అని కాన్షీరామ్‌తో అన్నారు. అదేదో మీరే చేసి ఫలితాలతో రండి. ఆ ప్రయోగం విజయవంతం అయితే మేము కూడా ఆలోచిస్తాం అన్నారు. ఇలా కాన్షీరామ్ తనకు ఉచిత సలహాలు ఇచ్చేవారికి ఒక సలహా ఇచ్చేవారు. నీ సలహా నీవు ఆచరించి ఫలితం తీసుకు రాగలిగితే దాన్ని మేము అమలు చేస్తాం అని ! దాంతో వాళ్ళు మళ్ళీ కనపడకుండా పోయారు. వారి సిద్ధాంతం, వారి ఆచరణ, వారి ప్రయోగం ఎంత మేరకు ముందుకు సాగిందో మళ్ళీ ఎప్పుడూ ఎక్కడా చెప్పకుండా పారిపోయారు.

ఒక రాజకీయ పార్టీ స్వభావం ఆ పార్టీకి నాయకత్వం వహించే వారిననుసరించి పరిశీలించాల్సి ఉంటుంది. ఏ కులాల, ఏ సామాజిక వర్గాల నాయకత్వంలో ఆ పార్టీ ఉంది? ఏ ఏ కులాల, ఏ సామాజిక వర్గాల ప్రయోజనం కోసం అది ఉంది ? అనేది ఆ రాజకీయ పార్టీ స్వభావాన్ని తెలుపుతుంది. పార్టీ నిర్మాణం కూడా ఆ పార్టీ ప్రకటించుకునే లక్ష్యాలతో, ఆచరణకు అనువుగా ఉందా? లేదా అనేది కూడా పరిశీలించాలి. చాలా పార్టీలు ఎన్నికల ప్రణాళికల్లో వారంత సమాజ క్షేమం కోరే వారు ఎవరూ లేనట్టు ప్రకటిస్తారు. పార్టీ నిర్మాణం అందుకు అనువుగా అసలే ఉండదు. ఉదాహరణకు దళిత బహుజనుల శ్రేయస్సే, అణగారిన వర్గాల సంక్షేమమే మా ధ్యేయం అని ప్రకటించే పార్టీల్లో ఆ దళిత బహుజన అణగారిన వర్గాల నాయకత్వానికి స్థానం శూన్యం. అగ్రకులాలదే ఆధిపత్యం. వాళ్ళు కనీసం పార్టీల్లో ఆచరించని సామాజిక న్యాయం సమాజంలో ప్రభుత్వంలో సాధిస్తామని ప్రకటిస్తుంటారు. ఇదంతా ఆ పార్టీల్లో నాయకత్వంలో ఉన్న అగ్రకులాల స్వార్థం కోసమే.

> "...ముఖ్యమంత్రిగా మాయావతి నాలుగోసారి గద్దెనెక్కబోతోంది. ఇప్పటిదాకా ప్రధానులుగా దేశానికి అందించిన యుపి రేపటి రాష్ట్రపతి ఎన్నికల్లోనూ కీలక పాత్ర పోషించనుంది. ఇక్కడ నుంచే ఢిల్లీ పీఠానికి ఎగబాగాలనుకున్న మతోన్మాదులకు ఈ ఫలితాలు దిమ్మతిరిగేలా చేశాయి. ఉత్తరప్రదేశ్ ఎన్నికల ఫలితాలు అన్ని పార్టీలూ గుణపాఠాలు తీయదగినవి. "
>
> *- 'ప్రజాశక్తి' సంపాదకీయం; 12-5-2007*

బహుజన సమాజ్ పార్టీ

నిర్మాణం - పనివిధానం

బిఎస్‌పి దృష్టిలో ఓటు విలువ - ఓటు పట్ల బిఎస్‌పి దృక్పథం

బహుజన సమాజ్ పార్టీ ఓటును అత్యంత విలువైనదిగా, అమూల్యమైనదిగా భావిస్తుంది. ఓటరు యజమాని అని భావిస్తుంది. ప్రజా ప్రతినిధి సేవకుడు అని వివరిస్తుంది.

అగ్రవర్ణ పార్టీలు తాము నాయకులుగా ప్రకటించుకుంటూ ప్రజలను, ఓటర్లను మభ్యపెట్టి వాడుకుంటారు. వారి దృష్టిలో ఓటరు యజమాని కాదు. వారి దృష్టిలో ఓటరు డబ్బులకు అమ్ముడు పోయేవారు. అబద్ధాలను నమ్మి ఓట్లు వేసేవారు.

ఓటు మీ సొంత కూతురు - మంచి వరునికివ్వండి : కాన్షీరామ్

కాన్షీరామ్ ఓటు పట్ల ఇచ్చిన నిర్వచనం గొప్పది. ఓటు అనేది మీ కూతురు వంటిది. కూతురుకి యోగ్యుడైన వరున్ని చూసినట్లు చూసి ఓటు వేయాలి. కూతురుని అయోగ్యునికి ఇవ్వాలని ఎవరూ అనుకోరు. డబ్బులకో, సారాకో కూతురును ఎవరికో అంటకడతారా? అని కాన్షీరామ్ వివరించేవారు. ప్రజలు అప్పుడు గానీ ఓటు విలువ తెలుసుకోలేదు. ఓటు సొంత కూతురు వంటిది అని కాన్షీరామ్ ఇచ్చిన నిర్వచనం దళితుల హృదయాలను, ఆత్మగౌరవాన్ని, నిర్ణయశక్తిని మేల్కొల్పింది.

ఇలా ఓటును సొంత కూతురుతో అగ్ర వర్ణ పార్టీలు పోల్చలేవు. వారికి ఓటు రిగ్గింగు ద్వారా, మోసపూరిత ప్రచారం ద్వారా, ఆకర్షణీయ ఎన్నికల ప్రణాళిక ద్వారా, డబ్బు ద్వారా సంపాదించుకునే సరుకు.

కాన్షీరామ్ దృష్టిలో, బిఎస్‌పి దృష్టిలో ఓటు ఒక సరుకు కాదు. ఓటు ఒక సొంత కూతురు. యోగ్యుడైన వరునికిచ్చి పెళ్ళి చేయడం ఎంత బాధ్యతాయుతమైన కర్తవ్యమో, ఓటు వేయడం కూడా అంతే బాధ్యతాయుతమైన కర్తవ్యం.

బిఎస్‌పి పార్టీ నిర్మాణం ఇలా వుంటుంది

1 రాష్ట్ర అధ్యక్షులు

రాష్ట్ర అధ్యక్షులతో పాటు ఒక ఉపాధ్యక్షుడు ఒక ట్రెజరర్ ఉంటారు.

ఈ ముగ్గురిలో ఒకరు ఎస్‌సి, ఒకరు బిసి, మరొకరు ఓసి, ఎస్టీ, మైనార్టీల నుండి ఉంటారు.

పై నుండి కింది దాకా ఉండే ప్రతి కమిటీలో ఇదే విధానం, ఇదే కాంబినేషన్ ఉంటుంది. ప్రతి ముగ్గురిలో ఒకరు తప్పనిసరిగా దళితుల నాయకత్వం ఉంటుంది. తద్వారా ఊరుకు, దళిత వాడకు మధ్య లంకె కలుస్తుంది. దళితవాడ ఊరుకు నాయకత్వం అందిస్తుంది.

రాష్ట్ర అధ్యక్షుని నాయకత్వంలో ఈ కింది విధంగా కార్యవర్గం ఉంటుంది.

లోక్‌సభ ఇన్‌ఛార్జిలందరు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులే

42 లోకసభ స్థానాలకు ఇంఛార్జిలుంటారు. వీరంతా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులే. అయితే వీరు లోకసభ నియోజక వర్గం దాటి పోయేది లేదు. వీరికి మూడు అసెంబ్లీ నియోజక వర్గాల ఇంఛార్జి బాధ్యతలుంటాయి.

అలాగే 42 లోకసభ నియోజక వర్గాలకు ఇద్దరి చొప్పున 84 మంది ఉప ఇంచార్జిలు ఉంటారు. వీరిని రాష్ట్ర కార్యదర్శి అని వ్యవహరిస్తారు. వీరికి రెండు అసెంబ్లీ నియోజక వర్గాల చొప్పున ఇంచార్జి బాధ్యతలుంటాయి. ఈ రెండు నియోజక వర్గాలు దాటి పోయేది లేదు. లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాలను చూసుకుంటారు.

మొత్తం రాష్ట్ర కార్యవర్గం

ఇలా రాష్ట్ర అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ట్రెజరర్‌తో పాటు 42 మంది ప్రధాన కార్యదర్శులు, 84 మంది రాష్ట్ర కార్యదర్శులు రాష్ట్ర అధ్యక్షుడి నాయకత్వంలో పని చేస్తారు. రాష్ట్ర అధ్యక్షుడే సుప్రీం. మొత్తం పార్టీకి మాయావతియే సుప్రీం.

రాష్ట్ర అధ్యక్షుని నాయకత్వంలో జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, ట్రెజరర్ అనే నలుగురితో జిల్లా కమిటీ ఉంటుంది.

అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలందరు జిల్లా కార్యదర్శులే

అసెంబ్లీ నియోజక వర్గ ఇంచార్జిని జిల్లా కార్యదర్శి అని అంటారు. అసెంబ్లీ నియోజకవర్గ కమిటీకి ఒక అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఉంటారు. అసెంబ్లీ

నియోజకవర్గ ఎన్నిక తరువాత సెక్టార్ కమిటీ ఉంటుంది.

పది పోలింగ్ బూత్‌లకు ఒక సెక్టార్ కమిటీ

పది పోలింగ్ బూత్‌లకు ఒక సెక్టార్ కమిటీ ఉంటుంది. సెక్టార్ కమిటీ ఇంచార్జిని అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి అంటారు.

పోలింగ్‌బూత్ కమిటీలో 11 మంది సభ్యులు ఉంటారు. ఒకరు అధ్యక్షులు, 5గురు కార్యదర్శులు 5గురు సహాయక కార్యదర్శులు. దీన్ని పోలింగ్ బూతు కమిటీ అంటారు.

ఇలా రాష్ట్ర కార్యవర్గం మొత్తం రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి దాకా పోలింగ్ బూత్ దాకా ఈ కింది విధంగా ఉంటుంది.

1.	బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు	1
2.	ఉపాధ్యక్షుడు	1
3.	ట్రెజరర్	1
4.	ప్రధాన కార్యదర్శులు (లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు)	42
5.	కార్యదర్శులు (లోకసభ నియోజకవర్గ ఉపఇన్‌ఛార్జిలు)	84

జిల్లా కార్యవర్గం

1.	జిల్లా అధ్యక్షులు (23 జిల్లాలకు ఒకరు చొప్పున)	23
2.	జిల్లా ఉపాధ్యక్షులు ,,	23
3.	జిల్లా ట్రెజరర్ ,,	23
4.	జిల్లా ప్రధాన కార్యదర్శులు ,,	23
5.	జిల్లా కార్యదర్శులు (అసెంబ్లీ ఇన్‌ఛార్జిలు)	294
6.	జిల్లా ఉపాధ్యక్షులు (జిల్లాకు ఒకరు చొప్పున)	23

సెక్టార్, పోలింగ్ బూత్ కమిటీలు

1.	అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు	
2.	సెక్టార్ కమిటీలు సుమారుగా 20×200 బూత్‌ల చొప్పున	4,000
3.	పోలింగ్ బూత్ కమిటీలు 294×200 పోలింగ్ బూత్‌లు	58,800

ఈ కింది కమిటీలు కూడా ఉంటాయి

1. కుల సమన్వయ కమిటీలు

2. ఐదు ఉద్యమాల కమిటీలు
3. బాంసెఫ్ కమిటీలు
4. బహుజన స్టూడెంట్ ఫెడరేషన్
5. బహుజన వలంటరీ ఫోర్స్
6. బహుజన రచయిత, కళాకారుల, జర్నలిస్టుల బృందాలు
7. మహిళా బృందాలు
8. ఆఫీస్ కార్యదర్శులు, పిఆర్ఓలు

ఇవన్నీ రాష్ట్ర స్థాయి నుండి సెక్టార్ కమిటీ దాకా ఉంటాయి.

విస్తరణ క్రమంలో ఇంకా ఏర్పడాల్సినవి

1. లీగల్ సెల్, గ్రీవియన్స్ సెల్ (కేసులు చూసుకునే కమిటీ)
2. మెడికల్ సెల్
3. రీసెర్చ్ సెల్/బహుజన సామాజిక శాస్త్రవేత్తల ఫోరం
4. బహుజన వాలంటరీ ఫోర్స్
5. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కమిటి
6. బహుజన తెలంగాణ విద్యావంతుల వేదిక
7. బహుజన పత్రిక సంపాదకవర్గం, జిల్లా రిపోర్టర్లు
8. బహుజన సమాజ ప్రచురణలు, సంపాకవర్గం
9. బహుజన టీచర్స్ ఫెడరేషన్
10. బహుజన యూనివర్సిటీ ప్రొఫెసర్స్ ఫోరం
11. ప్రభుత్వ భూవివరాల మరియు మిగులు భూమి వివరాల సేకరణ కమిటి
12. బహుజన చరిత్ర-సంస్కృతి పరిశోధన మరియు ప్రచురణల ఫోరం

వీటిలో కొన్ని సెక్టార్ కమిటీల దాకా సెల్స్ వుంటాయి.

మునపటి లాగా బిఎస్‌పిలో రాష్ట్ర నాయకులంటూ ప్రత్యేకంగా విడిగా ఉండరు. ఆయా నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిలుగా పనిచేసేవారే రాష్ట్ర నాయకులుగా ఉంటారు. ఏ నియోజకవర్గానికి ఇన్‌ఛార్జి లేకుండా గతంలో రాష్ట్ర నాయకులుగా చలామణి అయిన పద్ధతి ఇప్పుడు లేదు. స్పష్టంగా ఏదో ఒక నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిగా ఉంటూ కార్యకర్తలను సమీకరించి బహుజన సమాజ నిర్మాణాన్ని శక్తివంతం చేస్తూ

అవసరమైతే ఎన్నికల్లో పోటీచేయడానికి సిద్ధపడేవారే రాష్ట్ర నాయకులుగా ఉంటారు. అనగా ఎన్నికల్లో నిలబడకుండా, పోటీ చేయించకుండా, కార్యకర్తలను నిర్మాణం చేయకుండా మాటలు చెప్పుకుంటూ కాలం వెళ్ళబుచ్చే నాయకులకు బిఎస్‌పిలో స్థానం లేదు. ఇలాంటి వారికి ఆయా కుల సమన్వయ కమిటీల్లో, ఇతర కమిటీల్లో బాధ్యతలు వుంటాయి.

రాష్ట్ర కమిటి నాయకత్వంలో కుల సమన్వయ కమిటీలు

రాష్ట్ర అధ్యక్షుని నాయకత్వంలో రాష్ట్ర స్థాయిలో ఆయా కులాల సమన్వయ కమిటీలు ప్రతి కులానికి . ఉంటాయి. ఆయా కులాలకు సంబంధించిన వాళ్ళు కుల సమన్వయ కమిటీకి అధ్యక్షులుగా ఉంటారు. ఎస్‌సిల నుండి ప్రధాన కార్యదర్శి ఉంటారు. అనగా ప్రతి కులం సమన్వయ కమిటీలో ఆ కులం అధ్యక్షునితో పాటు ఒక ఎస్‌సి ప్రధాన కార్యదర్శిగా ఉంటారు. అలాగే ముస్లింల సమన్వయ కమిటీ కూడా ఉంటుంది.

ప్రతి కమిటీలో, ప్రతి దశలో ఎస్సీ, బీసీ, ఓసి కాంబినేషన్ ఇలా ఉంటుంది

ఇలా జిల్లా స్థాయిలో ఆయా కులాల కుల సమన్వయ కమిటీలు ప్రతి కులానికి ఉంటాయి. లోకసభ నియోజకవర్గ కమిటీకి ముగ్గురు కార్యదర్శులు ఉంటారు. ఒకరు ఎస్‌సి, ఒకరు బిసి, మూడవ పోస్టు బిసి, లేదా ఎస్‌టి లేదా మైనారిటీ లేదా ఓసి. ఎస్‌టి నియోజక వర్గంలో ఎస్‌టితో పాటు ఎస్‌సి, బిసిలు ఉంటారు.

ఇలా అన్ని కమిటీల్లో అన్ని కులాలు, వర్గాలు కలిసి రెండు వంతులు ఉంటారు. ఎస్సీలు సాలిడ్‌గా ఒక వంతు వుంటారు. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో యుపిలో ములాయంసింగ్ లాగా బిసిల నాయకత్వంలో బిసి పార్టీలు, బిసిలను ఆర్గనైజ్ చేయలేదు, వాళ్ళు వేరొక సంస్థలో, పార్టీలో అధికారంలో లేరు కనుక రాష్ట్ర పార్టీలో బీసీలను యుపిలో కన్నా ఎక్కువ సంఖ్యలో ఎంతో ప్రాధాన్యతతతో తీసుకోవడం అవసరమని బీసీలు భావిస్తున్నారు. బిఎస్‌పి కూడా భావిస్తున్నది.

పోలింగ్ బూతు కమిటీలో 11 మందికి ఈ కింది విధంగా పని విభజన ఉంటుంది.

1. ఒకరు పోలింగ్ బూతులో కూర్చుంటారు. మరొకరు రిలీవర్‌గా ఉంటారు. 5మంది పోలింగ్ బూతు కమిటీ సభ్యులు గ్రామంలోకి పోయి ఓటర్లను తీసుకు రావడం, ఇద్దరు క్యూ వద్ద ఏనుగు గుర్తుకే ఓటు వేయండి అని ప్రచారం చేయడం. ఇద్దరేమో ఓటర్లకు ఓటరు స్లిప్ రాసివ్వడం.

ఇలా ఒక అసెంబ్లీ/లోక్‌సభ నియోజక వర్గంలో 200 పోలింగ్ బూత్‌లు ఉంటే 2200 మంది కార్యకర్తలు 20 సెక్టార్లుంటే 40 మంది సెక్టార్ నాయకులు, అసెంబ్లీ నియోజక వర్గం ఇంచార్జీలు 23 మంది. ఇలా మొత్తం ఒక నియోజక వర్గంలో సుమారు 2263 మంది కార్యకర్తలు, నాయకులు ఉంటారు. వీరితోపాటు ఆయా కులాల సమన్వయ కమిటీల్లో వారు 2336 మంది కార్యకర్తల నాయకులు ఉంటారు.

ఇలా ఒక నియోజక వర్గంలో సుమారు 5వేల మంది కార్యకర్తలు, నాయకులు పనిచేస్తారు. ఇవన్నీ ఏర్పాటైన తరువాత మాత్రమే పార్టీ ఆ నియోజక వర్గంలో పోటీ చేయవచ్చని టిక్కెట్టు ఇస్తుంది.

ఈ కమిటీలు, పోలింగ్‌బూత్ కమిటీలకు, కుల సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయకుండా కేవలం పార్టీ ఇంచార్జీలు ఉన్న చోట ఎన్నికల్లో పోటీ చేయడానికి టిక్కెట్లు ఇవ్వరు. పోలింగ్ బూతు కమిటీల దాకా మొత్తం నిర్మాణం, పని విధానం సమర్థవంతంగా ఉన్నప్పుడే బిఎస్‌పి టికెట్లను కెటాయిస్తుంది.

ఇలా ఉత్తరప్రదేశ్‌లో బిఎస్‌పి విజయం వెనుక ఇంత పటిష్టమైన నిర్మాణం వుంది. రాష్ట్రంలో కూడా ఈ నిర్మాణం వేగవంతంగా సాగుతున్నది. సాంస్కృతిక, చారిత్రక నిర్మాణం ఎలా సాగించిందో మరో వ్యాసంలో వివరించాను.

ఏడాదిలో బిఎస్‌పి రాష్ట్రంలో తీసుకునే కార్యక్రమాలు

బిఎస్‌పి కళా బృందాలను తయారు చేస్తున్నది. విద్యావంతుల, మేధావుల బృందాలను తయారు చేస్తున్నది. కార్యకర్తలకు శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నది. బాంసెఫ్ అనే ఉద్యోగ సంఘాలను నిర్వహిస్తున్నది. రెండు జిల్లాలకు కలిపి ప్రతి ఆదివారం రాజకీయ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నారు. అన్ని రకాల మాధ్యమాలను (లాప్‌టాబ్, ఎల్‌సిడి ప్రొజెక్టర్, సిడిలు) ఉపయోగించుకుంటూ తరగతులు నిర్వహిస్తున్నారు. సమీక్ష సమావేశాలను, జన సమీకరణలను, సభ్యత్వ సేకరణలను ముమ్మరం చేస్తున్నారు. సభ్యత్వ రుసుము 20 రూపాయలు. ఈ సంవత్సరం నాయకులకు మాత్రమే సభ్యత్వం ఇస్తున్నారు. జిల్లాకు వెయ్యి నుండి 1500 మంది నాయకులకు మాత్రమే సభ్యత్వం ఇవ్వడం జరుగుతుంది. ఇలా 25 వేల మంది నాయకుల సభ్యత్వ నమోదు పూర్తి చేసే అవకాశం ఉంది. క్రీ.శ. 2008 జనవరి 15 నాటికల్లా కోటి రూపాయల నిధి సేకరించడానికి క్రియాశీల కార్యకర్తల నుంచి 100రూ॥లు "ఆర్థిక సహయోగ్ దివస్" సందర్భంగా సేకరించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ప్రతి ఏటా బిఎస్‌పి ఆర్థిక సహయోగ్ దివస్ నిర్వహిస్తూ విరాళాలను సేకరిస్తుంది. దీన్ని జాతీయ కమిటికి అందజేస్తుంది. ఏటా పార్టీ స్థాపక దినోత్సవం జరుపుతుంది.

బిఎస్‌పి మహాపురుషుల జయంతి వర్ధంతులను జరుపుతుంది. బహుజన వారసత్వంతో చరిత్రను అధ్యయనం చేస్తుంది. చరిత్ర వారసత్వాన్ని స్వీకరిస్తుంది. పూలే, ఛత్రపతి సాహూజీ మహరాజ్, నారాయణగురు, పెరియార్ రామస్వామి నాయకర్, డా॥ బి.ఆర్. అంబేద్కర్, బిర్సాముండా మొదలైన మహా పురుషుల జయంతులను జాతీయ స్థాయిలో జరుపుతారు. అలాగే రాష్ట్రంలో కూడా జరుపుతారు.

వీరితో పాటు ఎక్కడికక్కడ స్థానిక మహాపురుషుల జయంతి వర్ధంతులను కూడా జరుపుతారు. రాష్ట్రంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, యోగి వేమన, కాకతీయులు, శ్రీకృష్ణ దేవరాయలు, సమ్మక్క-సారక్క, బసవేశ్వరుడు, పాల్కుర్కి సోమన, భాగ్యరెడ్డి వర్మ, కుసుమ ధర్మన్న, జాషువా, సర్వాయి సర్దార్ పాపన్న, కన్నెగంటి హన్మంతు, రామసింహ కవి, తళక్కల్ చాంద్, దుర్గావతి మొదలైన వారి జయంతులు, వర్ధంతులు జరుపుతారు.

బిఎస్‌పి చేసే అయిదు ప్రధాన ఉద్యమాలు

బిఎస్‌పి అయిదు సూత్రాలను అమలు చేస్తుంది.

1) భారతీయ భాగ్యదారీ ఆందోళన్ (భాగస్వామ్య ఉద్యమం)
2) భారతీయ శరణార్థి ఆందోళన్ (భారతీయ శరణార్థుల ఉద్యమం)
3) భారతీయ సఫాయి మజ్దూర్ ఆందోళన్ (సఫాయి కార్మికుల ఉద్యమం)
4) భారతీయ దస్తకార్ ఆందోళన్ (చేతి వృత్తికారుల ఉద్యమం)
5) భారతీయ కిసాన్ మజ్దూర్ ఆందోళన్ (రైతు-కూలీల ఉద్యమం)

ఈ అయిదు రంగాల్లో బిఎస్‌పి ఉద్యమాన్ని నిర్వహిస్తున్నది.

చేతి వృత్తులను ఆధునికరించాలి. సాంప్రదాయక కుల వృత్తులకు బదులు వాటిని ఆధునీకరించి ప్రొఫెషనల్స్‌గా మార్చాలి. బిఎస్‌పి ప్రభుత్వాలకు గాని, ఇతరులకు గాని వినతి పత్రాలను ఇచ్చే పద్ధతులు వ్యతిరేకం. ఇతర పార్టీలకు భిన్నంగా...

ఆయా పార్టీలు ప్రణాళికల్లో ఇచ్చిన హామీలను అమలు జరపాలని బిఎస్‌పి కోరుతుంది ఉద్యమిస్తుంది. మీరిచ్చిన హామీలను అమలు జరపండి లేదా పక్కకు జరగండి లేదా రాజీనామా చేయండి అని ఉద్యమిస్తారు. ఇలా ఎన్నికైన ప్రజా ప్రతినిధులనే టార్గెట్ చేస్తారు. ఇందుకు భిన్నంగా సిపిఐ, సిపిఎం వాళ్ళు ఎన్నికైన ప్రజా ప్రతినిధులను వదిలివేసి పోరాటం చేస్తుంటారు. ఉదాహరణకు ఇళ్ళ స్థలాల

గురించి ఎన్నికైన ప్రజా ప్రతినిధులను నిలదీయకుండా సిపిఎం భూ పోరాటాలు చేస్తుంది. ఎందుకంటే వారంతా అగ్రకులస్తులు కావడం వల్లే వారికి వ్యతిరేకంగా ఉద్యమించరు. వారిని ఎండగట్టరు.

భారతీయ భాగస్వామ్య ఉద్యమం

భారతీయ భాగస్వామ్య ఉద్యమం ఆయా పరిశ్రమల్లో పని చేసే ఉద్యోగులకు, కార్మికులకు భాగస్వామ్యం కల్పించాలని ఉద్యమిస్తుంది. ప్రభుత్వ సంస్థల్లోనైనా, ప్రైవేట్ సంస్థల్లో నైనా రెంటిలోనూ వీరికి భాగస్వామ్యం ఉండాలని ఉద్యమాలు చేస్తుంది. విదేశీ, స్వదేశీ సంస్థలన్నిటిలో ఉద్యోగుల, కార్మికుల భాగస్వామ్యం ఉండాలనేది బిఎస్‌పి లక్ష్యం.

భారతీయ శరణార్థుల ఉద్యమం

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విదేశాల నుంచి వలస వచ్చే ప్రజలను విదేశీ శరణార్థులని అంటాయి. విదేశీ శరణార్థులకు కేంద్ర ప్రభుత్వం భారతదేశ బడ్జెట్‌లోంచి వారికి కొంత కేటాయిస్తుంది.

అయితే స్వదేశంలో గ్రామాల్లో అగ్రకులాలు, భూస్వాములు పెట్టే బాధలు భరించలేక, ఉపాధి లేక పట్టణాలకు వలసవచ్చే ప్రజలను కాన్షీరాం భారతీయ శరణార్థులని నామకరణం చేశారు. వీరు ఫుట్‌పాత్‌ల మీద, మురికి కాలువల ప్రక్కన గుడిసెలు వేసుకొని ఈ దేశ పౌరులు కాదనే రీతిలో బతుకులు వెళ్ళదీస్తున్నారు. అనేక మురికి వాడల్లో గుడిసెలు వేసుకొని తాగడానికి నీళ్ళు లేక, ఇళ్ళు లేక, వారి పిల్లలకు చదువులు లేక, సరైన తిండి లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. వారిని ఏ ప్రభుత్వాలు ఈ దేశ పౌరులు, ఈ దేశ శరణార్థులను పట్టించుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు కాని వీరి కోసం బడ్జెట్ కేటాయించడం లేదు. బిఎస్‌పి భారతీయ శరణార్థుల కార్యక్రమం పేరిట వీరి కోసం ప్రత్యేకంగా పథకాలు రూపొందిస్తున్నది. ఈ స్వదేశీ శరణార్థుల కోసం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయిస్తున్నది. వారి జీవన ప్రమాణాల ఎదుగుదలకు, వృత్తుల్లో నైపుణ్యానికి వారి పిల్లల విద్యాభివృద్ధికి విస్తారంగా బడ్జెట్‌లు కేటాయిస్తుంది. కేటాయించాలని ఉద్యమాలు చేస్తుంది.

భారతీయ సఫాయి మజ్దూర్ ఉద్యమం

బిఎస్‌పి దళితులే ఎక్కువగా పని చేసే సఫాయి మజ్దూర్ కార్మికుల కోసం వారి ఆర్థిక, సాంఘిక, రాజకీయ, జీవన ప్రమాణాల ఉన్నతి కోసం ఉద్యమం చేస్తుంది.

భారతీయ చేతి వృత్తుల ఉద్యమం

చేతి వృత్తులను ఆధునికరించాలని, సాంప్రదాయక కుల వృత్తులకు బదులు వాటిని ఆధునీకరించి వృత్తులుగా మార్చాలని బిఎస్‌పి ఉద్యమిస్తుంది. కులవృత్తులు వదిలివేయాలని నైపుణ్యం కల ఇతర వృత్తుల్లో ప్రవేశించాలని ఉద్యమిస్తుంది.

భారతీయ కిసాన్ మజ్దూర్ ఉద్యమం

బిఎస్‌పి 2-3 ఎకరాలు వున్న వ్యవసాయదారుల కోసం, ఉత్పత్తి సాధనాలు కొనుక్కోవడానికి రుణాలు ఇస్తుంది. వ్యవసాయ కూలీలకోసం భూమి కేటాయిస్తుంది. వారి అవసరాల కోసం, జీవన ప్రమాణాల కోసం రాజకీయ చైతన్యం కోసం ఉద్యమాలు నిర్మిస్తుంది.

బాంసెఫ్

బాంసెఫ్ అనేది ఉద్యోగుల సంఘం. ఉద్యోగుల నాయకత్వంలో స్వతంత్రంగా నడుస్తూ వుంటుంది. ప్రతి ట్రేడ్ యూనియన్, ప్రతి ఉద్యోగ సంఘం ఆ ఉద్యోగుల కోసమే పని చేస్తుంది. బాంసెఫ్ ఇందుకు భిన్నం. ఉద్యోగులతో ఏర్పడే బాంసెఫ్ ఉద్యోగుల గురించి ఏ ఒక్క పనీ చేయదు. వారి జీతాల పెరుగుదల గురించి గానీ, బదిలీల గురించిగానీ, ప్రమోషన్ల గురించి గానీ అసలే పని చేయదు. తాము ఏ సామాజిక వర్గం నుండి ఈ స్థాయికి వచ్చారో ఆ సామాజిక వర్గాల అభివృద్ధికి వారి రాజకీయ అభివృద్ధికి మాత్రమే కృషి చేయాలి. బాంసెఫ్‌లోని ఉద్యోగులు ఆయా సామాజిక వర్గాలకు, బిఎస్‌పికి మూడు విధాలుగా త్యాగాలు చేయాలి.

1) సమయం (Time)

2) సంపద (Treasure)

3) సమాలోచన (మేధస్సు) (Talent)

వీటిని 3Ts అంటుంటారు.

ఇలా బాంసెఫ్ బిఎస్‌పికి మెదడుగా పని చేస్తుంది. అది ఎక్కడ కనపడదు. వినపడదు. అలాగే బిఎస్‌పి నాయకులు కూడా మీడియాను ఆశ్రయించకూడదు. మీడియాపై ఆధారపడకూడదు. మీడియాపై ఆధారపడితే ఆ నాయకులను బిఎస్‌పి వదిలివేస్తుంది. వారి స్థానంలో కొత్త నాయకత్వాన్ని తయారు చేసుకుంటుంది.

ఇలా బాంసెఫ్ ఎకనమిజంలో కూరుకుపోకుండా, ట్రేడ్‌యూనియనిజంలో కూరుకుపోకుండా లెనిన్ ఆశించినట్లు రాజకీయ చైతన్యంతో, ప్రజల్లో రాజకీయ

చైతన్యానికి కృషి చేస్తుంది. తోడ్పాటునందిస్తుంది. నాయకత్వాన్ని అందిస్తుంది. ఇది వామపక్షాల ట్రేడ్‌యూనియనిజం కన్నా పూర్తి భిన్నమైనది.

వామపక్షాల ట్రేడ్‌యూనియనిజంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, ట్రేడ్ యూనియన్ల కోసం పని చేస్తారు.

బిఎస్‌పిలో పార్టీకోసం ఉద్యోగులు బాంసెఫ్ ద్వారా పని చేస్తారు.

వామపక్షాలు ఆర్థిక పోరాటాలు చేస్తాయి.

బిఎస్‌పి ఆర్థిక పోరాటాలు చేయదు. ఆర్థిక విముక్తి ఉద్యమం చేస్తుంది.

బిఎస్‌పి నాయకత్వంలో కుల సమన్వయ కమిటీలు

బిఎస్‌పి రాష్ట్ర నాయకత్వంలో రాష్ట్ర స్థాయిలో ప్రతి కులానికి కుల సమన్వయ కమిటీ ఉంటుంది. ఉదాహరణకు బిఎస్‌పి పద్మశాలి కుల సమన్వయ రాష్ట్ర కమిటి. బిఎస్‌పి రజక కుల సమన్వయ రాష్ట్ర కమిటి. బిఎస్‌పి దొమ్మరికుల సమన్వయ రాష్ట్ర కమిటి.

ఈ కుల సమన్వయ కమిటీలు ఇలా వుంటాయి.

1) రాష్ట్ర అధ్యక్షులు ఆ కులానికి చెందిన వారై వుంటారు.

2) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్సీకి చెందిన వారై వుంటారు.

అలాగే జిల్లా అధ్యక్షులుగా ఆ కులానికి చెందిన వారు వుంటారు. ప్రధాన కార్యదర్శిగా ఎస్సీ వుంటారు.

పార్లమెంట్ నియోజకవర్గ పద్మశాలి సమన్వయ కమిటికి పద్మశాలి అధ్యక్షులుగా వుంటారు. ఎస్సీ ప్రధాన కార్యదర్శిగా వుంటారు. అసెంబ్లీ, సెక్టార్ కమిటీలకు కూడా ఇదే విధంగా వుంటారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 8-10 కులాలు ఉంటాయి. ఆ కులాలన్నిటిలో బిఎస్‌పి కుల సమన్వయ కమిటీలు ఉంటాయి.

ఆయా కుల సమన్వయ కమిటీ అధ్యక్షులు, బిఎస్‌పి నాయకులు తమ కులం వారిని బిఎస్‌పి ఓటు బ్యాంకుగా మార్చడానికి సగం సమయం కేటాయించాలి. మిగతా సమయం ఇతర కులాలకు కేటాయించాలి. కొందరు తమ కులం కోసం ఎందుకని, ఇతర కులాల కోసం మొత్తం సమయం కేటాయిస్తామని అంటుంటారు. మీ కులం ఓట్లను సంపాదించలేరు గాని ఇతర కులాల ఓట్లను ఎలా సంపాదిస్తారు? అని బిఎస్‌పి నాయకులు ప్రశ్నిస్తారు. మీ కులం ఓట్లు సంపాదించకుండా ఇతర కులాల ఓట్లు సంపాదించడం వల్ల

ప్రయోజనమేమిటి? మీ కులం ఓట్లను మీరే కూడగట్టాలి అని స్పష్టం చేస్తారు. తద్వారా ఇతరుల కోసం పని చేస్తున్నాం అంటూ పైపై మాటలు చెప్పే నాయకుల పప్పులేవీ ఉడకవు. వారి కులం ఓట్లు వారికి ఎన్ని పడ్డాయో అనేదే వారి నాయకత్వానికి గీటు రాయిగా కూడా పరిగణిస్తారు. ఇలా లెటర్‌ప్యాడ్ నాయకులు ఎవరో, ఉపన్యాసాలతో, పత్రికా ప్రకటనలతో ఊదరగొడుతూ నాయకులుగా కనపడే పేపర్ టైగర్స్ ఎవరో ప్రజల్లో పని చేసే నాయకులెవరో తెలిసిపోతుంది. అందుకని ఇలాంటి వారంతా బిఎస్‌పిలో చేరకుండా నాయకులుగా అనేక ప్రకటనలు ఇస్తుంటారు. ఎన్నికల్లో నిలబడకుండా తప్పించుకుంటుంటారు.

ఇలా ప్రతి కులానికి సంబంధించిన కుల సమన్వయ కమిటీల ద్వారా బిఎస్‌పిలో రాష్ట్రం మొత్తం మీద ఆ కులానికి సంబంధించిన నాయకులు ఎంతమంది ఎదుగుతారో ఈ కింద చూద్దాం.

1. రాష్ట్ర కుల సమన్వయ కమిటి అధ్యక్షులు	1
2. జిల్లా కుల సమన్వయ కమిటి అధ్యక్షులు ఒకటి చొప్పున 23 జిల్లాలకు	23
3. పార్లమెంట్ నియోజకవర్గ కుల సమన్వయ కమిటీ అధ్యక్షులు 42 నియోజకవర్గాలు	42
4. అసెంబ్లీ నియోజకవర్గ కుల సమన్వయ కమిటీ అధ్యక్షులు 294 నియోజకవర్గాలు	294
5. సెక్టార్ కమిటీ అధ్యక్షులు 294×20	5880
ప్రతి కులానికి రాష్ట్రంలో మొత్తం అధ్యక్షులు	6240

ఇలా ప్రతి కులానికి 6240 చొప్పున రాష్ట్రంలో 8-10 కులాలకు కుల సమన్వయ కమిటీలు ఏర్పడితే మొత్తం బిసి నాయకులు రాష్ట్రం మొత్తమ్మీద కనీసం 65వేల మంది ఎదుగుతారు. వీళ్ళు తలా పది నుంచి వందమంది ఓటర్లను సమీకరిస్తే లక్షల్లో ఓటు బ్యాంకు తయారవుతుంది. అలాగే బిఎస్‌పిలో ముస్లింలు రాష్ట్రంలో 6240 మంది నాయకులు ఉంటారు. అలాగే తక్కువ సంఖ్యలో గల బిసి కులాలకు కూడా వారున్న మేరకు కుల సమన్వయ కమిటీలు ఉంటాయి.

ప్రతి కుల సమన్వయ కమిటీలో దళితులు బాధ్యత తీసుకొని ఆ కులాలకు సేవ చేయాలని కాన్షీరామ్ ఆదేశించారు. మహాత్మా జ్యోతిబాపూలే నుండి నారాయణ

గురు, ఛత్రపతి సాహుజీ మహరాజ్, పెరియార్ రామస్వామి నాయకర్, డా॥ బి.ఆర్.అంబేద్కర్ వరకు ఈ మహాపురుషులంతా అస్పృశ్యులను సంఘటిత పరచడానికే తమ జీవితాలను ధార పోశారు. అంబేద్కర్‌ను మినహాయిస్తే మిగిలిన వారంతా బిసి కులాలకు చెందిన వారే. ఆయా మహాపురుషులు చేసిన కృషి వల్ల అస్పృశ్యులు సామాజికంగా, రాజకీయంగా చైతన్యవంతులయ్యారు. బిసిలకు సామాజిక, రాజకీయ చైతన్యం కొరవడింది. ఆ మహాపురుషుల రుణం తీర్చుకోవడానికి దళితులు బిసిలను సంఘటితం చేయాల్సి వుంది అని కాన్షీరామ్ ఉద్బోధించారు. అలా ప్రతి కుల సమన్వయ కమిటీలో దళితులు కూడా బాధ్యత తీసుకొని ఆ కులాలు రాజకీయంగా, సామాజికంగా, తాత్వికంగా శక్తివంతం కావడానికి కృషి చేస్తారు.

ఇటీవల బ్రాహ్మణులను, వైశ్యులను, కమ్మ, రెడ్డి, కాపు తదితర అగ్రకులస్తులను కూడా తీసుకుంటున్నారు. కనక బిఎస్‌పికి అనుబంధంగా బ్రాహ్మణ కుల సమన్వయ కమిటి ద్వారా 6240, వైశ్య కుల సమన్వయ కమిటీ ద్వారా 6240, కమ్మ కుల సమన్వయ కమిటీ ద్వారా 6240 మంది అధ్యక్షులు ఉంటారు. కుల సమన్వయ రాష్ట్ర కమిటీ నాయకులు వారి కులాలను సమీకరించడానికి పార్టీ అనుమతితో రాష్ట్ర నాయకులుగా రాష్ట్రమంతటా తిరగవచ్చు. కానీ నియోజకవర్గాల కమిటీ నాయకులు ఆ నియోజకవర్గం పరిధి దాటి పోయేది లేదు. రాష్ట్ర నాయకులుగా తిరిగేది లేదు. అలా తిరిగితే ఒక్క జిల్లాకు ఇద్దరు కలెక్టర్లు వున్నట్లుగా పని అస్తవ్యస్తమవుతుంది.

ఇలా ఉత్తర ప్రదేశ్‌లో 2002 ముందునుండి పార్టీ నిర్మాణం, కుల సమన్వయ కమిటీలు పకడ్బందీగా నిర్మించడం జరిగింది. ఎవరికి టిక్కెట్టిచ్చి గెలిపించినా బిఎస్‌పి పార్టీ స్వభావంలో పని విధానంలో దళితులు కీలక పాత్ర వహిస్తారు. **అందువల్లే బిఎస్‌పి టిక్కెట్‌తో గెలిచి పార్టీ ఫిరాయించిన వాళ్ళు మళ్ళీ పోటీ చేసినప్పుడు ఓడిపోయారు. బిఎస్‌పి కొత్తగా రంగంలోకి దించిన అభ్యర్థులనే ప్రజలు గెలిపించారు.** దీన్నే బిఎస్‌పి ఓటు బ్యాంకు అంటారు. ఇలా ఎవరిని అభ్యర్థిగా నిలిపినా ఓటు బ్యాంకు చెక్కుచెదరని విధంగా బిఎస్‌పి నిర్మాణం సాగుతున్నది.

అందువల్ల 2007 ఎన్నికల్లో మాయావతి బ్రాహ్మణ, ఠాకూర్, వైశ్యులకు ఎక్కువ టిక్కెట్లిచ్చినప్పుడు ఆయా కులాల ఓట్లు బిఎస్‌పికి అదనంగా వచ్చాయి. బిఎస్‌పి ఓటు బ్యాంకు అలాగే వుంది. బిఎస్‌పి ఓటు బ్యాంకు ఈ అగ్రకులాలను గెలిపించడానికి ఉపయోగించబడింది. గెలిచిన అగ్రవర్ణాలు కూడా బిసి, ఎస్సీ అభ్యర్థులు నిలబడ్డచోట ప్రచారం చేసి వారి ఓట్లను బిఎస్‌పి అభ్యర్థులకు బదలాయించారు. ఇలా అగ్రవర్ణాలు

కూడా బిఎస్‌పి నిర్మాణంపై ఆధారపడి బిఎస్‌పి నిర్మాణాన్నే బలోపేతం చేస్తారు.

బిఎస్‌పి అగ్రవర్ణాల వారికి ఎక్కువ టిక్కెట్లు ఇవ్వడం ద్వారా అగ్రవర్ణాల పార్టీగా మారిపోయిందని విమర్శించే వాళ్ళు బిఎస్‌పి పార్టీ పని విధానం తెలియని వాళ్ళే. బిఎస్‌పిలో తమ భవిష్యత్తును వెతుక్కుంటూ బిసిలు చేరినప్పుడు వారికి కూడా ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుంది. అగ్రవర్ణాలనే స్వీకరించిన బిఎస్‌పి బిసిలను ఎందుకు మరుస్తుంది? మండల్ కమిషన్ లాగు కరో వర్నా కుర్సీ ఖాలీ కరో అని దేశ వ్యాప్తంగా బిఎస్‌పి నినదించి మండల్ కమిషన్ అమలు కోసం సంవత్సరం పైగా ఢిల్లీలో మహాధర్నాలు నిర్వహించిందని ఎంత మంది బిసిలకు తెలుసు?

కాంగ్రెస్, టిడిపి, బిజెపి, వామపక్షాలు తమ పార్టీ నిర్మాణాన్ని బిఎస్‌పిలాగా మార్చుకుంటే తప్ప బిఎస్‌పితో పోటీ పడలేరు. అందుకే బిఎస్‌పి పెరుగుతున్న కొద్దీ అన్ని పార్టీల్లో బిసి, ఎస్సీల ప్రాధాన్యత పెరుగుతూ ఉంటుంది. బిజెపిలో బంగారు లక్ష్మణ్ జాతీయ అధ్యక్షుడైనా, కాంగ్రెస్‌లో కోనేరు రంగారావు 1994లో ఉపముఖ్యమంత్రి అయినా అదంతా బిఎస్‌పి ప్రభావమే. నక్సలైట్, మావోయిస్టు పార్టీలు కాంగ్రెస్, టిడిపి పార్టీల్లాగా అగ్రవర్ణ నాయకత్వంలో కొనసాగుతున్నాయి. అవి బిసి, ఎస్సీల నాయకత్వంలోకి పరివర్తన చెందడానికి బిఎస్‌పి నిర్మాణం, పని విధానం మార్గదర్శకత్వంలో ముందుకు సాగడం తప్ప మరో మార్గం లేదు. బిసిలు కూడా బహుజన సమాజ్ పార్టీ నిర్మాణ సూత్రాలపై బిసిల నాయకత్వంలో స్వయంగా పార్టీలు నిర్మించుకోవచ్చు. ఉదాహరణకు ఎస్సీ అధ్యక్షుని స్థానంలో, ఇన్‌ఛార్జి స్థానంలో బిసి ఉంటూ ఉపాధ్యక్షుని స్థానంలో ఉప ఇన్‌ఛార్జ్ స్థానంలో ఎస్సీలను తీసుకుంటూ పార్టీని నిర్మించుకోవచ్చు. అలా యథాతథంగా బిఎస్‌పి పని విధానాన్ని, నిర్మాణాన్ని బిసిలు తమకనువుగా మలచుకుంటూ పార్టీని విస్తరింప చేసుకోవచ్చు. తమ శక్తి పెంచుకుంటూ బిఎస్‌పితో సీట్ల సర్దుబాటు చేసుకొని పరస్పరం లాభపడవచ్చు.

నియోజకవర్గ స్థాయిలో పైన పేర్కొన్న అన్ని కమిటీలు ఏర్పడి కార్యక్రమాలను ఉద్యమాలను సమర్థవంతంగా నడిపించినప్పుడే ఆ నియోజకవర్గంలో బిఎస్‌పి పార్టీ తన అభ్యర్థిని ప్రకటిస్తుంది. తన అభ్యర్థిని ప్రకటించింది అంటే అక్కడ బిఎస్‌పి పై అన్ని కమిటీలను, నిర్మాణాలను కలిగి వున్నదని అర్థం.

బిఎస్‌పి పార్టీ అభ్యర్థిగా ఎన్నికల్లో అభ్యర్థిని ఎలా నిర్ణయిస్తారు? అనేప్రశ్న సహజంగా కలుగుతుంది. ఎన్నికల నియోజక వర్గం ఇంఛార్జీల నుండే ఎన్నికల అభ్యర్థిని ఎన్నుకుంటారు. ఎన్నికల ఇంఛార్జిలు ముగ్గురు ఉంటారు. ఎన్నికలు ప్రకటించే నాటికి ఇతర పార్టీలు వాటి సామాజిక సమీకరణలు, అభ్యర్థులు అనుసరించి ఈ

ముగ్గురిలో ఎవరిని ఎన్నికల్లో నిలబెడితే బాగుంటుందో నిర్ణయిస్తారు.

అలాగే నిర్మాణాన్ని పటిష్టపరిచి కార్యకర్తల అభిమానం చూరగొన్న బాంసెఫ్ నాయకులు కూడా పార్టీ ఆదేశాన్ననుసరించి ఉద్యోగం వదిలేసి ఎన్నికల్లో పోటీ చేస్తుంటారు.

రాష్ట్రంలో బిసిలకు ఏ.పి.లో యుపి కన్నా రెట్టింపు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇవ్వకపోతే బిసిలను ఇతర పార్టీలకు వదిలేసినట్టవుతుంది. తద్వారా ములాయం లాగా బిసిలు ఆలస్యంగానైనా సొంత పార్టీ పెట్టుకోమని పరోక్షంగా చెప్పినట్టవుతుంది. అందుకని ఇవన్నీ గుర్తించి రాష్ట్రంలో ఎస్సీలతో సమానంగా బిసీల నాయకత్వం కూడా ప్రధానమే అని గుర్తించడం జరిగింది.

అయితే బిసీలు బిఎస్పిలో చేరకుండానే చేరినట్లుగా భ్రమపడుతూ బిసిలకు స్థానం తక్కువని ప్రచారం చేస్తుంటారు. వాళ్ళు చేరితే కదా బిసిల సంఖ్య పెరిగేది! కలిసి పనిచేయని వారే ఎక్కువ చర్చలు చేస్తారు. కలిసి పని చేయని దానికి చర్చలు దేనికి?

ఒకసారి ఒక మిత్రుడు గద్దర్‌ను కాన్షీరామ్‌కు పరిచయం చేశారు. బిఎస్పి గురించి, దాని పనివిధానం గురించి గద్దర్‌కు వివరించమని ఆ నాయకుడు కాన్షీరామ్‌ను కోరారు. గద్దర్‌ను మీరు బిఎస్పిలో చేరుతారా? చేరేదైతే ఎన్ని రోజులైనా మీకు బిఎస్పి గురించి వివరిస్తాను. చేరకపోతే మాట్లాడ్డం దేనికి? అంటూనే నా దగ్గర టైమ్ లేదని కాన్షీరామ్ గద్దర్‌కు నమస్కరించారు. అలాగే బిఎస్పిలో చేరిన తర్వాత ఎన్ని సందేహాలైనా తీర్చుకోవచ్చు. చేరాలనే నిర్ణయం తీసుకుంటే బిఎస్పి నాయకులు తమ శ్రమను, మేథస్సును వారికి అందిస్తారు.

అయితే బిసిలకు అనేక సందేహాలున్నాయి. ఎస్సీలకు 1932 నుండి చట్ట సభల్లో రిజర్వేషన్లు కొనసాగుతున్నాయి. బిసిలకు చట్టసభల్లో ఇప్పటికీ రిజర్వేషన్లు లేవు. కనుక అంబేద్కర్ సైమన్ కమిషన్‌తో వాదించి 1932లో సాధించిన రిజర్వేషన్లను బిసిలు ఇప్పుడైనా సాధించుకోవలసిన దశలో వున్నారు. అనగా బిసిల ఉద్యమం 1932లో దళితులు రిజర్వేషన్లు సాధించిన కాలం నాటికి వెనక్కి మళ్ళీ ఉద్యమాలు చేయవలసి వుంటుంది అని భావిస్తున్నారు. ఎస్సీలకు, ఎస్టీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు అనేవి రాజ్యాధికారంలో వారి వాటాను వారికి ఇచ్చేశాయి. దాన్ని అందుకున్నారు. అనుభవిస్తున్నారు. బిసిలకు ఈ వాటా అందలేదు. అందువల్ల ఎస్సీలకు, ఎస్టీలకు రిజర్వేషన్లు అనే చెప్పులు, గొడుగు, ఊతకర్ర ఉన్నాయని ఆ చెప్పులు, గొడుగు లేని బిసిలు చెప్పులున్న వారితో కలిసి నడవడం వల్ల ముల్లు గుచ్చుతాయని అంటున్నారు.

అందువల్ల బిసిల గురించి మరింత విశాల హృదయంతో ఆలోచించాల్సిన అవసరం వుంది. జనాభా నిష్పత్తి ప్రకారం చూస్తే భారతదేశంలో బిసిల సమస్య ప్రధాన వైరుధ్యం అని గుర్తించాల్సిన అవసరం వుంది. చట్టసభల్లో, ఉద్యోగాల్లో అగ్రకులాలు తమ జనాభా నిష్పత్తికి అదనంగా అనుభవిస్తున్నదంతా బిసిలదే. దాన్ని బిఎస్పి అగ్రకులాలకు కేటాయించడం సరైంది కాదు అని బిసిలు బాధపడుతున్నారు.

స్త్రీలు కూడా చట్ట సభల్లో రిజర్వేషన్లు కోరుతున్నారు. అందువల్ల చట్టసభలలో సీట్లను రెట్టింపు చేయాలి. 1950 నాటి జనాభాకు నేటి జనాభా మూడు రెట్లుంది. ఏడు కోట్ల జనాభా వున్న ఇంగ్లండులో మూడువందలపైగా పార్లమెంటు సభ్యులున్నారు. 110 కోట్ల జనాభాకు పార్లమెంటులో 2,500 సభ్యులు వుండడం ఎక్కువేమీ కాదు. పెంచిన సీట్లలో 40 శాతం స్త్రీలకు, 25 శాతం ఓబిసిలకు, 25 శాతం ఎంబిసిలకు రిజర్వేషన్ కల్పించాలి. ఈ నినాదాలు బిఎస్పి కూడా తీసుకోవాలని బిసిల కోరిక.

కుల సంఘాలకు రాజకీయ రంగంలో బిఎస్పి ఒక సువర్ణావకాశం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కుల సంఘాలు తమ నాయకుల్లోంచి రాజకీయాలపై ఆసక్తి, ఉత్సాహం వున్న వారిని మూడింట ఒక వంతు మందిని రాజకీయాలకు, బిఎస్పి కుల సమన్వయ కమిటీలకు బదిలీ చేసి తమ రాజకీయ చైతన్యాన్ని, వాటాను పెంచుకోవచ్చు. బిజెపికి ఆరెస్సెస్ తన కార్యకర్తలను ఇలాగే బదిలీ చేసింది.

ఇలా బిఎస్పి కోసం పని చేయడానికి మూడంచెల నిర్మాణం ఉంది. ఒకటి బిఎస్పి. రెండు కుల సమన్వయ కమిటీలు. మూడు బాంసెఫ్. వీటి ఆధ్వర్యంలో మరికొన్ని నిర్మాణాలున్నాయి. సాహిత్య కళాకారుల బృందాలు, అయిదు ఉద్యమాలకు అవసరమైన ప్రత్యేక కమిటీలు.

బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థి విభాగం, బహుజన వాలంటరీ ఫోర్స్, బహుజన కళామండలి, అనుబంధ సంఘాలు స్వతంత్రంగా పని చేస్తాయి.

నాయకత్వ సామర్థ్యానికి ఏది గీటు రాయి? మిమ్మల్ని ఎంత మంది ఫాలో అవుతున్నారు అనేదే ముఖ్యం. అదే మీ నాయకత్వ స్థానాన్ని తెలుపుతుంది.

బిఎస్పికి సామాజిక వర్గాల్లోని వర్గాల పట్ల స్పష్టమైన అవగాహన ఉంది.

10శాతం మంది పాలసీ మేకర్స్ లేదా ఒపీనియన్ మేకర్స్‌గా ఉంటారు.

20 శాతం మంది వాటిని అమలు చేసేవాళ్ళు ఉంటారు.

70శాతం మంది అనుచరులు - వీరిని సామాన్య ప్రజలు అని పిలుస్తారు. కొందరు వీరిని గొర్రెదాటు మనుషులు అని అంటారు.

బిఎస్‌పి పై ముప్పై శాతం గురించి ఆలోచిస్తుంది. వారిని పెంచుకుంటూ పోతుంది. తద్వారా సామాన్య ప్రజలు ప్రభావితం అవుతారు.

ఇలా బహుజన సమాజ్‌పార్టీ ఓటు పట్ల బహుజనుల్లో నూతన సిద్ధాంత దృక్పథాన్ని ప్రవేశపెట్టింది. ప్రజల నుండి కార్యకర్తలను, నాయకులను, పార్టీని నిర్మించింది. అలా ఉత్తరప్రదేశ్‌లో విజయం సాధిస్తూ వస్తున్నది. పశ్చిమ బెంగాల్‌లో సిపిఎం దశాబ్దాల తరబడి ఎలా అధికారంలోకి వస్తున్నదో అలాగే బిఎస్‌పి కూడా తన నిర్మాణం ద్వారా సిద్ధాంతాల ద్వారా సమర్థవంతమైన పరిపాలన ద్వారా సామాజిక పరివర్తనను సాధించి తిరిగి అధికారంలోకి రావడానికి బాటలు వేసుకుంటుంది. బహుజన సమాజ్ పార్టీ ఈ విశ్వాసంతో ముందుకు సాగుతున్నది.

కాల గమనంలో, బాట పయనంలో ఎన్నో ముళ్ళు, ఆటంకాలు తప్పవు. ప్రయోగాలు తప్పవు. ప్రయోగాలే అనుభవాలను ఇస్తాయి. ప్రయోగం మీద మరో ప్రయోగం చేస్తూ ముందుకు సాగడమే శాస్త్రవేత్తల కర్తవ్యం. సామాజిక శాస్త్రవేత్తలుగా బహుజన సమాజ శాస్త్రవేత్తలు ఇలా నిరంతరం ప్రయోగాలు చేయడాన్ని చర్చిస్తూ ఉండాలి. ముందుకు తీసుకెళుతూనే ఉండాలి. ప్రయోగాలు విఫలమైతే గుణపాఠాలు తీసుకోవాలి. ప్రయోగాలు విజయవంతమైతే అన్ని చోట్లా ఆ ప్రయోగాలను ఆచరణాత్మకంగా ప్రయోగించి చూడాలి. ఇలా సిద్ధాంతం, సామాజిక పరిణామాల, సమీకరణాల అధ్యయనం, ఆయా పార్టీల అధ్యయనం, ప్రయోగం, పార్టీ నిర్మాణం, రాజకీయ కార్యక్రమంతో ముందుకు సాగడం ద్వారా బిఎస్‌పి ఎదుగుతున్నది.

> "భారతదేశ చరిత్రలో తొలిసారిగా - అందులోనూ రాజకీయంగా, భౌగోళికంగా పెద్ద రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్‌లో - ఒక దళిత రాజకీయ పక్షం వేరొకరి సాయం లేకుండా స్వతంత్రంగా స్వంత బలంతో ప్రభుత్వాన్ని స్థాపించనుండడం చరిత్రాత్మక పరిణామం. అరవైఏళ్ల పార్లమెంటరీ ప్రజాస్వామిక ప్రయోగ సాఫల్యాలలో ఒకటిగా నిస్సందేహంగా పేర్కొనదగినది."
>
> – *'వార్త' సంపాదకీయం; 12-5-2007*

బహుజనులకు రాజ్యాధికారం సాధ్యమేనని దేశవ్యాప్తంగా

స్ఫూర్తినిచ్చిన మాయావతి

ఉత్తర ప్రదేశ్ ఎన్నికల ఫలితాలు 11 మే, 2007న వెలువడ్డాయి. 13 మే రోజున మాయావతి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ విజయోత్సవం సందర్భంగా దేశంలోని అన్ని పార్టీల నాయకులు మాయావతిని అభినందించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు అభినందించడానికి వెల్లువెత్తారు. ఎవరూ రావద్దని మాయావతి ఆదేశించారు.

మాయావతి స్వయంగా వివరించిన విశేషాలు

పది రోజుల తర్వాత 25 మే, 2007న మాయావతి ఆయా రాష్ట్రాల బిఎస్‌పి అధ్యక్షులను, నాయకులను ఢిల్లీకి ఆహ్వానించారు. సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాయావతి అనేక విషయాలను వివరించారు. విజయాన్ని సమీక్షించారు.

అలా మాయావతి స్వయంగా వివరించిన ప్రకారం ఉత్తరప్రదేశ్‌లో నేటి విజయం ఒక ప్రయోగం యొక్క విజయం. ఇలాంటి ప్రయోగాలు బిఎస్‌పికి కొత్త కాదు. ఎప్పటికప్పుడు కొత్త ప్రయోగాలు చేసుకుంటూ బిఎస్‌పి ముందుకు సాగుతున్నది.

సైద్ధాంతిక, ఎత్తుగడల, పొత్తుల రంగంలో అనేక ప్రయోగాలు జరిగాయి

బహుజన సమాజ్ పార్టీ పుట్టుకనుండి వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ నిర్మూలించడానికి రాజకీయ రంగంలో ఏఏ సామాజిక వర్గాలు కలిస్తే ఏఏ ఫలితాలు వస్తాయో విద్యావంతులు, మేధావులు అనేక కోణాల్లో చర్చిస్తూ వస్తున్నారు. రాజకీయ నాయకులు, బాంసెఫ్ మేధో వర్గం అనేక కాంబినేషన్‌లను పరిశీలించారు.

బిఎస్‌పి ప్రభుత్వం పడిపోయాక ఓబిసిలపై పునరాలోచన సాగింది

యుపిలో బిఎస్‌పి ప్రభుత్వం పడిపోయాక 1995 నుండి ఢిల్లీ యూనివర్సిటీలో, జె.ఎన్.యులో ఈ విషయమై అనేక చర్చలు సాగాయి. ఓబిసిలకు ప్రతినిధి అయిన

ములాయంసింగ్ యాదవ్ నుండి చేదు అనుభవాలు ఎదురయ్యాయి. ప్రత్యామ్నాయ కాంబినేషన్‌లను గురించి అనేక విధాలుగా చర్చించారు.

కొత్త కొత్త పొత్తులు, కాంబినేషన్‌ల చర్చలు

కుల వ్యవస్థలో అత్యున్నత స్థానంలో ఉన్న బ్రాహ్మణులు అట్టడుగు స్థానంలో ఉన్న దళితులు ఒక్కటైతే సమాజంలో కుల వివక్ష సహజంగానే తగ్గుతుంది అని చర్చలు సాగాయి. అలాంటి చర్చల్లో పాల్గొన్న వారిలో చంద్రభాను ప్రసాద్ ఒకరు.

కాన్షీరామ్ చెప్పేదానికి జరుగుతున్న దానికి మధ్య వ్యత్యాసం పసికట్టిన తీరు

కాన్షీరామ్ పెన్నును తీసుకొని పెన్ను మూతను అగ్ర కులాల పై పొరగా పెన్ను అట్టడుగు భాగంలో దళితులుగా పెన్ను మధ్య భాగాన్ని బిసిలుగా చెప్పేవారు. ఈ నిలువుగా ఉన్న పెన్నును అడ్డంగా పెడితే అన్ని కులాలు సమానం అవుతాయని చెప్పేవారు. రాజకీయ సంబంధాలు కాకపోయినా సామాజిక సంబంధాలు సమానం అవుతాయని, అందుకు అగ్ర కులాల ప్రతిపత్తిని బహుజనులు గుర్తించకుండా తమను తాము శక్తివంతులుగా మార్చుకొని రాజకీయ అధికారాన్ని సంఘటిత శక్తితో కైవసం చేసుకోవాలని కాన్షీరామ్ చెప్పేవారు.

అయితే ఆయన ఈ చర్చ చేసినప్పుడు మరొక మేధావుల బృందం అలా ఎందుకు ఉండాలి ? దళితుల నాయకత్వంలో బహుజన సమాజ పార్టీ, రాజకీయ అధికారాన్ని అందుకుంటున్నప్పుడు దళితుల నాయకత్వంలో మొత్తం సమాజం నడుస్తుంది కనుక కాన్షీరామ్ చెప్పినట్లుగా పెన్ను అడ్డంగా పడుకోబెట్టినట్లుగా కాకుండా పెన్నును తలకిందులుగా చేసి దళితులను ఉన్నత స్థానంలో ఉంచినట్టు అవుతున్నది. కనుక పెన్నును అడ్డంగా పడుకోబెట్టడం అనే ప్రక్రియ ఇప్పుడు ఆచరణలో లేదు అని అన్నారు.

పై వర్గాలు అట్టడుగు వర్గాలు కలిస్తే కుల వివక్ష పోతుందా?

మరొక సెక్షన్ పై నున్న బ్రాహ్మణులు కుల వ్యవస్థకు కారకులు కనుక పైనున్న బ్రాహ్మణులు అట్టడుగున ఉన్న దళితులు కలిసి ఐక్య సంఘటన కడితే కుల వివక్షత దానంతట అదే దాని ప్రాధాన్యతను కోల్పోతుంది అని వాదించారు.

ఇలా గత పదిహేనేళ్ళుగా కులాల సమీకరణలో అనేక ప్రయోగాలు జరిగాయి. వాటి పర్యవసానమే నేటి ఉత్తరప్రదేశ్‌లో అగ్ర కులాలకు సీట్లను కెటాయించిన ప్రయోగం.

వారి చర్చలు ఇటీవలి కొత్త సామాజిక పరిస్థితుల్లో ఒక ప్రయోగంగా ప్రయత్నించి చూద్దాం అని అనుకోవడం జరిగింది. 2002లో కొంతమేరకు ఆచరించడం జరిగింది. విజయాలు ఆశాజనకంగా వచ్చాయి. పర్యవసానంగా 2007లో జనాభా నిష్పత్తి ప్రకారం 46 టిక్కెట్లు ఇవ్వాల్సిన బ్రాహ్మణులకు, అగ్రకులాలకు రెట్టింపు టిక్కెట్లు ఇవ్వడం జరిగింది.

ఎన్నికల్లో ఓబిసిల ముస్లింల వైఫల్యమే కొత్త ప్రయోగాలకు తెరతీసింది

అగ్రవర్ణాలకు ఎక్కువ టిక్కెట్లు ఇవ్వడానికి ప్రధాన కారణం ఒబిసిల, ముస్లింల వైఫల్యం. గతంలో మూడు ఎన్నికల్లో ఒబిసిలకు, ముస్లింలకు వారి జనాభాను మించి టిక్కెట్లు కెటాయించడం జరిగింది. అగ్రకులాలకు అవకాశం ఇవ్వనప్పుడు అగ్రకులాల జనాభా నిష్పత్తి మేరకు అదనంగా వుండే సీట్లను కూడా ముస్లింలకు, ఓబిసిలకు బిఎస్‌పి కేటాయించింది. కానీ, ఒబిసిలు తమ ఓట్లను తమ కులాల అభ్యర్థికి వేసుకోలేక పోయారు. అలాగే ముస్లింలు, ముస్లింల అభ్యర్థికి ఓటు వేసుకోలేక పోయారు. ముస్లింలకు మత చైతన్యం తప్ప రాజకీయ చైతన్యం తక్కువ. తద్వారా చాలా మేరకు పార్టీ అక్కడ ఓడిపోయింది.

దీన్ని గుణపాఠంగా తీసుకొని అగ్రకుల పార్టీల మీద ఆధారపడే బదులు, అగ్రకుల ఓటర్లపై ఆధారపడి పార్టీ బలం పెంచుకోవాలని భావించి 2007లో ఒబిసిలకు, ముస్లింలకు టిక్కెట్లు తక్కువ ఇచ్చి వాటిని రాజకీయంగా చైతన్యవంతులైన బ్రాహ్మణులకు కేటాయించడం జరిగింది. అలా బ్రాహ్మణులకు రెట్టింపు టిక్కెట్లు దక్కాయి. ప్రయోగం సక్సెస్ అయ్యింది. కానీ ఓబిసిలకు, ముస్లింకు ధారాళంగా టిక్కెట్లు ఇచ్చిన ప్రయోగం అంతగా విజయంవంతం కాలేదు. ఇది ఉత్తర ప్రదేశ్ చరిత్ర.

బి.ఎస్.పి మూడుసార్లు అధికారంలోకి వచ్చినప్పుడు ఇతర పార్టీల మీద ఆధారపడాల్సి వచ్చింది. వాళ్ళు అకస్మాత్తుగా మద్ధతు ఉపసంహరించుకున్నారు. అసలు వాళ్ళ పార్టీల మీద ఎందుకు ఆధారపడాలి? వాళ్ళకున్న ఓటు బ్యాంకును మనం ఆకర్షించడం ద్వారా మన బలం పెరుగుతుంది. ఆ పార్టీల బలం తగ్గుతుంది. ఆయా అగ్రవర్ణ పార్టీల మద్దతు తీసుకునే బదులు ఆ అగ్రవర్ణ పార్టీలకు అండగా వున్న అగ్రవర్ణ ప్రజలను తమవైపు ఆకర్షించుకుంటే ఇతరుల మీద ఆధారపడే పరిస్థితి ఉత్పన్నం కాదు.

కనుక ఆ పార్టీలకున్న అగ్రకులాల ఓటు బ్యాంకును సహృదయతతో, స్నేహ హస్తంతో ఆకర్షించాలని మాయావతి భావించారు. ఇలా మూడుసార్ల ముఖ్యమంత్రి

పదవి అనుభవంతో మాయావతి అనేక పాఠాలు తీసుకున్నారు. దానివల్ల ఇవాళ పార్టీ అగ్ర కులాల మద్దతును కూడా పొందగలిగింది. అగ్ర కులాల ప్రజలు దళితుల నాయకత్వాన్ని ఆమోదిస్తూ ఓట్లు వేశారు.

రాజకీయ ఐక్యత సామాజిక సంస్కృతిక ఐక్యతకు దారితీసిన తీరు

ముందే చెప్పినట్లు బ్రాహ్మణులకు టికెట్లు ఇచ్చినందుకు బ్రాహ్మణ స్త్రీలు వారి ఇండ్లల్లో బ్రాహ్మణేతరులకు అస్పృశ్యులతో సహా అందరికీ స్వయంగా వంట చేసి వడ్డించారు. దళితుల ఇళ్ళల్లో బ్రాహ్మణ స్త్రీలు, దళిత స్త్రీలు చేసిన వంటను ఎలాంటి భేషజం లేకుండా భోజనం చేశారు. ఇలా బ్రాహ్మణ స్త్రీలకు, దళిత స్త్రీలకు మధ్య సాన్నిహిత్యం పెరిగింది. వైషమ్యాలు తగ్గి సోదరభావం, స్నేహభావం పెరిగింది. ఇలా అన్ని ప్రాంతాల్లో వీరి ఇళ్ళల్లో వారు, వారి ఇళ్ళల్లో వీరు తిన్నారు. ఇలా రాజకీయ ఐక్యత సామాజిక సాంస్కృతిక ఐక్యతకు దారి తీసింది.

మీడియా వ్యతిరేక ప్రచారం వల్ల బిఎస్పి 115 సీట్లు కోల్పోయింది

మీడియా చేసిన వ్యతిరేక ప్రచారం వల్ల బిఎస్పి అనేక సీట్లను కోల్పోయింది. మీడియా ప్రచారం విద్యావంతులకు, పట్టణాలకు పరిమితమైనప్పటికీ అది పది, పదిహేను వేల ఓట్లను నియోజకవర్గంలో ప్రభావితం చేయగలిగింది అని బిఎస్పి గుర్తించింది. వారి వ్యతిరేక ప్రచారం వల్ల 115 సీట్లు కొద్ది మెజారిటీ తక్కువై బిఎస్పి కోల్పోయింది. బిఎస్పికి మాయావతి అంచనాల ప్రకారం 305 నుండి 320 సీట్లు రావాలి. కానీ 207 వచ్చాయి. 70 సీట్లు కేవలం 5వేల ఓట్లతో కోల్పోయారు. 29 సీట్లు వెయ్యి ఓట్లతో కోల్పోయారు. అందులో 19 సీట్లు కేవలం 200 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఇలా మీడియా ప్రభావం వల్ల 115 సీట్లు బిఎస్పి కోల్పోయి ఇతరులు సాధించుకున్నారు.

మాయావతి 'మాయాయుగ్' సొంత మీడియా

మీడియాను దూరంగా ఉంచాలి అనే మాయావతి మీడియా వేసే ప్రభావాన్ని గుర్తించారు. ఎవరి మీడియా మీదో ఆధారపడడం దేనికని డిఎమ్కె, అన్నాడిఎమ్కెలాగే మాయావతి 'మాయాయుగ్' టీవీ ఛానెల్ని, దినపత్రికను ప్రారంభించనున్నట్లు ఇటీవల ప్రకటించారు. ఇలా తమిళనాడులోని డిఎమ్కె, అన్నాడిఎమ్కె గత 40ఏళ్ళుగా సినిమా, టీవీ, పత్రికా ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా తమ పార్టీల ప్రచారం చేసుకుంటున్న తీరును, ఆంధ్రప్రదేశ్లో ఈనాడు, ఆంధ్రజ్యోతి టిడిపికి, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ కాంగ్రెస్కు, ప్రజాశక్తి సిపిఎమ్కు పార్టీల ప్రచారం చేసుకునే వేదికలుగా మారిన

క్రమానికి మాయావతి కూడా రావడం హర్షణీయం. మాయావతి మీడియా, టీవీ ఛానెల్, పత్రిక భారతదేశ భావజాల రంగంలో, ఛానెల్ రంగంలో తన ప్రభావంతో పలు పెను మార్పులకు లోనుచేస్తుంది.

మాయావతి మీడియాను దూరం ఉంచి సాధించిన విజయం

మాయావతి మీడియాను ఎన్నికల్లో ఒక్కసారి కూడా కలవలేదు. ప్రెస్మీట్లు ఒక్కసారి కూడా పెట్టలేదు. వారు అడిగినా ఎవరికీ ఇంటర్వ్యూలు ఇవ్వలేదు. మనీ మీడియా మాఫియాలకు దూరంగా ఉండాలనే దృక్పథానికి కట్టుబడి పని చేసుకుంటూ వెళ్ళారు. ప్రజల్లో ప్రచారం చేసుకుంటూ వెళ్ళారు. నిర్మాణాన్ని, కార్యకర్తలను నమ్ముతున్న నేను ఉత్తర ప్రదేశ్లో పార్టీ నిర్మాణం మీదనే ఎక్కువ దృష్టి కేంద్రీకరించాను. నన్ను ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థులు సభల్లో పాల్గొనాలని కోరినప్పటికీ జడ్ కేటగిరీ భద్రత దృష్ట్యా అన్ని చోట్లకు వెళ్ళడం వీలు కాలేదు. అయినా అన్ని జిల్లాలను పర్యటించాను అని మాయావతి వివరించారు.

ఏడాది ముందే అభ్యర్థులను ప్రకటించడం ప్రపంచానికే ఆదర్శం

ఏడాది ముందే అభ్యర్థులను ప్రకటించడం ప్రపంచానికే ఆదర్శం. తద్వారా ఆ ఏడాదంతా సివిల్ పరీక్షలకు, ఎంసెట్ లాంగ్టర్మ్ కోచింగ్లకు నిరంతరం కష్టపడ్డట్టుగా అభ్యర్థులు, ఆ నియోజకవర్గ కార్యకర్తలు, ఆ అభ్యర్థి కులానికి సంబంధించిన ఇతర ప్రాంతాల ప్రజలు తప్పకుండా గెలవాలని ఏడాదంతా కష్టపడతారు. గెలుపును సాధించే దాకా నిద్రపోకుండా కృషి చేస్తారు. ఇలా మాయావతి ఏడాది ముందే పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించారు. విజయం సాధించి చూపారు.

2009 పార్లమెంట్ ఎన్నికల్లో 200పైగా ఎంపిలు గెలిచే దిశలో....

మరిన్ని సవాళ్ళను ఎదుర్కోవడానికి బిఎస్పి ఎప్పటికీ సిద్ధమేనని మరిన్ని ప్రయోగాలు చేయడానికి వెనుకంజ వేసేది లేదని సృజనాత్మకంగా ఆలోచించాలని మాయావతి అన్నారు. త్వరలో రాబోయే మధ్యప్రదేశ్ ఎన్నికల తర్వాత బిఎస్పి అధికారంలోకి వస్తుంది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 200పైగా సీట్లు సాధించి దేశంలోనే మొట్టమొదటి పార్టీగా ఎదుగుతుంది. అందుకు అందరూ కృషి చేయాలని, త్వరలో ఎన్నికలు జరగనున్న మధ్యప్రదేశ్లో తమ పార్టీ ప్రభుత్వం ఏర్పడనున్నదన్నారు.

ప్రయోగాలు ఎప్పుడూ మారుతూ వుంటాయి

వాస్తవిక నిర్దిష్ట పరిస్థితులను అధ్యయనం చేసి ఎత్తుగడలను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ ఉండాలి. స్థిరంగా ఇలాగే ఉండాలనే దృక్పథం ఎన్నటికీ పనికి

రాదు. నిరంతరం చైతన్యంతో ఎప్పటికప్పుడు మార్పులు చేసుకోవాలి. అవతలిపక్షం ఎత్తుగడలను పసిగడుతూ దాన్ని మించిన ఎత్తుగడలతో ముందుకు సాగినప్పుడే రాజకీయాధికారం సాధ్యమని మాయావతి అభిప్రాయం.

తక్కువ జనాభాగల ఎంబిసిలకు టిక్కెట్లిచ్చిన ప్రయోగం సక్సెస్ అయ్యింది

తక్కువ జనాభా గల ఎంబిసి కులాలకు టిక్కెట్లిస్తే రాష్ట్రంలోని ఆ కులాల వాళ్ళంతా ఆ నియోజకవర్గాలకు చేరుకొని తమ వాణ్ణి గెలిపించుకోవడం కోసం బాగా కృషి చేశారు. ఇలా తక్కువ జనాభా గల మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్‌కు టిక్కెట్లిచ్చే ప్రయోగం విజయవంతమైందని మాయావతి సోదాహరణంగా వివరించారు.

ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో బిఎస్‌పి ప్రయోగ శీలత

అందువల్ల ఉత్తరప్రదేశ్ ప్రయోగం లాగే ఆంధ్రప్రదేశ్‌లో కూడా తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల ఏర్పాటు ఉద్యమాలను నిర్మిస్తూ ఎంబిసిలకు అధిక ప్రాధాన్యత నిస్తూ అగ్ర కులాల్లోని ప్రజాస్వామిక సెక్యులర్ వాదులను కలుపుకొని బిఎస్‌పి విజయం సాధించి దేశానికి మరో అద్భుతం చూపించడం సాధ్యమే.

ముఖ్యమంత్రిగా మాయావతి సాధించిన మౌలిక విజయాలు

మాయావతి ముఖ్యమంత్రిగా సాధించిన విజయాలు దేశ వ్యాప్తంగా ప్రచారం జరగలేదు. ఇక నుండి మీడియా సహకారంతో బిఎస్‌పి ప్రభుత్వ విజయాలను ప్రజలకు దేశవ్యాప్తంగా తెలియజేయడం అవసరం.

ఉదాహరణకు : రాజ్యాంగంలో ప్రతి బడ్జెట్‌లో 22.5 శాతం అన్ని రంగాల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలని ఆదేశించారు. అయితే ఏ ఒక్క ప్రభుత్వం దీన్ని పాటించలేదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దీన్ని మాయావతి మాత్రమే తన బడ్జెట్‌లలో అన్ని రంగాలలో తొలిసారిగా 22.5 శాతం ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకించారు.

మూడు ఎకరాలకు మించి ప్రభుత్వ భూమి ఆక్రమించిన వారికి అన్ని ఎకరాలకు ఎన్ని సంవత్సరాలు పండించుకుంటే అన్ని సంవత్సరాల పెనాల్టీ వసూలు చేశారు. ఆ భూమిని ప్రభుత్వం వాపసు తీసుకున్నది. వారిని ఖాళీ చేయించింది. మూడు ఎకరాల లోపు ప్రభుత్వ భూమి దున్నుకొంటే ప్రభుత్వం వారికే పట్టాలు ఇచ్చింది.

ప్రభుత్వం తరపున కేటాయించిన ప్రతి మూడు ఎకరాలకు వ్యవసాయోత్పత్తి సాధనాలను కొనుగోలు చేయడానికి ప్రతి ఒక్కరికీ 20 వేల రూపాయలు గ్రాంటు ఇచ్చారు.

ప్రతి ఇంటికి ఇళ్ళు కట్టుకోవడానికి 50 వేల రూపాయలు కేటాయించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 8వేలు, 15 వేలు మాత్రమే కేటాయించారు.

స్వాతంత్ర్యం వచ్చిన నుండి దేశంలో ఓబిసిలు జనాభా నిష్పత్తి ప్రకారం ఐ.ఏ.ఎస్. పొందలేదు. గ్రూప్-1 సివిల్ సర్వీసులో వున్న ఓబిసిలకు ఐఎఎస్ కన్ఫర్మేషన్ ఇద్దామంటే కూడా సరిపడ దొరకలేదు. అందువల్ల ఓబిసిలు ఐఎఎస్ సాధించడానికి ప్రత్యేకంగా కోచింగ్ తరగతులు ఏర్పాటు చేయడం జరిగింది. ఉత్తర ప్రదేశ్‌లో దళిత ఐఎఎస్‌లు 30 శాతం ఉన్నారు. దళిత శాసనసభ్యులు, మంత్రులు తమ పిల్లలకు సంబంధాలు వెతుక్కోవలసిన క్రమంలో ఉన్నతాధికారుల ఆవశ్యకత పెరిగింది. అలా రాజకీయరంగంలో పెరిగిన మేరకు దళిత అధికారులు కూడా అన్ని రంగాల్లో ఎదిగారు. అలాగే వ్యాపార రంగంలో కూడా పుంజుకుంటున్నారు.

"పోటీ చేసి ఓడు, ఓడించు, గెలువు" (హారో, హరావో, జీతో) అనేది బిఎస్‌పి మౌలిక సూత్రం. దీన్ని కాన్షీరామ్, మాయావతి ఆచరించి చూపారు. మొదట నేను బ్రిజ్‌నూర్‌లో 1985లో పోటీ చేసినప్పుడు అయిదు వేల ఓట్లు వచ్చాయి. కాన్షీరామ్ 1986లో మళ్ళీ అక్కడే పోటీ చేయమన్నారు. 60 వేల ఓట్లు వచ్చాయి. 1987లో హరిద్వార్ ఉప ఎన్నికలో నన్ను పోటీ చేయాలని కాన్షీరామ్ ఆదేశించారు. ఆరు నెలల నిరంతర కృషితో 1లక్షా 36వేల ఓట్లు వచ్చాయి. అక్కడ రామ్‌విలాస్ పాశ్వాన్‌కు 36 వేల ఓట్లు మాత్రమే వచ్చాయి. ఆయన డిపాజిట్ కోల్పోయారు. 6 వేల ఓట్లు తక్కువై నేను ఓడిపోయాను అని మాయావతి ఈ సమావేశంలో గుర్తు చేశారు.

మాయావతి ఎన్ని సవాళ్ళను ఎదుర్కొని గెలిచిందో ఇప్పటికీ ఆశ్చర్యమే

"పార్టీ నిర్మాణం మీద కేంద్రీకరించిన నేను మన వారిని ఎన్నికల్లో మీడియాను ఆశ్రయించవద్దని కోరాను. అవతలి పక్షాలు నిర్మాణం పటిష్టంగా లేకుండా సినిమా గ్లామర్‌పై, పారిశ్రామిక వేత్తల డబ్బుపై, ఎలక్ట్రానిక్ మీడియాపై, ప్రింటింగ్ మీడియాపై, మాఫియాపై ఆధారపడ్డారు. ఎలాంటి సినీ గ్లామర్ లేకుండా మీడియా సహకారం లేకుండా ఈ విజయాలు సాధించాను. పార్టీ నిర్మాణం పటిష్టంగా ఉంటే ఏదైనా సాధించవచ్చునని నా అనుభవం రుజువు చేసింది" అని మాయావతి తన అనుభవాలను తెలిపారు.

ముఖ్యమంత్రిగా సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్న మాయావతి

ముఖ్యమంత్రి అయ్యాక మాయావతి సెజ్‌లపై సిపిఎం పార్టీ సైతం ధైర్యం చేయని నిర్ణయాన్ని ప్రకటించారు. ప్రత్యేక ఆర్థిక మండళ్ళకు ఆయా పారిశ్రామికులే

భూమిని రైతుల నుండి కొనుక్కోవాలి. రైతులకే వారు కోరిన ధర చెల్లించాలి. ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక మండళ్ళకు భూమిని సేకరించి ఇవ్వదు అని ప్రకటించారు. రిలయన్స్‌కు కేటాయించిన భూమిని వాపసు తీసుకోవడానికి చర్యలు తీసుకుంటున్నారు.

ఉత్తర ప్రదేశ్‌లో ప్రతి అగ్రకులం బందిపోట్ల ముఠాలను పెంచి పోషిస్తుంటాయి. ఇతర కులాల వారిని అవి బెదిరిస్తాయి. అష్టకష్టాల పాలు చేస్తాయి. హింసిస్తాయి. చంపేస్తాయి. అలాంటి బందిపోటు ముఠాల అన్నిటి ఆట కట్టించిన ఘనత మాయావతిదే. అగ్రవర్ణాల వాళ్ళు కూడా ఇంత గొప్ప ధైర్యశాలిని తన జీవితంలో చూడలేదని ప్రశంసించారు. రాజా భయ్యా వంటి ఎమ్మెల్యేగా ఎన్నికైన బందిపోటు ముఠా నాయకున్ని జైల్లో పెట్టి సంచలనం సృష్టించారు. ఇటీవల ముఖ్యమంత్రి అయిన వారం రోజుల్లోనే లక్నోలో ఒక బిఎస్‌పి ఎంపి ఇతరుల స్థలాన్ని ఆక్రమించ దానికి దుకాణాలు కూలగొట్టించాడని తెలిసిన వెంటనే తన ఇంటిముందే అతన్ని అరెస్ట్ చేసి కేసు పెట్టి జైలుకు పంపించి దేశానికే ఆదర్శంగా నిలిచారు మాయావతి.

ఇక నుండి మీడియా సహకారం తీసుకోనున్న బిఎస్‌పి

మీడియా ప్రాధాన్యతను గుర్తించిన మాయావతి సొంత మీడియాను, టీవీ ఛానెల్స్‌ను ప్రారంభించడంతో పాటు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, కేరళ వంటి రాష్ట్రాల్లో మరికొన్ని ప్రయోగాలు చేయనున్నారు. మీడియాను ప్రచార సాధనంగా ఉపయోగించుకోవాలని నిర్ణయించుకున్నారు.

ఈ దక్షిణాది రాష్ట్రాల్లో సినిమా, టివి, పత్రికలు నిర్వహించే పాత్ర హెచ్చు. మీడియా ద్వారా ఈ రాష్ట్రాల్లో భావజాలం, రాజకీయాలు 35 ఏళ్ళుగా పెద్ద ఎత్తున ప్రభావితమౌతూ వస్తున్నాయి. ఉత్తర భారతదేశానికి దక్షిణాదికి మధ్య సంస్కృతిలో రాజకీయ పరిణామాల్లో అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. దేని ప్రత్యేకత దానిదే. మాయావతి సొంత మీడియా, సొంత టీవీ ఛానెల్ ప్రారంభించాలని దక్షిణాది సామాజిక చారిత్రక పరిణామాలను ఉత్తర భారతదేశం కూడా స్వీకరించి అనుసరించినట్టయింది.

తమిళనాడులో టివి, సినిమా, మీడియా, రాజకీయాలు వాటి యాజమాన్యం విడదీయ రానివిగా పూర్తిగా కలిసి పోయాయి. ఆంధ్రప్రదేశ్‌లో అంతగా లేకపోయినా మీడియాతో సంబంధం లేని పార్టీలు గెలుపుకు ఆమడ దూరంలో ఉండిపోయాయి. అందుకే ఇవన్నీ అవగాహన చేసుకొని మాయావతి స్వయంగా టీవీ ఛానెల్‌ను, పత్రికలను నిర్వహించాలని నిర్ణయానికి రావడం జరిగింది. ఇలా ఒక్కొక్క అనుభవం నుండి ఒక్కొక్క గుణపాఠం, దానికి తగిన కార్యక్రమాలు, పరిష్కారాలు తీసుకుంటూ

మాయావతి ముందుకు సాగుతున్నారు.

ఇక్కడ రాజకీయ నాయకులు పత్రికల్లో మాత్రమే నాయకులుగా కనపడే కాగితం పులులు ఒక విషయం గమనించాలి. కేవలం మీడియా వల్లనే గెలవడం అసాధ్యం. మీడియా వల్ల గెలుపు సాధ్యమయ్యేదైతే టిడిపి ఓడిపోయి వుండేది కాదు. యుపిలో ఎస్‌పి, కాంగ్రెస్, బిజెపిలు చిత్తుగా ఓడిపోయి వుండేవి కాదు. గ్రౌండ్ వర్క్ అన్నింటికన్నా ముఖ్యమైనది. ఈ విషయంలో బిఎస్‌పి అన్ని పార్టీలకు ఆదర్శంగా నిలుస్తున్నది. అయితే అవి ప్రజల మీద ఆధారపడకుండా ప్రజలకు కూలీ ఇచ్చి పార్టీ ప్రచార పనులు చేయించుకొని వదిలివేసే భూస్వామ్య, పారిశ్రామిక, వ్యాపార, అగ్రకుల దృక్పథాన్ని కలిగి ఉన్నాయి. అందువల్ల గెలుపు బాటలో సరియైన ఎత్తుగడలతో సాగితే బిఎస్‌పికి రాష్ట్రంలో ఉజ్వలమైన భవిష్యత్తు ఉంది.

స్వతంత్ర భారత రాజకీయ నేతలతో ఎవరితోనూ పోల్చలేని

విలక్షణ వ్యక్తిత్వం కాన్షీరామ్

తొంభై దశకం ప్రారంభంలో... అప్పుడప్పుడే బిఎస్‌పి ఒక సంచలనంగా, కాన్షీరాం ఒక నిగూఢ వ్యక్తిగా భారతరాజకీయరంగస్థలంపై అడుగు పెట్టారు. ఒక ఆంగ్లదినపత్రిక తన మొదటి పేజీలో పెద్దసైజులో కాన్షీరాం ఫోటోను ప్రచురించింది. కాన్షీరాం ముఖంలో వెక్కిరింపుతో కూడిన చిరునవ్వు, ఆత్మవిశ్వాసం, ఒక తాజాదనం ఉట్టిపడుతున్నాయి. ఆ ఫోటో చూడగానే చటుక్కున మెదిలిన పేరు 'కాన్షీ కృష్ణుడు'.

ప్రాచీనకాలంలో వివిధ జాతులు, గణాల మధ్య; ఒకే జాతి, ఒకే గణంలో భిన్న శ్రేణులమధ్య ఆధిపత్య యుద్ధవాతావరణం పతాకస్థాయికి చేరిన దశలో దానిని నిర్ణయాత్మకమైన మలుపు తిప్పడంలో కృష్ణుడు ఉత్ప్రేరకపాత్ర నిర్వహించాడు. ఖచ్చితమైన చారిత్రక ఆధారాలు లేని స్థితిలో చాలా వరకు ఊహాప్రాయమైన సంభావ్యత మీద ఆధారపడిన కృష్ణునిపాత్ర గురించిన రూపకల్పన ఇది. ఆ విధంగా కురుక్షేత్ర యుద్ధం ఉత్తరభారత భవిష్య సామాజిక రాజకీయగతికి దిశా నిర్దేశం చేసిన కీలక పరిణామం. అనేక మంది రాజులు, అనేక అక్షౌహిణుల సైన్యాన్ని మోహరించి జరిపిన మహా సంగ్రామంగా దాని గురించి చేసిన చిత్రీకరణ వాస్తవానికి దానికిగల కీలక ప్రాముఖ్యం చుట్టూ అల్లిన కల్పనమాత్రమే. కురుక్షేత్రయుద్ధం పరిమాణంలో 'గొప్ప యుద్ధం' కాదు. గుణంలో కీలకమైన యుద్ధం. ఒకే గణంలో ఒకరినొకరు చంపుకోవడం అంతవరకు లేదు. అది ఊహకు కూడా అందని విషయం. అర్జునుడు ఎదుర్కొన్న విషాదయోగం అదే. గతితర్కం పట్ల స్పష్టమైన అవగాహన ఉన్న కృష్ణుడు చేసినదల్లా అర్జునునిలోని విషాదాన్ని, సందిగ్ధాన్ని తొలగించి అతణ్ణి యుద్ధానికి ప్రేరేపించడమే. అప్పుడతని ఉద్బోధే భగవద్గీత అయింది. కృష్ణుడు అవతార పురుషుడయ్యాడు. నిజానికి ఒక కోణం నుంచి చూస్తే, సామాజిక చలనానికి కీలకమైన తోడ్పాటునందించినవారే అవతార పురుషులుగా పురాణాలకు ఎక్కారు.

కాన్షీరామ్ విభిన్న శైలి

స్వతంత్ర భారతరాజకీయనేతలతో ఎవరితోనూ పోల్చలేని విలక్షణ వ్యక్తిత్వం కాన్షీరాం. మీడియా మేనేజ్‌మెంట్, ధనికశక్తుల ప్రాబల్యం పరిపాటిగా మారిన సమకాలీన పార్లమెంటరీ ప్రజాస్వామ్య రాజకీయ ప్రక్రియకు దూరంగా తనదైన పద్ధతిలో నిశ్శబ్దంగా

పార్టీని నిర్మించగలగడం ఆయన ప్రత్యేకత. చేతల్లోనేకాదు, మాటల్లో కూడా పార్లమెంటరీ మర్యాదల్ని, ముసుగుల్ని చీల్చిచెండాడిన విభిన్న శైలి ఆయనది. రొటీన్‌ను పూర్తిగా బద్దలుకొట్టడం ఆయన మనసావాచా కర్మణా అనుసరించిన వ్యూహం. 'మనువాదు'లతో జట్టుకడుతూనే వారిని మనువాదులుగా పేర్కొని అభిశంసించడం, అందరినీ వాడుకొంటూ అధికారంలోకి చేరుకొంటామని కుండబద్దలు కొట్టడం, అగ్రకులాలకు మేమే సీట్లు ఇస్తాం, మాకింద పనిచేయించుకొంటామని కవ్విస్తూనే వారిని ఉపయోగించుకోవడం అనితరమైన కాన్షీరాం వ్యక్తిత్వ ముద్రకు అద్దంపడతాయి. పార్లమెంటరీ సంప్రదాయాలకు వ్యతిరిక్తంగా కనిపించే ఇటువంటి 'పెడసరపు' ధోరణితోనే ఆయన బహుజన్ సమాజ్ పార్టీని 2.6 శాతం ఓట్ల (1985) నుంచి 23 శాతం ఓట్లకు (2002) పెంచగలగడం విశేషం. మరో కోణంనుంచి చెప్పుకోవాలంటే, పార్లమెంటరీ ప్రజాస్వామిక ఎన్నికల రాజకీయాల స్వరూప స్వభావాలను, అతితక్కువ కాలంలో అధికారానికి చేరువచేయగల అందులోని మెలకువలను అనితరసాధ్యంగా జీర్ణించుకోగలగడమే ఆయన విజయరహస్యం. అంతేకాదు, 'కాలమూ', 'చలనమూ' గురించిన అవగాహనను పార్లమెంటరీ ప్రజాస్వామిక ప్రక్రియకు జోడించడం నుంచే ఆయన సత్ఫలితాలను సాధించగలిగారు.

ఇంకోవిధంగా చెప్పాలంటే, అంబేద్కర్ భావజాలానికి కాన్షీరాం పార్లమెంటరీ ప్రజాస్వామిక రాజకీయాల అనుభవాన్ని, కాలికతను, చలనశీలతనూ మేళవించి, ఆచరణ పార్శ్వాన్ని అభివృద్ధి చేసి దాని ప్రాసంగిత (రెలెవెన్స్)ను సమకాలీనం చేశారు. మరింత క్లుప్తంగా చెప్పాలంటే, అంబేద్కర్ + పార్లమెంటరీ ప్రజాస్వామ్య అనుభవం; కాలమూ - చలనమూ = కాన్షీరాం. మాయావతి ఉత్తరప్రదేశ్‌లో చేసినదల్లా కాన్షీరాం ఇచ్చిన బ్లూప్రింట్‌ను యధాతథంగా అమలుచేయడమే. అగ్రవర్ణ-దళిత అధికారక్రమాన్ని ఆమె దళిత-అగ్రవర్ణ అధికారక్రమంగా తలకిందులు చేశారు.

అయితే, అంబేద్కర్ తర్వాత అంతటి దళితనేతగా కాన్షీరాంను గుర్తించి గౌరవించినవారు కూడా ఆయన వ్యూహాన్ని ఆకళించుకొన్నట్టు కనిపించడం లేదు. కాన్షీరాం ముందుకు తెచ్చిన కార్యాచరణ అంబేద్కర్ భావజాలానికి పొడిగింపేనన్న సంగతిని వారు అర్థం చేసుకొన్నట్టులేదు. మాయావతి దళిత - బ్రాహ్మణ - ముస్లిం ఈక్వేషన్‌తో సాధించిన విజయాన్ని అంబేద్కర్‌వాదానికి ద్రోహంగా, రాజకీయ అవకాశవాదంగా ఈసడించి త్రోసిపుచ్చడం చూస్తున్నాం. 'సైద్ధాంతిక స్వచ్ఛత'నుంచి ఎన్నికల ఇంజనీరింగ్‌ను, లేదా ఎన్నికల గణాంకాల కూర్పును చూసి తిరస్కరించే చాదస్తపు అపసవ్యదృష్టి దీనికి కారణం.

ఏదైనా ఒక సిద్ధాంతానికి అచలస్థితిని ఆపాదించుకుని, దానినొక విశ్వాసంగా, మతంగా ఘనీభవింప చేసుకొని, దాని కర్తను గుళ్ళో దేవుడిగా మార్చివేసుకుని దానికొక భావోద్వేగపు చట్రంలో బిగించుకొని కాలమూ, చలనంలో భాగంగా అనివార్యంగా వచ్చే పరిణామాలను స్తంభించిన మనస్థితితో అనుమానంతో, తిరస్కారభావంతో,

పూ్యరిటాన్ దృష్టితోచూసి వ్యాఖ్యానించే వైఖరి ఇది. వామపక్షవాదులు రష్యన్ విప్లవకాలపు సైద్ధాంతిక మనస్థితినుంచి బయటపడి, స్వాతంత్ర్యానంతరు పార్లమెంటరీ ప్రజాస్వామిక వాస్తవికతలోకి నేటికీ అడుగుపెట్టకుండా కాల, చలన స్పృహలేకుండా అప్పటి జార్గాన్‌తోనే హోరెత్తిస్తున్నట్టే అంబేడ్కర్‌నుదాటి అడుగు ముందుకువేయనివారు మాయావతి విజయంలో అవకాశవాదాన్ని, ద్రోహాన్నీ చూస్తున్నారు. నిచ్చనమెట్ల పద్ధతిలో ఆయా కులాల అమరికతో కూడిన కులవ్యవస్థ గురించిన ఒక సాంప్రదాయిక భావన స్థూలరూపంలో సమాజంలో వేళ్ళూనుకొన్న సంగతి తెలిసిందే. స్వాతంత్ర్యానికి ముందునాటి అంబేడ్కర్ భావజాలానికి ప్రాతిపదికను అందించిన కులవ్యవస్థ ఇప్పటికీ ఏ మాత్రం మార్పులేకుండా అలాగేలేదు. ఈ ఆరుదశాబ్దాల ప్రజాస్వామిక అనుభవంలో ఆయాకులాల అమరికలో, స్థితిగతులలో తేడాలు వచ్చాయి. వాటిని బేరీజు వేసుకుని తమ వ్యూహాన్ని, వాదాన్ని అవసరమైన మేరకు సవరించుకొనే దృష్టి లోపించడం మాయావతి విజయంపై వ్యతిరేక స్పందనలో కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న అంశం. సైద్ధాంతిక అచలస్థితినుంచి చూడడం దానికి కారణం. అరవైఏళ్ళ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగడంగా ఒక స్థాయిలోనే అయినా దళితుల విద్య, ఉద్యోగఅవకాశాలు పొంది ఆత్మగౌరవాన్ని రాజకీయ చైతన్యాన్ని తెచ్చుకొన్నారు. దీపాంకర్ గుప్తా (ఇంటరాగేటింగ్ కేస్ట్; అండర్‌స్టాండింగ్ హైరార్కీ అండ్ డిఫరెన్స్ ఇన్ ఇండియన్ సొసైటీ) ప్రకారం, ఉత్తరప్రదేశ్‌లోని షెడ్యూల్డు కులాలవారు వ్యవసాయాధారిత ఉపాధిమీద వెనకటిలా ఆధారపడకుండా సమీప పట్టణాలలో వ్యవసాయేతరమైన చిన్నచిన్న ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోసాగారు. దానితోవారికి ప్రత్యామ్నాయ రాజకీయాలవైపు ధైర్యంగా అడుగువేసే అవకాశం లభించింది. బిఎస్‌పి బలోపేతానికి అదొక కారణం. ఉత్తరప్రదేశ్, బీహార్‌వంటి చోట్ల బిసిలు రాజ్యాధికారానికి ఎదిగారు. అదేక్రమంలో బ్రాహ్మణులు పూర్వపు అధికార, ఆర్థిక ప్రాభవాన్ని కోల్పోయి కొన్నిచోట్ల దళితులుగా మారారు. స్వాతంత్ర్యానంతర ప్రజాస్వామ్య ప్రక్రియలో ఆయాకులాల సామాజిక, ఆర్థిక ఊర్ధ్వ, నిమ్నచలనంలో భాగంగా ఇంతవరకూ పీడితకులాలుగా ఉన్న కొన్ని కులాలు, కొన్నిచోట్ల పీడించేకులాలుగా పరిణామం చెందడమూ చూస్తున్నాం. నిజానికి ఇటువంటి పరిణామం వేళ్ళు పౌరాణిక, చారిత్రక కులాల్లోకి కూడా విస్తరించి ఉన్నాయి. భాగవతం ప్రకారం, మొదట్లో బ్రాహ్మణ, క్షత్రియ కులాలు రెండే. వివిధ దశల్లో ఇవి పీడిత – పీడన కులాలుగా స్థానాలు మార్చుకోవడం, మూడవకులం ప్రవేశంతో రాజీపడి రెండూ పీడనకులాలుగా మారడం కనిపిస్తుంది. ఒక దశలో పీడితకులాలుగా ఉన్న శూద్రకులాలు పీడించే కులాలస్థాయికి ఎదిగి చారిత్రక కాలంలో అగ్రవర్ణాలలో భాగం కావడం జరిగింది. ఇప్పుడు ఉత్తరప్రదేశ్, బీహార్ తదితర రాష్ట్రాలలో కొన్ని బిసి కులాలు శూద్రకులాల స్థాయిని దానితోపాటు అగ్రకుల ప్రతిపత్తిని అందుకొనే దశలో ఉన్నాయి.

యాంత్రిక దృష్టి

కానీ సైద్ధాంతిక అచలవాదులు మాత్రం బిసి, ఎస్‌సి, ఎస్‌టి ఐక్యపోరాటం గురించి

యాంత్రికంగా నొక్కిచెప్పడం జరుగుతోంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రక్రియలో వీటి మధ్య ఉన్న అంతర్వైరుధ్యాలు బహిర్గతమవుతున్నా, వాటిపై కృత్రిమంగా ముసుగుకపి&ప విశాల కూటమిగా చూపించబోవడం శుద్ధ సైద్ధాంతిక దృష్టి ఫలితమే. అందుకే ఈ ప్రయత్నం తరచు ఇసుక గూడుగా మారిపోతూ ఉంటుంది. ప్రజాస్వామ్య ప్రక్రియ, కాలిక, చలనశీలతల వెలుగులో ఈ పరిమితులను అర్థంచేసుకోగలిగినప్పుడే ఇందుకు పరిష్కారమార్గం కనిపిస్తుంది.

మాయావతి సాధించిన కెమిస్ట్రీలో లోతుగా పరిశీలించవలసిన మౌలికాంశాలు చాలా ఉన్నాయి. కులాన్ని సాంప్రదాయిక, అచల, శుద్ధ సైద్ధాంతిక భావననుంచి పక్కకు తప్పించి 'బహుజన' సూత్రంతోకాక సర్వజనసూత్రంతో పార్లమెంటరీ ప్రజాస్వామిక రాజకీయాలకు అవసరమైన ఒక ఎత్తుగడగా వాడుకొని ఆమె విజయం సాధించగలిగారు. కులాన్ని సామాజిక, చారిత్రక, సాంస్కృతిక మూలాలనుంచి, వాటికి సంబంధించిన భావోద్వేగాల బరువునుంచి తప్పించి అంకెలతో ముడిపెట్టిన రాజకీయ వ్యూహంగా మార్చడం ద్వారా సరికొత్త కుల సమీకరణలకు మార్గం చూపించారు. ఇందువల్ల కులాల సమీకరణకు ఆర్థికాంశ ఒక అప్రకటిత ప్రాతిపదికగా మారే అవకాశం ఏర్పడింది. ఈ మొత్తం కెమిస్ట్రీ అంతటికీ ప్రజాస్వామ్య ప్రక్రియే అవకాశమిచ్చింది. దేనినైనా నిర్మూలించడం, ధ్వంసం చేయడం అన్న తీవ్ర భావన ప్రజాస్వామ్య తాత్వికతతో ఇమడదు. కులాన్ని, మతాన్ని వర్గాన్ని – దేనినైనా సరే 'నిర్మూలించా'లని ప్రజాస్వామ్యం చెప్పదు. అది చేసేదల్లా వాటిని తటస్థీకరించడమే. వైరుధ్యాలను అది లౌకికమైన, భిన్నమైన ఉమ్మడి ప్రాతిపదికమీద కలుపుతుంది. తటస్థీకరణ క్రమంగా నిర్మూలనకు దారితీస్తుంది. ఇటువంటి ప్రజాస్వామ్య తాత్వికత పట్ల స్పష్టమైన అవగాహననుంచే కాన్షీరాం గొప్ప రాజకీయ సృజనశీలతను, అద్భుత వ్యూహనైపుణిని సంతరించుకోగలిగారు. ఆయన ప్రణాళికను మాయావతి సమర్థంగా అమలుచేసి స్వతంత్రంగా అధికార పీఠాన్ని అందుకోగలిగారు.

– కల్లూరి భాస్కరం, వార్త 17.05.07

అంచెలంచెలుగా ఆకాశం ఎత్తుకు

ఎదిగిన కాన్షీరామ్

భారత దేశ రాజకీయాల్లో బహుజన సమాజ్ పార్టీ స్థాపనతో విప్లవాత్మకమైన మార్పులో చోటుచేసుకున్నాయి.

1. గత 40 సం॥లుగా ఉన్న ఒకే పార్టీ అధికారానికి ఆటంకం కలిగింది.
2. అప్పటివరకు జాతీయ పార్టీలుగా గుర్తించబడిన వామపక్ష పార్టీలు ప్రాంతీయ పార్టీల స్థాయికి దిగజారిపోయాయి.
3. కుల రాజకీయాలకు బహిరంగ ప్రవేశం జరిగింది.
4. రాష్ట్రాలలో స్థానిక పార్టీలు అధికారం చేపట్టడం జరిగింది.
5. రాష్ట్రాల వారిగా ఆ ప్రాంతీయ పార్టీలు అధికారం చేపట్టాయి.
6. కేంద్రంలోని అధికార పార్టీ రాష్ట్రాల ముఖ్యమంత్రులను నియమించేది
7. నేడు రాష్ట్రాల ముఖ్యమంత్రులే కేంద్రంలో ప్రధానమంత్రి పదవిని నిర్ణయించడం జరుగుతున్నది.
8. వివిధ పార్టీలతో కూడిన సంకీర్ణ ప్రభుత్వాలు భారతీయ రాజకీయ వ్యవస్థలో ప్రవేశించి అధికారం చెలాయించడం ప్రారంభమైంది.
9. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల్లో తాము కూడా జాతీయ స్థాయిలో రాజ్యాధికారం లోకి రావడం సాధ్యమే అని విశ్వాసం కలిగింది.

ఈ మార్పులన్నింటిలో బహుజన సమాజ్ పార్టీ పాత్ర ప్రధానమైనది. దీని వ్యవస్థాపకుడు మాన్యశ్రీ కాన్షీరామ్ పంజాబ్‌కు చెందిన రామ్‌దాసియా శిక్కుల కుటుంబంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు శ్రీమతి బిషన్‌సింగ్ కౌర్, శ్రీ హరిసింగ్ రామ్‌దాసియాలు. పంజాబ్‌లో రోపార్ జిల్లా, కవాస్‌పూర్ గ్రామానికి చెందిన షెడ్యూల్డు కులస్థులు. శ్రీహరిసింగ్ కుటుంబం మిగతా షెడ్యూల్డు కులం వారికంటే మెరుగుగా ఉండేది. కాన్షీరామ్ కుటుంబం ఉమ్మడి కుటుంబం. వీరిలో ఎక్కువమంది సైన్యంలో చేరినందువలన సహజంగా దృఢకాయులు. అగ్రవర్ణాలు వీరి కుటుంబం మీద ఎలాంటి దాడులు చేయలేదు. అందుకు సాహసించేవారు కాదు.

కాన్షీరామ్ 15-3-1934లో జన్మించారు. హరిసింగ్ కుటుంబం వ్యవసాయం చేసేవారు. కాన్షీరామ్ బాల్యం ఒడిదుడుకులు లేకుండా సాగింది. చిన్నతనం నుండే కష్టపడే అలవాటు వలన స్వాభిమానం, ఆత్మవిశ్వాసం, భయం లేకపోవడం తదితర

గుణాలు అలవడ్డాయి. కాన్షీరామ్ కవాన్‌పూర్ గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మల్లాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల 4వ తరగతి వరకు చదివారు. 5వ తరగతి నుండి 8వ తరగతి వరకు, రోపార్ జిల్లా కేంద్రంలోని ఇస్లామియా స్కూలులో 9వ తరగతి, 10వ తరగతి డిబిఎ స్కూలు, కాలేజి విద్య గవర్నమెంట్ కళాశాలలో పూర్తిచేశారు. రామ్‌దాసియా శిక్కు కుటుంబంలో బిఎస్సీ వరకు చదివిన మొదటి వ్యక్తి కాన్షీరామ్. 1956లో ఉన్నత విద్యాభ్యాసం కొరకు డెహ్రాడూన్‌లోని స్టాఫ్ కాలేజీలో చేరారు. కొద్దికాలం జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో ఉద్యోగం చేశారు. ఆ సంవత్సరం డా. అంబేద్కర్ చనిపోయారు. ఆయన గురించి కొంతమేరకు కాన్షీరామ్ మిత్రుడు, సహోద్యోగి గైనీ ద్వారా తెలుసుకున్నారు.

కాన్షీరామ్ 1958 పూణాలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిలటరీ ఎక్స్‌ప్లోజివ్స్ సంస్థల్లో రీసెర్చ్ ఆఫీసర్‌గా నియమించబడ్డారు. ఈ పరిశోధన శాఖలో 1964లో అంబేద్కర్ జయంతి సెలవు దినాన్ని రద్దు చేసినందుకు దీనాబా అనే దళిత ఉద్యోగి నిరసన తెలిపారు. అప్పుడు కాన్షీరామ్ అంబేద్కర్ పట్ల ఆసక్తి కనబరిచారు. ఆ రోజు రాత్రి కుల నిర్మూలన గ్రంథాన్ని మూడు సార్లు చదివారు. అది ఆయన జీవితాన్ని మలుపు తిప్పిన సంఘటన

దళితులు డా॥ అంబేద్కర్ మిషన్‌ను తమ స్వార్థం కొరకు ఉపయోగించడం కాన్షీరామ్‌ను మనస్థాపనకు గురిచేసింది. డాక్టర్ అంబేద్కర్ ఈ వ్యవస్థను మార్చడానికి ప్రయత్నం చేసి తన జీవితాన్నే బలిదానం చేశారు. కానీ ఆయన పేరు చెప్పుకొని నాయకులు దళితులను మోసం చేస్తున్నారని కాన్షీరామ్ తలచారు. ఈ స్థితిని మార్చాలంటే ఉపకులాలను, బహుజనులను ఏకం చేయాలనుకున్నారు.

1965లో తల్లిదండ్రులు కాన్షీరామ్ వివాహం చేయాలనుకున్నారు. కాని వారి తల్లిదండ్రులకు 25 పేజీల ఉత్తరం వ్రాశారు. అందులో తన జీవిత లక్ష్యాన్ని వివరించారు. నేను పెళ్ళిచేసుకోను. ఇల్లు పరివారాన్ని పట్టించుకోను అన్నారు. కుటుంబ కార్యక్రమాలకు హాజరు కానని వ్రాశారు. 1983లో తన తండ్రి చనిపోతే కూడా హాజరుకాలేదు. తన ఉద్యోగానికి రాజీనామా చేసి డబ్బులు తీసుకోడానికి కూడా వెళ్ళలేదు. 1971లో కపర్దే, మనోహర్ హాటే, కాన్షీరామ్ పూణాలో ఒక సమావేశం నిర్వహించారు. కపర్దే బాంసెఫ్ నిర్మాతల్లో ఒకరు.

దేశం మొత్తంమీద 17 లక్షల మంది విద్యావంతులైన ఎస్.సి., ఎస్.టి. ఉద్యోగులున్నారు. వీరిని రాజకీయేతర సంస్థగా సమీకరించాలి అనేది బాంసెఫ్ లక్ష్యం. 6 నెలల్లోనే ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనారిటీస్ కమ్యూనిటీస్ ఎంప్లాయిస్ అసోసియేషన్, పూణా పేరుమీద సంస్థను 14 అక్టోబర్ 1971లో స్థాపించి సమావేశం నిర్వహించారు. దీనికి వెయ్యిమంది హాజరైనారు. కాన్షీరామ్ అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు.

ఆ రోజుల్లో పూణాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు తిరిగి సంస్థను బలోపేతం చేశారు. సైకిల్‌పై తిరిగేవారు. ఎక్కడ రాత్రి అయితే అక్కడే పడుకొని ఎవరైనా పెడితే తినేవారు లేకపోతే ఉపవాసం ఉండేవారు. 1972లో సీనియర్ ఎంప్లాయిస్

ప్రాబ్లమ్స్ అండ్ సొల్యూషన్ అనే అంశంమీద సదస్సు నిర్వహించారు. డిసెంబర్ 6, 1978లో బ్యాక్‌వర్డ్ అండ్ మైనారిటీస్, కమ్యూనిటీస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (బామ్‌సెఫ్) అని పేరుపెట్టి "బోధించు - పోరాడు - సమీకరించు" అనే నినాదంతో దేశవ్యాప్తంగా సంఘాన్ని బలోపేతం చేశారు.

బామ్‌సెఫ్‌ను రాజకీయాలు, పోరాట రహిత, మతరహిత సంస్థగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ఢిల్లీలో కార్మిక శాఖలో పనిచేస్తున్న సెక్షన్ ఆఫీసరు శ్రీ దౌలత్‌రామ్ బంగర్ ఇంటిలో బామ్‌సెఫ్ కార్యాలయం ప్రారంభించారు. 'నావద్ద చేయవలసిన పని ఎంత ఉందంటే జబ్బు పడడానికి కూడ నాకు తీరిక లేదు' అంటారు. బామ్‌సెఫ్‌ను బలోపేతం చేయుటకు చాల కష్టపడ్డారు. వేలాది శిక్షణ శిబిరాలు నిర్వహించారు. ఇందులో 500 మంది పి.హెచ్.డి. స్కాలర్స్, 3000 మంది డాక్టర్లు, 15000 మంది సైంటిస్టులు, 70 వేల మంది గెజిటెడ్. నాన్ గెజిటెడ్ ఉద్యోగులు చేరారు. ఐదు సంవత్సరాలలో 2 లక్షల మంది ఉద్యోగులు పాల్గొన్నారు. పే బ్యాక్ టుది సొసైటిపై చర్చ జరిగింది. ఇందులో విద్యావంతులైన ఉద్యోగులు బ్రెయిన్ బ్యాంకు (మేథోబ్యాంకు) మనీ బ్యాంకు టాలెంట్ బాంకుగా అందించవలసిన అవసరం ఉంది. 14 ఏప్రిల్ 1979 నుండి 14 జూన్ 1979 వరకు 'విల్ ది అంబేద్కరిజమ్ రివైవ్ ఆర్ సర్వైవ్' అనే విషయం మీద దేశంలోని 10 పట్టణాలలో సదస్సులు నిర్వహించారు.

దేశంలోని యువతను, మేధావుల్లోని అంబేద్కరీయులను మేలు కొలిపారు. కాన్షీరామ్ నాయకుడుగా నియమించబడ్డారు. డిసెంబర్ 2, 1979 నుండి 1979 4 డిసెంబరు వరకు బామ్‌సెఫ్ మొదటి సదస్సు రెండు రోజులు నిర్వహించారు. 10 వేల మంది ప్రతినిధులు హాజరయ్యారు. అంబేద్కర్ ఆలోచన విధానాలకు పదును పెట్టారు. బామ్‌సెఫ్‌ను నిజమైన అంబేద్కర్ మిషన్‌గా తీర్చిదిద్దారు.

20 నవంబర్ 1980 నుండి 25 నవంబర్ 1980 వరకు నాలుగు రోజులపాటు బామ్‌సెఫ్ రెండవ సమావేశం నిర్వహించారు. ఢిల్లీలో రామ్ లీలా మైదానంలో 22 రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. 1981 అక్టోబర్ 14 - 18 వరకు మూడో బామ్‌సెఫ్ సమావేశాలు చండీఘర్ పేరేడ్ గ్రౌండ్స్‌లో జరిగాయి. బామ్‌సెఫ్ వాలంటీర్ల కవాతు జరిగింది.

1981లో 6 డిసెంబర్ దళిత సోషిత్ సమాజ్ సంఘర్షణ సమితి, డి.ఎస్-4 స్థాపించారు. ఇది ఆందోళన నిర్వహించే సంస్థ కావడంతో బామ్‌సెఫ్ ఉద్యోగులు పాల్గొనలేదు. దీనిలో దళిత యువతను, విద్యార్థులను చేర్చుకున్నారు. 1981 ఫిబ్రవరి 26, 27 తేదీల్లో రాజ్యాంగ క్లబ్‌లో జరిగిన డిఎస్-4 సమావేశంలో వేలాది మంది పాల్గొన్నారు. 18 ఏప్రిల్ 1982లో బామ్‌సెఫ్ సమావేశాన్ని ఆగ్రాలో జరిపారు. ఇందులో ఆప్రెస్ట్ ఇండియా ఇంగ్లీషు మాసపత్రికను ప్రారంభించారు.

1982లో లిమిటెడ్ పొలిటికల్ ఆక్షన్ కోసం హర్యానా, మధ్యప్రదేశ్, జమ్మూకాశ్మీరు, పంజాబులో డి.ఎస్-4 ఎన్నికలలో పాల్గొన్నది. దీని ముఖ్యోద్దేశం...

1. మన ఎన్నికల టికెట్‌ను మనమే తయారు చేసుకోవాలి.

2. మన ఏక సూత్రం దళిత, వెనుకబడిన, మైనారిటీ వర్గాల జాతీయ పార్టీని స్థాపించడం.

డిఎస్-4 నాయకత్వంలో 24 సెప్టెంబర్ 1982 పుణాలో, 24 అక్టోబర్ 1982లో చండీఘర్‌లో పూనా ఒప్పందాలకు వ్యతిరేకంగా నిరసన జరిపారు. 6 డిసెంబర్ 1982లో జపాన్‌లోని ఒసాకా పట్టణంలో అంతర్జాతీయ మానవహక్కుల సమావేశంలో కాన్షీరామ్ పాల్గొని దళిత, అంటరాని వారు ఎదుర్కొంటున్న వెతలు, వివక్షతలు గురించి ప్రపంచ ప్రజల దృష్టికి తెచ్చారు.

బహుజన సమాజ్ పార్టీ ఆవిర్భావానికి ముందు 15 మార్చి 1983 డిఎస్-4 వారు రెండు పాదాలు, రెండు చక్రాలు అనే ఆందోళన నిర్వహించారు. దేశంలో ముఖ్య పట్టణాలు, గ్రామాలను కలుపుతూ, 3,200 కి.మీ. 40 రోజులు కాన్షీరామ్ సైకిల్ మార్చ్ నిర్వహించి అంబేద్కర్ విధానలను ప్రచారం చేశారు. ఉత్తరప్రదేశ్‌లో సారా వ్యతిరేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో స్త్రీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దీనితో డిఎస్-4 బాగా పాతుకు పోయింది. 6 డిసెంబర్ 1983లో సమతా, ఆత్మగౌరవం ఆందోళన ప్రారంభించి కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు నిర్వహించారు. 1984లో బోట్‌క్లబ్ మైదానంలో ముగింపు సమావేశం జరిగింది.

బహుజన సమాజ్ పార్టీ ఆవిర్భావం వెంటనే డా॥ అంబేద్కర్ సూచించినట్లు "మీరు వెళ్ళి మీ యింటి గోడలమీద రాయండి ఈ దేశానికి మేము పాలకులు కాబోతున్నామని" చెప్పిన నినాదం ఆందోళన కార్యక్రమంగా 16 మార్చి 1984 నుండి 14 ఏప్రిల్ వరకు దేశవ్యాప్తంగా నిర్వహించి భారతదేశమంతటా మనకంటూ రాజకీయ పార్టీ అవసరం అనే నినాదంతో సదస్సులు నిర్వహించారు. 1984 ఏప్రిల్ 14 నాడు డా॥ బి.ఆర్. అంబేద్కర్ జయంతి రోజున బహుజన సమాజ్ పార్టీని ప్రకటించారు.

30 మార్చి 1984న బహుజన టైమ్ మరాఠి పత్రిక, బహుజన టైమ్ హిందీ, ఇంగ్లీషు పత్రికలను ప్రారంభించారు. జూన్ 22-24, 1984న బహుజన సమాజ్ పార్టీ ప్రథమ జాతీయ సభలు ఢిల్లీలో కాన్షీరామ్ అధ్యక్షతన లాల్ ఖిల్లా మైదానంలో జరిగాయి. 1-4 ఆగస్టు 1984లో మండల కమీషన్‌ను అమలు చేయండి లేదా కుర్చీలు వదలండి అనే నినాదంతో బోట్స్‌క్లబ్‌లో బిఎస్‌పి సదస్సు నిర్వహించింది. 13 నవంబర్ 1984లో బిఎస్‌పి 9 రాష్ట్రాలలో ఎన్నికలలో అభ్యర్థులను నిలబెట్టింది. 10 లక్షల ఓట్లు లభించాయి. తర్వాత కొన్ని ఎన్నికలలో పాల్గొన్నారు. కాని అభ్యర్థులు గెలవలేకపోయారు.

5 అక్టోబర్ 1987 నుండి 15 ఆగస్టు 1988 వరకు కాన్షీరామ్ గారు అస్పృశ్యత, అమానవీయత, అన్యాయం, అత్యాచారాలు మరియు అసమానతలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహించి "సోదర భావాన్ని పెంపొందించడం" అనే నినాదంతో ఢిల్లీలోని బోట్స్ క్లబ్ వద్ద ధర్నా నిర్వహించారు.

1988లో కాన్షీరామ్ అలహాబాద్ నియోజకవర్గం నుండి వి.పి. సింగ్‌పై పోటీ చేశారు. అందులో 'ఒక ఓటు ఒక నోటు' అనే నినాదం', 'నా రాజా రహేగా- నా

రాజీవ్‌రహేగా, రహేగా కాన్షీరామ్' అని నినాదం ఇచ్చారు. కాన్షీరామ్‌కు 76వేల ఓట్లు వచ్చాయి. న్యూయార్క్‌టైమ్స్ పత్రిక "రాబోయే రోజుల్లో పార్టీలకు ప్రత్యామ్నాయం" అని అభివర్ణించింది.

1989 ఉత్తరప్రదేశ్ ఎన్నికలలో బిఎస్‌పి 2 లోక్‌సభ సీట్లు 13 అసెంబ్లీ స్థానాలు గెలుచుకొంది. డిసెంబర్ 1990 నుండి 14 ఏప్రిల్, 1990 వరకు సామాజిక పరివర్తన ద్వారా రథయాత్ర ప్రారంభమయింది. లక్షల మంది పాదయాత్రలో పాల్గొన్నారు. కాన్షీరామ్ 1992 నవంబర్ ఉత్తరప్రదేశ్ ఉప ఎన్నికలలో లోక్‌సభకు ఇటావా నుండి పోటీ చేసి గెలిచారు. ఈ గెలుపు ఆయన జీవితంలో మైలు రాయి. 1993 ఎన్నికలలో ఉత్తరప్రదేశ్‌లో బిఎస్‌పి 67 ఎమ్ఎల్ఎ సీట్లు గెలుచుకొంది.

మొదటిసారిగా బిఎస్‌పి శాసనసభ్యులు మంత్రులయ్యారు. 6 డిసెంబర్ 1993లో అంబేద్కర్ నిర్యాణం సందర్భంగా 'జాతితోడో సమాజ్ జోడో' కులాన్ని నిర్మూలిద్దాం - సమాజాన్ని నిర్మిద్దాం అనే ఆందోళన ప్రారంభించారు. పాట్నా, కలకత్తా, అహ్మదాబాద్ వంటి పట్టణాల్లో ఊరేగింపు నిర్వహించారు. 1995లో బిఎస్‌పి యుపిలో అధికారం చేపట్టింది. ఇప్పుడు 2007లో నాలుగోసారి మాయావతి ముఖ్యమంత్రి అయ్యారు.


కాన్షీరామ్ ఆధిపత్యంలో బిఎస్‌పి 18 రాష్ట్రాలలో శాఖలను ఏర్పాటు చేసుకున్నది. జాతీయ పార్టీగా గుర్తింపు పొందింది. బిఎస్‌పి 20 శాతం ఓట్లు సాధిస్తే అక్కడ ప్రభుత్వాన్ని మన స్వశక్తి మీద ఏర్పాటు చేసుకోవచ్చు అంటారు కాన్షీరామ్. అందుకు ప్రజలను మనీ, మాఫియా, మీడియా, మీడియా శక్తులను ఎదుర్కొనడానికి తయారు చేయాలన్నారు. బిఎస్‌పి 8 శాతం ఓట్లు పొందిన చోట ఏ పార్టీ కూడ తనంతట ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోలేక బిఎస్‌పి మీద ఆధారపడేట్లు చేయడమే నేటి లక్ష్యం అని కాన్షీరామ్ ప్రకటించారు. ఏ భూమి ప్రభుత్వానిదో ఆ భూమి మనదే. ఓట్లు మావి, సీట్లు మీవా ఇకపై చెల్లదు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ నినాదం బహుజనులను ఉత్తేజితులను చేసింది. బహుజనోద్యమ రథ సారథి మాన్యశ్రీ కాన్షీరామ్ 9-10-2006న అమరులయ్యారు

1996 ఎలక్షన్లలో బి.ఎస్.పి. జాతీయపార్టీగా గుర్తింపు పొందింది. మనువాద పార్టీలకు ప్రత్యామ్నాయంగా పార్టీని రూపొందించారు. కాన్షీరామ్ శక్తిసామర్థ్యాల వల్ల సందర్భాను సార ఎత్తుగడల వల్ల సిద్ధాంతం పట్ల సడలని దీక్షవల్ల, భారతీయ రాజకీయ చరిత్రలోనే అంచెలంచెలుగా బహుజన సమాజ్ పార్టీ విజయాలు సాధిస్తున్నది. 13ఏళ్ళలో బిఎస్‌పి జాతీయ పార్టీగా కీలక పాత్ర పోషించే దశకు ఎదిగింది. స్వాతంత్ర్యానంతరం పుట్టి పెరిగి జాతీయ పార్టీగా గుర్తింపు పొందిన పార్టీ బిఎస్‌పియే. కాంగ్రెస్, బిజెపి తరువాత జాతీయస్థాయిలో మూడవ జాతీయ పార్టీగా ఎన్నికల కమిషన్ గుర్తించింది. నాల్గవదిగా సిపిఎమ్, ఐదవదిగా సిపిఐ వెనకబడిపోయాయి. 2009 ఎన్నికల్లో జాతీయస్థాయిలో 200పైగా లోక్‌సభ స్థానాలు సాధించి కాంగ్రెస్‌ను 100కు, బిజెపిని 100లోపుకు కుదించి దేశంలోనే మొదటి పార్టీగా గుర్తింపు పొందాలని లక్ష్యంతో అంబేద్కర్, కాన్షీరామ్ కలలను సాకారం చేస్తూ బిఎస్‌పి ముందుకు సాగుతున్నది.


ఫోటోల్లో స్వీయ చరిత్ర



ఏప్రిల్ 14, 2007 అంబేడ్కర్ జయంతి. అనంతపూర్ ఎస్.కె.యూనివర్సిటీ.
వైస్‌ఛాన్స్‌లర్ ఎ. రామారావు, బి.ఎస్. రాములు, రిజిస్ట్రార్ తదితరులు



ఏప్రిల్ 8, 2007 'బి.ఎస్. రాములు కథలు ఒక పరిశీలన' ఎంఫిల్ పుస్తకావిష్కరణ
వరంగల్. ప్రిన్సిపల్ పరమేశ్వర్, బన్న అయిలయ్య, నవీన్, కర్రె సదాశివ్,
పేర్వారం జగన్నాథం, కె.యు. వి.సి. డా. గోపాల్‌రెడ్డి, బి.ఎస్. రాములు, గిరిజా మనోహర్ .



మార్చి 28, 29, 2007 ఆంధ్రా యూనివర్సిటీ విశాఖపట్నంలో వర్తమాన సమస్యలు
సామాజిక శాస్త్రవేత్తల తత్వవేత్తల కృషి అంశంపై జాతీయ సెమినార్‌లో
సి. డా॥ ఎల్. వేణుగోపాల్ రెడ్డి, బి.ఎస్. రాములు [illegible] శాఖాధిపతి